# గురి

మల్లిపురం జగదీశ్

కథలు

ప్రచురణ

**స్నేహకళాసాహితి**

పార్వతీపురం

# GURI

*Mallipuram Jagadeesh Kathalu*

*on* 30th April 2018

*Cover Design :* Ganteda Kiran Kumar

*Back Title Painting :* Chandanapalli Gopala Rao

*Published by :*

**Snehakala Saahiti,** Parvatipuram

*For Copies :*

**Jagadeesh M.**

S.N.P. Colony, Ramalayam Last Line

Parvatipuram - 535 501

Cell : 94401 04737

**Visalandhra Book House** and it's all Branches

**Prajasakthi Book House** and it's all Branches

*and*

All Leading Book Shops

*Printed at :*

**Sri Sri Printers**, VIJAYAWADA - 2,

srisriprinters.vja@gmail.com

Cell : 9490 63 4849

Price : ₹ 150/-



నాన్న గారూ !

మా జ్ఞాపకాల్లో మీరెప్పుడూ బ్రతికేవుంటారు.

**- భాగ్యలక్ష్మి, జగదీశ్, గీతాకుమారి**

మామయ్యా! సదా మీ స్మరణలో...

**- రామచంద్ర రావు, శ్రీదేవి, కృష్ణారావు**

తాతయ్యా! మీ ఆశీస్సులతో...

**గౌతం రామ్, జ్యోత్స్న, జయరామ్**

**విష్ణు ప్రియ, హర్షవర్ధన్, లోకేష్, షర్మిళ**

మీ జ్ఞాపకాలే ఊపిరిగా....

మీ...

**- సుబ్బలక్ష్మి**

## కృతజ్ఞతలు ...

కాళీపట్నం రామారావు గారు

ఏ.కే. ప్రభాకర్ గారు

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు

అట్టాడ అప్పల్నాయుడు గారు

గంటేడ గౌరునాయుడు గారు

శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వర రావు గారు

## మాట వరసకి...


| | | |
|---|---|---|
| నేల బిడ్డల నెలవుల అన్వేషణ | రాచపాళెం చంద్రశేఖరరెడ్డి | 7 |
| శిథిలమౌతున్న సామూహిక గానం | ఎ.కె. ప్రభాకర్ | 12 |
| ఇవి కతలు కావు ఆదివాసీ వెతలు | అట్టాడ అప్పలనాయుడు | 23 |
| గురిపెడుతున్న మలి దశలో.. | గంటేడ గౌరునాయుడు | 25 |
| నా మాట. | జగదీశ్ మల్లిపురం | 30 |


## కతల దారిది....


| | | |
|---|---|---|
| 1. | గురి | 33 |
| 2. | నాపేరు సొంబరా | 53 |
| 3. | సింజీడి | 67 |
| 4. | చంద్రన్న | 83 |
| 5. | నల్లజెండా | 93 |
| 6. | తార్రోడ్డు | 106 |
| 7. | తాంద్రచుట్ట | 120 |
| 8. | బుగ్గి | 132 |
| 9. | నిత్య నిర్వాసితులు | 140 |
| 10. | అడవితనం | 150 |
| 11. | శిథిల సమూహం | 160 |
| 12. | డోలి | 172 |
| 13. | గత వర్తమానం | 185 |
| | స్నేహ కళాసాహితి మాట | 195 |

# నేల బిడ్డల నెలవుల అన్వేషణ

"ఇది నిర్వాసిత కాలం
ప్రజలంతా నిర్వాసితులుగా మారే కాలం
నేలకు మాత్రమే కాదు, తమ బతుకుల్ని తాము కోల్పోతున్న కాలం
తమకు తెలీకుండానే నిర్వాసితులుగా మారిపోతున్న కాలం
మనిషి మనిషన్న సంగతి మర్చిపోతున్న కాలం
ఒక జాతి అంతరిస్తున్న కాలం
ఒక తరం తర్వాతి తరంతో బంధనాల్ని తెంపుకుంటోన్న కాలం" (గతవర్తమానం)

మల్లిపురం జగదీశ్ రచించిన పదమూడు కథల సంపుటి ఇది. ఆయన ఈ కథల్ని 2013–2018 మధ్య ఆరేళ్ళలో రాసారు. ఇవి ఇరవయ్యొకటో శతాబ్ది తొలిపాదంలో వచ్చిన కథలు. ప్రపంచీకరణ మూడు దశాబ్దాల క్రితం భారతదేశంలోకి ప్రవేశించింది. ఈ కాలంలో భారత ప్రజానీకం దుర్భరమైన సంక్షోభాలను చవిచూసింది. దేశం అమ్మకపు సరుకుగా మారిపోయింది. అభివృద్ధి, సంస్కరణ అనే మాటలు తమ అర్థాన్ని కోల్పోయాయి. మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయి. శ్రామికుల వృత్తులు ధ్వంసమై పోయాయి. దేశం పరాధీనమైంది. వ్యవసాయం ధ్వంసమైపోయింది. విద్య, ఉపాధి, వైద్యం మార్కెట్ సరుకులయ్యాయి. పాలకులు భుజాలు మార్చుకుంటున్నారు. పాలన ఒకటే. ప్రజలతో సంబంధం లేకుండా, ప్రజల భాగస్వామ్యం లేకుండా, పాలకుల నిర్ణయాలు అంతిమంగా అభివృద్ధి పేరిట అంతా జరిగిపోతున్నది. ప్రజాస్వామ్యంలో ప్రజల

పాత్ర కీలకమైనదైనా, అది క్రమంగా అదృశ్యమైపోతున్నది. పెట్టుబడీదారులకు, విదేశీ కంపెనీలకు లాభాలు సంపాదించి పెట్టడమే అభివృద్ధిగా రుజువౌతున్నది. ప్రజలు వాళ్ళ వృత్తుల నుండి, వాళ్ళ వనరుల నుండి, వాళ్ళ జీవితాల నుండి పరాయీకరింపబడుతున్నారు. జగదీశ్ కథలకు ఈ నేపథ్యమే వస్తువైంది.

ఉత్తరాంధ్ర ఆదివాసి ప్రజల జీవితాలతో ప్రపంచీకరణ ఎలా చెలగాటమాడుతున్నదో జగదీశ్ ఈ కథల్లో చిత్రించారు. ఉత్తరాంధ్రలో ఆదివాసీ ప్రజలు ఎక్కువగా ఉన్నారు. అది వీరోచిత ఉద్యమాలు నడిచిన నేల. అడవులు అధికంగా వున్న ప్రాంతం. కళింగుల కాలం నుండి దోపిడికి గురౌతున్న ప్రాంతం. ఆధునిక సాహిత్యానికి పునాదులు వేసిన ప్రాంతం. ప్రజల భాషకు పట్టం కట్టిన ప్రాంతం. సామాజికంగా సాంస్కృతికంగా పోరాట స్ఫూర్తిని కలిగించిన ప్రాంతం.

ఉత్తరాంధ్రలో గురజాడతో బ్రాహ్మణ జీవితం దగ్గర మొదలైన కథానిక ఆదివాసీల దగ్గరకు చేరుకుంది. ఉత్తరాంధ్ర కథకులలో జగదీశ్ అయిదవ తరం రచయిత.

ఈ సంపుటిలోని కథలు ఉత్తరాంధ్రలో అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసానికి ప్రతిబింబాలు. పాలకుల నమూనా అభివృద్ధి, దానిని ప్రతిఘటించే ప్రజల చైతన్యం, దానిని అణచివేసే రజకీయ దుర్మార్గాలను జగదీశ్ వాస్తవికంగా ఈ కథలలో ఆవిష్కరించారు.

ఒక దేశం ప్రజలు చాలా స్పష్టంగా రెండు అసాధారణ ఆర్థిక రాజకీయ వర్గాలుగా చీలిపోయిన తీరుకు ఈ కథలు వాస్తవిక చిత్రాలు. గోచిపాతలు, జీనుప్యాంట్లు ఒకే చోట సహజీవనం చేసే వికృత సంస్కృతికి ఈ కథలు అద్దం పడుతున్నాయి. ఈ దేశ మూలవాసులైన ఆదివాసీ ప్రజలు తమ జీవితం నుండి, సంస్కృతి నుండి దూరంగా నెట్టివేయబడుతున్న వాస్తవాన్ని ఈ కథలు ఆవిష్కరిస్తున్నాయి. పరాయీకరణ అంటే ఏమిటో ఈ కథలు కళ్ళకు కట్టినట్లు చూపిస్తాయి. పరాయీకరణ అంటే ఎవరి జీవితం వాళ్ళది కాకపోవడం, ఎవరి

ఉత్పత్తి వాళ్ళది కాకపోవడం, ఎవరి హక్కులు వాళ్ళు అనుభవించలేక పోవడం. ప్రజలు తమకు తెలియకుండానే తమ నేలలో తాము పరాయి వాళ్ళు అయిపోవడం. జగదీశ్ కథలు సామాజిక వాస్తవికతకు విమర్శనాత్మక, కళాత్మక ప్రతిఫలనాలు. ఈ పదమూడు కథల నిండా పరాయీకృత ఆదివాసి జీవితం వస్తువై పరచుకుంది.

రచయిత ఉత్తరాంధ్ర ఆదివాసులలో ఒకరు... అధ్యాపకుడూ. తమ జీవితాన్ని లోతుగా అధ్యయనం చేసి వాస్తవికంగా చిత్రించారు. బొగ్గుపని చేసుకుని బతికే బూగన్న షావుకార్లు, అడవి అధికారుల దౌష్ట్యానికి బలైపోతాడు (బుగ్గి). కొండ ప్రాంత ప్రజలు కనీస సౌకర్యాలు లేక రోగాలతో చావు బారిన పడుతుంటే, పాలకులు ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణ ప్రచారం చేయటం పట్ల అధిక్షేపం (డోలి). ఆదివాసులు నిరాదరణకు గురౌతుంటే, మత మార్పిడి సంస్థలు తమ రాజకీయాలను చొప్పించడం విడ్డూరం (నా పేరు సొంబరా). అడవి ప్రాంతాల అభివృద్ధిని గాలికొదిలేసి గ్రామాలలోకి విదేశీ పానీయాలు, మత్తుపానీయాలు, సాంకేతిక సామాగ్రిని సప్లై చేసే పాలన మీద విమర్శ "నల్ల జెండా". ఈ కథలో పెట్టుబడిదారీ వ్యవస్థ వికృత రూపం కనిపిస్తుంది. పవర్ ప్రోజెక్టు (గురి), పోలవరం ప్రోజెక్టు (గతవర్తమానం), జంఝావతి ప్రోజెక్టు (నిత్య నిర్వాసితులు) పేర్లతో పాలకులు ఉత్తరాంధ్ర ఆదివాసి ప్రజల జీవితాల్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్న తీరును రచయిత అద్భుతంగా కథీకరించారు.

ఒకనాటి భూ విముక్తి పోరాటంలో పాల్గొన్న వాళ్ళు వర్తమాన కాలంలో భూమిని పోగొట్టుకున్న దైన్యతకు "తాంద్రచుట్ట" కథ ప్రతిబింబం. పనిగట్టుకుని ప్రజలకు వస్తు వ్యామోహాన్ని కలిగించి, వాళ్ళను అప్పుల సుడిగుండంలోకి దించేసి, వాళ్ళను దగా చేస్తున్న పెట్టుబడీదారీ సంస్కృతిని "తాగ్రోడ్డు" కథ ప్రతిబింబించింది. తీవ్రవాదాన్ని అణచివేసే పేరు మీద కార్యనిర్వహణశాఖ ఆడే నాటకాలను "చంద్రన్న" కథ ప్రదర్శించింది. గాంధీని జాతిపితగా గౌరవిస్తూ, సారాయి అమ్మి పాలన సాగించే రాజనీతిని మహిళలు

ప్రతిఘటించిన తీరును "సింజీడి" కథ ఆసక్తికరంగా చిత్రించింది. సారా వ్యతిరేక ఉద్యమకారిణి 'సింజీడి' భర్త ప్రభుత్వ సారా తాగి మరణించడం విషాదం. ఆదివాసీలకు సహజమైన జీలుగు సారా స్థానంలోకి ప్రభుత్వం కాపు సారాను దించి ప్రజల ప్రాణాలను హరించే దుర్మార్గమీ కథ.

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా మనం గర్వంగా చెప్పుకునే మన దేశంలోని చీకటి కోణాలను ఈ కథలు దివిటీ కట్టి చూపిస్తాయి. అనేక అప్రజాస్వామిక ధోరణులను ఈ కథలు చర్చకు పెట్టాయి. డెబ్భై ఏళ్ళ స్వాతంత్ర్యం తర్వాత స్వాతంత్ర్య ఫలాలు ఎవరికందుతున్నాయని ఈ కథలు ప్రశ్నిస్తున్నాయి.

జగదీశ్ కథలలో గట్టి రాజకీయ కంఠస్వరం వినిపిస్తుంది. "దశాబ్దాల క్రితం ఈ నేల మీద జరిగిన పోరాటాలు వృధాయేనా?" "వూర్లో మాత్ర కంటే మందే దొరకడం...ప్చ్!" "ఈ దారి ఎన్నేళ్ళుగా ఆ ఊరి దరఖాస్తుల మీద నడిచెళ్ళిందో, ఎంత మంది నాయకులకు ఓట్ల కోసం ఉపయోగపడిందో" "మాత్రలతో తగ్గిన జ్వరాన్ని ప్రార్థనతో తగ్గినదిగా చెప్పేవారు" "ఆధునిక సౌకర్యాల అందుబాటు ఎవరికి లాభం చేకూర్చింది?" "భూ సేకరణ, భూ ఆక్రమణ రెంటి అర్థం ఒకటే... ప్రజల భూముల్ని లాక్కోవడం"

ఆదివాసీల జానపద సంస్కృతి ఈ కథల్లో స్వస్వరూపంతో ప్రత్యక్షమౌతుంది. ఏ కథ చదివినా అందులో సాంస్కృతిక నేపథ్యం దర్శనమిస్తుంటుంది. ఉత్తరాంధ్ర భాషలోని మాధుర్యాన్ని ఈ కథల నుండి పిండుకోవచ్చు. ఉత్తరాంధ్ర ప్రాంత సామాజిక పరిణామాలు తెలియకుండా ఈ కథలు రాయడం సాధ్యం కాదు.

ఆదివాసీ ప్రజలతో రచయిత మమేకమై రాసారు. అక్కడ ఉద్యమ నేపథ్యాన్ని రచయిత తన కథలకు చారిత్రక స్పర్శగా ఉపయోగించుకోవడం బాగుంది. ఉద్యమ కాలానికీ, ఉద్యమేతర కాలానికి మధ్య గల తేడాను ఈ కథలు గుర్తించాయి. ఉద్యమాలు అసంపూర్ణంగా నిలిచిపోతే వచ్చే దుష్పరిణామాలను ఈ కథలు గుర్తు

చేస్తాయి. ఉద్యమ ప్రాంతాలలోని పాలక వ్యవస్థ ఎంత బలంగా చొచ్చుకు వస్తుందో కూడా ఈ కథలు పరోక్షంగా రుజువు చేస్తున్నాయి.

మొత్తంమీద అభివృద్ధి అనే రాజకీయ ప్రహసనాన్ని ఈ కథలు ప్రశ్నిస్తున్నాయి. నిలదీస్తున్నాయి. ఈ కథలలో స్థానికత నిర్దుష్టంగా వుంది. వస్తునిర్దిష్టట వుంది. స్థానికత విశ్వజనీనతగా పరిణామం చెందే క్రమాన్ని ఈ కథలు సూచిస్తాయి. ఆదివాసీ ప్రజలను పాత్రలుగా మలచడంలో, ఆ ప్రజల సంబంధాలను ఆవిష్కరించడంలో రచయిత జాగ్రత్తగా వ్యవహరించారు. తాను అధ్యాపకుడు కావడం వల్లనేమో చాలా కథల్లో విద్యారంగ ప్రసక్తి వస్తుంది. ఉత్తరాంధ్ర ఆదివాసీ ప్రజల సంభాషణలు ఈ కథలలో ఆకర్షణీయమైన విషయం. వస్తు చిత్రణలోనే కాదు వస్తు విస్తరణలోనూ రచయితలో సంయమనం వుంది.

మంచి కథారచయితకు వుండవలసిన లక్షణాలు మల్లిపురం జగదీశ్ సొంతం చేసుకున్నారు. ఉత్తరాంధ్ర కథకహారంలో ఒక మణిపూస జగదీశ్. ఆయనకు నా శుభాకాంక్షలు.

'మా లాంటోలకి బతుకుండదండి
ఇరికిపోయినోలమండి
బతకలేము" (చంద్రన్న - కథ)

అనంతపురం **– రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**

13 ఏప్రిల్ 2018.

# శిథిలమౌతున్న సామూహిక గానం

"The fish,
Even in the fisherman's net,
Still carries,
The smell of the sea"

తమ నేలకూ సంస్కృతికీ దూరమైన జనం గురించి పాలస్తీనా కవీ, రచయితా మొరీద్ బార్గౌతి (Mourid Barghouti) చెప్పిన మాటలు ఆదివాసీ రచయిత మల్లిపురం జగదీశ్‌కి అతికినట్టు సరిపోతాయి. అడవికి దూరమైనా గుండె నిండా అడవితనాన్నీ వొంటినిండా అడవి పరిమళాన్నీ మోసుకుంటూ అతను బయట ప్రపంచంలో తిరుగుతూనే వున్నాడు. వాటిని మనకు తన కథల మాధ్యమంగా పంచిపెడుతూనే వున్నాడు. నిజానికి తన స్వీయానుభవ నేపథ్యం నుంచి గాయపడ్డ ఆదివాసీ గుండె గోసని అపూర్వంగా సాహిత్యీకరించిన జగదీశ్‌ని సాహిత్య ప్రపంచానికి కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. కొండంత యెత్తున్న అతణ్ణి చదవడం, వినడం నాకు యెప్పటికీ గొప్ప అనుభవమే. చదివాక అతని కథలు మనల్ని వొకపట్టాన వొదలవు. గుండె లోతుల్లోకి జొరబడి కల్లోలాన్ని రేపుతాయి. అంతరంగంలో అలజడి కలిగిస్తాయి. ఆత్మశోధనకు పురికొల్పుతాయి. ఆదివాసిని అడవికి దూరం చేస్తున్న శక్తుల గురించి జగదీశ్ యింతకు ముందు 'శిలకోల' లో సంధించిన ప్రశ్నలు మనల్ని యింకా వెంటాడుతూనే వున్నాయి. ఆ ప్రశ్నలకు నాగరిక పౌర సమాజం నుంచి గానీ రాజ్యపాలకుల నుంచి గానీ సమాధానాలు లభించలేదు. అడవి బిడ్డకు మునుపు అయిన గాయాలు మానలేదు.., సలుపుతూనే

వున్నాయి. మళ్ళీ మళ్ళీ కొత్త గాయాలు అవుతూనే వున్నాయి. నెత్తురోడుతున్న దేహంతో సడలని పోరాట పటిమతో రాజీలేని నిబద్ధతతో యిప్పుడు 'గురి' తప్పని కథలతో అభివృద్ధి లోగుట్టు విప్పి చెబుతూ మరోసారి మన ముందు నిలబడ్డాడు జగదీశ్. ఈ సారి అతని గొంతు రాటు తేలింది. చూపు నిశితమైంది.

దేశంలో అడవి మీదా దాని నేల పొరల కింద వున్న ఖనిజాల మీదా మల్టీనేషనల్స్ కన్ను పడ్డాక వాటికి దళారులుగా వున్న దేశీయ పాలకులకి అడవి నుంచి ఆదివాసీని తొలగించే కార్యక్రమంలో తొలి అడుగు అభివృద్ధి మంత్రం. పాత రోజుల్లో దశాబ్దాలుగా గిరిజనేతరుల దోపిడీ ఆదివాసీని అడవిలోతట్టుకి తరిమితే, ఆతరువాత సంక్షేమ పథకాలు అడవి అంచుకు తెచ్చాయి. ఇప్పుడు ఆదివాసీలు అభివృద్ధి వలలో విలవిలలాడుతున్నారు. బలవంతంగా నిర్వాసితులవుతున్నారు. ఒక చోట పవర్ ప్రాజెక్టు, మరో చోట ఇనుము కోసమో, బాక్సైట్ కోసమో మైనింగ్. ఇంకోచోట భారీ ఆనకట్టలు. అడుగడుగునా ప్రత్యేక ఆర్థిక మండళ్ళు... ఆదివాసిని నిలబడ్డ సొంత నేల నుంచి తరిమి కొట్టడానికి వెయ్యిన్నొక్క పద్ధతులు. సామాజిక సంపదని ప్రైవేటు వ్యక్తులకి కట్టబెట్టడానికి వంద యెత్తుగడలు. పెసా, 1/70 వంటి చట్టాల్ని నిర్వీర్యం చేసే కుట్రలు. ఖాకీ నీడలో తుపాకి మొన మీద బలవంతపు ప్రజాభిప్రాయ సేకరణలు, భూ దురాక్రమణలు. అడుగడుగునా మానవ హక్కుల ఉల్లంఘన. కొత్త శతాబ్దంలో యీ ప్రక్రియ వేగవంతమైంది. వ్యవస్థీకృతమైంది. కాదంటే క్రూర హింస జడలు విప్పుకుంటుంది. సాంస్కృతిక దాడి, దొంగ సంక్షేమ పథకాలు, పోలీసు మిలటరీ చర్యలు– వ్యూహం త్రిముఖంగా అమలవుతోంది. అదేంటో యుగ యుగాలుగా యే దేశంలోనైనా అభివృద్ధి యజ్ఞంలో తొలి బలి పశువు ఆదివాసీయే. పురాణ కాలం నాటి ఖాండవ దహనం దగ్గర నుంచి యివాళ్టి దండకారణ్యం వరకూ 'ఆకుపచ్చ' విధ్వంస ప్రకంపన కేంద్రాలు (epicenters) యెప్పుడూ గిరిజన ఆవాసాలే.

అభివృద్ధి పడగ నీడలో పరాయీకరణ అంచుల్లో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తన జాతి జనుల దుఃఖానికి విచలితుడైన రచయిత వేదన జగదీశ్ కథల్లో ప్రతి అక్షరంలోనూ కనిపిస్తుంది. తన మూలాలకు దూరమైన అపరాధ భావన కూడా జగదీశ్ గొంతులో వినిపిస్తుంది. 'కొండ కొనకు పూచిన సూర్యుణ్ణి డప్పుగా చేసి – గొంతుని గొగోయ్‌గా మార్చి' చెబుతున్న యీ కతల్లో అభివృద్ధి తెస్తున్న విధ్వంసం పట్ల ఆగ్రహం వుంది. కోల్పోతున్న ప్రాకృతిక సంపదని కాపాడుకోవాలన్న తపన వుంది. నిర్వీర్యమై జారిపోతున్న యువత జీవితాల్లో మానవీయ విలువల్ని నిలబెట్టాలన్న స్థిర చిత్తం వుంది. నామరూపాల్లేకుండా నాశనమవుతోన్న సంస్కృతిని వొడిసి పట్టుకోవాలన్న యెరుక వుంది. తన జాతి జనుల పట్ల అలవికాని ప్రేమ వుంది. కొన్ని చోట్ల నిస్సహాయుడి ఆక్రందన వుంది. ఆక్రోశం వుంది. ఏం చెయ్యాలో తోచనితనంలోంచి పుట్టిన దిగ్భ్రాంతి వుంది సమస్త శక్తుల్నీ కూడగట్టుకొని పోరాటం కొనసాగించాలన్న దిటవుతనం వుంది. వాషింగ్టన్ నిర్మాణానికి తెల్లజాతికి భూములిచ్చి సర్వం కోల్పోయిన అమెరికా మూలవాసి నాయకుడు సియాటిల్ పడిన ఘర్షణ వంటి ఘర్షణే రచయిత లోపల జరుగుతూ వుంది. లేకుంటే తీవ్ర జ్వర స్పందన లాంటి 'గతవర్తమానం' కథ పుట్టదు. వందల కొద్దీ వూళ్ళనీ లక్షలాది యెకరాల భూముల్నీ ముంచి ఆదివాసీలను నిర్వాసితులుగా మార్చిన పోలవరం శాపంగా మారిన వైనాన్ని, అంతర్జాతీయ స్థాయి రాజధాని నిర్మాణానికి భూసమీకరణలో వేలాది యెకరాల పంట భూముల్ని కోల్పోతున్న రైతుల దైన్యాన్ని రెడ్ ఇండియన్ చీఫ్ సియాటిల్ ఉపన్యాసంతో కొల్లేజ్ చేస్తూ, వొక తరగతి గదిని ముంపు గ్రామంగా మార్చి, నిర్వాసితుల నివేదనల్నీ, నినాదాల్నీ టీచర్ స్టూడెంట్‌ల మధ్య సంభాషణగా, అంతరంగ సంక్షోభాల వినిమయ మాధ్యమంగా అల్లి, గత వర్తమానాల్ని వొకదానిపై మరొకటి వోవర్‌లాప్ గావిస్తూ కథగా మలిచిన తీరు, శిల్ప పరంగా చేసిన ప్రయోగం అద్భుతం. జీవిత కల్లోలాన్ని ఆవిష్కరించడమే

ప్రయోజనంగా యెన్నుకున్న టెక్నిక్ అది. 'నేలంటే తాత ముత్తాతల అస్థికలలోంచి పుట్టుకొచ్చిన బతుకు పువ్వు...మనిషి నేలకు చెందిన వాడు కానీ నేల మనిషికి చెందింది కాదు' అంటూ సియాటిల్ చేసిన ప్రసంగం ఆదివాసి భూ ఆక్రమణదారులకు హెచ్చరిక. అభివృద్ధి బేహారులకు కనువిప్పు. అది యింకెంత మాత్రం గతం కాదు, వర్తమానమే. అది పాత కాలపు నలుపు తెలుపు చిత్రం కాదు. రాజకీయంగా ఆర్థికంగా భిన్న వర్ణాలతో వాటి షేడ్స్ తో యెంతో సంక్లిష్టంగా తయారైంది.

ఒకప్పుడు – ఐటీడీఏలు, గిరిజన కార్పోరేషన్లు, గొర్రెలకు బర్రెలకు బ్యాంకు రుణాలు, వివిధ సంక్షేమ పథకాలు, ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ళు, రోడ్లు... అడవికీ మైదానానికీ మధ్య దూరం చెరిపేయడానికి, అడవిని ఆధునికీకరించడానికి, అడవిలో అన్నల ప్రాబల్యం తగ్గించడానికి పాలకులు చెయ్యని పని లెదు. వెయ్యని సంక్షేమ – అభివృద్ధి పాచిక లేదు. దాంతో అడవి మార్కెట్టయ్యింది. అడవి వెలుతురు దీపాల కింద చీకటి కోనయ్యింది. అడవి నెత్తుటి మడుగయ్యింది. అడవి ఆరని గాయమైంది. ఆదివాసీ ఆవాసాలు టూరిస్టు కేంద్రాలయ్యాయి. ఇప్పుడు అడవినే మాయం చేసే కార్పోరేట్ భూతం బయల్దేరింది. రాత్రింబవళ్ళు సేటిలైట్ నిఘా కింద రాజ్యం దాని కోరలకి పదును పెడుతోంది. అడవిలోకి మిలటరీ వాహనాలు నడుపుతోంది. హెలీకాప్టర్లు దించుతోంది. అడవి యుద్ధ క్షేత్రమైంది.

ఈ నేపథ్యం నుంచే రచయిత పుట్టెడు ప్రశ్నలు మన ముందు కుప్పపోస్తున్నాడు. అడవిలోకి పరిచిన తార్రోడ్లు అడవిలోకి యేమి తెచ్చాయి? అడవి నుండి యేమి తీసుకుపోయాయి? సౌకర్యాలు యెవరి సొత్తయ్యాయి? సంపద యేమైంది? సంస్కృతి యేమైంది? శ్రమ ఎవరిదీ– సిరి ఎవరిదీ అని అడిగి ఆయుధం పట్టి పోరాటాలు చేసి పొందిన భూములేమౌతున్నాయి? పోరాట మార్గానికి దూరం చేయడానికి అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల లబ్ది పొందిందెవరు? ఇంత అభివృద్ధి నడుమ పొట్ట కూటి కోసం వలసలు యింకా యెందుకు

అనివార్యమయ్యాయి? నిర్వాసితులకిచ్చిన పునరావాస వాగ్దానాలకు పట్టిన తుప్పు తొలగేదెప్పుడు? నిరుద్యోగం ఆకలి అవమానాలు యెందుకు కొనసాగుతున్నాయి? చదివిన చదువులు ఏమిచ్చాయి? అడవి బిడ్డలు ఆదివాసీలు యేమయ్యారు? ఎదిగిన వాళ్ళు యెందరు... వొరిగిన వాళ్ళు యెందరు?

పరాయీకరణ పొత్తిళ్ళలో పెరిగే ప్రకృతి శిశువులు అరకొర చదువులతో అటు నాగరిక ప్రపంచానికీ యిటు కొండకీ పనికి రాకుండా పోయారు. తమ భాషలో లేని బుక్కుల్తో పది పన్నెండు దాకా పాకి ఆ తర్వాత యెదగలేక... యెదిగినా తమకు తాము 'పరాయి' అయి స్వీయ సంస్కృతికి దూరమై నాలుగు రాళ్ళ కోసం ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ దరఖాస్తులా మారిపోతున్నారు. పాలకులు విసిరే చిల్లర స్కీముల్లో లబ్ధిదారులు కావడానికి స్వతంత్రంగా జీవించే హక్కునీ, స్వేచ్ఛనీ, ఆత్మగౌరవాన్నీ కోల్పోయి పొద్దెరుగని బిచ్చగాళ్ళవుతున్నారు (తాగ్రోడ్డు). ఆశ్రమ పాఠశాల హాస్టళ్ళలో వంటకుక్కులుగానో, వాచ్‌మన్‌గానో, జీసీసీలో సేల్స్‌మన్‌గానో చేరుతున్నారు. లేదా పోలీసు కానిస్టేబుల్స్ గానో స్పెషల్ ఆఫీసర్స్ గానో, ఇన్‌ఫార్మర్‌గానో మారుతున్నారు. కాకుంటే కార్పొరేట్ అభివృద్ధికి బ్రోకర్ గానో అవతరిస్తున్నారు. ఇవేవీ వద్దంటే బూటకపు ఎన్‌కౌంటర్లో మరణిస్తున్నారు (చంద్రన్న).

మరి అభివృద్ధి ఫలాలు యెవరికి చేరాయంటే సమాధానం వుండదు. నిజమే, భౌతికంగా అభివృద్ధి జరిగినట్టు కనిపిస్తుంది. గుడిసెల స్థానంలో శ్లాబ్ ఇళ్ళు వచ్చాయి. వాటి మీద టీవీ యాంటినాలు మొలిచాయి. బళ్ళ గోర్జీలు మట్టి దార్లయ్యాయి. మట్టి దార్లు సిమెంట్ రోడ్లయ్యాయి. వాటి మీద మోటార్ సైకిళ్ళు తిరుగుతున్నాయి. జీలుగు కల్లు బదులు వంట సారా, దాని స్థానంలో ప్రభుత్వ పర్మిషన్‌తో దిగిన రాయల్ స్టాగ్ వంటి బ్రాండెడ్ సరుకు గూడల్లోకి వూళ్ళలోకి దర్జాగా చొచ్చుకొచ్చాయి. ఇదంతా అభివృద్ధే; కానీ శ్లాబ్ యిళ్ళలో తినడానికి తిండిగింజలుండవు. రాత్రీ పగలూ

తేడా తెలీకుండా సీరియళ్ళలో సీరియస్ గా మునిగి పక్కవాడు చస్తున్నా పట్టించుకోరు. స్వదేశీ విదేశీ తేడా లేకుండా చీప్ లిక్కర్ యేరులై ప్రవహిస్తుంది; కానీ తాగడానికి సురక్షితమైన నీళ్ళుండవు. ఎన్ని సదుపాయాలొచ్చినా గిరిజనులకి యిప్పటికీ వైద్యం అందని మాని పండే. సమయానికి వైద్యం అందక చిన్న చిన్న రోగాలతోనే (డయేరియాతోనో... మలేరియాతోనో) చనిపోవచ్చు. రోగుల్ని కొండ దిగువున యెక్కడో వున్న ఆసుపత్రికి మోసుకు పోవాలంటే 'డోలీ' కట్టాల్సిందే. దారి చూపడానికి సెల్‌ఫోన్ టార్చ్ వెలుగు తోడుంటుంది. అదీ హైటెక్ అబివృద్ధి. ఎంత పారడాక్స్?

'ప్రకృతిని దేవతలా కొలిచే అత్యంత సహజమైన మానవులు. ఈ భూమిపైన అణువణువూ పవిత్రమైనదేనని భావించే సమూహం. తన పూర్వీకుల జ్ఞాపకాలు చెట్లలో ప్రవహించే జీవరసమనీ... పరిమళించే ప్రతి పువ్వూ అక్కచెల్లెలేనని... పలకరించే ప్రతి జీవీ అన్నదమ్ముడే అని భావించే అతి పురాతన మానవ సమాజం'లోకి, చెట్టుకీ పుట్టకీ అడవి తల్లికీ వూరి జాకరమ్మకీ మొక్కిన ఆదివాసీ గూడల్లోకి వారివి కాని వినాయక చవితులూ సంక్రాంతులూ వచ్చాయి. ఇప్పుడు ఊళ్ళో చర్చి, మెళ్ళో శిలువా మొలిశాయి. సొంత భాషా, వేషం అన్నీ పోయాయి. 'ఇదంతా కుట్రలా నేదా?'. చీకటి పడుతూనే, కొండ వెన్నెల పులుముకుంటూనే యిల్లిల్లూ చుట్టి వచ్చే పిన్లకర్ర గానం లేదు. కిన్నెర మోత లేదు, టిల్లకాయ ధ్వనుల్లేవు. తుడుం డప్పుల శబ్దాల్లేవు. గొగోయ్ సుస్వరాల్లేవు. ఆడా మగా పదం కలిపి పాడే బృందగానాల్లేవు. థింసా అడుగుల్లేవు. సామూహిక జీవితం, ఆట,పాట, పండుగ, జాతర అన్నీ ధ్వంసమైపోయాయి. మంది బతుకునీ సామూహిక సాంస్కృతిక వ్యవస్థనీ నిలిపిన జన్నోడు, దీసరీ, ఎజ్జోడూ, కార్జిలు బతికే తెరువు లేక భవన నిర్మాణ కూలీలుగా చెన్నయో, బెంగళూరో వలసపోయి కూలిన శిథిలాల కింద సమాధవుతున్నారు (శిథిల సమూహం).

ఇదంతా హింసే. సాంస్కృతిక పీడనే. అభివృద్ధిలో పీడన,

దోపిడీ రూపం మార్చుకున్నాయి తప్ప పోలేదు. పాత రోజుల్లో వాసన నూనె, సబ్బులు, పౌడర్లు, దువ్వెన్లు పాలిష్టర్ బట్టలు యిచ్చీ అటవీ సంపదనీ షావుకారు దోచుకుంటే యిప్పుడు బూతు చిత్రాల్ని కరతలామలకం చేసిన సెల్‌ఫోన్ కంపెనీలు స్వాహా చేస్తున్నాయి, బడ్డీ షాపుల్లోకి బ్రాందీ బుడ్లు దించిన మద్యం వ్యాపారీ దోచుకుంటున్నాడు. ఒకప్పుడు మైదానాల నుంచి వచ్చిన వడ్డీ వ్యాపారి భూముల్ని గుంజుకుంటే యిప్పుడు ప్రభుత్వమే పవర్ ప్రాజెక్ట్ కోసమో మరింకో పరిశ్రమ కోసమో భూముల్ని కాజేస్తుంది. సారాకి భర్త బలైతే 'సింజీడి' వంటి స్త్రీలు తిరగబడ్డానికి సిద్ధంగా వున్నారు. కానీ పొగలా కమ్ముకొచ్చే మార్కెట్ మాయాజాలాన్ని 'గురి' చూసి కొట్టడంలోనే ఆదివాసీలు దిగ్భ్రమకి లోనవుతున్నారు. సహాయం చేయాల్సిన ప్రభుత్వ అధికారులు కార్పోరేట్ మార్కెట్ కి దళారి పాత్ర పోషిస్తున్నారు. అంతే కాదు స్వార్థంతో ఆదివాసీలని అనేక విధాలుగా ప్రలోభ పెడుతూ విస్థాపన మార్గాల్ని సుగమం చేస్తూ వారి కన్ను వారే పొడుచుకొనేలా చేస్తున్నారు. వారిలోంచి జాతి ద్రోహుల్ని తయారు చేస్తున్నారు. ఆదివాసీ అస్తిత్వాన్ని పెను ప్రమాదంలోకి నెడుతోన్న యీ సంక్షోభాన్నంతటినీ జగదీశ్ వంటి లోపలి మనిషి మాత్రమే విమర్శనాత్మకంగా విశ్లేషించి సాహిత్యీకరించగలడు. స్వీయానుభవం నుంచి యేర్పరచుకున్న దృక్పదంతో అతను దాన్నొక బాధ్యతగా కొనసాగిస్తున్నాడనడానికి యీ సంపుటిలోని ప్రతి కథా వుదాహరణగా నిలుస్తుంది.

'తాంద్రచుట్ట' కథలో రక్తం చిందించి పోరాడి సాధించుకున్న భూమిని సైతం వూరి పిల్లల బడికోసం ధారపోసిన బూగన్న ముఖత: ఆదివాసీ అవసరాల గురించి చెప్పిన మాటలు జగదీశ్ దృక్పథాన్నీ సామాజిక తాత్వికతనీ పట్టిస్తాయి. 'నాకు ఏది సుకమో నువ్వు సెప్పకూడదు... నీనే సెప్పాల. నా సుకం గురించీ నీనే మాట్లాడాల'. ఎంత మౌలికమైనవీ యెంత లోతైనవీ యీ మాటలు! అభివృద్ధి గురించీ సంక్షేమం గురించీ మాట్లాడినప్పుడు అసలు ఆదివాసులు యేమి కోరుకుంటున్నారు అన్నది యెవరూ పరిగణనలోకి తీసుకోరు. ఆదివాసీ

జీవితం గురించి గానీ, అడవికి ఆదివాసీకి వున్న విడదీయరాని బంధం గురించి, గానీ వారి ఆలోచనా విధానం గురించి గానీ యేమాత్రం అవగాహన లేని నాగరికుల దృష్టి కోణం నుంచే అభివృద్ధి పథకాలు నిర్వచించడం జరుగుతుంది. ఆదివాసీ ఆవాసాలలో పనిచేసే ప్రతి అధికారీ బాగన్న మాటల్ని ప్రియాంబుల్ లా గుర్తుపెట్టుకోవాలి. బయటుండి రాసే వాళ్ళకి యీ దృక్కోణం వుండదు. ఆదివాసీ సాహిత్యంలోకి మల్లిపురం జగదీశ్ వంటి రచయితలు యిబ్బడి ముబ్బడిగా వచ్చినపుడు మాత్రమే యిటువంటి ఆలోచనలు వెలుగులోకి వస్తాయి. ఆదివాసీ మనోభావాలు గుర్తింపు, గౌరవం నోచుకుంటాయి. అభివృద్ధికి మానవీయ ముఖం అనే మాటలు నిజమౌతాయి. జగదీశ్ గొంతు సమూహమై బలపడినపుడు మాత్రమే 'ఇంతకీ ఈ దేశంలో మేమున్నట్టా లేనట్టా (నల్లజెండా) అని ప్రశ్నించే 'ఇండియా తాత' చూపుకి సమాధానం దొరుకుతుంది.

ఆదివాసీ జీవితాల్లో ఆచరణలో, విలువల్లో చోటుచేసు కుంటున్న అనేక వైరుధ్యాల్ని జగదీశ్ యీ కథల్లో వొడుపుగా పట్టుకున్నాడని చెప్పడానికి నిండైన నిదర్శనం 'అడవితనం' కథ. ఆ కథలో రచయిత వ్యక్తం చేసిన ఆవేదన చూడండి. దాన్ని ఆవిష్కరించిన తీరు చూడండి. వస్తు శిల్పాలు రెండూ సమపాళ్ళలో వొకదాన్ని మరొకటి డామినేట్ చెయ్యకుండా నడిచిన కథ అది.

అడవికి దూరమైన కొద్దిమంది – అతి కొద్దిమంది ఆదివాసీలు అభివృద్ధి ముఖంగా మైదానాలవైపు, పట్టణాలవైపూ, నగరాలవైపూ నడిచిన వాళ్ళు ఉద్యోగాలు పొందారు. సొంత ఇళ్ళు కట్టుకున్నారు. స్మార్ట్ ఫోన్లు టీవీలు, ఫ్రిడ్జ్‌లు, ఏసీలు, వాహనాలు సౌకర్యాలు అమర్చుకున్నారు. కానీ అడవితనాన్ని కోల్పోయారు. అడవితనమంటే సామూహికత. సమూహంలో యిచ్చిపుచ్చుకోవడం. కళతో సమూహాన్ని నిర్మించిన వారు. నాగరీకులై అడవితనాన్ని మర్చిపోయారు. నేస్తరికం చేయడం, ఇవ్వడం, ఇంటికొచ్చిన వారికి ఆతిథ్యం యివ్వడం., అడిగిన వారికి ఆశ్రయమివ్వడం, ఆపదలో

వున్నవారికి ఓదార్పునివ్వడం... ఇవన్నీ మర్చిపోయారు. అడవితనాన్ని కోల్పోవడమంటే మనిషితనాన్ని కోల్పోవడమేనన్నది ఆ కథ ముగింపు. కథలో రచయిత చూపిన శిల్ప పరమైన నేర్పు కూడా విశిష్టమైనది. అడవిలో వున్నప్పటి జీవితాన్నీ, దూరమైన తర్వాత నగరజీవితాన్నీ జ్ఞాపకాల ద్వారా పోల్చి చూసుకోవడం కనిపిస్తుంది. అడవితనాన్ని కోల్పోయాక పోగొట్టుకున్న సంస్కృతిని పదే పదే ప్రస్తావిస్తూనే చివరికి తోటి మనిషి కష్టం పట్ల నిర్లిప్తంగా వుండే స్పందనా రాహిత్యమే అడవితనాన్ని కోల్పోవడం అని తీర్మానిస్తాడు. అయితే కథకి అదే ముగింపయితే ప్రత్యేకత లేదు. అడవికి దూరమైన వొక ఆదివాసీ మహిళ చెప్పిన కథ యిది. సుఖాల మత్తులో పడి మానవత్వ స్పందనల్ని మర్చిపోయేలా చేసిన బతుకునుంచి బయటపడి ఆమె తన అడవితనాన్ని కాపాడుకోవడానికి చివరికి సిద్ధపడుతుంది. ఆ విషవలయంలో చిక్కిన భర్తని కాపాడకుందా? అన్న సందేహం అలానే వుండిపోవడంతో కథ వోపెన్ ఎండింగ్ కథగా రూపొందింది. ఆదివాసీ జీవన విలవల్ని అన్ని విధాల వున్నతీకరించిన కథ యిది. కతలో అడవికి దూరమైన వాళ్ళకి పేర్లుండవు. పేరుకూడా కోల్పోయిన పాత్రలవి.

ఇతరేతర పరాయీకరణల మీద కంటే సాంస్కృతిక పరాయీకరణ మీదే యెక్కువ దృష్టి పెట్టాడనిపిస్తుంది. మెరుగైన జీవితం కోసం క్రైస్తవంలోకి మారి స్వీయ సంస్కృతిని కోల్పోతున్న యెందరో యువకులు రచయితగా జగదీశ్‌ని బాగా డిస్ట్రబ్ చేస్తారు. 'నాపేరు సొంబరా' కథలో తండ్రి మతం మారడంతో సొంబరా రాబర్ట్ అవుతాడు. ఎస్టీ రిజర్వేషన్ పోగొట్టుకుంటాడు. మారిన మతం అతనికి యేవిధంగానూ వుపయోగపడదు. పేదరికపు దెయ్యాన్ని అది వదిలించలేదు. అవసరం కొద్దీ మూలాల్లోకి చూసుకోవడంగా మొదలైన సొంబరా అన్వేషణ స్వీయ అస్తిత్వ స్పృహగా పరిణమించడంతో అతను మళ్ళీ ఆదివాసీగా మారడానికి నిర్ణయించుకుంటాడు. ఈ కథలోనే కాదు ఇతరత్రా కూడా జగదీశ్ గిరిజన గూడల్లోకి ప్రవేశించిన క్రిష్టియన్ మిషనరీలు ఆదివాసీని, వారి సంస్కృతి నుంచి యెలా

దూరం చేస్తున్నాయో ప్రస్తావించాడు. అయితే 'వనవాసి కళ్యాణం' పేరున సంఘ పరివార శక్తులు మతాంతరీకరణని అడ్డుకోవడమే కాకుండా బలవంతంగా 'ఘర్ వాపసీ' కార్యక్రమాన్ని దేశమంతటా పెద్ద యెత్తున అమలు చేస్తున్నాయి. ఘర్ వాపసీ అంటే వాళ్ళకు ఆదివాసీ తన సొంత జీవన విధానంలోకి సవర, గోండి, కోయ... సంస్కృతిలోకి రావడం కాదు. హిందూ మతంలోకి మార్చడం. మతతత్వవాదులు వ్యూహాత్మకంగా అమలు చేస్తోన్న హైందవీకరణలోని యీ రాజకీయ కోణం కూడ రచయిత స్పృశించాల్సిన అంశమే.

జగదీశ్ 2013-2018 మధ్య కాలంలో రాసిన పదమూడు కథల్నీ వొకచోట చూసినప్పుడు వస్తు శైలీ శిల్పాల పరంగా అతను చేస్తున్న ప్రయోగాలు, సాధిస్తున్న పరిణతి అబ్బుర పరుస్తాయి. కథానిర్మాణంలో, నిర్వహణలో కొత్త ప్రయోగ రీతుల్ని అతను ప్రయత్నిస్తున్నాడు (గతవర్తమానం). ఆదివాసీ జీవితాల్లో యింతకు ముందు స్పృశించని కోణాల్లోకి మరింత లోతుగా చూస్తున్నాడు (అడవితనం). కథల్లో వస్తు విస్తృతి పెరిగింది. ప్రధానమైన తేడా అల్లా 'శిలకోల' లో లాగా బలమైన స్త్రీ పాత్రలు యీ కథల్లో లేవు. అతని వచనంలో వుధృతి వుద్విగ్నత తగ్గి ఆలోచన యెక్కువయింది. సమస్యల్ని చూసే దృక్పథంలో మార్పు రాలేదు కానీ అభివృద్ధి నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి తాను, తనలాంటి వారూ నడిచొచ్చిన దారి గురించి మూల్యాంకనం చేసుకోవడం బలంగా కనిపిస్తుంది. అదే అతని కథల్లో ప్రతిఫలిస్తుంది. రచనలో 'చీకటంతటినీ రెండు మూటలుగా కట్టి కావిడీ చేసి భుజానికెత్తుకున్నట్టు.... బొగ్గుల కావిడీతో, రెండు కళ్ళనీ దోసిళ్ళు చేసి షావుకారి జేబువైపు చూస్తూ...., చీకటీ దుఃఖం కలిసి కంట్లోంచి ధారగా...., ఊరు చీకటి ఊయలలో వూగుతోంది..., గడపల్లో నిన్నాగిపోయిన సీరియళ్ళు సాగడం మొదలయ్యాయి, పొద్దు కొండమీద ఆలుపు తీర్చుకుంటోంది, నిత్య పురాతన గీతంలా గెడ్డ... వంటి కవితాత్మక వ్యక్తీకరణలు మరింతగా పదునుదేరాయి. ఆ శైలి జగదీశ్‌కే సొంతం. అది రచయితని

పాఠకులకు ఆత్మీయుణ్ణి చేస్తుంది.

'గురి' కథలు చదివాక నాకో పిట్టకత గుర్తొస్తుంది. జగదీశ్‌లా నాకు కథ చెప్పే విద్య రాదు గానీ చేతనైన మేరకు చెప్తా వినండి:

*'ఒక అర్ధరాత్రి చిమ్మ చీకట్లో గొర్రెల మందలోకి వొక దొంగ జొరబడ్డాడంట. అట్టా జొరబడి నెమ్మదిగా గొర్రెల బొచ్చు కత్తిరించుకు పోతున్నాడట. కత్తెర చప్పుడుకి మేలుకొన్న వొక పొట్టేలు మిగతా వాటిని అప్రమత్తం చేసి నువ్వు చేస్తున్న పనేంటని దొంగని గట్టిగా నిలదీసిందట. రానున్న చలికాలంలో మిమ్మల్నందర్నీ చలి బారిన పడి చనిపోకుండా కాపాట్టానికి వెచ్చటి వున్ని కంబళ్ళు నేసి యిస్తానికే మీ బొచ్చు. లేకుంటే నాకేల? అన్నాట్ట ఆ ఘరానా దొంగ.'*

గొర్రెలు ఆ దొంగని నమ్మాయో కుమ్మాయో అన్నది వేరే కత. అది మన ప్రాపంచిక దృక్పదాన్ని బట్టి, సంస్కారాన్ని బట్టి మనం కట్టుకుందాం. అయితే ఆ పని జగదీశ్ కథలు చదివాక, బతుకు పోరాటంలో బుగ్గయిన బూగన్ననీ– బుగ్గి నుంచే ఫీనిక్స్ పక్షిలా లేచి వచ్చిన సింజీడిని – యెన్ని ఆటంకాలు యెదురైనా గురి మీదే దృష్టి పెట్టిన గీతనీ – మూలాల్లోకి తిరుగు ప్రయాణం చేస్తున్న సొంబరానీ – గోచీగుడ్డనే జెండాగా యెగరేసిన ఇండియా తాతనీ – అడవితనాన్ని కోల్పోవడానికి సిద్ధపడని ఆదివాసీ మహిళనీ తెలుసుకున్నాక చేస్తేనే బావుంటుంది.

సమయం లేదు.

సిద్ధమా మరి!

తన గుండెనీ కొండనీ కథల అద్దంలో చూపిస్తున్న మల్లిపురం జగదీశ్‌ని యెదకు హత్తుకుంటూ...

14 ఏప్రిల్ 2018.
(బాబా సాహెబ్ పుట్టినరోజు) **– ఎ కె ప్రభాకర్**
హైదరాబాద్

# ఇవి కతలు కావు ఆదివాసీ వెతలు!

మల్లిపురం జగదీశ్‌ని నేను దాదాపుగా రెండు దశాబ్దాలుగా ఎరుగుదును. రెండు దశాబ్దాలుగా మల్లిపురం జగదీశ్ ద్వారా నేను వర్తమాన ఆదివాసీ జీవితాన్ని కొంతకాలంగా తెలుసుకుంటున్నాను. మా మధ్య గల సాహిత్యబంధం ద్వారానే యిది సాధ్యమయ్యింది. నిజానికి సాహిత్య సంబంధమంటే జీవన సంబంధమే! జీవితాన్ని సాహిత్యం పట్టించుకున్నంతగా యితరమేదీ పట్టించుకోదు.

నేనెరిగిన అయిదు దశాబ్దాల కిందటి ఆదివాసీ జీవితాన్ని బహుశా మల్లిపురం జగదీశ్ యెరిగి వుండడు. ఏయే కల్లోలాలు, యేయే కొండగాలులు, వసంతకాల మేఘ ఘర్జనలు, యెన్నెన్ని ఆశలూ, ఆరాటాలూ వీచీ, పూచీ, వెలిగీ ఆరిపోయేయో జగదీశ్‌కి తెలిసుండక పోవచ్చు.

ఎందుకు ఆరిపోయేయో, యెలా ఆరిపోయేయో యెరుక గాంచని, నెత్తుటి ఆనవాళ్ళేమీ మిగలని కల్లోలానంతర అడవిలో పెరిగి పెద్దయిన వాడు. నెత్తురింకిన అడివిలో, కొండగాలుల్లో, మేఘాల ఘర్జనల్లో, కాలిన గూడేల్లో, వెలసిన కాలనీల్లో, కాలనీ ఇళ్ళ కప్పులమీద పొడిచిన యాంటెన్నాలలో, వాసమేర్పర్చుకున్న కార్యాలయాల్లో, ఆశ్రమ పాఠశాలల్లో, ఊళ్ళను కలిపే తార్రోడ్డుల్లో, ఊరిముందర వెలసే సిలువ ఆలయాల్లో, నడయాడే దోవల్లో, నర్సరీల్లో నడయాడినవాడు.

అడవితనమ్మీద యే శక్తులో విత్తిన, విత్తుతోన్న విషపు విత్తనాల మొలకలను, మొక్కలనూ, అల్లుకున్న అక్రమాల జిల్లేళ్ళను కళ్ళతో చూసి, చూసి గింజులాట పడినవాడు. ఈ అడివిల యీ రోడ్లేటీ? ఈ బడులేటీ? ఈ ఆపీసులేటి? ఈ నాయకులేటీ? ఈ

పాలన యేటీ? ఇందల నా ప్రమేయమేటీ? ఈ అడివిల ఆ కంపినీలేటీ? నా మనుసులు అడివికి దూరమవడమేటీ? ముందరకెళ్తన్నామా యెనక్కా? అసలు మీమే నడస్తన్నామా, ఎవుళో నడిపిస్తే నడస్తన్నామా? ఈ నడకలెక్కడికి? నీనెవుడిని? ఆదివాసీనా? హిందువునా? క్రిష్టియన్నా? ఎవుళ్ని? నా గతమేటి? వర్తమానమేటి? భవిష్యత్తేటి? ఈ అధికారపు వాహనాలెవరివి? ఎగిరే ఆ జెండాలెవరివి? ఏ జెండా వెనకాల యే అజెండా దాగి వున్నాది? ఏటిది? ఏటేటిది? ఈ ప్రశ్నలు ఆదివాసీ నేలవి! నేల మీద బతికిన మనుసులవి! మనుసుల లోలోపలి వెతల వెనకనున్న ప్రశ్నలు!

ప్రశ్నల మధ్య ఊపిరి పీల్చినవాడు మల్లిపురం జగదీశ్! సలిపే బతుకుల 'గాయం' కథనం చేసినవాడు. వేదన లోంచి పెల్లుబికిన ఆగ్రహాన్ని 'శిలకోల'గా సంధించిన వాడు. ఇపుడు తాను "గురి" పెట్టిన అక్షరాయుధాలతో అబద్ధపు అభివృద్ధి పథకాల మాయను బట్టబయలు చేస్తున్నాడు. ప్రపంచీకరణ కాదు విశ్వవాణిజ్యీకరణ ఆదివాసీ నేలకు వచ్చిందే గానీ, అక్కడి వాస్తవ జీవన వెతలేవీ విశ్వానికి తెలీవు. మొన్నటికి నిన్నటికీ, నేటికీ మార్పేదో జరిగింది గదా... అడవికి నెమ్మది నెమ్మదిగా ఆధునికత చేరుతోంది గదా! అభివృద్ధి వెలుగులు అవిగవిగో అంటున్నారు కొందరు. ఇంకొందరు అడివంటుకుంది, అరుణారుణ బాటలో మళ్ళీ నడుస్తుందంటున్నారు. మల్లిపురం జగదీశ్ యీ యే కొందరిలోనో లేడు. అడవిలో వున్నాడు. ఆదివాసీలతో వున్నాడు. గనక ఆయన చెప్పిన వెతలనూ, కతలనూ నమ్ముతాను. వాటిలోంచే నేను వర్తమాన ఆదివాసీ జీవనాన్ని యెరుక పొందుతాను. సహృదయ పాఠకులు నాలాగే యీ కతల ద్వారా యెరుకపొందగలరని ఆశిస్తాను.

12.04.2018. **– అట్టాడ అప్పల్నాయుడు**

శ్రీకాకుళం.

# గురిపెడుతున్న మలి దశలో....

మొక్క నాటి, నీరు పోసి, గొప్పు తవ్వి, మేకలు ఆకుల్ని మెయ్యకుండా ఒక ముళ్ళ కంప అడ్డం పెట్టి.... ఆ మొక్క పెరిగి పూలు పూసి కాయలు కాస్తుంటే ఎంతో సంబరపడతాము. అదిగో అలాంటి సంబరమే నాది. 'అక్షరాల దారిలో'...అడుగు పెట్టిన నాటి నుండి 'శిలకోల' వింటి బద్దకు సంధించి 'గురి' చూసుకుంటున్న ఇప్పటిదాకా చి.జగదీశ్ ఆరంభ వికాసాల దశలన్నీ నా కనుసన్నలలోనే జరిగాయని ఒకింత గర్వంగానే చెప్పవచ్చు నేను. అలాగని నా వల్లనే తానీ స్థాయికి వచ్చాడనీ... తన ఎదుగుదలకు నేను మాత్రమే కారణమని చెప్పడం కాదిది. తాను నమ్మిన రంగంలో ఎవరైనా ఎదిగారంటే అందుకు వారి కృషి,అధ్యయనం,నిరంతర శ్రమ... ఆ క్రమంలో మార్గనిర్దేశం చేసేవారి సహాయ సహకారాలు... కారణమై వుంటాయి.

ఏడెనిమిదేళ్ళ వయసు నుంచీ నేను బోధించే పాఠాల్ని, పాడే పాటల్నీ, చెప్పే కథల్నీ ఇష్టంగా విన్నవాడు. ఆ పాఠాల బాటలోంచి...ఆ కథల తోటలోంచి... ఆ పాటలపూల గాలుల్లోంచి ఎదిగొచ్చిన వాడు. గిరిజన సంక్షేమ అశ్రమ పాఠశాల టిక్కబాయిలో ఐదో తరగతి వరకు చదివి, గురుకుల పాఠశాల భద్రగిరికి వెళ్ళాక ఆ 'పొట్టి బుడంకాయ' మళ్ళీ తీపి రాగాలు వినిపించే కిన్నెర కాయలా ఎదిగి వచ్చాడు ఉపాధ్యాయుడుగా టిక్కబాయి పాఠశాలకి. గురుశిష్యులము సహోద్యోగులమయ్యేము. చుట్టూ ఆకుపచ్చ ప్రవాహాల్లా కొండల వరుసలు... ఆ కొండల నడుమ బొమ్మరిల్లులా బడి. బడి తోటలో మొక్కల మధ్య పిల్లలతో నేనూ, మిత్రుడు గణపతి (ఇప్పుడు మాకో

గ్నాపకం గా)... మాతో జగదీశ్. ఆ తరువాత మాతో ఉపాధ్యాయుల గౌరీశంకరరావు మాతో చేరేడు. ఆ బడిలో... ఆ ప్రకృతి ఒడిలో తొలి మలి సందెల్లో పాటలతో, కథలతో, బొమ్మలతో అప్పటి ఆ మా పాఠశాల సంతోష చంద్రశాల.

ఒకరోజు... జగదీశ్ ఏదో చెప్పాలనుకుని చెప్పడానికి సందేహిస్తున్నట్టు అనిపించి... 'జేబులోంచి ఏదో అక్షరాల వాసనొస్తోందే..' అని అతని జేబులోని కాగితం తీసి చూస్తే అదొక కవిత. ఆ వాక్యాల్ని అట్నుంచిటు, ఇట్నుంచటు చేసి ఏదో పత్రిక్కి పంపించేను తనకి చెప్పకుండా. తరువాత ఆ విషయమే మరిచి పోయాను. అలా పంపించిన కవిత పత్రికలో అచ్చయ్యింది. ఆ పత్రిక పట్టుకుని వచ్చిన జగదీశ్ కళ్ళలో ఎంత మెరుపో! (అలాంటి మెరుపులు ఆ తరువాత చాలా సార్లు చూసాను అతని కళ్ళలో) అదుగో అలా మొదలైన అతని సాహిత్య ప్రయాణం అడవి దారుల్లోంచి, రాళ్ళ గుట్టల మీంచి కొండలపైకి సాగి అక్కడి జీవితాల్ని అక్షరబద్ధంగా విస్తోంది. అలా.... నా తరగతి గదిలోంచి విద్యార్థిగా వెళ్ళి ఉపాధ్యాయుడిగా ఎదిగి నా సహోద్యోగి అయ్యేడు. నా అక్షరాల తోటలోంచి బయలు దేరి కథకుడిగా ఎదిగి నాకు సాహితీ సహచరుడయ్యేడు.

ఇదో అరుదైన సందర్భం. ఏ కొందరికో మాత్రమే ఎదురయ్యే అనుభవం.

కథా రచయితగా తన సాహిత్య ప్రయాణంలో ఎందరో గొప్పవాళ్ళని కలిసి వుంటాడు. ఎన్నో కొత్త మెలకువల్ని నేర్చుకుని వుంటాడు. తాను చేయాల్సిన కార్యక్రమాలు, రాయాల్సిన కథా వస్తువులూ... సాహిత్యసామాగ్రి, సజ్జు సరంజామా ఏవో ఈపాటికి తను రూపొందించుకునే వుంటాడు. సాహిత్యం సామాజిక బాధ్యతగా భావించిన అనేకుల సాహచర్యం, సాన్నిహిత్యం తనకుంది గనక ఆ మార్గం నుండి ఎప్పుడూ తప్పుకోడనే నమ్మకం నాకుంది. నా నమ్మకం వమ్ముకాదనే నా మీద నాకున్న నమ్మకం.

* * *

గిరిజన సమాజం నుంచి వచ్చిన తొలి కథకుడిగా ... (కనీసం ఉత్తరాంధ్రకు) ఇప్పటికే తనకి మంచి గుర్తింపు ఉంది. పలువురి పెద్దల ప్రశంసలు అందుకున్నాడు. తన రచనలకు గుర్తింపుగా పురస్కారాలూ పొందివున్నాడు. ఏ పురస్కారమైనా చేస్తున్న సాహిత్య కృషికి లభిస్తున్న ప్రోత్సాహమనీ, తద్వారా 'భవిష్యత్తులో మరింత నిబద్ధతతో పనిచెయ్యాలనే హెచ్చరికే పురస్కారం' అనే ఎరుక తనకుందని నాకు తెలుసు.

ఇంతవరకూ గిరిజన జీవితం ప్రధానంగా రచనలు చేసిన వారు గిరిజనేతరులే. సృజనాత్మక సాహిత్యంలో నాకు తెలిసి తెలుగులో గిరిజన జీవితాన్ని ప్రాంతీయ పలుకుబడి, నుడికారం, జాతీయాలు, సామెతలు, వారి భాషా యాసలతో సంభాషణల సహజ చిత్రణ జరిగిందని చెప్పలేం. దానికి కారణం ఆయా రచయితలు అక్కడి జీవితాన్ని జీవించినవారు కాకపోవడమే. జగదీశ్ ఆ సమాజం నుంచి వచ్చిన వాడే అయినా ఆ జీవితానికి ఎడంగా జీవించిన వాడు. సాహిత్యానికి దగ్గరై కొంత ఎరుక కలిగినాక తన మూలాల వేపు తొంగిచూడడానికి ప్రయత్నిస్తున్నవాడు, అన్వేషణ జరుపుతున్నవాడు. ఈ అన్వేషణలో తను చాలా శ్రమించాల్సి వుంది. తన భాషా సంస్కృతులకు సంబంధించిన ఎన్నో విషయాలను అవగాహన చేసుకోవాల్సి వుంది. పరిశీలించాల్సి వుంది... పరిశోధించాల్సివుంది. అందుకు ఆయా గిరిజన భాషల్లో ప్రావీణ్యం కాకపోయినా ప్రవేశమైనా వుండాల్సివుంది. అంతే కాకుండా తనలాంటి సృజనకారుల్ని తయారుచేసుకుని అక్షర సైనికులుగా అందర్నీ కలుపుకుని ఏకోన్ముఖంగా పయనించాల్సిన అవసరమూ వుంది. అది తాను మాత్రమే తీసుకోవాల్సిన బాధ్యత... తన తక్షణ కర్తవ్యం కుడా.

* * *

వింటి బద్దకు శిలకోలను సంధించిన తరువాతే లక్ష్యం వేపు 'గురి' పెట్టడం ఏ వేటగాడైనా చేసేపని. అక్షరాయుధాల్ని 'గురి'పెట్టే

వేటగాడే రచయిత కూడా అనుకుంటే జగదీశ్ ఇప్పుడు ఆ సందర్భంలో వున్నాడు. వింటి బద్దకు నారతాడు బిగించి 'శిలకోల'లు సిద్ధం చేసుకోవడం అనే తొలి దశను దాటి 'గురి'పెట్టే మలిదశకు చేరుకున్నాడు. ఇప్పుడే ఏకాగ్రత మరింత అవసరం. ముందున్న లక్ష్యాన్ని ఛేదించడానికి నారితాడును వెనక్కి బలంగా లాగాల్సిందే. వింటిబద్దా బాగా వంగాల్సిందే. అలాగే జగదీశ్ తన మూలాల్లోకి... జాతి సంస్కృతి కుదుళ్ళలోకి వెనక్కి వెనక్కి అన్వేషిస్తూ వెళ్ళాల్సిందే. అడవినేలలో ఇంకిన నెత్తుటి జాడలవెంట నడుస్తూ అడవిగాలుల్లో కలిసి వీస్తున్న వీరుల ఉసురుల సడికి చెవియొగ్గుతూ.. ఏకాగ్రతకు భంగం కలిగించే ప్రతికూల పరిస్థితుల్నీ...లక్ష్యం నుంచి దృష్టిమరల్చే ఆకర్షణల్నీ అధిగమించాల్సిందే. బయట నాగరిక సమాజానికి తెలిసేందుకు అవకాశంలేని... చీకటిలో మగ్గిపోయే, వెలుగు చూడని అంశాలెన్నో... జగదీశ్ మాత్రమే చెప్పాల్సిన కథావస్తువులెన్నో అతనికోసం అక్కడ, ఆ కొండకొనల మీద... అడవి గూడల్లో ఆర్తిగా ఎదురు చూస్తున్నాయని, తాను మాత్రమే పూరించగల ఖాళీలు అక్కడ మిగిలే వున్నాయని చెప్పకతప్పని సందర్భమిది.

* * *

ఈ 'గురి' కథా సంపుటిలోని కథల గురించి నేనేమీ మాట్లాడలేదు. మిత్రులు గౌ: రాచపాళెం చంద్రశేఖరరావు గారూ, డా.ఏ.కే. ప్రభాకర్ గారూ ఆ కథల గురించి వాటి ప్రత్యేకతల గురించి సవివరంగా మాట్లాడారు. వారు మాట్లాడ్డమే సముచితం..అదే ఈ కథలకు సరైన సత్కారం. అందుకే నేను కథల జోలికెళ్ళట్లేదు. అయితే నా మాట అంటూ ఒక్క వాక్యమైనా లేకుండా ఎలా? అన్నాడు జగదీశ్. నా మాట అటుంచితే ఆశీస్సు లందించాల్సిన ఆనందసందర్భమిది.

"నేను స్నేహకళాసాహితి నుండి తయారైన వాడిని" అని చెప్పుకుంటాడు జగదీశ్. ఇది తన వినయానికి, ఒదిగివుండే తత్వానికీ నిదర్శనం. తన పై ఎందరి ప్రభావమో వుంది. ఎందరి ప్రోత్సాహమో

వుంది. అతనీ స్థితికి చేరడం వెనక తన కృషితో పాటు ఎందరిదో జ్ఞాన సంపద ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ దోహదపడి వుంటుంది. అలా వాళ్ళందరికీ... తద్వారా సమాజానికీ ఋణగ్రస్తుడే. ఆ ఋణవిముక్తి కోసం నిరంతరం పరిశ్రమించాల్సిందే... తప్పదు.

చేసిన దానికంటే చెయ్యాల్సింది, చదివినదానికంటే చదవాల్సింది, రాసినదానికంటే రాయాల్సింది, తెలిసిన దానికంటే తెలుసుకోవాల్సింది... ఎంతో వుంటుంది ఎవరికైనా. అందుకు మినహాయింపులుండవు. సాహిత్యం తన కార్యరంగంగా ఎంచుకున్న జగదీశ్ ఈ రంగంలో నిర్విరామ కృషి సలుపుతాడని, ఎన్నెన్నో విజయాలను తన ఖాతాలో జమ చేసుకుంటాడని... ఆశిస్తూ...

చివరిగా

'అమృత సంతానం' లాంటి బృహద్రచనగా నవల ఒకటి తెలుగు నేలలోని గిరిజన జీవితం నేపథ్యంలో సమాజానికి అందించాలని... ఆ శక్తి అతనికి సమకూరాలని సాహితీ సహచరునిగా ఆశిస్తూ... గురువుగా ఆశీర్వదిస్తున్నాను.

పార్వతీపురం **– గంటేడ. గౌరునాయుడు**

15.04.2018

# నా మాట

నాన్నగారూ!

నేను మీ సంతకాన్ని.

దానికి ఋజువు నా రచనలే.

నా ప్రతి అక్షరం వెనుకా మీరున్నారు. ఇది నిజం.

నా పన్నెండేళ్ల వయసులో మీ మీద కోపమొచ్చి (కారణం గుర్తులేదు) మూడు కిలోమీటర్ల ఆమిటి అడవిరోడ్డు దాటి అక్కడి బస్ షెడ్డు గోడ మీద 'మల్లిపురం రామారావు మోసగాడు' అని మసిబొగ్గుతో రాసి స్కూలుకెళ్ళిపోయాను. ఆ మరుచటిరోజు పోష్టు బేగుకోసం వచ్చే ఉత్తరాల మామ మంగులు ద్వార తెలుసుకుని స్కూలులో మా టీచర్స్ ముందు నిలబెట్టేరు నన్ను. నాకిప్పటికీ గుర్తే.... తల్లిదండ్రుల గురించి అలా చేయకూడదని మా టీచర్స్ చెప్పుకొస్తుంటే మీరు మాత్రం 'మోసగాడు' ని 'మీసగాడు'గా రాసావు అది తప్పు... తెలుగు సరిగ్గా నేర్చుకో అన్నారు. బహుశ ఆ హెచ్చరికే నన్నిలా నడిపించి వుంటుంది.

రాత.

అదెప్పటికీ సరదా అంశం కాదు నా దృష్టిలో. పరిం ముళ్ళ కంప మీద ఆరేసిన నార చీరని బయటకు తీయడం లాంటిది రాత. ముళ్ళు గుచ్చుకూడదు... చీర చిరగకూడదు.

నా ప్రతి పుట్టిన రోజుకీ స్కూలుకొచ్చి చాక్లెట్లూ, బిస్కెట్లూ తీసుకొచ్చి మా మాష్టార్ల దగ్గరికి తీసికెళ్ళేవారు. వాళ్ళకీ దండం పెట్టించి ఆశీస్సులు ఇప్పించేవారు. నా చదువుల గురించి ఏ ఒక్క రోజూ నన్నడగలేదు మీరు, నా గురువులతోనే మాట్లాడేవారు. ఏ.పీ.ఆర్. స్కూల్, భద్రగిరికి మొదటి బేచ్ విద్యార్థిగా చాల జాగ్రత్తగా వుండాలని

మాత్రమే చెప్పేవారు. 'నీవు మంచిపని చేస్తే నిన్ను పొగడొచ్చేమో కానీ చెడ్డ పని చేస్తే మాత్రం నీ తల్లిదండ్రుల్నీ, గురువుల్నీ అడుగుతుంది లోకం ...జాగ్రత్త' అని హెచ్చరించే వారు. ఆ స్కూల్లోని తెలుగు చెప్పే కాటమ రాజుగారూ, ఆ మాష్టారి కుటుంబమూ, బయోలజీ చెప్పిన రమణ మూర్తిగారూ, ఫిజిక్స్ చెప్పిన ప్రసాదరావుగారు, సోషల్ చెప్పిన దుర్గాప్రసాద్‌గారూ, విజయరాంభట్లు గారూ, ఇంగ్లీషు చెప్పిన కృష్ణారావుగారూ, జగన్మోహన్ గారూ, లెక్కలు చెప్పిన రాజు మాష్టారూ, జీఎల్లెన్ సారూ, పీయిటీ సత్యన్నారాయణ సార్, ప్రిన్సిపల్ రామచంద్రమూర్తి గారూ... ఇంకా ఎందరో... అందరూ నాలో సజీవంగా వున్నారు. వాళ్ళు చెప్పిన ఏ పాఠమూ వృధా కాలేదు. మీ ఆశయం నీరుగారలేదు.

నాకిప్పటికీ గుర్తు... 'మీ మల్లిగాడు స్టూడెంట్స్‌లో ఉద్యమాలు లేపుతున్నాడని' మా పీయిటీ సార్ మిమ్మల్ని పిలిపించారు ఓ రోజు స్కూలుకి. నన్ను పక్కకి తీసుకెళ్ళి అడిగారు...ఏమి జరిగిందని? గ్రిక్స్ ఆటలపోటీలకెళ్ళే వారికి అదనపు శక్తి అవసరమని వాళ్ళకి డబల్ టిఫిన్లు దగ్గరుండి పెట్టించే వారు ఆ పీయిటీ సార్. 'మాకూ పెట్టించండి డబల్‌టిఫిన్' అని అడిగాను. లేదంటే అందరం భోజనాలు మానేస్తాం అని స్టూడెంట్స్ అందరిచేతా జై కొట్టించేను. వాళ్ళంటే ఆడుతున్నారు కప్పులు తెస్తున్నారు... నీ కెందుకురా? డబుల్ టిఫిన్? అని తిరిగి ప్రశ్నించారు సార్. వాళ్ళు గ్రౌండులో ఆడి కప్పులు తెస్తే, మేము క్లాస్‌లో చదివి మార్కులు తెస్తున్నాం. క్లాస్‌లో ఫస్ట్ వచ్చిన వాడికి డబల్ టిఫిన్ పెట్టించండని అడిగాను. ఆ రోజు మీరు నాతో అన్నారు 'నీ మాటలో నిజముంది' అని. అక్కడితో ఆ విషయం ప్రిన్సిపల్ గారి దగ్గరకు వెళ్ళడమూ, ఆయేడాది నుండి స్పోర్ట్స్ వాళ్ళతో పాటు క్లాస్ ఫస్ట్ వచ్చిన వాళ్ళకూ డబుల్ టిఫిన్ పెట్టడమూ జరుగుతూ వచ్చింది. అప్పుడు నాకర్థమయ్యింది... ప్రశ్నించడమెలాగో! పీఈటీ సార్ ప్రేమగా నన్ను దగ్గరకు తీసుకోవడమూ గుర్తుంది.

నేను గురి పెట్టిన ప్రతి ప్రశ్న వెనకా మీరున్నారు. మీ స్ఫూర్తి వుంది. నా ప్రతి గురువూ వున్నారు. వాళ్ళు నేర్పిన ప్రతి పాఠమూ వుంది.

నా నడక వెనుక ఎందరో వున్నారు. చదువు నేర్పిన గురువులూ, రాయడం నేర్పిన గురువులూ, ప్రశ్నలు నేర్పిన గురువులూ, కుటుంబ సభ్యులూ, స్నేహితులూ... విజ్ఞులు... ఎందరో! ఎందరెందరో!!

అందరికీ నమస్కరించడం నా బాధ్యత.

నా మీదే కాదు నా కథలమీద కూడ ప్రేమతో మాటందించి, **'నేల బిడ్డల నెలవుల అన్వేషణ'** అని నన్నిలా నిలబెట్టిన ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరావు గారికీ, **'శిథిలమౌతున్న సామూహిక గానం'** అంటూ నన్ను స్పృశించిన డా. ఏ.కే. ప్రభాకర్ గారికీ...

నా పుస్తకం మీద మీ సంతకమైనా వుండాల్సిందే అని అనగలిగేంత చనువునిచ్చి., ఆ మాట అన్న వెంటనే **'ఇవి కతలు కావు ఆదివాసీ వెతలు!'** అని మాట పంపిన అట్టాడ అప్పల్నాయుడు గారికీ, **'గురిపెడుతున్న మలి దశలో....'** అని ఆశీర్వదించిన గురువుగారు గంటేడ గౌరునాయుడు గారికీ...

నా ఈ స్థితికి కారణమైన "స్నేహకళాసాహితి" లోని ప్రతి ఒక్కరికీ...

పుస్తకాన్ని ఇంతందంగా అచ్చు వేసిన శ్రీశ్రీ ప్రింటర్స్, విశ్వేశ్వరరావు గారికీ...

ఈ కథల్ని మొదట అచ్చువేసిన ఆయా పత్రికలకీ...

అడిగిన బొమ్మని అడిగిన వెంటనే వేసిచ్చిన చందనపల్లి గోపాలరావుకీ...

కవర్ డిజైన్ ఇలా చేసి నా కోసం శ్రమించిన గంటేడ కిరణ్‌కీ...

మిత్రుడు జి. రామకృష్ణ (శాంతి) ఈనాడుకీ....

మీ స్మృతిలో

నమస్కరిస్తూ...

కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

**– జగదీశ్ మల్లిపురం**

# గురి

**ఎం**డిపోయిన మాని మొజ్జు మీద లక్ష్యం రెక్కలల్లాడిస్తోంది. విలుకాడు విల్లుని సంధించాడు. నారిని మరింత బలంగా తనవైపుకి లాగి లక్ష్యదూరాన్ని అంచనా వేసేడు. దగ్గర్లోనే వుంది.

మబ్బు పట్టిన ఆకాశం...స్తంభించిన గాలి... ఊపిరాడనట్టు ఉక్కపోత. శిలా విగ్రహాల్లా చెట్లు. గుబురులో ఒకే ఒక ఆకు మాత్రం అదే పనిగా రెపరెపలాడుతోంది పిచ్చిపట్టినట్టు.

విలుకాడి నుదుటి మీది చెమట బొట్టు ఎడమ కన్ను ప్రక్కగా చెంపమీదికి జారింది. అతని వెనుక చెట్టు కొమ్మ ఉయ్యాల్లోని పాప తల బయటికి పెట్టి విలుకాడి చేతులమీంచి లక్ష్యం వైపు చూస్తోంది.

నిశ్శబ్దాన్ని నిండు కుండలో మోస్తున్నట్టు ... అడవి.

విలుకాడి చేతిలోంచి శిలకోల దూసుకు పోయింది. లక్ష్యం ఎగిరి పోయింది. శిలకోల 'జువ్వ్' మని శబ్దం చేస్తూ మాని మొజ్జు

మొదలుకి గుచ్చుకుంది. పిచ్చిపట్టిన ఆకు ఆగిపోయింది... వెక్కిరిస్తున్నట్టు.

విలుకాడు నిర్ఘాంతపోయేడు. ఎగిరిపోతున్న లక్ష్యం వైపు బేలగా చూస్తూ.

తప్పకూడని గురి... తప్పింది.

విల్లు సంధించడానికీ, లక్ష్యం ఎగిరిపోడానికీ నడుమ ఏదో జరిగింది. ఏమిటదీ?

సమాధానంగా.... విలుకాడి మొలలోంచి

'పంచదార కొమ్మా కొమ్మా... పట్టుకోవద్దనకమ్మా' సెల్ ఫోన్ మోగుతోంది.

విలుకాడి కంటే ముందే ప్రమాదాన్ని పసిగట్టిందేమో...లక్ష్యం తప్పించుకుంది.

"డాడీ! ఫోన్" అనడంతో ఈ లోకంలోకి వచ్చేడు సత్యం. జేబులో ఫోన్ రింగవుతోంది. 'అంటే ఇంతదాకా మోగింది తన జేబులోంచా? మరి...

ఓహ్!... కలా!!

నిజమే... గురి తప్పిన విలుకాడు.

"ఎక్కడున్నారు? పాపేమైనా అల్లరి చేస్తోందా?" శ్రీమతి అడుగుతోంది.

"లేదు లేదు... ఇంకా అరగంట దూరంలో వున్నాం" సత్యం ఫోన్ పెట్టేసాడు.

బస్ వేగంగా కదులుతోంది. ఒక్కసారిగా గాలి తీవ్రత పెరిగింది. తేడా గమనించేడు సత్యం. కురుపాం దాటాక గాలి చల్లబడిపోతుంది. అంటే ఏజెన్సీలోకి ప్రవేశించామన్న మాటే. అంతదాకా కనపడని చెట్లూ... కొమ్మలూ... తుప్పా... డొంకా... కొండా... కోనా....అన్నీ ఎదురై పలకరిస్తాయి. రోడ్డు సన్న బడిపోతుంది. కిటికీ లోంచి కొమ్మలు రెమ్మలూ ముఖానికి తగులుతూ... 'నీ కోసమే...ఎదురు చూస్తున్నా' మన్నట్టుంటాయి.

ఆ గాలి ... పాతదే.

ఆ చలి ... పరిచయమైనదే.

కొత్తగా... స్పృశిస్తూ... చెట్లూ, కొండలూ... వెనక్కి కదులు తున్నాయి. వేగంగా... వెనక్కి... వెనక్కి... వెనక్కి... కళ్ల ముందే కన్న తండ్రి మంగులు కన్ను మూసినప్పటికి.

* * *

"ఒరే మంగులూ! రేపు తెల్లార గట్ట లెగాల... బండి పుయ్యాల" ఇంటి మెట్లెక్కుతూ చెప్పేడు షావుకారి.

'అలగేన్లే' అన్నట్టు తలవూపి వెనుతిరిగేడు మంగులు.

మంగులు షావుకారికి కంబారి. ఐదేళ్లదాకా. అదీ ఎందుకంటే... ఓ రోజు... షావుకారి పొలంలో వరి ఎన్నులు దొంగతనం చేస్తూ దొరికి పోయేడు.

పంచాయితీ పెట్టించేరు. ఊరి పెద్దలందరూ వచ్చి కూర్చున్నారు. అందరి మధ్యలో తల దించుకుని నిలబడ్డాడు మంగులు. వరి ఎన్నుల పేరుతో దోషిగా నిలబెట్టి తన ఇంట్లో మరికొన్ని బంగారు వస్తువులు కూడా పోయాయని నింద మోపేడు షావుకారి. నిజానికి మంగులు ఎన్నులు తెంచిన పొలం మంగులుదే. కానీ అప్పుడెప్పుడో మంగులు తండ్రికి యాభై రూపాయలు అప్పు ఇచ్చి తీర్చలేకపోయేదని ఆ పొలాన్ని స్వాధీనం చేసుకున్నాడు షావుకారి.

తీర్పు చెప్పండి చెప్పండంటూనే తీర్పు చెప్పేడు షావుకారి... ఐదు సంవత్సరాల కంబారితనం తన ఇంట్లో చెయ్యాలని. ఆ తీర్పు మంగులు ఒప్పుకోలేదు. కళ్లెర్రగించి చూసేడు. 'మేకల పై పులుల తీర్పు చెల్లదన్నట్టున్నా'యతని చూపులు. షావుకారికి ఆ చూపులు నచ్చలేదు. ఐతే పోలీసు కేసు పెడతానన్నాడు. ఆ మాటకి ఊరు గజగజలాడింది. మంగులు తండ్రైతే షావుకారి కాళ్లు పట్టుకుని వదల్లేదు. వూరంతా బ్రతిమాలింది. మంగులినీ బ్రతిమాలింది. కంబారితనానికి ఒప్పుకోమని. మంగులు తల దించేడు... ఊరు కోసం.

* * *

వూరికి దూరంగా... గెడ్డ ప్రక్కన... ముంత మామిడి చెట్టు క్రింద... పాక. పాక ప్రక్కనే అరెకరా గుడ్డి. గుడ్డినానుకొని నాయుడి పొలాలు. ఆ పొలాలు కాస్తున్న కిత్తన్న.

"ఏట్రా బేగి పారొచ్చినావు?" చీకట్లో నడిచొచ్చిన కొడుకుని అడిగేడు కిత్తన్న.

"తెల్లార గట్ట బండి పుయ్యాల... అందకే బేగొదిల్నాడు" ముంజూరు కింద అరుగు మీద రాటకు చేరబడ్డాడు మంగులు.

ఆ రాట ఎప్పటిలా లేదు. అరుగులో ఏదో మార్పు. ఎప్పుడు అక్కడ కూర్చున్నా, మేక పింద్రికిలు అంటుకునీవి. వాటిని దులుపుకుంటూ ఆ రాటకే కట్టిన మేకని ప్రేమగా తిట్టుకుంటూ... ఒక్క చరుపు చరిచి అదల్చడం అలవాటు మంగులుకి.

ఇప్పుడా అరుగు శుభ్రంగా... ఎవరో తుడిచినట్టు... రెండు మూడు రోజులుగా ఆ రాట చుట్టూ మేక తిరిగిన ఆనవాళ్లేవీ లేవు. అప్పుడు గమనించేడు... ఎక్కడో... దూరంగా మేక అదే పనిగా అరుస్తోంది. ఆ అరుపులో ఏదో తేడా వుంది.

"ఏటైందే?" అడిగేడు మంగులు.

పెణక కింద పొయ్యి వూదడంలో నిమగ్నమైయున్నాడు కిత్తన్న. మళ్లీ అడిగేడు. సమాధానం రాలేదు. కాసేపు నిశ్శబ్దం తర్వాత... రహస్యం చెపుతున్నట్టు అన్నాడు...."పారిపోయిందిరా" అని.

గొంతులో విషాదాన్ని పసిగట్టేడు మంగులు. "మేకపిల్లా?" అడిగేడు

"కాదు... మీయమ్మరా"

" ఏటీ?!" ఆశ్చర్యపోయేడు. అప్పుడు గమనించేడు మంగులు ఇంట్లో అమ్మ లేదు.

"మేకపిల్ల బయింకే మీయమ్మ పారిపోయింది" గొంతులో విషాదమూ,భయమూ పోలేదు.

"మేకపిల్ల బయిమా?" గొణిగేడు మంగులు.

అది నాయిడోల మేక. దాని మేపుకి సంవత్సరానికి ఐదు కుంచాల ధాన్యంకి నాయిడోలతో ఒప్పానం అమ్మకి. అదీ ఈ మద్దినే రెండు పిల్లల్ని యీనింది.

"ఐతేటయింది?" మంగులు

"ఒక మేక పిల్లకి సిందవెత్తికెలిపోయింది"

"సిందవా... ఎప్పుడు?"

"నిన్న"

"మరి అమ్మో?"

"పొద్దు ఏల మీద బయలెల్లిపోయింది" గుసగుసలాడినట్టుంది గొంతు.

"ఇంతకేటైంది?"

"మేక పిల్లకి సిందవ తినీసిందని నాయుడికి తెలిసిపోయింది"

"అయితే?"

"ఇంటికి పిలిపించేడు"

"... ..."

"పంచాయితీ పెట్టించినాడు"

"ఆ?"

"అక్కడేటవుతాదో నీకు తెలీదేటి?"

"ఏటన్నారు?"

"మేకపిల్ల కి సిందవ తినకపోయుంతే... అది పెద్దదైయుంతే... మూడొందలు సేసునట"

"మూడొందలా?" కళ్లు పెద్దవి చేస్తూ

"మరేటి! మూడొందలు. ఒప్పానం పెకారం మేకపిల్ల సూబెట్టాల. నేకపోతే మూడొందలేనా కట్టాల"

"కట్టకపోతే?"

"పోలీసు కేసు. అదీ కాకపోతే ఐదు సమచ్చరాల కంబారికం"

మేకపిల్ల అదేపనిగా అరుస్తోంది... హృదయ విదారకంగా.

సిందవ బారిన పడ్డ పిల్లమేక కోసమో!

ప్రేమగా గడ్డి పరకలందించే అమ్మ కోసమో!!

దాని రోదన అక్కడ చీకటిని కరిగించలేకపోయింది. ఆ పాకకి వెలుగివ్వలేక పోయింది.

ఆ చీకటి లోంచే... రహస్యంగా ఓ కబురొచ్చింది. సంగమ్మీటింగుంది రమ్మని. ఆ కబురు వెంటే అడుగులేసాడు మంగులు. ఆ అడుగుల వెంట వెలుగు పయనిస్తుందని ఆశ. ఆ వెలుతురులో కొండా కోనా వరసలు కట్టి థింసా నృత్యమవుతుందని నమ్మకం.

ఈ లోగానే... కోడి కూసేసింది. గతుక్కుమన్నాడు మంగులు. పరుగూ నడక...పరుగూ నడకన షావుకారింటికి చేరేడు. అప్పటికే లెగిసిపోయిన షావుకారి గుడ్డి దీపంలో డబ్బులు లెక్కబెడుతూ కనిపించేడు.

“ఏట్రా... ఇప్పుడు తెల్లారిందేటి?” కోపమైపోతాడనుకున్న షావుకారి ప్రశాంతంగానే వున్నాడు చిత్రంగా.

“రేతర నిద్దర్లేదు షాకారీ” సంజాయిషీ ఇచ్చేడు మంగులు

“ఏమీ?” ఏమీ ఎరగనట్టు అడిగేడు. మంగులుకి తెలుసు షావుకారి లేకుండా వూరి పంచాయితీ జరగదని. అయినా చెప్పేడు “నాయిడోల మేకపిల్లకి సిందవ తినీసింది షాకారీ”

“అయితే? సిందవకి నెనకడానికెల్లేవేట్రా?” నవ్వేడు షావుకారి వెటకారంగా.

మంగులు ముఖం ఎర్రబడింది. ఆ ఎరుపు చీకట్లో కనపడకుండా పోయింది.

“అంతేనా...రాతిరి పూట సంగమ్మీటింగులకెల్లేవా?” షావుకారి మరింత దగ్గరికొచ్చి అడిగేసరికి గతుక్కుమని వెనక్కి జరిగేడు మంగులు.

“ఎల్లు కారొల్లసకెల్లి కయ్యన్న గడపలున్న సరుకెక్కించుకొచ్చీ... రేపు పెద షావుకారికి పంపాల, నేను టౌనెల్లాల”

మంగులు నవ్వుకున్నాడు. ఆ బండి తిరిగి రాదని..ఆ సరుకులు జనాలకి పంచేస్తారని.

చీకటింకా విచ్చుకోనేలేదు. తూరుపు కొండమీద ఆకాశం తెల్లబడుతోంది. ఈ లోగ బండి గెడ్డచేరింది. ఒడ్డున వున్న చింత మానుకింద బండి ఆపేడు మంగులు. కడుపులో బరువు గుడగుడ లాడింది. బండి దిగి తుప్పలవైపు పరుగుతీసేడు. కడుపు భారం ఇలాగ దిగిందో లేదో..."అమ్మో! సచ్చిపోయేన్రో దేవుడో!!" అంటూ గావుకేక వినపడింది. గతుక్కుమన్నాడు మంగులు. తుప్పలనుంచి బయటికొస్తూ ఎదురుగా వున్న చెట్టు క్రింది దృశ్యం వణుకు పుట్టించింది.

షావుకారి చిన్నకొడుకు హర్నాదు...చెట్టుకి కట్టీసున్నాడు. అతని చుట్టూ సాయుధులైన మనుషులు అర్ధచంద్రాకారంలో నిలబడి వున్నారు. ఆయుధాలు ఆకలితో వున్నట్టున్నాయి. ముందు కొట్టేరు. ఏవో నినాదాలిచ్చేరు. ఒకరిచేతిలోని గొడ్డలి పైకి లేచింది. ముందు కుడిచేయి... ఆ తర్వాత కాళ్లు.

ఆ చెట్టు మొదలు...ఎర్రబడుతోంది.

పరిస్థితి అర్ధమైపోయింది మంగులుకి... పరుగందుకున్నాడు.

పరుగు...పరుగు...పరుగు.

తుప్పా...డొంకా...ముళ్లు..మళ్లూ...అడవీ...గెడ్డా అన్నీ దాటి ...గొడ్డలమ్మ కురికి...ప్రతియేడూ తుడుముడప్పులతో...కందికొత్తల పండుగ జరిపించుకొని తనలో దాచుకున్నట్టే తననీ దాచిపెట్టింది.

ఒక రాత్రి, ఒక పగలు తిండీ తిప్పలు లేకా కళ్లముందు తెగిపడిన కాళ్లూ చేతుల దృశ్యాలతో ఊరికి దూరంగా దూరపు చుట్టాలింటి వైపు అడుగులేసాడు. అనుకున్నదొకటి, జరిగినదొకటి. తనకు తెలిసిన మేరకి, సరుకులు అప్పజెప్పడమే, మరి ఈ సంఘటనేమిటి?

అనూహ్యంగా...భయంకరంగా... అంటే కొన్ని నిర్ణయాలు తనకు తెలియవన్నమాట.

కొన్ని నెలల తర్వాత ఊరు చేరితే వూరు మామూలు గానే వుంది. మంచం పట్టిన ముసిలోలు ఇద్దరు చనిపోవడం తప్ప ఊర్లో ఏ మార్పూ లేదు. కానీ ఏదో సందేహం... ఏదో మార్పు. షావుకారి

పిలవనూ లేదు. తనూ వెళ్ల లేదు కంబారితనానికి. ఊర్లో వాళ్లు తనవైపు అనుమానంగానే చూస్తున్నారు. వీటికి సమాధానం కొన్ని రోజుల్లోనే తెలిసిపోయింది మంగులుకి.

ఓ రోజు సాయంత్రం చివరీధి కుంబిర్కి ముసిలోడు మంచమెక్కేడు. ఊష్టం. మంచం కింద ఎన్ని కుంపట్లు పెట్టినా గజగజా వణికి పోతున్నాడు. ఎజ్జోడి చేత ఎంత మందు రాయించినా లాభం లేకపోయింది.

అప్పుడొచ్చేడు షావుకారి "ఏటైందిరా?" అని. అందరూ అతని వైపు చూసేరు. "జొర్రం షాకారీ వొగ్గుండదు...తగ్గుండదూ.." అని చెప్పేరు. "ఎలగ తగ్గుతాదిరా .. ఇది మామూలు జొరమైతే తగ్గును." అని అనుమానస్పదంగా మూల్గేడు. అందరూ ఆలోచనలో పడ్డారు. "మొన్నామద్దిన మంగులు గాడు గెడ్డొడ్డున వొలకాల కాంచి తచ్చాడ్డమ నీను సూసేన్రా!" అని అక్కడి నుండి వెళ్లి పోయేడు.

మరో రోజు...

గెడ్డలో స్నానం చేస్తున్నాడు ఒంటరిగా. నీటిలో నడిచొచ్చి తననెవరో వెనకనుండి కొట్టినట్టైంది. స్పృహ వచ్చి కళ్లు తెరిచి చూసేసరికి వీధి మధ్యలో పడివున్నాడు. కాళ్లూ చేతులు నులక తాళ్లతో బంధించబడి వున్నాయి. ఒళ్లంతా గాయాలతో... భరించలేని నొప్పితో. షావుకారి మాటలు ఒక్కొక్కటీ వినపడుతున్నాయి.

"ఈడుంటే... వూరు వొల్లకాడైపోద్ది. ఎవలు చేరదీసి గెంజి పోస్తారో అల్నే తినేస్తాడు. ఊరిల ఈడున్నన్నాళ్లూ చావులు తప్పవు. ఆ తర్వాత మీ ఇష్టం"

స్పృహ కోల్పోతూనే క్రమక్రమంగా... అర్థమైపోయింది మంగులుకి. గెడ్డ పక్కనే కాగుపుల్ల విరిచి నోట్లో వేసుకొని నములుతున్నపుడే అనుమానం. అది స్మశానమని...తన వెనకనుంచి వొచ్చి కొట్టింది షావుకారి కొత్త కంబారి మాసడని.

"మనూర్ల చావులకి కారణమెవులనుకుంతున్నారు? ఈడే. ఊరినుంచి బయటపడ్డాడు... ఇద్దరు ముసిలోలు సఫా. ఈడున్నన్నాళూ

ఊరికి పట్టిన పీడ వదలదు. ఆ తర్వాత మీ యిష్టం." షావుకారి మాటలు స్పష్టంగా వినపడుతునే వున్నాయి మంగులుకి. అతని కళ్లు మూతలు పడుతుండగా... వీధి చివర గడపలో బిడ్డని గుండెలకు హత్తుకుని కన్నీళ్లు కారుస్తున్న భార్య కనపడింది.

తల్లి ఒడిలోని పదకొండేళ్ల సత్యం ఏదో అడుగుతున్నాడు ఏడుస్తూ... "అమ్మా! నాన కేటైందే?"

"నాననెందుకు కొడుతున్నారే?"

"సంపెస్తారా?"

అన్ని ప్రశ్నలకూ ఏడుపే సమాధానమయ్యింది.

"ఎందుకే? ఎందుకే??" సత్యం పట్టు విడలేదు. అమ్మ జుట్టు లాగి మరీ అడుగుతున్నాడు ఏడుస్తూ.

"మీ నాన్న సి...ల్లిం...గో...డ...ట...రా" బోరున ఏడుస్తూ నెత్తి బాదుకుంటూ అంది.

ఆ కేక కొండల్లో ప్రతిధ్వనించింది. మంగులు కనురెప్పలు ముతబడ్డాయి. ఊపిరాగిపోయింది. మంగులు భార్య మంచం పట్టింది. కొన్నాళకి ఆమె కూడా కన్ను మూసింది.

* * *

"సార్! ఎక్కడ దిగుతారు?" కండక్టర్ పిలుపుతో కళ్లు తెరిచేడు సత్యం. బస్ దిగేడు. శిధిలమైపోయిన బస్టాపు. అప్పటిదే. దానికెదురుగా కొత్తది...మిలమిల మెరిసే నీలి అక్షరాలను మోస్తూ.

"డాడీ! ఇంకెంత దూరం?" గీత అడుగుతోంది.

"దగ్గరేనమ్మా...ఇదిగో ఇలా నడిస్తే అలా చేరిపోతాం" అంటూ నడక మొదలెట్టేరు.

గీత ఎన్నో సందేహాలను అడుగుతోంది. అన్నిటికీ ఓపిగ్గా సమాధానాలు చెప్తున్నాడు సత్యం. గీతకు ఈ ఊరు కొత్త. ఈ నేల కొత్త. ఆమె ఇక్కడ పుట్టలేదు. నగరంలోనే పుట్టి పెరిగింది.'ఇది తాత నడిచిన దారమ్మా... నేను పెరిగిన నేలమ్మా... మనని పెంచిన కొండమ్మా' అని చెప్పాలని... అన్నీ కూతురికి తెలియాలని సొంత

వూరికి ప్రయాణమయ్యేడు సత్యం. చిన్ననాటి గురుతులన్నీ ఒక్కొక్కటిగా... కథలు కథలుగా చెప్తూ వొచ్చేడు.

"ఇది ఒకప్పుడు చిన్న బండి గోర్జిరా. కొన్నాళ్లకి మట్టి రోడ్డైంది. ఆ తర్వాత్తర్వాత ఇది ఇలగ తార్రోడ్డైంది. మా చిన్నపుడు ఈ దారంట ఒంటరిగా నడ్డమంటే భయం"

ఆ మాట పూర్తవకుండానే పెద్ద శబ్దం చేసుకుంటూ ఆటో వచ్చి ఆగింది పక్కనే.

"వస్తారేటి?" డ్రైవర్ తల బయటకు పెట్టి అడగ్గానే ఇద్దరూ ఎక్కేసారు.

కొండచుట్టూ తార్రోడ్డు. వేగంగా వెనక్కు పరిగెడుతోంది కొండ. కొండ అప్పటిలా లేదు. కొండ చుట్టూ ఎన్ని మార్పులో!!

వూరు వూరంతా మారిపోయింది. వీధులు విశాలమయ్యేయి. ఇళ్లు ఎత్తు పెరిగాయి...సిమెంట్ పైకప్పులతో. ఇంచుమించు అన్ని ఇంటి పై కప్పులమీదా డిష్ యాంటెనాలు. గడపలు గజాల దొడ్లుతోనూ... తమను తాము ఖైదీలుగ మార్చుకుంటున్నట్టు. మనుషులూ మారిపోయేరు. కొత్త తరం...జీన్ ఫేంటు,టీ షర్టుల్లోనూ... పంజాభీ డ్రెస్సుల్లోనూ. అడుగడుగునా సెల్ ఫోన్ మోతలతోనూ.

మొదట పోల్చలేక పోయినా గుర్తు పట్టేక ఆశ్చర్యపోయేరు ఊరంతా. కుశల ప్రశ్నలడిగి చేరదీసేరు. మామా, బావా, అన్నా, చిన్నానా అని పలకరించి మాట్లాడేరు.

"ఇనాలూ ఎక్కడున్నావైతే?" అడిగేడు చిన్ననాటి మిత్రుడు పకీరు.

"ఇక్కడి నుంచి పారిపోయేక పార్వతీపురం లో రైలెక్కేసేను. విజయవాడ రైల్వేస్టేషన్లోనే చాలా సంవత్సరాలు గడిపేను. ఆ తర్వాత అనాథ శరణాలయం... ఓ కంపెనీలో ఉద్యోగం... అలా గడిచి పోయిందిలే."

"మరి.. పెళ్లి?"

"కంపెనీలోనే పరిచయమయ్యింది. దానికీ ఎవ్వరూ లేరు. అదిగో ఒక్కతే కూతురు. పేరు గీత. ఇక్కడే ఇల్లు కడితే బాగుంటాది గదా అనీ...."

"ఇక్కడా??"ఆశ్చర్యపోయేడు పకీరు.

"ఏమి కట్టకూడదా?"

"ఇక్కడోళ్లందరూ సైట్‌లు కొనీసి టౌనెల్లిపోతుంటే నువ్వేటి అట్నుండిటు?"

"ఇన్నాళు టౌనులున్నాను కదా" అని "సరేగానీ ఊర్లో సంగతులేంటీ?"

"ఊరుకేమి? పైన పటారం లోన లొటారం"

"ఏమీ?"

"సూడ్డానికి డాబాలు... సిమెంటు రోడ్లు. ఇంటిల మాత్రం తిండిగింజలుండవు."

"అంటే ఊరు బాగులేదా?"

"బాగులేకేమి? సూపరు. గుంటలందరూ టిప్పుటాపు మీదున్నారు సూసుండవా? ఏ గుంటా గుంటడైనా ఒక్కతీరుగున్నారా సెప్మి? ఒకడి మాట ఇంకొడినడు. సిన్నా పెద్దా...మంచీ మర్యాద వున్నాయా ఎవులికైనా? ఖైనీ గుట్కా... సిగిరెట్టు మందూ. ఏ అలవాటూ లేనోడెవడూ లేదు" చెప్పుకు పోతూనే ఉన్నాడు.

"మామా! ఏది ఏమైనా జీడితోటలు, ఉపాది ఆమీ పనులొచ్చి జనాల్ని సెడగొట్టేయి" అంటూ ట్రాక్ సూట్‌లో వున్న వ్యక్తి కూర్చున్నాడు.

"మీరూ?" అనుమానంగా అన్నాడు సత్యం

"కృష్ణ ని బావా! మీ జోగులు మామ కొడుకుని" అని పరిచయం చేసుకుంటూనే ప్రక్కనే కూర్చున్నాడు.

"సారీ బావా, గుర్తు పట్టలేకపోయేను. ఇప్పుడేం చేస్తున్నావు..?"

"మనూర్లోనే...డ్రిల్లు మాష్టరు" అని పకీరు చెప్పేడు.

"మరేమైతే? మీ మేనగోడలికి నీ దగ్గరే చేర్పించేస్తాను."

"ఇలాంటి బడిలోన మీ పిల్ల చదువుతాదా?" అన్నాడు నిష్టూరంగా.

"ఎందుకు చదవదు గానీ... జీడి తోటలు జనాల్ని ఎలాగ సెడగొట్టేయి?" మునుపటి చర్చను కొనసాగించేడు.

"సెడగొట్టవేటి? పని చెయ్యక్కర్లేదు. డబ్బు మన్నాన డబ్బు. డబ్బు సేతికందితే మనోల్ని ఆపగలమేటి? నీకొకటి తెలుసునా.. యువసాయం సేసినోడి కన్నా కొండమీద రెండు జీడి మొక్కలేసుకున్నోడు సుకంగున్నాడు"

"అంటే?" అడిగాడు సత్యం.

"ఎవసాయం బాగులేదని." ఖచ్చితమైన ముగింపు ఇచ్చినట్టు చెప్పేడు పకీరు.

"నిజమే వ్యవసాయానికి రోజులెప్పుడో చెల్లి పోయాయి" గొణుక్కున్నాడు సత్యం.

"బాగున్నారండీ!" ఎత్తుగా ఎర్రగా వున్న అందమైన యువకుడు అడిగితే "మీరూ?" అన్నాడు సత్యం

"నేను శ్రీనునండి... కృష్ణమూర్తి గారి మనవడిని" అంటూ మంచం వేసేడు కూర్చోమన్నట్టు.

నిజమే. షావుకారి కూతురి కొడుకు. పోలికలు గుర్తొచ్చేయి. ఇల్లు కాస్త మారింది. సిమెంటు బెంచీల మీద సామాన్లు అడ్డదిడ్డంగా పడి వున్నాయి. గడపకెదురుగా చిన్న బడ్డీ. ప్రక్కనే కాయిన్ బాక్సు. చిల్లర సామాన్ల నుంచి చీప్ లిక్కర్ దాకా వున్నాయక్కడ.

"వ్యాపారమెలా వుంది?" అడిగాడు సత్యం.

"ఏమి వ్యాపారమండీ... ఆ రోజుల్లో అయితే తిరుగుండేది కాదండీ. ఈ రోజుల్లో అలగలేదండి."

"ఏమీ?"

"మొన్నే... గూడ నుండి ఒక ముసిలోడు పది చీపుర్లు తెచ్చేడండీ. నాకిచ్చీరా అన్నాను. 'ఎంతా' అన్నాడు. రేటుంది గదా అని 'ముప్పై అయిదు' అన్నాను. కాదు యాభై అన్నాడు. అయితే ఒద్దులేరా అనీస్తే...

అలాగే మోసుకెల్లిపోతున్నోడు కరువులు మేష్టకెదురయ్యేడు. ఆలమ్మాయి టౌనులుంది గదా... అవుసరమని యాభై ఇచ్చీసి తీసుకున్నాడు."

"ముసిలోడికి మంచి రేటొచ్చినట్టేకదా" అన్నాడు సత్యం

"ఇలాగైతే మా వ్యాపారమేటైపోవాలండీ?" అని "ముసిలోడికి మంచి జరిగిందన్నారు గదా... అదే ముసిలోడు మరొక రోజు పాతిక చీపుర్లు మోసుకొచ్చేడు. నీనే మల్లా అడిగేను. 'ఏభైకి తగ్గనూ' అన్నాడు. ఆ రోజు కరువులు మేష్టు ఉజ్జోగస్తుడూ... అవుసరమున్నోడూ... ఎంతకైనా కొంటాడూ... నీను కొనాలంతే మార్కెట్‌ల రేటుండాల గదా' అన్నాను. ఆ మాటకి ముసిలోడు ఏటి సేసేడు తెలుసండీ.... మొల్లోంచి సెల్ తీసి పెద షావుకారికి ఫోన్ చేసేడు.... నా మీద నమ్మకం లేక"

"ఔనా?" ఆశ్చర్యపోయేడు సత్యం.

"ఔనండి... ఇప్పుడంతా ఆన్‌లైన్లోనే"

"ఐతే ఏమైంది?"

"ఏటవడమేటీ...'నలభై ఇస్తానూ తెచ్చీ' అన్నాడు పెద షావుకారి. తీర కష్టపడి మోసుకెల్తే పాతిక లెక్కన ఇచ్చీసి పంపీసేడు.

"అదేంటీ?" మరింత ఆశ్చర్యపోయేడు సత్యం

"ఇంద ఇప్పుడే ఫోనొచ్చింది... రేటు తగ్గిపోయిందీ' అని పెద షావుకారి జేబులోనని ఫోను తీసి చూపించేడు.... అలగనీ ఆ పోను నిజమని అనుకుంటున్నారా? పోను మాట్లాడినంత మాత్రాన రేటు పసిగట్టీగల్దా? ఆ సీపుర్లు తిరిగి తేగల్దా? ఈదీది తిప్పి అమ్మగల్దా? సచ్చినట్టిగ ఆ రేటుకే ఇచ్చీసి తిరిగొచ్చీసేడు ముసిలోడు" అని ముగించేడు శ్రీను ఏది చేసినా మేమే చెయ్యాలన్నట్టు.

ఇన్నేళ్లలో... ఆధునిక సౌకర్యాల అందుబాటు ఎవరికి లాభం చేకూర్చింది? మధ్యవర్తులు ఏమౌతూ వచ్చేరు? లాభాలు ఎక్కడికి చేరుతున్నాయి?

"ఏది ఏమైనా జనం తెలివి మీరిపోయేరండీ!"అన్నాడు శ్రీను

“కాదు...కాదు... తెలివి జనానిది కాదు” గొణిగినట్టే అనుకున్నాడు సత్యం

“జనాలకి కట్టల కట్టలు చేతికందీయాల” పకీరు యధాలాపంగా అన్నాడు.

“అందెస్తుంది కదేటీమద్దిన...” అని నసిగేడు కృష్ణ

“కట్టలేటీ... అందీడమేటి?” అనుమానంగా అడిగేడు సత్యం.

“ఏట్లేదూ...’ అనన్నాడు గానీ “దీనంతటికీ అసలు కారణం మరొకటుంది” అని అర్ధాంతరంగా ఆపేడు కృష్ణ

“ఏటి బావా అది?” కుతూహలంగా సత్యం కళ్లు చిన్నవి చేసేడు.

“ప్రోజెక్టుల పవరండీ” అన్నాడు పకీరు.

“పవరా? పవర్ ప్రోజెక్టా?”

“రెండూ” అని నర్మగర్భంగా తల వూపేడు కృష్ణ

“ఎలాగ?”

“అవన్నీ ఇప్పుడెందుకులెండి” అంటూ లేచేడు.

“కూర్చో మామా, ఇప్పుడెక్కడికి ఎల్తామూ?” అని సత్యం అంటూంటే

“పద బావా అలా నడుచుకుంటూ మాట్లాడుకుందా”మని లేచేడు కృష్ణ

నడుస్తున్నారు ముగ్గురూ

“ఈ కొండవతల పవర్ ప్రోజెక్టొకటి కడతారట కదా మామా! భూములన్నీ కూడబెడతున్నారు. మీరొగ్గేసిన భూమికి ఆల్రడీ మన పాత పెసిరెంటు దబ్బుల్దొబ్బేడని ఊర్లందరూ అనుకుంతన్నారు తెలుసునా?” వివరించబోయేడు కృష్ణ

“అదొక పెద్ద కతరా దద్దా!” అని పకీరు నిట్టూర్చేడు

“చెప్పు...చెప్పూ” అని సత్యం

“గవర్మెంటు కట్టాలంతాది... మనోలు వొద్దంతారు” రెండు ముక్కల్లో తెంపేసాడు పకీరు.

"గవర్మెంటునెదిరించాలంతే ఎవుడి తరమూ? అధికార్లు, పోలీసులూ... బలమూ, బలగమూ... అంత అటే"

"ఎదిరించాలి... తప్పదు" మళ్లీ గొణిగినట్టే అన్నాడు సత్యం

"ఎదిరించాలి నిజమే గానీ మనిసొక్కాసి లాగుతుంతే ఎదిరించగలమా?" సందేహం వెలిబుచ్చేడు మరొకడు.

"అదే... అందుకు ఒక నాయకుడు కావాలి" గొణిగేడు సత్యం

"ఈ మద్దిన ఊరంతా గందరగోళంగా వుందిరా మామా!"

"ఏమీ?"

"ఎవుడెటుకాసి మాట్లాడుతాడో అర్ధమవకంటంది"

"ఏమైంది?" అడిగాడు సత్యం

"ఒకార్నెల్లు క్రితం... కలెక్టరు గారు మీటింగు పెడతామని అందరూ రావాలనీ దండోరా ఏయించేరు.... ప్రెజాభిప్రాయమని. మాంచి పనులు టైములోన... ఎవుడెల్తాడు? అయినా కమీనిష్టు పార్టీవోలు పున్యమా అని ఒకలిద్దరైనా వొచ్చేరు. ఆలేటంతారో, ఈలేటంతారో ఎవులికీ అర్ధంగాలేదు. ఎవుడో ఒక మాటన్నాడు... మరొకడెవుడో ఒక రాయిసిరేడు. అదే అదుననుకొని పోలీసులు రెచ్చిపోయేరు. సబ వాయిదా పడింది. మల్లా ఈ మద్దిన ఎడతారని బోగట్టా" పకీరు ముగించేడు.

"అయితే ఈ మద్దిన ఒక పుకారొచ్చింది" పకీరు కొంచం ముందుకు వంగి చెప్పేడు

"ఏమని?" సత్యం

"పేక్టరీ వోలు ఒకడికి తెలీకుండా మరొకడికి రాత్రి పూట ఒంటరిగా పిలిపిస్తున్నారని"

"పిలిపించీ...?"

"నోట్ల కట్టలు పంచుతున్నారనీ. అదంతా సీనుగాడు ద్వార జరుగుతుందని మా అనుమానం.." అని అర్ధాంతరంగా ఆపేడు కృష్ణ

"ఎలాగ?"

“ఈడు సిన్నింటోడనుకుంతున్నావా? సూడ్డానికి సిన్న గుంటడిలాగ, సిన్న బడ్డీ ఎట్టుకొని బతుకుతున్నోడిలాగ కనబడుతున్నాడు గానీ ఈడు సేసిన యేపారం సిన్నది కాదు”

“ఏమిటది?”

“సిట్‌ఫండ్లు, రెయలెస్టేట్లు... ఆర్డీలు, ఇన్సూరెన్సులు ఒకటేమిటి? అలపొంటోడు ఈ మద్దిన పవర్ ప్రోజెక్టోలతో చేతులు కలిపినాడని పుకార్లు సికార్లు చేస్తున్నాయి.”

“కలిసేం చేస్తాడు?”

“చెయ్యాల్సిందంతా చేస్తున్నాడు.” అందుకున్నాడు కృష్ణ

“ఏమిటది?”

“జనాన్ని కూడబెట్టడం. ఫేక్టరీ వోలకి జనం కావాలి. జైకొట్టే జనం కావాలి. ప్రెజాభిప్రాయ సేకరణ సభలో ‘వూ’ కొట్టే జనం కావాలి. అందుకు ఎవుడొప్పుకుంటాడు? ఒప్పుకున్నా ఒట్టిగొప్పుకోడు గదా? డబ్బు ఎర జూపాల. అందుకు ఒక మనిషి కావాల. అదిగో... అప్పుడు దొరికేడు మన శీనుగాడు.

“గానీ... అది నిజిమో అబద్దమో తెలీకుంటుంది మామా, ఎవుడినడిగినా ‘ఔనటా’ అని ముకము తిప్పేసి ఎలిపోతున్నారు గానీ ఎవుడూ వులకడూ, పలకడు..”

“లేదు, లేదు... ఇందులో నిజం లేకపోలేదు”

“అంతే? ఇదంతా అడే సేస్తున్నాడంతావా?”

“అవ్వొచ్చు. అలాంటి అవసరం మనూర్లొ ఇంకొకడికి లేదు”

పకీరు ముఖంలో పొద్దు ములిగిపోతున్న దృశ్యం... కృష్ణ కళ్లలో ఊరుని కమ్ముకుంటున్న దృశ్యం.

* * *

సత్యం ఇంటికి పునాది రాళ్లేసాడు. ఊర్లో అతని స్థానం గట్టిపడింది. అందరికీ దగ్గరివాడయ్యేడు. ప్రతి రోజూ ప్రతి ఇంటికి

వెళ్లేడు. అందరితోనూ కలగలిసి పోయేడు. పండుగలోనూ, పబ్బంలోనూ... కష్టంలోనూ, సుఖంలోనూ... అంతా తానైనట్టు.

ఓ వెన్నెల రాత్రి...

ఊరందరినీ ఇంటికి రమ్మని ఆహ్వానించేడు.

“ఏట్రోయ్ బావా! మా కోడలు గానీ అలికిడి సేసిందేటి?” అంటూ ఇగటమాడుతూ వచ్చి కూర్చున్నారు కృష్ణ తదితర బృందమంతా.

నవ్వుతూ అందరినీ పలకరించేడు.

“ఇది నవ్వుకోవాల్సిన సమయం కాదు బావా!”

ఆ స్వరం లోని గంభీరతకి అందరూ నిశ్శబ్దమైపోయేరు.

“ఏటైంది బావా?” అని దగ్గరికొచ్చేరు మిత్రులు

“ఊరు బావా, ఊరుకి పీడ పట్టింది బావా.... తేరుకోకపోతే నాశినమైపోద్ది బావా”

“ఏటి దద్దా! సరిగ్గా సెప్పురా నాయినా” అంటూ కొందరు అసహనాన్ని ప్రదర్శించేరు.

“మనూరు ఎప్పుడు కట్టేరో తెలుసునా?” కలలో అడిగినట్టు అడిగాడు సత్యం.

“కట్టడమా? అదెవులికి తెలుస్తాదిరా మనవడా? మా తాత ముత్తాతల కాసి వూరిక్కడే వున్నాదా మరేటి? అయినా ఆ వూసెందుకురా ఇప్పుడు?” నోట్లో చుట్ట తీసి బయటకు వుమ్ముతూ అన్నాడు జన్ని తాత.

“ఎందుకా? మరొక ఐదేళ్లు పోతే ఈ వూరు ఇక్కడ ఇలాగ వుండదు” అన్నాడు సత్యం.

“ఊరుండకపోడమేట్రా నాయినా...”జీను ఫేంట్ యువకుడు లేచేడు అసహనంగా.

“ఉండకపోవడమంటే...ఉంటాది గానీ ఇలగుండదు.”

“అంటే?”

“తినడానికి తిండుండదు. తాగడానికి నీళ్లుండవు”

"ఇంకా నయం.. బతకడానికి మనముండమన్నావు గాదు" అంటూ ఒక యువకుడు సటైరేసేడు.

"ఔను, అదే నిజం" అన్నాడు సత్యం స్థిరంగా.

"ఏట్రా బాబు! సెపింపందేదో తిన్నగ సెప్పొచ్చుగదా?" ఓ మధ్య వయస్కుడు అడిగాడు.

"అదీ చెప్తాను. ముందివి చూడండి" అని కొన్ని ఫోటోలని అందించేడు.

ఎడారి ప్రాంతంలో బ్రతికున్న శవాలలాంటి మనుషుల చిత్రాలవి. ఎండిపోయి, బక్కచిక్కిపోయిన ఆలమందలు, బొగ్గు పూసినట్టుండే ఇంటి పైకప్పులు...

"ఏటీ పొటోలు? ఇవన్నీ మాకేలా" అనుమానం వ్యక్తం చేసేడు మరో నడివయస్కుడు.

"కొన్నాళ్లు పోతే మనూరు కూడా ఇలగే తయారవుద్ది" అన్నాడు సత్యం సాలోచనగా.

"ఎందుకూ?" అందరి అనుమానాన్ని ఒకడడిగాడు.

"పవర్ ఫేక్టరీ పడితే అంతే మరి."

"నిజమా?" అందరి కళ్లలో భవిష్యత్ చిత్రం.

"ఈ ఫొటోలు అబద్దం చెప్పవు. అవి ఇప్పటికే పెట్టిన ఫేక్టరీ చుట్టూ వున్న గ్రామాలవి. చుట్టూ పది పదిహేను కిలోమీటర్ల మేర బొగ్గు కమ్మేస్తుంది. పీల్చుకోడానికి గాలి...తాగడానికి నీరు...తినడానికి తిండి... అంతా బొగ్గు, బొగ్గు. మనుషులు, పశువులు, మొక్కా మోడూ, అంతా బొగ్గు బొగ్గై బతుకంతా బుగ్గైపోతాదిరా...నాకు తెలుసు... నేనిన్నాళూ పనిచేసింది ఇలాంటి ఫేక్టరీ లోనేర్రా. నీను పడ్డాన్రా... ఆ బాదలన్నీ. మీకు తెలీదు. నాకు తెలుసునురా... నాకు తెలుసును." కలవరిస్తున్నట్టు అన్నాడు సత్యం.

"మరి మా బూముల సంగతేట్రా? రేటు బాగా వొచ్చిందని అప్పుడిచ్చీసినాము. అవి ఫేక్టరీ కోసమని ఇప్పుడు తెలిసింది. మనమొద్దంతే మాత్రం ఆ భూవులు తిరిగొస్తాయా?.. ఫేక్టరీ

కట్టడమాపేస్తారా?" అప్పటికే ఎకరా భూమిచ్చేసిన బిడ్డికోడు దీనంగా అన్నాడు.

"అదీ నిజమే. కానీ సమయం ఇంకా దాటి పోలేదు." సాలోచనగా అన్నాడు సత్యం.

"ఎలగ?" అందరి తరపున ఒకడడిగాడు.

"మళ్లీ మీటింగు పెడతారు. ప్రజాభిప్రాయ సేకరణ" అని ముగించేడు సత్యం.

* * *

శ్రీను బడ్డీ ముందు ఒక మోటరు బైక్ ఆగింది. ఇద్దరు వ్యక్తులు దిగి ఇంటిలోకి నడిచి వెళ్లేరు. వెనక శ్రీను కూడ వెళ్లేడు. "ఏమిటి విషయం?" మంచమ్మీద కూర్చుంటూ అడిగాడు కొత్త వ్యక్తి.

"నిన్న మొన్నటి వరకూ బాగనే వుంది. కానీ 'సత్యం' వచ్చిన తర్వాత వూర్లో ఏదో మార్పొచ్చినట్టు అనుమానం..." అర్థాంతరంగా ఆపేడు శ్రీను.

"ఎవరతను?" అడిగాడు మరో వ్యక్తి.

"అతనూ..." అని అడిగాడు శ్రీను.

* * *

'టక్...టక్...టక్...' మని ఎవరో తలుపు కొట్టిన చప్పుడైతే బయటికొచ్చేడు సత్యం. ఎదురుగా ఓ అపరిచిత వ్యక్తి, అనుమానస్పదంగా.

"ఎవరూ?" అని అడిగేంతలోనే "సత్యం అంటే మీరేనా?" అన్నాడు

"ఔను... ఏమి?"

"మీరొక సారి స్టేషనుకు రావాలి. ఎస్సై గారు కబురు"

* * *

ఒళ్ళంతా గాయాలతో సత్యం. చుట్టూ వూరి జనం. ప్రక్కనే అమ్మ చుట్టూ పెనవేసుకొని ఎన్నో ప్రశ్నలతో గీత.

"అమ్మా! డాడీకేమైందీ?"

"డాడీనెక్కడికి తీసికెళ్లేరు?"

"ఎందుకు లేవలేకపోతున్నారు...?"

"అందరూ ఎందుకు ఏడుస్తున్నారు?" గీత అడుగుతోంది... గుక్కతిప్పుకోకుండా. కళ్లలో విషాదాన్ని కక్కుతున్న సత్యం భార్య అరిచింది..."మీ... నాన్న...ఇ...న్...ఫా...ర్మ...ర...టే...త...ల్లీ!"

❊ ❊ ❊

"డాడీ నాకూ నేర్పించూ" ఒకటే అల్లరి చేస్తోంది గీత.

"తప్పకుండానమ్మా!" అని గీతని కృష్ణ ముందు నిలబెట్టేడు సత్యం.

ఆమె చేతికి 'బౌ' ని 'యారోస్' ని అందించేడు కృష్ణ.

గీత విల్లు ఎక్కు పెట్టింది. నారిని తనవైపుకి లాగింది... బలంగా. బాణం మొన చివర నుండి చూపు సారించింది.

"డాడీ! దేన్ని కొట్టాలి?" అడుగుతోంది గీత.

సత్యం ఆమె కళ్ల లోకి చూసేడు. లక్ష్యం ఆమె ఎంచుకోగలదు. అతనికి తెలుసు... గీత గురి తప్పదు.

*01.05.2013,* నవ్య వీక్లీ

# నా పేరు సొంబరా

**క**లెక్టరు కార్యాలయం...గ్రీవెన్స్ రోజు. గుంపులు గుంపులుగా జనం. సమస్యలన్నీ సాయం కోరుతూ. వరండా నిండా వరుసల్లో. ఎదురు చెట్ల కింద చెల్లా చెదురుగా ఎవరి ఆతృత లో వాళ్లు.

ఊపిరాడని ఉక్క. ఒళ్లంతా చెమట, చికాకు. క్షణ క్షణం నాలో అసహనం. ఎవరి మీదో చెప్పుకోలేని కోపం. వరండా చివర టాయిలెట్స్ లో దూరి ముఖమ్మీద నీళ్లు చల్లుకున్నాను. రిలాక్స్ అయ్యాను. ఎదర అద్దం. నన్ను నేను చూసుకున్నాను.

వెడల్పాటి ముక్కు, విశాలమైన నుదురు, వంపులు తిరిగిన జుట్టు. నా వయసప్పుడు నాన్న ఇలాగే వుండి వుంటాడు.

నాన్న ఇప్పుడు వుండి వుంటే అన్నదమ్ముల్లా వుండే వాళ్లం. నేను పుట్టిన వెంటనే తాత నాన్న ని కౌగిలించుకుని ముద్దులాడేడట.

“నిలబెట్టేవురా! జాతి కాపు కాసినోడివనిపించేవురా!!” అని జత ఎడ్లు కొని కానుక గా యిచ్చేడట. పుట్టిన వెంటనే నన్ను చేతుల్లోకి తీసుకొని అడవి వైపు చూపిస్తూ ‘ఇదిగో నా రాజు... అడివికే రారాజు’ అని గర్వంగా తాతల్నందర్నీ స్మరించుకున్నాడట.

నేను పుట్టడం ఇంటికే కాదు, ఊరికే పండుగట. ఎందుకంటే వూరికి పెద్ద అయిన తాత కి పుట్టిన ముగ్గురన్నదమ్ముల్లో అందరికీ ఆడపిల్లలే. చిన్నవాడైన నాన్నకి పుట్టిన ఏకైక మగ సంతానం నేను.

నాకు గుర్తొస్తోంది...

తాత భుజమ్మీద గుర్రంపండేసుకుంటే తాత వుంగరాల జుట్టు పట్టుకుని నేను రాజునై వీధులన్నీ ఊరేగేను. రెండు చేతుల్లోనూ కిన్నెర పట్టుకుని నన్ను పాటలు పాటలుగా తిప్పేవాడు తాత. అదే భుజాల మీద దప్పు దరువుల్లో కొత్త వూర్లు, కొత్త కొండలూ, వింత వింతల అడవీ చూసేను. ఆ భుజాల మీదే... తాత పెదాల మీద పలికిన పిన్ల కర్ర పాటల్లో ముత్తాతల గొంతులు విన్నాను. మా ఇద్దరి వైభవం చూసి వూరంతా ముచ్చట పడేది.

నాకు పేరు పెట్టడానికి ఇంటికి ఆకుల తోరణం కట్టించేరట. ఎజ్జోడిని పిలిపించి ఇంటి దేవత మూల “కానికు” వేయించేరు. దీపం వెలుగులో అమ్మ ఒడిలో వున్న నన్ను తాత ఎత్తుకుని చేటలో బియ్యం నెరుపుతు గుగ్గిలం వేసి ధూపం పట్టేరట. ఎజ్జోడు ముంతలో నీళ్లను చిలకరిస్తూ రాగాలు తీసి దేవతలందరినీ స్మరించేరట. మా వంశం లోని అందరి పేర్లూ గొంతెత్తి పలుకుతున్నాడట. ఒక్కొక్క పేరుకీ ఒక్కొక్క బియ్యం గింజను నీటిలో వేస్తున్నాడట. చుట్టూ మూగిన చుట్టాలు. వూరి వాళ్లూ, బంధువులూ ఆతృతగా ఆ ముంతలోని బియ్యం గింజలు వైపే చూస్తున్నారట. ఏ పేరు పలికినపుడు బియ్యం గింజ నీటిలో మునుగుతుందో అదే నా పేరు.

మంగడూ...

బారికీ...

లక్కాయీ...

సన్నాయీ...

సుక్కూ...

సొంబరా...

చివరి పేరుకి బియ్యం గింజ నీట మునిగింది. ఒక్కసారిగా ఉళ్లాల ఉత్సవం... వూరంతా వెలుగు. తాత ఒక్కసారిగా ఎగిరి గెంతేసేడు. వీధుల వెంట నన్నెత్తుకుని ఊరేగించేడు. తుడుం కుండ నడుముకి కట్టి నడిరేయి దాకా వాయిస్తూ... ఏ జామునో నిదుర పోయేడట. తాత కంత సంబరం. ఎందుకంటే... నాకు దేవతలిచ్చిన పేరు ఎవరిదో కాదు, మా తాతదే.

"నా జాతిని నిలబెడతాడు... నా మనవడు" అనే కన్ను మూసేడు తాత.

"రాబర్టూ! రాబర్టూ!!" ఎవరో పిలుస్తున్నారు.

నన్నే... నన్నే... నన్నే.

నా పిడికిలి బిగుసుకుంది. బలంగా గాల్లోకి చేయి విసిరేను. ఎదురుగా వున్న అద్దం ముక్కలయ్యింది. నా గుండెలాగే.

ఇప్పుడు నా పేరు రాబర్ట్ విల్సన్...ఔను రాబర్ట్ విల్సన్.

నన్ను నా నుంచి దూరం చేసిన పేరు, నేను నేను కాకుండా పోయిన పేరు. గుండెలోని గాజు పెంకుల్ని కెలుకుతున్న పేరు.

నేను 'సొంబరా' నుంచి 'రాబర్ట్ విల్సన్' గా ఎలా రూపాంతరం చెందేనో లీలగా గుర్తొస్తోంది నాకు.

ఆ రోజు నాన్న నన్ను హాస్టల్లో చేర్పించడానికి వచ్చిన రోజు. అప్పటికే వేరే స్కూల్లో నాలుగు చదివి మానేసిన నాకు సీటివ్వడం కుదరదన్నారు మాష్టారు. ఆ స్కూలు నుండి టీ.సీ. తెస్తే గానీ చేర్పించడం వీలవదని అంటూనే ఒక మార్గం చెప్పేరు. అక్కడ వున్న పేరు కాకుండా వేరే పేరున ఇక్కడ చేరడం. అప్లికేషన్ నింపుతూ మాష్టారికి నచ్చిన సినిమా హీరోల పేర్లు చెప్తూ వచ్చేరు...నాన్న దేనికి తల వూపుతాడోనని.

"అవేవీ ఒద్దండీ... రాబర్ట్ విల్సన్ అని రాయండి" అని కొత్త గొంతు వినపడింది. అతని వైపు చూసేను. తెల్లబట్టలేసుకొని చేతిలో నల్లటి పుస్తకంతో వున్నాడతను. మెడలో సిలువ వేలాడుతోంది. అతను తరచూ వూరు రావడం, ఇంటికి దగ్గరవడం నాకు గుర్తుకొచ్చింది అప్పుడు.

"ఇదేటి వోయ్! ఇలగుందీ పేరు?" అని నాన్నని అడిగారు మాష్టారు ఆశ్చర్యంతో. నాన్న నేల చూపులు చూస్తున్నాడు.

"మీము మతము తీసుకున్నాము" అని నాన్న అమాయకంగా అనడం నాకింకా గుర్తే.

మతమూ... తీసుకోవడమూ!?

తీసుకోవడానికి ఎవరిస్తారు? ఎందుకిస్తారు? అసలు ఇవ్వడమేమిటి? మతమంటే ఏమిటి? మా వూరికి మతమెలా వొచ్చింది?

అప్పుడు మా వూరెలా వుండేది?

బద్దలైన అద్దం పెంకుల్లో నా ప్రతిబింబంలా... పగిలిన నా గుండె లోతుల్లోంచి వెల్లువెత్తుతున్న హృదయ ఘోషలా...

ప్రశ్నలు... సందేహాలు...

తాతల నాటి ముచ్చట్లలో మా వూరిని చూసేను. ఇప్పుడు ప్రధాన రహదారికి నాలుగు కొండల అవతల, అడివికి ఆమడ దూరంలో, చుట్టూ పొలాలతో మూడే మూడు వాసల్లో వుండేది వూరు. భూములున్న వాళ్లు పొలాల్లోనూ, లేనివాళ్లు కొండల మీద పోడు వ్యవసాయం చేసే వాళ్లు. అడవిలొ చింత పండూ, చీపుర్లూ, పనస పళ్లు, ఇప్పమొగ్గలూ సంతలో అమ్ముకుని జీవనం సాగించే వాళ్లు. అంతా వర్షాధారమే. వాన కురిస్తే తిండి, లేదంటే పస్తులు. అయితే వాన కురిపించేది అడివి తల్లి, అందుకు సాక్షులు పూర్వీకులే అని నమ్మకం. చనిపోయిన వాళ్లు చల్లగా చూస్తే అడివి తల్లి కరుణించినట్లే. వాన కురుస్తుంది. లేదంటే కరువు. పెద్దల్ని ప్రసన్నం చేసుకుని చినుకుల ఆశీర్వాదం పొందడమే పండుగ.

పండుగంటే... గూడెంలోని అందరి గుండె చప్పుళ్లనూ డప్పులు చేసి అడవికి వినిపించడం.

పండుగంటే... కొండమీద పండిన ప్రతి గింజా మీ చలవేనని పిన్న కర్ర పాటలు పాడడం.

నీ నీడలో ఒక్కటై వున్నామని అడివి తల్లి ముందు గజ్జె కట్టి థింసా అడుగులు వేయడం... అడవికి దండం పెట్టడం.

అంతే. అడవే దేవత. పోయిన పెద్దోళ్లే దేవుళ్లు. దేవుళ్ల కనుసన్నల్లో దేవత ఒడిలో బతకడమే మతం.

మరి ఇప్పుడు?

మా వూరెలా వుంది??

అనడానికి ఆదివాసీ గ్రామం గానీ అన్ని ఆధునిక సదుపాయాలు అందుకుంది. టి.వీ, సెల్‌పోన్, ఫ్రిజ్, మోటారు బైక్. ఈ వస్తువుల కంటే ముందు... వస్తువుల్ని మోసుకొచ్చిన రోడ్డు కంటే ముందు మా వూరికి ఒక సిమెంట్ కట్టడం వొచ్చింది. అది బడి కాదు... పంచాయితీ భవనమూ కాదు... చర్చి!

అత్యంత వైభవంగా... ఆధునిక హంగులతో... ఆకుపచ్చని అడవిలో రంగురంగుల కట్టడం. దాని చుట్టూ వూరి గుడిసెల్లో మోకాలిపై మేము.

చలిచలి గాలుల్లో తుడుము డప్పుల హెూరు.

చలి మంటల్నీ, మంచం క్రింది కుంపట్లనీ వదిలి వూరు వూరంతా వీధుల్లో ప్రవాహమైపోతున్న రాత్రి... యువతీ యువకుల థింసా అడుగుల సవ్వడీ...

ఇవేవీ నన్ను నిలువనీయడం లేదు. నా కాళ్ల సంకెళ్లు తెంచుకుని నాన్న కు తెలీకుండా పాత వూరి వైపు అడుగులేసేను.

అక్కడ...

మేము వదిలేసిన ఇల్లు... ఆ సందడిలో ఎంతో దిగులుతో కనిపించింది. నా కోసం ఎన్నో కలలు గన్న తాత కనిపించేడు. తాత నడిచిన అడుగులు కనిపించేయి. జీవం తొణికిసలాడే వూరు కనిపించింది. సందడితో వున్న సమూహం కనిపించింది.

అలాంటి వూరు నుంచి ఎందుకు వేరయ్యేము?

తాత చనిపోయిన తర్వాత ఊరి పెద్దమనుషుల్లో ఒకడైన నాన్న వ్యవసాయం తో పాటు వ్యాపారం కూడా చేసేవాడు. వూరు రోడ్డుకు మరీ దూరంగా, కొండల మధ్య వుండడంతో ఏ షావుకారీ వచ్చేవాడు కాదు. అందుకని నాన్న సంతలోని కొన్ని వస్తువుల్ని కొని వూర్లో అమ్మేవాడు. డబ్బు కోసం కాకుండా వూరి అవసరాల కోసం వ్యాపారం చేసే వాడు. ఇప్పుమొగ్గలు, కందులు, చింతపండు, చీపుర్లు... ఏవైనా వస్తు మార్పిడి చేసే వాడు.

అప్పట్లో ఐదు చదివి మానేసిన నాన్నని హాష్టల్లో కుక్కు ఉద్యోగం ఇస్తామని పిలిచిందట ఐటీడీఏ. తీరా అక్కడికెళ్లాక హాష్టల్లో అందరూ తినగా మిగిలిన ఎంగిలి మెతుకులు తప్ప జీతమొచ్చే ఉద్యోగం కాదని తెలిసి మానేసాడు. అప్పటి నుండి నాన్నకి ఆ ఆఫీసంటే రోత పుట్టింది. ఆ తర్వాత రోజుల్లో ఊర్లో వాళ్లు ఏదో సాయం అందుతుందని ప్రతి సోమవారం గ్రీవెన్స్‌కి వెళ్లి వస్తున్నా నాన్న మాత్రం ఎప్పుడూ ఆ మెట్లెక్కలేదు. అతని మనసులో ‘అది మా కోసం కాదు’ అని ముద్ర పడిపోయిందేమో!

సరిగ్గా అలాంటి సమయంలోనే తెల్లదుస్తుల్లో వున్న వ్యక్తి వూర్లోకి అడుగు పెట్టేడు. ఆ తర్వాత్తర్వాత తెలిసొచ్చింది. అతని ద్వారానే మా వూర్లో మతం నడిచొచ్చిందని. తరచూ ఇంటికొస్తూ వుండే వాడు. నాన్నతో సన్నిహితంగా వుండేవాడు. అతనే నాన్న వ్యాపారాభివృద్ధికి ధనసాయం చేసాడని ఆ తర్వాత తెలిసొచ్చింది. ఎవరికైనా ఒంట్లో బాగోలేక పోతే వాక్యం చదివి ప్రార్ధన చేసేవాడు. ఒక్కో సారి మాత్రలని కూడా ఇచ్చేవాడు. మాత్రలతో తగ్గిన జ్వరాన్ని ప్రార్ధనతో తగ్గినదిగా చెప్పేవాడు.

క్రమక్రమంగా వూర్లోని కొంతమందితో సంఘం స్థాపించేడు. వాళ్లంతా ఒక్కచోట చేరి బైబిల్ చదివి ప్రార్ధన చేసే స్థాయికి తీసుకొచ్చేడు.

ఓ రోజు....

ప్రార్ధన ముగించి కళ్లు తెరిచేసరికి నాన్న చేతిలో వందల నోట్లు కొన్ని మెరుస్తూ కనిపించేయి. ఎదురుగా అతను. 'ఎందుకు?' అన్నట్లు అడిగాడు నాన్న. "ఇక నుంచి వూరి ప్రజల బాధల్ని ప్రభువుకి నువ్వే వినిపించాలి. ముందుండి అందరినీ దేవుని సన్నిధికి చేర్చాలి. అందరికోసం ప్రార్ధన చేయాలి." అని ముగించేడు.

ఆ కొద్ది రోజులకే నాన్న లాంటి వారందరికీ ట్రైనింగు కోసం పంపించేరు. ప్రతిరోజూ విధిగా ప్రార్ధన చేయాలి. ఆడవాళ్లు బొట్టు పెట్టుకోకూడదు. కొత్తవాళ్లెవరైనా వస్తే షేక్‌హేండ్ తీసుకోవాలి. సారా మానేయాలి. తుడుం కొట్టకూడదు. డప్పు ముట్టకూడదు. ఇలాంటి కొత్త నిబంధనలెన్నో వూర్లోకొచ్చేయి.

ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతం వొచ్చేది నాన్నకి. వాటితో పాటు సవర భాషలో పాడిన క్రీస్తు గీతాల సీ.డీ.లు, బైబిళ్లు, రంగురంగుల కేలండర్లూ తో పాటు విలువైన కానుకలు ఎక్కడి నుండో వచ్చేవి.

తమ భాష ఆధునిక సంగీత పరికరాలతో అందంగా వినబడుతుంటే ఎవరికి ఆనందంగా వుండదు? ప్రార్ధన కొచ్చిన వాళ్లు పండిన పంటలో తొలికాయ, తొలిగింజ ప్రభువుకి చేరాలనడంతో అందరూ ఏదో ఒకటి తెచ్చిచ్చేవాళ్లు. దాంతో నాన్న మరింత ఉత్సాహంగా పని చేసేవాడు.

"అయితే... తాత ముత్తాతల కాసి నడుస్తున్న సంప్రతీకము ఎలాగ మానెస్తామూ?" అని వెనకడుగేసిన ముసిలోళ్లూ లేకపోలేదు.

వాటన్నిటికీ సమాధానం చెప్పింది సంఘం.

'ఇన్నాళూ చెట్టుకీ పుట్టకీ మొక్కి మీరేమిటి సాధించేరు? అది మూర్ఖంతోనూ, అనాగరికంతోనూ కూడుకున్నది. ఎంత కాలమని మారకుంట వుంటారు? మనం అభివృద్ధిలోకి మారాలంటే ప్రభువుని నమ్ముకోవాల్సిందే"నని మరొక తీర్మానం కూడ చేసేరారోజు. మతం తీసుకున్నవాళ్లంతా వేరుగా ఒక కొత్త వూరుగా నిర్మించబడతారని ప్రకటించేరు.

అలా ఏర్పడిందే మా కొత్త వూరు... పాల్ నగర్.

అక్కడి నుంచి చూస్తే ఈ వూరు చాలా దూరంలో వుంటుంది. ఎంత దూరమంటే ఒకరితో ఒకరు మాట్లాడితే వినిపించినా వెనుతిరిగి వెళ్లి పోయేంత దూరం.

నా వీపు మీద ఒక దెబ్బ పడ్డాక గానీ నాకు ఆ దూరం తెలిసి రాలేదు. తుడుము డప్పుల హోరు ఆగిపోయింది. థింసా నృత్యం మౌనం వహించింది. అందరి కళ్లలో ఆశ్చర్యం అలముకుంది.

“ఇక్కడేటి సేస్తున్నావురా? మతం తీసుకున్నోలు ఇలగ గెంతకూడదని తెలీదేట్రా?” అని నాన్న నన్ను బలవంతంగా అక్కడి నుండి కొత్త వూరికి ఈడ్చుకు వెళ్లిన దృశ్యం ఇంకా సజీవంగానే వుంది.

నా గుండెల్లో మోగుతున్న డప్పులు మూగబోయాయి. నా కాళ్లకు వేలాడుతున్న గజ్జెలు మోగక సంకెళ్లుగా మారిపోవడం తెలుస్తూనే వుంది.

బయట దూరంగా పాత వూరిలో డప్పుల హోరు, నాలో నిశ్శబ్దం.

మా వూరిప్పుడు కొత్త దేవుని నీడలో వుంది.

ఎవరో విధించిన నిబంధనల్లో బంధీ గా వుంది.

నా గుండెల్ని కదిలించే డప్పు లేదు. ఉరుము మెరుపుల తుడుము దెబ్బా లేదు.

అడవిని ఆడించే కిన్నెర పాటాలేదు.

వెన్నెల రాల్చే పిన్నల కర్రా లేదు. ఆటలేదు. పాట లేదు. థింసా నృత్యపు అడుగుల సందడి అసలే లేదు.

అంతా నిశ్శబ్దం... నిశి రాతిరి నిశ్శబ్దం. గుండెలోతుల్లో గుచ్చుకుంటూన్న అద్దం పెంకుల శబ్దం.

* * *

ఓ రోజు సాయంత్రం వూరు సమావేశమయ్యింది.

“లాజర్ వున్నాడా?” అడిగాడు అతను.

అది నాన్న కొత్త పేరు. అసలు పేరు 'లక్కాయి' అని నాన్న ఎప్పుడో మర్చిపోయివుంటాడు. ప్రచారం కోసం కొండ కొండనీ ఎక్కి దిగేవాడు. ఇంటింటినీ పలకరించేవాడు. చుట్టాలూ,బంధువులూ అందరిళ్లకీ వెళ్లి ప్రార్ధనలు చేసి మతం వైపుకి మళ్లించేవాడు నాన్న.

"లేదు గదా?" అన్నారెవరో... ప్రచారం కోసం ఎప్పుడూ వూరి బయటే వుంటాడన్న అర్థంలో.

"లాజర్ ను సంఘం నుండి బహిష్కరిస్తున్నాం" అని అన్నాడు గొంతు సవరించుకొని తెల్లదుస్తుల్లో వున్న వ్యక్తి. ఊరంతా ఆశ్చర్యంతో నోళ్లు తెరిచారు. అందరికీ తెలుసు నాన్న ఎలాంటి వాడో. "ఎందుకో తెలుసా? కొత్త నిబంధనని చేతబట్టి మద్యం సేవించేడు. దేవుని కృపని ధిక్కరించేడు కాబట్టి" అని ముగించేడతడు.

తాగడం తప్పే. కాదనలేదు కానీ కొండోడి బతుకులో సారా తాగడం నేరం కాదు. పొద్దు తూరక ముందె కొండకి చేరి అవిశ్రాంతంగా శ్రమించి పొద్దు మునిగే సమయానికి రెండు జీలుగు చుక్కలు గొంతులో పోసుకొని వూరు చేరి నృత్యం చేయడం ఇక్కడి బతుకులో ఒక భాగం. పూర్వీకుల నుండి వస్తున్న ఆచారమేటీ? రాత్రి వేళ చలి మంట చుట్టూ చేరిన వూరు... తుడుము డప్పుల చప్పుళ్లలో ... సన్నాయి, గొగోయ్ సంగీతాల నడుమ శ్రమని మర్చి పోవడానికి అందరు కలిసి సారా ని సేవించడం... నృత్యం చేయడం కొత్త కాదు. ఆ రాత్రిళ్లలో సారా ఒక సంప్రదాయం. అందరూ కలిసి తాగడం ఒక ఐక్యతా చిహ్నం. ఇంటికొచ్చిన అతిధికి సారా ఇచ్చి మర్యాద చెయ్యడం ఒక జీవన విధానం. ఇప్పుడది ఎక్కువై ప్రాణాల మీదికి తెచ్చుకోవడం తప్పే కావచ్చు. కానీ నాన్న అంతలా తాగి వుంటాడా? అలసిన శరీరానికి నిద్ర పుచ్చడానికి రెండు చుక్కల విశ్రాంతినివ్వడం నేరమా? దానికి శిక్ష బహిష్కరణా?

ఇంటికొచ్చిన నాన్నకి విషయం తెలిసింది. మొదట్లో దాన్ని పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఆ తర్వాత రోజుల్లో నాన్నకి అర్థమైపోయింది. ..బహిష్కరణ ఎంత బలమైనదో!

ఇరుగు పొరుగు మాట్లాడక పోవడం... ప్రార్ధన సమయంలో కూడ దూరం చేయడం నాన్న మనో వేదనకు కారణమయ్యింది. ఊరి పెద్దరికం ఎవరి చేతుల్లోకి మారిపోయిందో స్పష్టమైపోయింది. తిండీ తిప్పలు మానేసి కొండల మీదే గడిపే వాడు. ఇంటికి చేరే వాడు కాదు. గుండెల్లో కసి నిండిపోయిందేమో... నిజంగానే తాగడం మొదలు పెట్టేడు. తాగి తాగి ఏ తుప్పల్లోనో, డొంకల్లోనో పడుకుని రోజుల తరబడి కనపడే వాడు కాదు. మనుషులు అడివి పట్టీడం అంటారే... అలాగ.

మమ్మల్నీ, ఇంటినీ వదిలి కేరేజీలో గంజి పట్టుకుని నాన్నని వెదుక్కుంటూ అడివిలంట తిరిగేది అమ్మ. తెల్లవారి బయల్దేరి ఏ రాత్రికో వచ్చేది... కన్నీళ్లని మోసుకుంటూ. “అమ్మా! బువ్వే... ఆకలి” అని చెల్లి తమ్ముడు అమ్మ గుండెలమీదికి ఎగబడే వాళ్లు. పొయ్యి ముట్టించి బువ్వలుడికీ వరకైనా పిల్లలు ఆగాలగదా అని పొరుగింటోల్లకి అంబలో, గెంజో అడిగితే ముఖం చాటేసే వాళ్లు. మతం తీసుకున్న వాళ్లు బహిష్కృతులైతే  నరకాన్ని ఇక్కడే ఎదుర్కోవాల్సి వస్తుందని నాకప్పుడే తెలిసింది.

అందుకే నేనెప్పుడూ హాస్టల్ వదిలే వాడిని కాదు. చెల్లీ, తమ్ముడ్నీ కూడా హాస్టల్లో చేర్పించింది అమ్మ.... తిండి దొరుకుతుందనే. హాస్టల్ లో ఏ తగువుల్లోనూ తలదూర్చేవాడిని కాదు. నాకు భయం. మాష్టారు ఏ కారణం చేతైనా ఇంటికి పంపించేస్తే??? తిండి దొరకదని భయం. అమ్మకి కష్టం కలుగుతుందని భయం.

ఆ రోజు బట్టలుతుక్కుని తడి బట్టల్తో హాస్టల్ గదిలో కొచ్చేను. నా పెట్టి మీద కూర్చొని నా కోసం ఎదురు చూస్తున్నాడు మండంగి మామ. అతన్ని చూస్తే అమ్మను చూసినట్టిగయ్యింది. పరుగు పరుగున అతన్ని చేరుకున్నాను.

“ఇంటికెల్దుమా” అన్నాడు.

“ఎందుకే?” అన్నాను

“ఏమీలేదు... నాన్న...” అని ఆగేడు.

"ఇంటికొచ్చేడా?" అన్నాను

"ఔ' నన్నట్టు తల వూపేడు.

'ఎన్నాళ్లైంది నాన్నను చూసి? అప్పుడెప్పుడో అమ్మనీ, మమ్మల్నీ దగ్గర కూర్చో బెట్టుకొని బైబిలు చదవడం నేర్పించేడు. పాటలు పాడి నిదురపుచ్చేవాడు. మేము గుర్తొచ్చి ఇంటికి చేరివుంటాడు. ఇక పై బైబిలు వూసెత్తడేమో?! కథలు చెప్తాడు. ఇంటి పెద్ద కొడుకు ఎలాంటి బాధ్యతలు తీసుకోవాలో చెప్తాడు. చిన్నపుడు తాతకి ఎలాంటి సాయం చేసేవాడో వివరిస్తాడు. అమ్మనెలా చూసుకోవాలో చెపుతాడు.

బస్సు దిగి వూరి వైపు నడుస్తున్నాం. కొండ మలుపు తిరిగితే వూరు కనపడుతుంది. రెండు పొలం గట్లు దాటితే ఊరి పొలిమేరల్లోకి చేరిపోతాం. కానీ మండంగి మామ ఊరి దారి కాకుండా కొండదారి నడిపించేడు. కొండవాలులో కురికి మాని చెట్టుకింద ఊరి జనం గుమిగూడి వున్నారు. నన్ను చూసి ఒక్కొక్కరూ దారిచ్చేరు.

అక్కడ....

చెట్టుకొమ్మకి వేలాడుతూ కనిపించేడు నాన్న.

* * *

"రాబర్ట్! రాబర్ట్ విల్సన్?"

ఎవరో పిలుస్తున్నారు. మళ్లీ నన్నే. అదే పేరు...

నన్ను శూన్యాన్ని చేసిన పేరు.

నాలోని 'నన్ను' ని లేకుండా చేసిన పేరు.

పేరంటే... ఒక గుర్తింపు కదా?

పేరంటే... ఒక వ్యక్తిత్వం... ఒక అస్థిత్వం.

తరతరాలుగా నడిపిస్తున్న ఒక మానవ జీవన సూత్రం.

పేరంటే... ఒక జాతి. ఒక సంస్కృతి.

నా పేరుతో నాకు సంబంధించినవేవీ లేవు కదా!

రాబర్ట్ విల్సన్!

ఎవరి పేరది? ఏ దేశపు పేరిది? ఈ పేరులో ఎవరి సంస్కృతి దాగి వుంది? ఏ జాతి అనవాళ్లున్నాయి? ఎవరి తరానికి వారసుడను?

"నువ్వు గిరిజనుడివేనా?" డిగ్రీ పూర్తి చేసి టీచర్ ట్రైనింగు సీటు కోసం ఇంటర్వ్యూ లో అడిగారు... నా సర్టిఫికేట్లని ఎగాదిగా చూస్తూ.

'ఔ' నన్నాను.

"ఎలా?" అన్నారతను. "ఇలాంటి పేర్లు మీలో లేవే? మీ బంధువుల పేర్లు కొన్ని చెప్పు"

"సన్నాయీ... కడాయీ... అప్పారావూ... అన్నమ్మి... మిలంతి... సొంబరా... గయామి.... జిల్కి... సోమేసూ..." గుర్తొచ్చిన పేర్లన్నీ చెప్పేను. నన్ను చూసుకునే పేరు ఎక్కడా లేదు.

"నువ్వు గిరిజనుడిని నీకు రిజర్వేషన్ కల్పించింది రాజ్యాంగం... నీవది పొందాలంటే నువ్వు గిరిజనుడివని నిరూపించు కోవాలి కదా?" అని టిక్ పెట్టేరతను.

నిజమే... ఎవరు నిజమైన గిరిజనుడు? అతన్ని ఎలా గుర్తు పట్టాలి? ఎమ్మార్వో ఇచ్చిన కాగితమ్ముక్క సరిపోతుందా?? అదే అయితే... ఆలాంటి కాగితమ్ముక్కలు ఎన్ని లేవు???

ఆ రోజు ఎమ్మార్వో ఆఫీసులో సర్టిఫకేట్లు ఇస్తున్న రోజు... ఏమి జరిగింది?

"ఈ పేరేమిటి ఇలా వుంది? ఎవరితను? రమ్మనూ...." అని ఎమ్మార్వో గారు పిలిచారు. లోపలికి వెళ్లాను.

"ఏ వూరు?"

చెప్పేను.

"మీ నాన్న పేరు?"

అదీ చెప్పాను.

"అయితే... కన్వర్టెడ్ అన్నమాట"

మౌనంగా తల దించుకున్నాను.

"మతం సరే... మరి నువ్వు గిరిజనుడివని ఋజువేమిటి?"

"......"

"నీది ఏ వూరు...ఎక్కడ పుట్టేవు? ఎవరికి పుట్టేవు? నీ ఆచార

వ్యవహారాలేమిటీ? నీ పండుగలేమిటి? నీ సంప్రదాయమేమిటీ?? ఇవన్నీ ఎంక్వైరీ చేసి నీకు సర్టిఫికేట్ ఇస్తాం. సరేనా?" అని లేచేరు.

'నాన్నా! ఎంత పని చేసేవు నాన్నా?! ఈ పేరు పెట్టి నన్ను జాతి నుండి వెలివేసినట్టు, నా కంటూ ఒక గుర్తింపు లేకుండా చేసావు కద నాన్నా! అడవి లో పుట్టి... అడవిలో పెరిగి.... పేరు మూలంగానే ఈ క్షోభని ఎందుకనుభవించాలి? చిన్నపుడు ఈ పేరున పిలుస్తుంటే అందరిలోనూ ప్రత్యేకంగానూ, కొత్తగానూ వుండేది. రంగుల చొక్కాలా బాగున్నట్టనిపించేది. మరి ఇప్పుడు??? బరువుగా... మోయలేనంత భారంగా... దానికిందే నలిగిపోతున్నంతగా.'

నాన్న పోయాక అమ్మ మౌనంగా పాత ఇంటికి చేరింది. అమ్మ వెనక మేమూ నడిచేము. అక్కడ ఎప్పటిలాగానే పాత జీవితం గడిపాము. ఆ వూరు మళ్లీ అక్కున చేర్చుకుంది. అప్పుడే తెలిసింది. చినుకు రాలడం పండగని. నేల దున్నడం పండుగనీ. విత్తునాటడం పండుగనీ. మొక్క మొలకెత్తడమే పండుగనీ. పువ్వు పూసి కాయ కోయడమే పండుగనీ. పండుగ ప్రతి కదలిక లోనూ ప్రకృతి తో కలిసి నడుస్తున్నామని అప్పుడే తెలిసొచ్చింది. నేను అడవి మనిషి ననీ... తాతే నా సంస్కృతని అప్పుడే తెలిసింది.

ఇన్నాళ్లూ... నా వాళ్ల అమాయకత్వాన్నీ, పేదరికాన్నీ అడ్డం పెట్టుకొనీ మాపై మరకల్ని అంటిస్తున్నదెవరు? నన్ను నా నుంచి ... నా సంస్కృతి నుంచీ దారి మళ్లిస్తున్నదెవరు? నా సంస్కృతికి మూలాధారమైన నా భాషని మతం కోసం హైజాక్ చేస్తున్నదెవరు? అసలు మతమెందుకు? అది మనిషికి అవసరమా??

"రాబర్ట్!... రాబర్ట్ విల్సన్ ఎవరయ్యా? ఎన్ని సార్లు పిలవాలి నిన్ను? ఎక్కడికి వెళ్లేవు? పేరు మార్చుకోడానికి గెజిట్ అప్లై చేసింది నువ్వేనా?" అని కలెక్టరు గారి దఫేదారు అడుగుతున్నాడు.

"ఔనండీ" అని లోపలికి వెళ్లేను.

* * *

ఇప్పుడు చెబుతున్నా....

నా కొండ కొనకు పూచిన సూర్యుణ్ణి డప్పుగ చేసి

దరువుల వరుసల్ని మార్చి మార్చి కొట్టి చెపుతున్నా

నా పిన్నల కఱ్ఱ పాటల్లోంచి...

'టిల్లకాయ' ధ్వనుల్లోంచి....

నా థింసా అడుగుల చప్పుళ్ల లోంచి...

గొంతుని 'గొగోయ్' గా మార్చి చెబుతున్నా...

" నేను మానవుణ్ణి

నేను ఆదివాసీని

నాకు మతం లేదూ...

నా పేరు సొంబరా" అని.

*(ప్రజా ప్రభాతం -నవంబర్,2013)*

# సింజీడి

"**ఆ**డి బుర్ర పేలిపోను... ఆడి బతుకులు బుగ్గైపోనూ...

ఆడిపెల్లం ముండమొయ్య... ఆడికి సంకటం రనూ...

గాడుపు పుట్టా.... ఆడి జిమ్మడిపోనూ...

ఆడికి మరిడి తినీయా.... మాదు పుట్టీయా...." దీర్ఘాలు తీస్తూ ఏడుస్తోంది సింజీడి. మధ్య మధ్యలో ముక్కు చీదుకుంటోంది. ఖాండ్రించి ఉమ్ముతోంది. జారిపోతున్న జుట్టుని ముడి కట్టి మెట్ట దోపుతోంది. ఆమె ప్రక్కనే గోడ మూల దీపం వెలుగుతోంది. దీపానికి కొంచం దూరంలొ కోళ్ళ గూడొకటి వుంది. దాని ప్రక్కన ఎగడప రాటకి చేరబడి ఏడుస్తున్న సింజీడి ప్రయత్న పూర్వకంగా కోళ్ళగూడు వైపు చూడకూడదని అనుకుంటోంది కానీ అది ఆమె కు సాధ్యం కావడంలేదు. ఆ గూడు కింద ఎజ్జురాలు ఊదిచ్చిన (మంత్రించి ఇచ్చిన) పొయ్యి బుగ్గి చల్లి వుంది. ఆ కోళ్ళ గూడుని మూడు రోజుల

దాకా కదపకూడని మరీ మరీ చెప్పి వెళ్ళింది. అలా కదిపితే రావలసిన ఆత్మ రాదనీ. దాని అడుగులు గూడులోని పొయ్యి బుగ్గి మీద పడవనీ, అలా పడకపోతే జీవితాంతం పీడలు వెంటాడతాయనీ హెచ్చరించీ మరీ వెళ్లింది. చనిపోయిన వ్యక్తి దహన సంస్కారాలు పూర్తయిన మూడు రోజుల వరకూ ఆ ఇంటివద్దే దయ్యమై తిరుగుతూ వుంటాడనీ మూడోరోజు కార్యానికి సంతృప్తి చెంది దీవించి పెద్దగా మారతాడని నమ్మకం. ఆ మూడు రోజుల్లో ఆ ఇంట్లోనే వుంటూ మంత్రించిన పొయ్యి బుగ్గిమీంచి నడిచి వెళ్తాడని, అప్పుడు అతని పాదముద్రలు అక్కడ కనిపిస్తాయనీ మళ్ళీ మళ్ళీ అటే చూస్తూ ఏడుస్తోంది.

"పల్లకోయమ్మీ... కాలిపోయినోలితోటి మనమ్మల్లా కలిసి పోతామే? ఏదో ఒక పొద్దు మనమూ కాలిపోయినోలిమే. ఐతే ఒకలు ముందల మరొలలు ఎనకాల... అంతే" పక్కింటి ముసిలోడు ఓదార్చేడు.

ఆ రోజు తెల్లారి మునకాల కర్ర,జిగ్గి పట్టుకుని కొండకి బయల్దేరి వెళ్ళిన పెనిమిటి మంగడు మరిచటిరోజు సాయంత్రం శవమై ఇంటికొచ్చేడు. కొండపనికని బయల్దేరినోడు ఆ పని చూడకుండా దారిలో సారా బట్టికెల్లి శవమైపోయేడు. రోజూ తాగడం... ఇంటికొచ్చి గొడవ పడ్డం... ఎప్పటినుండో అలవాటైపోయింది. ఒక్కొక్క సారైతే ఏ తుప్పల్లోనో డొంకల్లోనో పడిపోవడం... దారిలో నడిచొస్తున్న వాళ్లు ఎవరైనా చూస్తే ఇంటికి తేవడం. .. వాళ్లకి సాధ్యపడకపోతే తానే వెతుక్కుంటూ వెళ్ళి ఇంటికి తేవడం సాధారణమైపోయింది సింజిడికి. ఆ రోజు మాత్రం సింతమాను కురికిలో పడి ఎవరికీ కనపడలేదు. మత్తుమీద లెగలేకపోయేడు. ఒళ్ళంతా మట్టి కొట్టుకు పోయి, చెద పురుగులు కొరికీసి, నీరందక.... చెయ్యి దాటిపోయేడు.

పెనిమిటి గుర్తొచ్చి మళ్లీ స్వరం పెంచి రాగమందుకుంది.

"ఆలికి కాలు పడిపోనూ.... సేతులు పడిపోనూ...లంజా కొడుకులూ... లమ్డీ కొడుకులు.... మా బతుకులు బుగ్గిపాలుసేసినోలు నాశినమైపోనూ.... తాగుడు....తాగుడు....తాగుడు...ముండ తాగుడు

మరిగినాడు గానీ బూమి పోయింది.” అని తలబాదు కుంటోంది. అతని జ్ఞాపకాల్ని ఒక్కొక్కటీ తల్చుకుని శోకగీత మాలపిస్తోంది. అతని చావుకి కారణమైన సారాని తిడుతోంది. సారాకి వ్యతిరేకంగా తను పోరాడితే సహకరించనివారిని తిడుతోంది. చావుకి కారణమైన పరిస్థితుల్ని తిడుతోంది.

గత కొన్ని రాత్రులుగా ఎడతెరిపి లేకుండా వినిపిస్తోన్న ఆమె ఏడుపు నిశ్శబ్దానికి ఒక ప్రశ్నై ఎదురు నిలబడుతోంది. నిశి రాతిరికి పెను సవాసు విసురుతోంది. ఉబికి వస్తోన్న దుఃఖాన్ని తెరలు తెరలుగా నెమరివేసుకుంటోంది.

సారా తాగక ముందు ఎలాగుండీవోడు పెరిమిటి?! ఎంత ముద్దుగ చూసుకుండీవోడూ! కాలుకిందకి దించితే ముల్లు గుచ్చుకుంతాదే అనీవోడు. పని సెయ్యక పోతే నీకు సాయమెల గవుతానూ మామా అనీది తాను. కొండకెల్లినా.. కూలికెల్లినా... గొప్పుకెల్లినా... ఒక్క క్షణం కొంగు వొదిలోడుకాదు. కష్టానికైనా సుఖానికైనా తొడుండీవోడు. ఎండైనా వానైనా కలిసి పనిసేసి అలిసిపోవడం.. రేయైనా పొగులైనా కలిసి అలుపు దీర్చుకోవడం...

“నన్నొగ్గి ఎక్కడికీ ఎల్లవా?” అడిగిందో రోజు సింజీడి గోముగా.

“ఎక్కడికెల్లమంతావు సెప్పు” తిరిగి ప్రశ్నించేడు.

“ఎక్కడికంతే నీనేటి సెప్తాను... మొగుడికి మొలన దోపీసి తిరుగుతుందని వూరొలందరు నాకు అంతారు కదే”

“నీనేటీ వూరోల పెల్లం సుట్టూ తిరగనేదు నా పెల్లం సుట్టే గదేటి తిరుగుతున్ను” అని తన పనిలో తాను నిమగ్నమైపోయేడు.

ఓ రోజు సాయంత్రం కొండ నుండి జీలుగు చెట్టు దారంట దిగుతుంటే... చెట్టు కింద అవతలీది ఆరికి మామ జీలుగు తుంబ భుజానేసుకొని ఎదురయ్యేడు. “ఓలమ్మి! మా వోడికి మరఈ సెయ్యి పట్టి నడిపించకే... ఒక్క గడి ఒగ్గీయే నువ్వు లేకుంటగ నడ్డం నేరుస్తాడూ ” అని ఇగటమాడేడు.

“మీ తమ్ముడికి నీనేటి కొంగుకి కట్టీసి తిప్పుతున్నట్టిగే! మొగోలికి

ఆడోలు నడక నేర్పినంతటోలా?” అని మూతి విరిచి గబగబా అడుగులేసింది సింజీడి. ఇంటికి చేరి పొయ్యి ముట్టించిన వేళకి మంగడు ఇంటికి చేరేడు... తడబడుతున్న అడుగుల్తో... తియ తియ్యని పుల్లని జీలుగు వాసనతో.

అది మొదలు...

జీలుగు తప్ప ఏసారాగానీ ముట్టి ఎరగడు. ఒకవేళ తాగినా కడుపు నిండా తిని నిశ్శబ్దంగా నిదురపోయేవాడు. పగలు పడిన కష్టమంతా ఒక్క జీలుగు చుక్క నిదురతో తెల్లారి పనికి తయారై పొయేవాడు.

అలాంటిది వూర్లోకి వంట సారా ఎప్పుడు ఎలగొచ్చిందో గానీ వీధులన్నీ సారా కంపుకొట్టడం మొదలెట్టాయి. సాయంత్రాలు తగువుల్తో వేడెక్కడమారంబించేయి. మారిపోయిన వూరు వికృత రూపం క్రమక్రంగా కనిపించసాగింది.

రోజూ తూలుతు పెనిమిటి రావడం... ఒంటిమీది గోసి గుడ్డ జారిపోతూ చివరికి సారాయే అతన్ని తాగినట్టుగా ... ఎముకలు తేలిన శరీరంతో ఇల్లు చేరీ చేరగానే “ఒడ్డించే...” అనడం.... వడ్డిస్తే కూరలేదనో .. ఉప్పు చాల్లేదనో సింజీడి వీపుమీద పిడిగుద్దులు గుద్దడం... “సచ్చేన్రో దేవుడో! రంద్రో సంపేస్తున్నాడు నామొగుడూ అని వీదిలోకి పరుగులు తీయడం వాళ్ళకే కాదు వీధిలో వాళ్లకీ అ మాటకొస్తే ఆ వూరి వాళ్లకీ అలవాటయపోయింది.

మొదట్లో పెనిమిటి కొట్టిన దెబ్బల్ని భరించినా కొన్నాళ్లకి ఎదురు సమాధానం చెప్పేది. మరికొన్నాళ్లకి తిరిగి దెబ్బకొటే&ఎది తాగిన మత్తులో అతన్ని అదుపు చెయ్యడం కష్టతరమైనా ఎదిరించకపోతే ఇల్లు గుల్లచేస్తాడని ఆపనిచేసేది. సాయంత్రమైతే చాలు ఆ ఇమట్లో తగువు మొదలయిందన్నమాటే. నిజానికి ఇలాంటి దృశ్యాలు ఆ వూర్లో చాలా కుటుంబాల్లో వున్నవే.

ఇలాంటి తగువులు అక్కడ సాధారణమే. అది ఎంత సాధారణమంటే సాయంత్రమైతే చాలు వీధిలో తాగి తూగినోళ్లని తప్పించుకొని వెళ్లడం కష్టం.

ఓ రోజైతే కొత్తగా పెళ్ళై మనువొచ్చిన పరాయూరు పిల్ల ఎవరికీ చెప్పాపెట్టకుండా కన్నోరింటికి వెళ్ళిపోయింది.

"ఏమే?" అని అడిగేరు పిలవడానికి వెళ్ని బంధువులు.

మౌనం వహించింది.

కొడుతున్నాడా?

తిడుతున్నాడా?

అన్ని ప్రశ్నలకీ అడ్డంగా తలవూపించి.

ఏటైందో సెప్తేగదే మాకు తెలుస్తాది...అని గుచ్చి గుచ్చి అడిగితే... "తిట్టినోడైనా కొట్టినోడైనా బాగున్ను దెబ్బలు కానో సంసారమెత్తీదును..." అని కాసేపు ఆగింది. ఆ తర్వాత నిశ్శబ్దాన్ని బద్దలుగొట్టినట్టు చెప్పింది... "వొస్తాడు... ఉలకడూ... పలకడూ. తాగీసి తొంగుండి పోతాడు.. మంటిబుక్కడం లాగ. సంసారం సెయ్యనోడి తోటి నీనేలుండాల?" అని మూతి తిప్పింది.

ఈ సంగతి తెలిసి వూరంతా ముసి ముసి నవ్వులు నవ్వి ముక్కున వేలేసుకున్నారు గానీ ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. కానీ సింజీడి మాత్రం తేలిగ్గా వదల దలుచుకోలేదు. మహిళా మండలి సభ్యులతో మాట్లాడింది. అందరినీ వెనకేసుకెళ్ళింది...సర్పంచ్ ముందు పెట్టింది.

"మనూరు సంగతైతే నీను సూడగలను. గానీ పొన్నూరు సంగతి నేనేటి సెయ్యగలనూ? మనూరు కాడ వంట సేస్తున్నారా సెప్పండి. ఆల మీదా కంప్లైంట్ పెడుదుము." అని చేతులెత్తేసాడు.

"నువ్వు సెయ్యకపోతే మీమే సేస్తాం... మాకూ తెలుసు ఏటి సెయ్యాలో" అని గిరుక్కున వెనక్కి తిరిగింది సింజీడి. మూలనున్న దుడ్డుగర్రలు పట్టుకొని సారా బట్టీల వైపు అడుగులేసింది. ఆమె వెనకా మహిళామమడలి సభ్యులు.... చీరల్ని చిలకట్టు కట్టి, కొంగుల్ని బొడ్లోదోపుకుని, జుట్టుని మెట్టముడేసి.... అందిన ఆయుధం చేతబట్టుకుని.

ఊరు దాటింది. ఊరు చుట్టూ వున్న పొలాలు దాటింది. పొలాల కవతల బట్టి గట్టు దాటింది. గట్టవతల కొండ. కొండవతల దోనిపాక గెడ్డ. గెడ్డకానుకుని పొలాలు. పొలాలు కానికుని దట్టంగా పరుచుకొని వున్న అడవి. అడవిలోంచి ఎవరికీ కనిపించకుండా... ఏకొండల మీదనుంచో దూకి ఆ చెట్ల మాటున నిదానించి నడుస్తున్న గెడ్డ. గెడ్డ ఒడ్డున రహస్య స్థావరంలా సారా పొయ్యి, మట్టి కుండల్తో. వూరేసిన ఇప్ప మొగ్గలు.

ఆ సార బట్టీల్ని ద్వంసం చెయ్యడానికి మహిళా దళం.

గట్టు దాటుతుంటే.... చీర కొంగు 'బర్ర్ర్..' మని చిరిగి పోయింది. వెనక్కి తిరిగి చూస్తే ఇనప ముళ్ళ కంచె. గట్టు ప్రక్కనుంచి సిమెంటు స్థంబాల తో ఐరెన్ ఫెన్సింగు. రెండు అడుగులు వెనక్కి వెళ్ళి రెండు కాళ్ళూ నిగిడి చూసింది. పెదెకరాల పైగా స్థలం. అందులో ఒకప్పుడు తాము కష్టపడి తుప్పా డొంకా నరికి సాగుచేసిన యెకరాన్నర పొలం.

ఆ పొలం తమ చేతుల్లోంచి ఎలా చేజారిపోయిందో గుర్తొచ్చింది.

ఆ రోజు సాయంత్రం.... ఎప్పటిలాగానే పెరిమిటి తాగేసి తూలుతూ ఇంటికొచ్చేడు. ఇద్దరూ తగువులాడుతూ వున్నారు. ఇరుగూ పొరుగు ఎవరిపనుల్లో వాళ్ళున్నారు. వీదంతా గోల గోలగా వుంది. అప్పుడొచ్చింది టాపులేని జీపు... వీధి మధ్యలోకి. అందులోంచి ముందు కుక్క దిగింది. అది చూసి పిల్లలు పారిపోయేరు. వూరి కుక్కలు "భౌ..భౌ.." మని చుట్టు ముట్టేయి. "ఛీ... చెడీ" అని వూరోలు దూరం తగిలేరు. అవి మొరుగుతూ వీధి అవతలికి పారిపోయేయి. వీధిలో నిశ్శబ్దం. అప్పుడు దిగేరు చిన్నదొరగారు... మాజీ ఎమ్మెల్యే. అప్పుడెప్పుడో రెండు ఎలక్షన్ల ముందల "నీను మీ వోడినే. గెలిపించండి" అని ఓట్లడగడానిఇ వొచ్చేరు. తర్వాత వూర్లో నాయిడోలింట్లో దొంగతనం జరిగితే ఆళని పరామర్శించడానికొచ్చేరు. ఆ తర్వాత

అతడు కొండోడు కాదని ఎవులో కోర్టులో కేసు పెడితే ఓడిపోయేరు. మల్లా ఇదే రవడం.

"ఏట్రా లక్యాయ్! బాగున్నావా?" అని అడిగేరు. తన పేరు పెట్టి పిలిచేసరికి భుజాలు గజాలైపోయేయి.

"నమస్కారం బావూ" అని ఎదురెళ్ళి ఆహ్వానించేడు. వీధిలో నులక మంచం వేసి కూర్చోమన్నాడు.

"సెప్పు బావు... ఏటిలగొచ్చేవు?" అడిగేడు లక్కాయి... వూరి పెద్దగా.

"ఏమీ లేదురా మిమ్మల్ని చూసి చాలా రోజులైంది కదా" చేతులు వెనక్కి ఆన్చి కాళ్ళు మీద కాళ్ళు పెట్టుకొని అన్నారు.

"ఎంత దయ బావ్ మా మీద!! గానీ ఏటీ పని లేకుండ ఒట్టిగొస్తావా?? ఏటో సెప్పు" అని అడిగాడు

"ఈ సంవత్సరం వరెలగుందిరా?"

"వరా? నీరుంతె గదా?"

"అదీ నిజమే. వర్షాలూ లేవూ కరువొదల్దు"

"మరి? ఆ బట్టి గట్టు పొలాలైనా?"

"అవా? అనడానికి బటిట గానీ అమదల సుక్క నీరుంచినారా?

"ఏమీ?"

"నీకు తెలీదేటి బావ్? అయినా ఒకసుట్టైనా మా వూరొస్తే తెలుస్తాది గదా?"నవ్వుతూ అన్నాడు

"నాకెందుకు తెలీదురా? కురాసింగి గెడ్డది. దాని మీద ఎగువుకి నాలుగు చెక్కుడాములు కట్టడం తోటి మీ వూరికి నీరందకుంటుంది"

"అవును బాబు! నీకు తెలీకుండా వుంతాదా? ఐతే నీనొకటడుగుతాను... దిగువుకుండడం మా తప్పా?"

"అలా కాదురా! ఎగువూర్లకి కూడా నీరందాల గదా?" తాను పదవిలో వుండగానే ఆ నాలుగు చెక్‌డామ్‌లు కట్టడం అతనికి తెలుసు.

"అవన్నెందుకు గాని బాబు.. అసలు సంగతేటో సెప్దూ"

"ఊరి పక్కనున్న భూములు కాదు గానీ, దోనిపాక గెడ్డ

బూములు... ఎవరెవరు చేస్తున్నార్రా?" అని అందరి వైపు పరిశీలనగా చూసేరు. ఆ మాటనేసరికి రాజు గారు కూర్చున్న మంచం చుట్టూ వూరోలు మరికొందరు పోగయ్యేరు. వారిలో సింజీడి, మంగడూ వున్నారు.

"ఉన్నారు బాబూ! ఏమీ?"

"ఏమీ లేదురా ఇవన్నీ కౌర్లు భూములే గదా! ఇప్పుడా నీరొచ్చే వూసే లేదు. అందుకే అవన్నీ మీదగ్గర లీజుకు చేద్దమని ఆనుకుంటున్నాన్రా"

"లీజుకా?" ఆశ్చర్యాన్ని ప్రకటించాడు లక్కాయి అందరి తరపున,

"వూఁ ' కొట్టేరు.

"అంతేటి బావూ?"

"కొన్నాళ్ళు నేను వ్యవసాయం చేస్తాను. మీకు కొంత డబ్బిస్తాను"

"అదేటి బావ్... బూవులు కావాలంతే కొనీడమో అమ్మడమో జరగాల గానీ ఈ లీజులేటీ కొత్తగా" వాళ్ళందరికీ వన్నాఫ్ సెవంటీ చట్టం తెలుసు.

"కొత్తేమీ కాదురా... పద్ధతి పాతదే. అయితే మన ఏజెన్సీకి కొత్త అంతే."

"ఎన్నాళు సేస్తావూ? ఎంతిస్తావూ?" వెంటనే అడిగాడు.

"యెకరానికి పాతిక వేలు"

నిశ్శబ్దం. ఆశ్చర్యపోయేరంతా. కొందరు ఆలోచనలో పడిపోయేరు. మరికొందరు మరేమీ ఆలోచించకుండా ఓ నిర్ణయాని కొచ్చేసారు. అలా నిర్ణయానికొచ్చిన వాళ్లలో మంగడూ వున్నాడు. అందుకే మరొక అడుగు ముందుకేసి "డబ్బులెప్పుడిస్తావూ?" అని కూడా అడిగేసాడు. సింజీడి ఎంత వారిస్తున్నా మంగడు వినలేదు. ఆ సాయంత్రం "ఎవరెవరు భూములు లీజుకిస్తారో మాట్లాడుకోండి" అని జీపు స్టార్ట్ చేసి వెళ్ళిపోయేరు దొరగారు.

ఆ రాత్రి వూర్లో అంతా మాట్లాడుకున్నారు. ఊరందరికీ కనిపించింది పాతిక వేలే గాని లీజు ఎన్నాళ్ళకని మాత్రం చెప్పలేదని మాత్రం ఎవరూ గమనించలేదు. తెల్లారీ సరికి టాప్‌లెస్ జీపు మళ్ళీ వూర్లోకొచ్చి ఆగింది. కానీ అందులో దొరగారు లేరు. అతని బదులుగా తెల్లబట్టలేసుకున్న పొడుగాటి వ్యక్తి దిగేడు. “లక్కాయి ఎవర్రా?” అని అడిగేడు. ఆ పిలుపు కోసమే ఎదురు చూస్తున్నట్టు ఎదురెళ్ళేడు లక్కాయి. ‘‘దొరగారు కాగితాలు రానుకుందుమని ఇంటికొచ్చీమన్నార్రా” అని గడపలో మంచం లాక్కొని కూర్చున్నాడు. అందరూ సంశయిస్తూనే బయల్దేరేరు పాస్ పుస్తకాలు పట్టుకుని.

తిరిగొచ్చిన కొన్నాళ్ళకి అందరికీ అర్థమైందేమిటంటే దొరగారికి ఎదురు చెప్పలేక మోసపోయేమని. కాగితాలన్నీ తీసుకొని ఒక్కొక్కరి చేతిలో ఐదేసి వేలు పెట్టి నెలాఖరుకి ఇస్తామని చెప్పి పంపించేసారు. మంగడికైతే ఆ ఐదువేలు కూడా దక్కలేదు. ఎందుకంటే భూములు ఇచ్చిన వాళ్ళలో అతి తక్కువ భూమి వున్నది మంగడే. ఆ వున్న తక్కువ భూమికి కూడా కాగితాలు గానీ, పట్టాలు గానీ లేవు కాబట్టి వెయ్యి రుపాయలే ఇచ్చి సరిపెట్టేసారు. ఎవరికీ అడిగే ధైర్యం చాల్లేదు. అందరూ ఎలా సంతృప్తి పడిపోయేరంటే ఆ భూములెలాగూ కొర్నువి కాబట్టి సచ్చినోడి పెల్లికి వొచ్చిందే కట్నమన్నట్టు మిన్నకుండిపోయేరు. మరి కొన్నాళ్ళకి అవి తమ పొలాలు కూడా మర్చిపోయేరు. ఆ కొన్నాళ్ళకి వాళ్ళలో కొందరికి తెలిసొచ్చిందేమంటే ఆ లీజు రాసుకున్నది తొంబైయేళ్ళకని.

అది మొదలు ఊర్లోకి కొత్త కొత్త వాహనాలు రావడం మొదలయ్యింది. ట్రాక్టర్‌ని మొట్టమొదటి సారి చూసింది అప్పుడే. అక్కడెక్కడో కింద పారుతున్న నీటిని మోటారు సాయంతో కొండెక్కించొచ్చని తెలిసింది అక్కడే. వ్యవసాయం అంటే కొత్త కొత్త పురుగు మందులనీ, ఖరీదైన పనిముట్లనీ కొత్త కొత్త పద్ధతులనీ తెలిసొచ్చింది అప్పుడే. అసలు వ్యవసాయమంటేనే డబ్బు వ్యవహారమని

తెలుసుకున్నదీ అక్కడే. ఊర్లోకి కొత్త మనుషులు వొస్తూ వుంటే వారు పనుల కోసం మనుషులు కావాలనీ, ఎక్కువ డబ్బులిస్తామనీ కూలికి ఊర్లో మనుషుల్ని తీసుకెళ్ళే వాళ్ళు. తాను కూడా కూలిపనులకని వెళ్ళిందక్కడకి. సొంత పొలం మీద కూలి పనులకెళ్ళడం! అక్కడే పార్టీలనీ, మీటింగులనీ జరుగుతూ వుండీవి.

ఓ రోజు...

ఒంటరిగా కొండ దిగొస్తున్న ఊరి ఆడపిల్లను అల్లరి చేసేరు అక్కడి మేనేజర్లు. అది అమాయకమైన పిల్ల కాబట్టి ఎక్కడా పొక్కకుండా వుండిపోయింది. నిజానికి ఆ రోజు వాళ్ళు ఏమి చేసేరో ఆ పిల్ల చెప్పలేకపోయింది. ఆ రహస్యం కొండల్లోనే నిశ్శబ్దంగా సమాధై పోయింది. అప్పటి నుంచి అటువైపు ఒంటరిగా వెళ్ళాలంటే జడుసుకునే వాళ్ళు వూరి ఆడపిల్లలు. అటువైపు వెళ్ళినా ఏ పోలీసు కేసనే ఏ అనర్థం జరగవచ్చునో ఎవ్వరూ అటువైపు కన్నెత్తి చూసేవారు కాదు. ఊర్లోకి దొరగారు అప్పుడప్పుడూ వస్తూ వుండేవారు. అలాంటప్పుడు అతనితో మాట్లాడ్డానికి ఎవరికీ ధైర్యం చాలేది కాదు.

మరో రోజు....

కొండ మీద నుండి కర్రలు దించుతున్న వూరోలికి దొరగారి కుక్క అడ్డగించి వెంటాడింది. కర్రల బరువులు కాసుకోలేకా కుక్కని తప్పించుకోడానికి పరిగెత్తలేక డొంకల్లోన పడిపోతే కుక్కొచ్చి చీరేసింది. తొడ కండరాలు లాగేసింది. ఆ తరువాత నెలరోజులు పనికెల్లలేక తిండి గింజల్లేక నానా బాధలు పడీ సావుతప్పి కన్ను లొట్టబోయినట్టైగై పోయింది. అడిగితే "దానూసు ఎవడెల్లమన్నాడ్రా మీకు?" అని కోప్పడ్డాడు దొరగారు. "అదేటి బాబు! అది కొండ దారి గదా... తిండి దొరకాలంతే కొండకెల్లకపోతే అవుద్దా?" అని అందరూ అడిగేరు. అప్పుడు దొరగారు అన్నారు... "ఆదిప్పుడు మీ దారెలగవుద్దిరా?" అని. ఆ మాటకి వూరోలు గుండెలోన రాయి పడిపోయింది. గట్టిగా అడిగితే మల్లా ఆ కుక్కనెక్కడ ఉసిగొలుపుతాడో నని బెదిరిపోయేరు.

అదా అక్కడి నుండి ఆ దారి వూరికి దూరమైపోయింది. గెడ్డ పరాయిదైపోయింది. కొండ కానిదైపోయింది.

చిరిగిపోయిన చీర ముక్కని మరొొక్కసారి చూసుకుంది సింజీడి. దూరమైపోయిన ఆ పొలం గుర్తొచ్చింది.

'ఆ పొలం వుండి వుండి వుంటే వూర్లో ఏమీ దొరక్కపోయి నప్పుడల్లా అటుకాసి యెళ్ళి తుప్పలూ డొంకలు నరికి ఉన్నాదనిపించు కుండోలిమి.' అనుకుంది.

కొర్రు అనుకున్న భూమిప్పుడు బంగారమైపోయి ఇనప కంచె పహారాలో వుంది. మధ్యలో ఏపుగా పెరిగిన బాదం చెట్టు. ఆ చెట్టు పక్కనే రేకుల షెడ్డు... దాని పక్కనే ఆగి వున్న టాపులేని జీపు. దాని మీద పులి లాంటి కుక్క. పొలం నిండా ముందెన్నడూ చూడని పామోలిన్, ఎర్రచందనం మొక్కలు. కళ్ళ ముందే వున్నా తమది కాకుండా పోయిన తమ భూమి! కురాసింగి గెడ్డ నీరందక ఏడాదిగా మారిపోయిన భూమిప్పుడు డబ్బున్నోడి చేతిలో పడేసరికి సస్యశ్యామలమైపోయింది.

"ఓలె సింజీడప్పా! నడే బేగి" అని వెనక నుంచి నడుస్తున్న వాళ్ళు తొందర చేయడంతో ఈ లోకంలోకి వచ్చి అసలు పని గుర్తుకొచ్చి అడుగులు వేగంగా వేయనారంభించింది. కంచె దాటి మలుపు తిరిగాక సారా బట్టి కనిపించింది. సారా బట్టి పక్కనే కుండల్తో దిగిన సారా. ఆ పక్కనే కావిళ్ళతో తరలించడానికి సిద్ధమవుతున్న ప్లాస్టిక్ టిన్నులు. ఒక్కసారి ఆడోల్లందరూ అక్కడ ప్రత్యక్షమయ్యేసరికి అక్కడున్న వాళ్ళకి ఏమీ అర్థం కాలేదు. వాళ్ళ చేతుల్లోని కర్రల్ని చూసేక అర్థమైపోయింది. పులుల్లా గెంతేరు సారా కుండలవైపు. పగలగొట్టేరు. పొయ్యిల్ని ధ్వంసం చేసేరు. కొంతమంది మొదట్లో తగువుకి దిగినా... ఆడోళ్ళ సంఖ్య చూసి వెనక్కి తగ్గేరు. మరికొంతమంది ప్రతిఘటించి విఫలమయ్యేరు. ఒక్కసారిగా అక్కడ పరిస్థితి బీభత్సంగా మారిపోయింది. అక్కడున్నోళ్ళందరూ పారిపోయేరు.

నిశ్శబ్దం...! భయంకర నిశ్శబ్దం!!

కొండ మలుపు తుప్పల్లోంచి ఇప్పమొగ్గల మొకర మోసుకుంటూ తూలుతూ ఏదో పాట పాడుకుంటూ వూస్తూ ఎదురయ్యేడు మంగడు. అక్కడికొచ్చి పరిస్థితి చూసి ఆశ్చర్యపోయేడు. అక్కడి ఆడోళ్ళలో సింజీడి వుండడం చూసి బిక్కచచ్చిపోయేడు.

"నీకేం పోయేకాలమా? నీకు సంకటం పట్టుకున్నాదా?" అని భర్తమీద విరుచుకు పడింది. అప్పటికే తాగేసి వున్న మంగడు భార్యమీద అగ్గిమిద గుగ్గిలమైపోయేడు. భార్యమీదా, మిగతా ఆడోళ్ళమీదా కలబడబోయేడు కానీ లాభం లేకపోయింది. అతను మత్తు మీదున్నాడు, సంఘం వూపు మీద వుంది. తూలుతున్న మంగడిని నడిపించుకుంటూ ఇల్లు చేరింది సింజీడి.

అప్పుడర్థమయ్యింది సింజీడికి పెనిమిటి తాగడమే కాకుండా వంట కూడ మొదలెట్టేసి తన పోరాటానికి అర్థం లేకుండా చేస్సాడని. సారా బట్టీలు ధ్వంసం చేసిన సంగతి చుట్టు పక్కల వూర్లలో సంచలనం రేపింది. అ నోటా ఈ నోటా చేరి ఆ విషయం ఎక్సైజ్ పోలీసులకు కూడా చేరింది. దొంగలు పడ్డ ఆరు నెల్లకి అన్నట్టు పోలీసులు వూర్లోకొచ్చి ఏమైందీ అని విషయ సేకరణ మొదలెట్టేరు. అందరూ మౌనం వహించేరు... ఏమీ జరగనట్టే వుండిపోయేరు. చివరికి పోరాటం చేసిన సింజీడి కూడా ఏమీ మాట్లాడలేదు. నోరు మెదిపితే పెనిమిటి జైలుకెల్తాడని ఆమె కూడా అందరిలాగానే మౌనంగా వుండిపోయింది.

ఇది జరిగిన కొన్నాళ్ళదాకా వూర్లో ఏ సాయంత్రమూ తాగుడు తగువు రాలేదు. ఏ వీధీ సారా కంపు కొట్టలేదు. కానీ... ఓ సాయంత్రం సింజీడి పనిలో వుండగా మంగడు తూలుతూ వచ్చేడు. తగువు మొదలయ్యింది. "మల్లా ఎక్కడ మరిగించినారో...?!" అని పెరిమిటితో తగువుకి దిగింది. ఏమీ చెయ్యలేని కోపంతో మంగడు మాత్రం ఇలా అన్నాడు..." సీరలు ఎగేసుకొచ్చేసి సారా కుండలు సితగ్గొట్టేస్తే తాగుడు ఆగిపోద్దేటే? మొగుల్లు తిన్నగుండాలంతే. ఆలలగ తిన్నగుండాలంతే పెల్లాలూ? ఇంకా తిన్నగుండాల.." అని.

ఆ మాటకి చిర్రెత్తుకొచ్చింది సింజీడికి.

మళ్ళీ కొంగు ముడేసింది. చీర ఎగ్గట్టింది. గబ గబా అడుగులేస్తూ వూరు దాటింది. ఈ సారి ఆమె వెనుక ఎవ్వరూ లేరు. ఒంటరిగా నడవడం మొదలు పెట్టింది. సారా బట్టీల వైపు కాకుండా పోలీసు స్టేషను వైపు.

తెల్లారే సరికి వూరోల తాగినోల్లు ఎవరూ కనపడలేదు. తాగినోళ్ళే కాదు సారా వండినోలెవరూ రెండు రోజుల దాకా కనపడకుండ పోయేరు. అందరితో పాటు మంగడూ ఇల్లు చేరలేదు. పోలీసులకి దొరక్కుండ అడవుల్లోకి పారిపోయేరని అనుకున్నారంతా. కానీ వాళ్ళందరూ వంట స్థలం మార్చేసి పోలీసులకి దొరికిపోయేరు. అందరూ సెల్లో కూర్చొనున్నారు. కేసు కట్టీసేరు. వాళ్ళలో మంగడూ వున్నాడు. లాఠీ దెబ్బలెప్పుడూ రుచిచూడనోడు ఆ సారి రుచి చూసేడు. అసలే తాగుడు శరీరం. దెబ్బలకి అక్కడే చస్తాడనుకున్నారంతా మిగతావాళ్ళు. రెండు రోజుల తర్వాత వాళ్ళలో ఇద్దర్ని విడిచి పెట్టేరు. ఆ ఇద్దరిలో మంగడున్నాడు. గాయపడ్డ భర్తను చూసి నివ్వెరపోయింది సింజీడి. సారా మానిపించడానికి పోలీసుల సాయమడిగింది కానీ ఇలా కొడతారని వూహించలేకపోయింది. వచ్చీ రాగానే ఇంత ముద్ద తిని మూలనున్న మునకాల కఱ్ఱ తీసి బయటకు నడిచేడు మంగడు.

'ఎక్కడికే?' అని అని అడిగినా వినపడనట్టే మౌనంగా వెళ్ళిపోయేడు. తిన్నగా దొరగారింటికి చేరుకున్నాడు. దొరగారిని కలవాలన్నాడు. వూర్లో లేరని చెప్పేరు గేటు దగ్గర. ఎంతేలైనా దొరతో మాట్లాడే ఎల్తానని అక్కడే గోడకానుకొని బొంతుకాలేసుకొని కూర్చుండిపోయేడు. ఏ రాత్రికో ఇల్లు చేరిన దొరగారిని పలకరిస్తే…" నాకు నా బూమి డబ్బులు కావాల బావూ!" అన్నాడు. దొరగారు గతుక్కుమన్నారు. వాడి వెనక ఎవరైనా వున్నారేమో నని చూసేరు.

"ఇస్తాన్లేరా! నీ కంత కష్టమేటొచ్చిందో సెప్పురా!" అని సముదాయించి అడిగితే అసలు విషయం చెప్పేడు మంగడు.

"మరేట్లేదు బాబు మన పొలం పక్కన గెడ్డ కాడ సారా వొమడినామని పోలీసులు మనోలు నలుగురికి బొక్కలేసినారు. కేసు కడతామంతున్నారు. ఇద్దరికే వొగ్గినారు. డబ్బుకడితే కేసు లేకుండ వొగ్గుతారట. అందకే పరిగెట్టి వొచ్చినాను... పొలం డబ్బులిస్తావని" ఆగి ఆగి చెప్పేడు.

దొరగారు వూపిరి పీల్చుకున్నారు. కుర్చీ మీద వాలిపోతూనే "ఓస్ ఇంతేనా? దీనికి నా వరకూ పరెగెట్టి వొచ్చేసినావా?" అని ఫోన్ తీసి మాట్లాడేరు. అవతలోడు పోలీసోడని మంగడికి అర్ధమయి పోయింది. 'లమ్డీకే ... మంగడంతే ఎవడనుకున్నావ్ నా ఇంటి మనిషి. ఇంకో సారిలగ జరిగిందనుకో నువ్వక్కడుండవ్' అని ఫోను పెట్టేసి మంగడి భుజమ్మీద చెయ్యేసి ఇలా అన్నాడు... "మంగడంతే నా ఇంటి మనిషి. నీకేం భయిం లేదు. ఈ సారెవడైనా పేలితే నా పేరు చెప్పు సరేనా ? ఇంత దాక రావక్కరలేదు. ఒక్క ఫోను కొట్టు" అంటూ గుమ్మం దాకా నడిపించి వందనోటొకటి చేతిలో పెట్టేరు దొరగారు.

ఇంటికొచ్చేసరికి సెల్లో వుండాల్సిన మిగతా వాళ్ళందరూ వూరు చేరిపోయేరు. అందరిలో హీరో అయిపోయేడు మంగడు.

అది మొదలూ... ఆడోళ్ళు వుద్యమాలు చేసి సారా బట్టీలు తగలబెట్టడం... దొరికినోలికి పోలీసులకప్పజెప్పడం, ఒక రోజు రాత్రి సెల్లో వుంచడం. ఆ తెల్లారే దొరగారి ఫోన్ సాయంతో ఇంటికొచ్చీడం. .. వంటకి తయారైపోవడం మామూలయి పోయింది.

వూర్లో మగాళ్ళు సారాకి బానిసలైపోవడం... ఆడోళ్ళు శత్రువులైపోవడం... ఆ క్రమంలో సింజీడి సారా ఉద్యమకర్తగా గుర్తింపు పొందింది.

* * *

"ముండ గండలూ...! నా పెనిమిటికి తినీసినార్రో నాయినా! నా భూములు లాక్కున్నార్రోయ్! " ముక్కు చీదుకుంటూనే శాపనార్ధలు పెడుతోంది... సింజీడి. అంత దుఃఖం లోనూ కొల గూడుని గమనించడం మానలేదు.

గత వారం రోజులుగా చూస్తున్నాడు ముసిలోడు. సింజీడి తిండి తిప్పలు లేకుండా మంచి నీళ్ళైనా ముట్టకుండా ఏడుస్తోంది. వూరు మంగడి చావుని మరిచిపోయినా సింజీడి ఏడుపు పదే పదే గుర్తుకు తెచ్చేలా చేస్తోంది. ఆమెను ఎంత మంది ఓదార్చుతున్నా ఫలితం లేకపోతోంది. ముసిలోడికి తెలుసు ఈ సారా చావు మొదటిది కాదు. అలాగని దాన్ని ఆపడం ఎవరి సాధ్యమూ కావడంలేదు. సారా వంటని ఆపగలిగే ఒకే ఒక్క సింజీడి ఇలా మూల కూర్చొని ఏడ్వడం అతనికి మరింత దిగుల్లోకి నెట్టేసింది.

"ఇంకెవలికోసం బతకాల్రా దేవుడా! నీనుండి ఏటి లాబంరో దేవుడో! " అని మరింత హెచ్చు స్వరంతో ఏడుస్తోంది.

ఉన్నట్టుండి గాలి ఒక్కసారి బలమగా వీచింది. గడపనున్న దీపం ఆరిపోయింది. పక్కింటి ముడిలోడు మంచం దిగి సింజీడి దగ్గరికొచ్చేడు. ఆమె వైపు ఒక్కసారి పరిశీలనగా చూసేడు. ఆమెను ఓదార్చుతూనే కోల గూడు ఎత్తి చూసేడు. "అమ్మీ!" అని పిలిచేడు బిగ్గరగా. ఏడుస్తూనే అతనివైపు చూసింది ఏమిటన్నట్టు. కోలగూడు కింద పరిచిన పొయ్యిబుగ్గి వైపు చూపించేడు. అక్కడ రెండు పాదం గుర్తులు వుండడాన్ని చూపించేడు.

సింజీడి ముఖం వెలిగిపోయింది. భర్త దైవమై పెద్దల్లో కలిసిపోయేడని దండం పెట్టుకుంది. వూర్లో ఏ చెడు జరిగినా దానికి దెయ్యమై పీడించేడూ అని మాట రాదన్న తృప్తి కనిపించింది.

సింజీడి ఏడుపు ఆపింది. కళ్ళు తుడుచుకుంది. మెడలో వేలాడుతున్న పూసల దండని కళ్ళకద్దుకుంది. మదిలో పెనిమిటి రూపాన్ని మనసారా తలచుకుని తల నేలాన్చింది. ఆమె కన్నుల్లోంచి రెండు కన్నీటి బొట్లు జారిపడ్డాయి. లేచి తలంటు స్నానం చేసింది. ఆరిపోయిన దీపాన్ని నూనె పోస్తూ వెలిగిస్తోండగా వీధిలో తగువేదో వినిపించింది. కొసాయింటి నాగడు. తూలుతూ నడుస్తున్నాడు. భర్తని నడిపించుకుంటూ ఇంటికి తీసుకెళ్తోంది.

వీధిలోకి అడుగు పెట్టేసరికి ఒక్కొరూ రోడ్డుకానుకొని వున్న కొత్తబడ్డీ నుంచి మగోళ్ళు ఒక్కొరూ బయటికి రావడం గమనించింది. లోపలికెళ్లే సరికి కొత్త షావుకారి సీసాలు తీసి సరుకు అందిస్తూ కనిపించేడు. ఏటని అడగబోయింది. అడక్క ముందే సమాధానమిచ్చేడు షావుకారి. "చూడు సింజీడి! పోలీసులకి డబ్బు కట్టి తెచ్చుకున్న సరుకు. నువ్వు రిపోర్టు చేస్తానన్నా చెల్లదు. ఆ తర్వాత నీయిష్టం" తగువుకి సిద్ధమన్నట్టు చెప్పేడు

ఇంకా అక్కడే తిరుగాడుతున్న దయ్యమేదో అర్థమయ్యింది సింజీడికి. చేజారిపోయిన భూములూ...లోకాన్నొదిలిపోయిన పెనిమిటీ... దొరగారూ.. దొరగారి బేపులూ... సారా బట్టీలూ... వూర్లోకొచ్చిన కొత్త బడ్డీలూ... కలగాపులగంలా బుర్రలో మెదులుతుంటే ప్రశాంతంగా వెనుతిరిగింది. సంఘం మీటింగుకి రమ్మని పిలిపించింది వూర్లో అందరికీ. అక్కడ ఏమ్మాట్లాడాలో ఒక్కొక్కటిగా ఆలోచిస్తోంది... ఎలా మొదలు పెట్టాలి? ఎక్కడ మొదలు పెట్టాలి? భయపడ్డం కన్నా బలపడ్డం ముఖ్యమని గ్రహించిందేమో... స్థిరంగా అడుగులెయ్యడం ముసిలోడు గమనించేడు. సింజీడి మెట్ట ముడేసి కొంగు బొడ్లో దోపి ముందుకు నడుస్తోంది.

పక్కింట్లో సింజీడిని చూస్తూనే తన పాదాలకంటిన పొయ్యి బుగ్గిని కడిగేసుకున్నాడు.

*(వేగావతి కథలు, శ్రీకాకుళ సాహితి, 26.10.2014)*

# చంద్రన్న

**చీ**కటి పడింది. కరెంట్ పోయింది. ఒక్కసారిగా పిల్లల గోల. నా భయం చీకటి గురించీ, రాత్రి గురించీ కాదు. పిల్లల గురించే. కొండ ప్రక్కన అడవిలో ఈ గిరిజన ఆశ్రమ పాఠశాల. అనుకోవడానికి ఇది పాఠశాల గానీ గదులకి తలుపులుంటే కిటికీలుండవు. కిటికీలుంటే వాటికి గడియలుండవు. చీకట్లో ఏ వైపు నుండి ఏ జంతువు ఎగిరి పడుతుందో... ఏ మూల నుండి ఏ పురుగు పాకుతుందో... అడుగేస్తే ఏ పాము కాటేస్తుందో క్షణక్షణం భయం భయం. ప్రహరీ గోడ వుండదు. వున్నా అది దేనికీ అడ్డం కాబోదు.

"మేసారండీ... ఇల్లీడికి దయ్యం పట్టిందండీ" చీకట్లో పిల్లల కేక.

"మేసారండీ... నా బువ్వకడ నీలు పోసేనాడండీ" ఓ కంప్లైంట్

"నా దుప్పటి సింపేసినాడండీ..." ఎవడో ఏడుపు, గోల.

చీకట్లో నా నిస్సహాయత..."సై..లె..న్స్" అని అరవడం తప్ప నేనేమీ చెయ్యలేని నిస్సహాయత. నా చేతిలో ఒక కొవ్వొత్తి. నా మొబైల్ వెలుగు తప్ప ఏ కాస్త వెలుగైనా ఇవ్వలేని నిస్సహాయోపాధ్యాయుడిని. మిగతా స్టాఫ్ లాగ వుదయం వచ్చి సాయంత్రం వెళ్లిపోగలిగే దూరం కాదు నాది. కుటుంబసభ్యుల్ని వదిలి వారానికోసారి, సెలవుల్లో మాత్రమే వెళ్లగలిగే వూరు నాది.

పేరుకి ఇది ఆశ్రమ పాఠశాలగానీ... వార్డెన్ వుండడు. ఏడాదికొకడు చొప్పున ఉపాధ్యాయులే ఆ బాధ్యతలు నెరవేరుస్తూ వుంటారు. హెడ్‌మాష్టరు ఇంకొక స్కూలుకి డెప్యుటేషను. అతని స్థానాన్ని మరొక సీనియర్ ఉపాధ్యాయుడు నెరవేరుస్తూ. మొత్తంగా ఈ రాత్రిపూట అడవిలో అనాధలా...ఆశ్రమ పాఠశాల.

"సెటాప్... డోంటాక్...నోర్మూయ్... రాస్కెల్" అంత చీకట్లోనూ గోలలోనూ స్పష్టంగా వినపడిందామాట. అంటే చంద్రన్న డ్యూటి ఎక్కేడన్నమాట. అతడు నాకు రాత్రి మిత్రుడు. స్కూల్లో నైట్‌వాచ్‌మన్. చీకటి పడగానే అతనికోసం అతనికోసం ఎదురు చూడ్డం నాకు తెలీకుండానే అలవాటుగా మారిపోయింది. సరిగ్గా పిల్లల బోజనాలు అవుతున్నపుడే ఎంట్రీ అవుతాడు. ఇలాగే...అవే మాటల్తో, అదే మాడ్యులేషన్‌తో. నా దగ్గరకొచ్చి"తిన్నావు గురువూ?" అని అడుగుతాడు వినయంగా. నేను చెప్తాను. తినకపోతే "ఒడ్డిస్తాను పదా!" అంటాడు. తిన్నాను అంటే "నీలు తెచ్చిస్తానైతే" అని ప్రక్కనే వచ్చి కూర్చుంటాడు. అటూ ఇటూ చూసి బుర్రగోక్కుంటూ "ఐదు రూపాయలియ్యి గురువూ" అంటాడు. రోజూ ఇవ్వను కదా, ఏదో ఒకటి చెప్తాను. దానికతను రెండు చేతులూ నలుపుకుంటూ "అలగేన్లే... నీ బోద్దైతే" అని మెల్లగా జారుకుంటాడు. ఎప్పటిలాగానే తన నులక మంచాన్ని స్టోర్ రూమ్ ఎదురుగా పరుచుకుని పడుకుంటాడు. కాళ్ళ వద్ద అతని కుక్క అతని చుట్టూ పిల్లలు...

పాటల కూని రాగాలు.... పొడుపు కథలతో అతడు.

అది అతనితో నాకున్న అలవాటైన దృశ్యం. కానీ.... అతడు డ్యూటీకి రాని రోజులూ వున్నాయి. ఆ రోజుల్లో నాకు, పిల్లలకీ రాత్రి

పూట తోడెవరు' ఒకసారి గైర్హాజరయ్యాడంటే వారం పది రోజుల దాకా రాడూ, ఎవరికీ కనపడడు. చివరికి అతని భార్యకు కూడ.

అలాంటి రోజుల్లో ఒకసారి ఆమె వచ్చింది... చంకలో పిల్లాడినెత్తుకుని... కళ్ళనిండా దిగులు నింపుకుని.

"ఏమైందమ్మా?" అడిగాను.

"నా పెనిమిటి ఇంటికొచ్చుండడండీ" అంది.

"ఎటు వెళ్ళేడో నీతో కూడా చెప్పడా?" అన్నాను.

"తాగేసి ఎటెలిపోతాడో తెలీదండీ... ఎల్లినోడు నాకూ సెప్పడండీ" అంటూ కన్నీళ్ళు తుడుచుకుంది. ఆమె కన్నీళ్ళు చూసి పిల్లోడూ ఏడుపందుకున్నాడు.

ఏమి చెయ్యాలో నాకు బోధపడలేదు.

గతంలో నేను మరో స్కూల్లో వున్నపుడు అక్కడ పని చేస్తున్న వాచ్‌మన్ కనిపించకుండా పోయేడు. అతను కూడా రాత్రి అయ్యేసరికి మందు మత్తులో ఎటో వెళ్ళి వుంటాడ్లే అని వూరుకున్నాం. అది అలవాటే అన్నట్టు.

కానీ....

ఓ రెండు రోజుల తర్వాత స్కూల్లోకి సాయంత్రం వేళ ఒక అపరిచిత వ్యక్తి నన్ను అడిగాడు..."జమ్మయ్యనే వ్యక్తి మీ హాస్టల్లో పనిచేస్తున్నాడా?" అని. దానికి ఔనని సమాధానమిచ్చి 'మీరెవర'ని అడిగేంతలోనే  'మీరొకసారి స్టేషన్‌కు రావాల్సి వుంటుంది' అని అతని ఐడెంటిటీ చెప్పేడు.

అక్కడికి వెళ్ళాక తెలిసింది జమ్మయ్యని అరెస్ట్ చేసేరని.

"ఏమైందీ, ఎందుకు సార్?" అని అడిగితే...

"మీరు హాస్టల్లో పిల్లలకే భోజనాలు పెడుతున్నారా? అన్నలకి కూడా వండి పెడుతున్నారా మాష్టారూ!" అని అడిగేసరికి నాకు కాళ్ళూ చేతులు వణికిపోయేయి.

"అయ్యయ్యో!.. అదేంటి సార్?" అని అన్నాను. అదెలా సాధ్యమవుతుంది అన్న ధోరణిలో.

"వీడినడగండి" అని జమ్మయ్య వైపు చూపించేరు.

"నాకేటీ తెలీదండీ ...నీనలపోంటోడిని కాదండీ!" అని తలవంచుకుని ఓ మూల నిలబడి వున్నాడు జమ్మయ్య.

అతన్ని చూస్తే జాలేసింది. రెండు రోజులుగా తిండీ నిద్రా వున్నట్టు లేదు. మాసిన బనీను, లుంగీలో వున్నాడు. అతని కనురెప్ప ఒకటి వాచి వుంది. ఎన్ని దెబ్బలు తిన్నాడో పాపం! ఇద్దరు టీచర్స్ నుండి హామీ పొంది, వార్నింగులతో అతన్ని బయటకు తీసుకు రావడానికి ఎస్సై అంగీకరించేడు.

స్టేషన్ నుండి బయటికొస్తుండగా అడిగాను... "ఏం జరిగింది? నువ్వేం చేసేవు? నిజం చెప్పు" అని.

"నీనేటీ సెయ్యలేదండీ..." అని చెప్పడం మొదలు పెట్టేడు. "రాత్రి పిల్లల బోజనాలైపోయినాయండీ. ఎంగిల్లు తుడుస్తున్నానండీ... గుంటలందరూ గోల గోల సేస్తున్నారండీ. ఆ టైములోన 'అన్నా!' అని ఎవరో పిలిసినట్టిగయ్యిందండీ. ఎనక్కి తిరిగి సూసేనండి. తలపాగ సుట్టుకోని లుంగీ బనీను మీద కనబడినాడండి జబర మనిసి. 'ఎవులూ? ఏటికావాలన్నా?' అన్నానండి'

'ఆకలేస్తుంది... అన్నం పెడతావా?' అన్నాడండి. 'అలగన్నోడికి మీరైనా అన్నం పెట్టరండీ?' అని తిరిగి ప్రశ్నించేడు.

పెడతామన్నట్టు తల వూపేను.

"కదండీ, నీనూ అలగే పెట్టేనండీ. కిచిన్‌రూమ్‌లోనికి పిలిసి కూకోబెట్టి, కూర లేకపోతే సారు తోటి అన్నం పెట్టేనండి. తింతున్నపుదు 'అన్నా! అన్నా!!' అని మాట్లాడండీ. నీను మల్లా అలగే జవాబు సెప్పినానండి. అదండీ జరిగింది. ఆప్టలికి ఒక్కలొస్తారండీ? పిల్లల తలిదండ్రులొస్తారూ... దార్ల పోయినోలొస్తారు. పిల్లలు తినగా మిగిరిలిపోయినన్నం ఏటి సేస్తామండీ... 'ఆకలీ అన్నోడికి ఇంత పిసర పెట్టమండీ? అలగే పెట్టినానండీ" అని తువ్వాలుతో ముఖం తుడుచుకుని ముందుకు నడిచేడు.

"దానికే తీసికెలిపోయేరా? అతనెవరో నీకు తెలీదా?" అడిగేను అమాయకంగా.. ఒకింత అనుమానంతో.

"తెలిసిందండి. రెండు ముద్దలు తినేసిన తర్వాత తింతున్న ప్లేటు కింద పెట్టి చప్పట్లు కొట్టేడండీ. ఎందుకని సూస్సరికి చీకట్లోంచి నలుగురు కనిస్టేబుళ్ళు నా జబ్బట్టుకొని బడికి దూరంగా సీకట్లోనున్న జీపెక్కించీసినారండి. ఇక్కడికొచ్చింతర్వాత తెలిసిందండి అతగాడు ఎస్సైగారని."

ఆ సంఘటన గుర్తుకొచ్చి నా ఆలోచనలు పరిపరి విధాల పరుగులు తీసాయి. చంద్రన్న భార్య కన్నీళ్లతో నా ఎదురుగా. ఆమె కాళ్ళకు చుట్టుకుపోయిన మూడేళ్ళ బాబు అల్లరి చేస్తున్నాడు ఏదో కావాలని.

చంద్రన్న కూడా అలాగే ఇరుక్కున్నాడా? ఏ అపరాత్రి వేళో అపరిచిత వ్యక్తులతో మాట్లాడేడా? అడగ్గానే హాస్టల్లో అన్నం గానీ ఎవరికైనా పెట్టి తినిపించేడా? లేకా ఇంకేదైనా జరిగి వుంటుందా? గతంలో ఎప్పుడూ డ్యూటీకి గైర్హాజరైనా కొద్ది రోజులకే తిరిగొచ్చేసేవాడు మత్తు వదిలాక. కానీ ఈ సారి ఇన్ని రోజులైనా ఇంటికి చేరలేదు. అతని ఆచూకీ కోసం చంద్రన్న భార్య ఇలా కన్నీళ్లతో నా ముందుకు రావడం నన్ను మరింత ఆందోళనకు గురిచేసింది.

పిల్లలందరూ స్టడీ అవర్‌లో కూర్చున్నారు. స్టడీ అన్నమాటే గానీ పిల్లలు పక్కలన్నీ సర్దేసుకునే వుంటారు. చిన్నపిల్లలైతే నిద్రపోయే వుంటారు. గదుల్లోంచి పిల్లల గోల ఇంకా వినపడుతూనే వుంది. హాస్టల్ గదులకు అవతల పిల్లల మాటలు చీకటి లోంచి లీలగా వినవస్తున్నాయి. బహుశా చెంబులు పట్టుకుని వెళ్ళి వుంటారు.

చంద్రన్న వుండి వుంటే ఈపాటికి నేనూ నిద్రపోయేవాణ్ణి. స్టోర్ రూమ్ ఎదురుగా అతని నులక మంచం ఖాళీగా కనిపిస్తోంది. కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ చీకట్లోకి చూస్తూ అరుస్తున్నాయి. మెలకువలో వున్న పిల్లలు కుక్కల్ని 'ఛీ...ఛెడీ' అని అదిలిస్తున్నారు. అవి కాస్తా వెనక్కి తగ్గినా కాసేపటికి మళ్ళీఅరవడం

మొదలుపెట్టేయి. చీకట్లో అడవిలో ఏ జంతువు అలికిడిని పసిగట్టేయో! అరుస్తూనే వున్నాయి.

హఠాత్తుగా కుక్కలు నిశ్శబ్దమైపోయేయి. మరునిమిషానికి కారణం తెలిసొచ్చింది. చీకట్లోంచి ఓ ఆకారం మా వైపు నడుస్తూ రావడం కనిపించింది. దగ్గరకొచ్చాక స్పష్టమయ్యింది... అతను చంద్రన్న.

ఆఫీసు రూమ్ వరండాలో నేను. నా ఎదురుగా అతని భార్య, ఆమె చంకన బిడ్డ. నేరుగా మా దగ్గరకొచ్చి నిలబడ్డాడు. ఒళ్ళంతా గాయాలతో వున్నాడు.

"ఏటైందే?" అని అతని భార్య అతన్ని చేరుకుంది. పిల్లోడు అతన్ని చేరక ముందే వచ్చి ఎత్తుకున్నాడు చంద్రన్న. అసలే బక్కచిక్కిన శరీరం. దానికిప్పుడు గాయాల తోడు. మాసిన బనీను, లుంగీ మీద రక్తపు మరకలతో భయం గొలుపుతున్నాడు.

"చంద్రన్నా! ఏమిటిది? ఏమైంది నీకు ?" అడిగేను.

"మేసారూ! మీము బతకలేమండి. మాలాంటోలకి బతుకుండ దండి. ఇరికిపోయినోలమండి. బతకలేము. అంటూ కుప్పకూలి పోయేడు... స్థంబానికి అనుకుని. నీళ్ళందించేను. చెంబుడు నీళ్ళు గటగటా తాగేసి కాసిన్ని మిగిల్చి ముఖం కడుక్కున్నాడు. అతని భార్య కొంగుతో ముఖం తుడిచింది.

"అసలేం జరిగింది...? ఎక్కడికెళ్ళేవూ ఇన్నాళూ?"

"ఎలిపోతాం మేసారూ! ఉజ్జోగమొదిలీసి ఎలిపోతాం.." అని రొప్పుతున్నాడు.

"ఎందుకూ?" అన్నాను మెల్లగా.

"నీను బతికుండాలంతే ఈ ఉజ్జోగం సెయ్యకూడదు. ఈ ఉజ్జోగం లేకపోతే నాకు బతుకులేదు."

"సరిగా చెప్పు.." అన్నాను కాస్త సమయమిచ్చి.

"మీకాడ ఏటీ దాయలేను మేసారూ...!!" అని చెప్పడం మొదలు పెట్టేడు.

"ఈ వుజ్జోగమెలగొచ్చిందో తెలుసండీ మేసారూ! ఒక రోజు మా వూరికి కూంబింగ్ పోలీసులొచ్చినారండి. అందరి ఇల్లూ సూసినట్టిగే మా ఇల్లూ నెనికినారండి. ఏటీ దొరకలేదండి. అందరికీ అడిగినట్టిగే మా ఇంటోల గురించి అడిగినారండి. సెప్పినానండి. అప్పుడే 'నీవేటి సదువుకున్నావూ' అడిగినారండి. 'ఏడు' అన్నానండి. 'నీకు వుజ్జోగమిస్తాము సేస్తావా?' అని అడిగినారండి" అని ఆపేడు.

"అంటే ? పోలీసుల ద్వారా వచ్చిందా నీకీ ఉజ్జోగము?" అని అమాయకంగా అడగబోయేను.

"వుండండి... బోల్డుంది కద ఇందల" అని అటూ ఇటూ చూసేడు. అప్పటికే పిల్లలు గదుల్లోంచి నిద్రాదేవత ఆనవాళ్ళు నిశ్శబ్దంగా కనిపిస్తున్నాయి.

"చెప్పు.. ఫర్వాలేదు" అన్నాను.

"మేసారూ! ఎలాగ వొదిలీసి ఎలిపోతానూ? మీ కాడ ఏటీ దాయలేను. వుజ్జోగము గదా... ఏముజ్జోగమూ?" అని అడిగినానండి. వంటకుక్కు అన్నారండి. గానీ నీ పని వొండడం కాదూ అన్నారండి. ఏటో తిరకాసున్నాదని అనుమానపడ్డానండి. గానీ వుజ్జోగమంతే ఆశ. ఒప్పుకున్నానండి. అయితే ఆ తర్వాత అసలు మడత పెట్టినారండి..." అని ఆపేడు. చుట్టుపక్కల చూసేడు మళ్ళీ. ఆ రాత్రి వేళ అతనెందుకు భయపడుతున్నాడో నాకైతే అర్థం కాలేదు.

కొడుకు నిద్రపోతున్నాడని వాడిని ఎత్తుకుని గ్రౌండులో తుప్పుతోంది చంద్రన్న భార్య.

"ఏమిటీ?" అడిగేను.

"ఏట్లేదూ... నీకు ఆర్డరిస్తారూ... నీ పేరు 'చంద్రన్న' అని చెప్పూ... అనన్నారండి"

క్షణకాలం నాకు అర్థం కాలేదు.

"ఏమిటీ మళ్ళీ చెప్పు" అన్నాను.

"ఔనండి... చంద్రన్న పేరుతో వుజ్జోగం సెయ్యమన్నారండీ"

"అంటే?"

"చంద్రన్న నీను కాదండీ" అన్నాడు మెల్లగా.

"మరి..?"

"మాయన్న సోములండి.... చిన్నపుడెపుడో ఇల్లొదిలీసి పనులకని దేశిమెలిపోనాడని అనుకున్నామండి. ఆ తర్వాత తెలిసిందండి...ఆడు ఇల్లొదిలి దేశిమెల్లలేదు అడివిలోకి పారిపోయేడని. అన్నయిపోనాడండి. వుజ్జోగంల చేరిన్నాటికి నాకు మల్లా తెలీదండి. అక్కడిలెల్లి మా యన్న సోములు... సెంద్రన్నయిపోయినాడండి."

"అంటే.... నువ్వు... ఎలా?" ఏదో లింకు దొరికినట్టు అడిగాను.

"ఆ చంద్రన్న లొంగిపోయినట్టు... లొంగిపోయినోడికి వుజ్జోగమిచ్చినట్టు" స్పష్టంగానే చెప్పేసాడు... రెండు ముక్కల్లో.

"అయితే... నీ పేరేమిటి?" అడిగాను.

"ఏదైతేటిలెండి... ఆ పేరులేదు, నీనులేను" అన్నాడు స్థిరంగా.

ఆశ్చర్యపోయేను. ఏమిటిది? ఒకరిపేరుతో మరొకరు. దేనికోసం? ఏది నిజం? ఏది అబద్ధం? ఈ నాటకం ఎవరి కోసం...? ఎవరి లాభంకోసం? ప్రశ్నల మీద ప్రశ్నలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేయి.

"...నీను లేకపోయినా నా పేనముందండి గదండీ... అందుకే నాకీ బాదలు తప్పవు" అన్నాడు మళ్లీ

"అతని వైపు ఆసక్తిగా చూసేను చెప్పు అన్నట్టు."

"వుజ్జోగంల చేరిన తొలి తొలేత ఒక్కొక్క పోలీసు మా ఇంటికొచ్చేలండి... ఏటి సంగతులూ' అని అడిగోలండి. ఆ తర్వాత్తర్వాత ఆళ సంగతి అడిగోలండి. ఈ వూర్ల ఏటి జరిగినా... చుట్టు పక్కల ఏటి జరిగినా సెప్పమనీవోలండి. అప్పుడప్పుడూ ఆలే నన్ను తీసికెల్లోలండి. ఎస్పీయే నాతో మాట్లాడోలండి" అని ఆపేడు.

ఎవడు వీడు? పులిమీద స్వారి చేస్తున్న వాడా? చీకట్లో దారి తెలీక తోచిన అడుగేస్తున్నాడా? తెలిసి చేస్తున్నాడా? తెలీక బలైపోతున్నాడా? అతన్ని చూస్తే జాలేసింది. అతని భార్యాపిల్లలతో దిక్కుతోచని వాడిలా నిలబడివున్నాడు ఎదురుగా.

"...తొలేత నాకు తెలీదుగానండీ... ఆ తర్వాత నాకు తెలిసొచ్చిందండి. ఎప్పుడికైనా ముప్పు తప్పదని." అని నావైపు సూటిగా చూసేడు.

నేనాలోచిస్తున్నదీ...అతను చెప్పబోతున్నదీ ఒక్కటే.

"ఔనండి! మొన్న నాకు ఎత్తికెలిపోయింది అన్నలండి" అని ఆపేడు.

నిశ్శబ్దంలో ఆ మాట స్పష్టంగా వినపడింది. దాంతో నాకు భయం కమ్ముకుంది.

"ఏమన్నారు?" అడిగాను నా గొంతులో ఆతృత నాకే వినపడింది.

"ఏటంతారు? వార్నింగిచ్చేరు. ఇప్పుడే సంపీసుందురు" అని మళ్ళీ ఆపేడు ఏదో ఆలోచిస్తున్నవాడిలాగా "గానెందుకో నన్ను కొడుతున్నోలందరూ ఒక్కసారి వొదిలీసి పారిపోయినారు"

నిశ్శబ్దం మరింత భయంగొలుపుతోంది.

"వొస్తాం మేసారూ... రేపెవులైనా మీకొచ్చి అడుగుతారు. నీను రాలేదని సెప్పండి" అని భార్యవైపు చూసేడు. ఆమె బిడ్డని భుజాల కెత్తుకుని సిద్ధంగా వున్నట్టు కనిపడింది.

"పదే... ఇంకేటాలోసిత్తావూ" అన్నాడతడు.

ఆమె నా వైపు తిరిగి రెండు చేతులు జోడించింది. నాకు అనుమానమేసింది. "చంద్రన్నా?" అని పిలవబోయేను. అంతలోనే అతడు నమస్కరించేడు. నా గొంతులోంచి మాట రాలేదు. బాధగా మూల్గింది నా మనసు.

ఊరికి చివరి కరెంటు స్థంబం మీద వీధి లైటు ఆగి ఆగి వెలుగుతోంది. లూజ్ కనెక్షన్... గాలికి వూగుతూ... ఆరి వెలుగుతూ. దాని కిందనుంచి చీకటి గుండెల్లోకి దిగబడినట్టు రోడ్డు కనీ కనపడకా. రోడ్డు మీద నీడల్లా ఈ ముగ్గురూ. వెలుగు పడేంతదాక కనిపించి క్రమంగా చీకట్లో కలిసిపోయేరు.

* * *

"గుడ్‌మాణింగ్ సార్! ఇంకా లేవలేదా?" అంటూ వార్డెన్ గారు వస్తూనే ''పేపర్ చూసేరా..? మనకు దగ్గర్లోనే ఎన్‌కౌంటరయ్యింది. చూడండి అంటూ నా ముందు పేపరు పడేసి వంటగదివైపు నడిచెళ్ళిపోయేరు.

నా కళ్ళు మండుతున్నాయి. నద్రలేమి నన్ను ఇంకా ఇబ్బంది పెడుతోంది. అక్షరాలు మసక మసకగా అస్పష్టంగా...

''పోలీసులు.... మావోయిస్టులు... ఎదురుకాల్పులు. సంఘటనా స్థలం వద్ద ఒక మృతదేహం. ఇంకా గుర్తించాల్సి వుంది .... చంద్రన్నదిగా అనుమానం."

నా నిద్ర ఎగిరిపోయింది. రాత్రి సంఘటనా, సంభాషణా గుర్తుకొచ్చాయి. నా గుండె వేగంగా కొట్టుకోవడం నాకు తెలుస్తూనే వుంది.

ఆ మృతదేహం ఎవరిది...? ఏ చంద్రన్నది?

*పాలపిట్ట, సెప్టెంబరు - అక్టోబరు 2014*
*ప్రాతినిధ్య కథ 2014*

# నల్లజెండా

"ఇంకెంత దూరం?" దారి ప్రక్కనున్న రాయి మీద కూర్చుంటూ అడిగాను. ఆగాక గానీ తెలిసి రాలేదు ఎంత అలసటతో వున్నానో. గొంతు ఆర్చుకు పోతోంది. ఒళ్ళంతా చెమటలు... ఆపై చిన్న చినుకులు.

"దగ్గరే సార్...అల్లా సింత చెట్టు కనపడుతుందా... ఆ వంపు తిరిగితే ఊరు కనపడతాది" అని మాష్టారూ ఆగేరు. దారిపొడుగునా నేనలా అడగుతుంటే మాష్టారి నుంచి 'అదే' సమాధానం వస్తోంది కానీ ఊరు మాత్రం రావడం లేదు. వెనక్కి తిరిగి చూసేను. కళ్లు తిరిగినట్టైంది. సముద్ర మట్టానికి ఎంత ఎత్తులో వుండి వుంటానో ఊహించాను. చుట్టూ కొండలు...అడవిని మోస్తూ. ఆ కొండ దొంతరల మధ్య మేము నడిచొచ్చిన దారి మలుపులు తిరుగుతూ...అక్కడక్కడా ఆకు పచ్చగా మాయమైపోతూ...సన్నగా మెరుస్తోంది. దారి ప్రక్క

నుంచే ఏ శిఖరాల మీంచి దూకుతోందో ఒక జలపాతం. ఆ హోరు లోంచి ఎగిరొస్తున్న గాలి మనసును తడుపుతోంది. ఆకులపై చినుకుల సంగీతం.

గత వారం రోజులుగా వాయిదా పడుతూ వస్తున్న ప్రయాణమిది. గిరిజన గ్రామాల్లో మౌళిక సదుపాయాల మీద చేద్దామనుకున్న నా పరిశోధన ఇన్నాళ్లకి వాస్తవ రూపం దాల్చినందుకు నాలోని అలసట అదృశ్యమై ఉత్సాహం ఉరుకుతోంది. ఉదయం మొదలైన మా నడక ఇంకా పూర్తికాలేదు, గమ్యం చేరలేదు.

"ఒక్కడినైతే ఎప్పుడో ఎక్కేసుందున్సార్" అన్నారు మాష్టారు. నిజమే....రోజూ నడిచే వాళ్లకి ఈ దారి అలసటనీయదు. నా మనసులో మాటకి కొనసాగింపుగా మళ్లీ అన్నారు..."ఇక్కడోళ్లయితే ఒక్క గంటలో ఎక్కి దిగిపోతారు తెలుసాండీ" అని.

అదీ నిజమన్నట్టు... ఒక మానవ సమూహం మమ్మల్ని దాటుకుంటూ వెళ్లి పోతోంది... వడి వడిగా అడుగులు వేసుకుంటూ. ఒక తల్లి...భుజానికి వేలాడుతున్న బిడ్డ. తలపై బరువైన కర్రల మోపు. తండ్రి...భుజానికి రెండు వైపులా కావిడి. దేహాల పై నామ మాత్రపు గుడ్డలు ఆచ్ఛాదనగా వున్నాయి. అవి చెమట తోనూ, మట్టి తోనూ నిండి వున్నాయి. తల్లి భుజానున్న పిల్ల కాకుండా మరో ఇద్దరు పిల్లలు నడుస్తూ వున్నారు.... నగ్న దేహాలుగా.

మాష్టారి చేతిలో పాలిథీన్ కవర్ వుంది. అందులో జెండా కాగితాలు, పురి కొసలు, చాక్లెట్లు, బిస్కెట్లు వున్నాయి. మరో చేతిలో వాటర్ బాటిళ్లు, టీపొడి. గుడ్ డే బిస్కెట్ పేకెట్లు, కొన్ని రికార్డ్స్ గల సంచీ వుంది. రేపు ఆగష్టు పదిహేను. ఏ రోజు తప్పినా రేపు మాత్రం తప్పక కొండ ఎక్కాల్సి వుందన్నారు మాష్టారు. గతంలో వున్న మాష్టారు ఎప్పుడూ బడికి వెళ్లేవారు కాదని సస్పెండ్ చేసారట. అందుకనే తనని అక్కడకి బదిలీ చేసారని చెప్పేరు మాష్టారు. ఆ వూర్లో స్కూల్ బిల్డింగ్ లేదట. ఎవరి గడపలోనో నులక మంచమేసుకొని పిల్లలకి అక్షరాలు దిద్దిస్తూ వుంటారని చెప్పారు.

మేము తిరగాల్సిన చింత చెట్టు మలుపు దగ్గరకొచ్చాం. ఒక్క సారిగా నా కాళ్లు వాటంతటవే ఆగిపోయాయి. అక్కడితో దారి కనిపించ లేదు. ఎటు పోవాలో నాకు అర్థం కాలేదు. వెనక్కి తిరిగి ఆశ్చర్యంగా మాష్టారి వైపు చూసాను. 'దారేది?' అన్నట్టు.

నావెనకే నిశ్శబ్దంగా నడిచొస్తున్న మాష్టారు 'ఏమైంది' అన్నట్టు చూసి ఆగేరు. చినుకుల సవ్వడి చిత్రంగా వినిపిస్తోంది. ఒంట్లోని చిరు చెమట, ఆపై చిన్న అలసట. ఎదుట దట్టమైన అడవి... తనలో లోపలికి రా..రమ్మని ఆహ్వానిస్తున్నట్టు.

"ఇదిగోండి... ఇలాగ సార్." అని నవ్వుతూ ఒక పొదల క్రింది నుంచి దూరేరు. అతని వెనుకే నేను. దారి మరింత సన్నబడింది. సన్నబడి.. కొండ పై పైకి ఎగబాకుతోంది. ఎంత పైకంటే... దారి నా ముడుకులికి తగులుతోంది. ప్రక్కనున్న కొండ తుప్పలు, కొమ్మలు ఊత పట్టుకొని పైకి... దీన్ని 'నడక' అనడం కంటే...'ట్రెక్కింగ్' అనడం సబబు. ఎప్పుడెక్కిందో ఎండ.... సూర్యుడి ఆఖరి చూపుల్లో వుంది కొండ. గమనించలేదు గానీ చిన్నగా చలివేస్తోంది. చినుకులు ఎప్పుడో ఆగిపోయాయి. ఒంటికి పట్టిన చెమట ఎప్పుడో ఆరిపోయింది. అంతదాకా హాయినిచ్చిన గాలి లోలోపలి ఎముకల్ని కొరకడానికి సిద్ధమవుతున్నట్టనిపిస్తోంది. చిత్రమైన వాతావరణపు అనుభూతి. ఇది ఫలానా కాలం అని చెప్పడానికి వీలులేని ఓ కొత్త రకపు అనుభవం. బహుశా ప్రకృతి ఒడిలోకి... కాదుకాదు.... గుండె లోలోతుల్లోకి ప్రయాణిస్తున్నపుడల్లా ఇలాంటి అనుభూతి ప్రతి ఒక్కరికీ తప్పదేమో.

ఎక్కడి నుంచో ఏ పురాతన ఆదిమానవ రాగంలోనో ఆలపిస్తున్నట్టు వేణుగానం వినవస్తోంది. పశువుల అలికిడి, ఆపై మానవ సంచారపు ఆనవాళ్లు. అంతదాకా ఆవహించిన అడవి క్రమంగా మాయమౌతున్నట్టు. దారి విశాలమయ్యింది. పెంట కుప్పలు ప్రత్యక్షమయ్యేయి. కోళ్లు, మేకలు ఎదురయ్యేయి. అంత దాకా పరిమళించిన గాల్లో తేడా తెలియ వచ్చింది. కుక్కల అరుపులు కూడ వినవచ్చేయి. ఊరు దగ్గరౌతోందేమో... అడుగులు మరీ నెమ్మదించేయి. నాలో ఆతృత. ఎన్నో మైళ్లు ప్రయాణించిన తరువాత ఓ కొత్త లోకానికి

చేరువవుతున్నపుడు ప్రతి బాటసారి మనసు ఇలానే ధ్వనిస్తుందేమో. గత కొన్ని గంటలుగా నన్ను ధరించిన అడవి, పొరలు పొరలుగా పల్చబడి కొంత విరామ మిస్తూన్నట్టు .. ఎదురుగా కొన్ని ఇళ్లు.

“ఇదేనా వూరు?” అడిగాను వెనక్కి తిరక్కుండానే. నా చూపులు ఊరు కోసం వెతుకుతున్నాయి.

“ఇదే సార్... గానీ ఇంకా కిందకి దిగాల” అన్నారు మాష్టారు.

“ఇంకానా?” అని ఆశ్చర్య పోయాను. మరింత నిరుత్సాహానికి లోనౌతూ.

“ఇవన్నీ పశువుల శాలలు సార్. ఆ కిందకి కనిపిస్తోందా... అది... ఊరు” అన్నారు

మాష్టారు నన్ను ఓ గడప ముందున్న నులక మంచం మీద కూర్చో బెట్టి, రాత్రి భోజనాల ఏర్పాట్లు చేయడానికి వీధి చివరికి వెళ్లిపోయారు. కరెంటు దీపాలున్న గడపల్లోంచి సీరియళ్ల పాటలు యమ సీరియస్‌గా వినిపిస్తున్నాయి. మరో గడప లోంచి ‘సోనూనిగం’ గొంతు కూడా విన వస్తోంది. కొంత మంది యువకులు రిథమిక్ గా డాన్స్ చేస్తున్నారు. జీన్స్‌లో టాప్ లెస్ గా వున్నాడో కుర్రాడు. అత్యంత వేగంతో ఏ సినీ హీరోకీ తీసి పోనంతగా నడుమూపుతూ అభినయిస్తున్నాడు (అతని గురించి వివరాలు మాష్టారిని అడిగితే... టెన్త్ ఫెయిలయిన కుర్రాడని తెలిసింది). చాలా మంది నోట్లో గుట్కాలు. కుర్రాళ్లు షార్ట్‌ల్లోనూ ముసలాళ్లు గోచీలతోనూ. కొంతమంది చేతుల్లో సెల్ ఫోనూ.

ఇంత మారు మూల ఇలాంటి వాతావణం నేనూహించనిది. నేను నా ఆలోచనల్లో ఉండగానే మాష్టారు వచ్చేరు. అతనితో ఒక పొడవైన సన్నని వృద్ధుడు వున్నాడు.దూరం నుంచి చూస్తే నగ్నంగా నడిచొస్తున్న మానవ దేహంలా అనిపించేడు. దగ్గరయ్యాక తెలిసొచ్చింది అతని వొంటిమీద గోచీ గుడ్డ వుందని. అతన్ని నాకు పరిచయం చేసారు. అతని మాటల్లో తెలిసిందేమిటంటే అతనావూరికి పెద్ద అని. నన్ను పరిచయం చేసారు మాష్టారు.

“తాతా నీ పేరు?” అడిగాను.

"ఇండియా" అన్నాడు.

ఆశ్చర్యపోయేను. మళ్లీ అడిగాను. అతను అదే చెప్పాడు.

"పేరేంటీ చిత్రంగా వుంది" అన్నాను

"ఈ పేరుకే ఇలాగైతే 'రేడియో' అని ఇంకొకడున్నాడు సార్" అని చుట్టు ప్రక్కలా చూసేరు మాష్టారు అతనికోసమన్నట్టు.

"అది సరే కానీ... ఊరందరితో కొద్దిసేపు మాట్లాడొచ్చా?" అని అడిగాను.

"మాట్లాడండి... ఈ రాత్రంతా మీ ఇష్టమే. ముందిది చెప్పండి." అని ఏదో రహస్యం చెప్తూన్నట్టు ముందుకు వంగేరు నావైపు. నేను ఆశ్చర్యంగా ఏమిటన్నట్టు చూసేనతని వైపు.

అతని వైపు చూసేను. ఇందాకా 'సోనూనిగం' పాటకి డాన్స్ చేసిన జీన్ ఫేంట్ కుర్రాడు. కళ్లెర్రబడి వున్నాయి. నోట్లో ఏదో నములుతున్నాడు.

"మీరేమైనా పుచ్చుకుంటే.....?!" అని నాన్చేరు

"అంటే..?"

"ఎప్పుడూ నడనోలు... కొండెక్కేరు. అలిసిపోయేరు గదా ...."

"మీ బ్రాండేదో సెప్పీ గురువా?" అని ఒక కుర్రాడు కుండ బద్దలు గొట్టీసాడు.

నవ్వుతూ తిరస్కరించబోయి... "ఏమేం దొరుకు తాయో...!!" నాలో కుతూహలాన్ని లోలోపలే అణుచుకొని అడిగాను.

"ముందు మీకేటి కావాలో చెప్పు గురువూ!" ఆ కుర్రాడే అన్నాడు.

నిజానికి మందులో ఏ బ్రాండులుంటాయో నాకైతే అప్పటికప్పుడు గుర్తురాలేదు. ఓ మిత్రుడి మాటల్లోని బ్రాండ్‌ని చెప్పాను.

"రోయల్ స్టాగ్"

"ఓసదేనా..." అంటూ ఆ కుర్రాడు వెనుతిరిగి పోయాడు.

"ఆ కుర్రాడి పేరేంటీ ?" ఎందుకో అడగాలనిపించింది.

"హృతిక్ రోషన్" మాష్టారు చెప్పారు.

నాకు మరీ ఆశ్చర్యమనిపించింది. "అదేంటీ?అదో బాలీవుడ్ హీరో పేరు కదా...ఈ మద్యే వీడేమైనా పేరు పెట్టుకున్నాడా?" అడిగేను.

'అదా ఊర్లో సొంత పేర్లుంటాయి సార్, కానీ స్కూల్లో కెల్లీసరికి రిజిష్టర్లలో మేష్టులు మార్చేస్తారు" అని కాసేపాగి... " సచినూ, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, సిమ్రాన్, సౌందర్య, సోనాలీ... వీళ్లందరూ మా స్కూల్లో వున్నారు సార్"

అప్పటికి మాచుట్టూ మరి కొంత మంది చేరేరు. చాలా మంది అర్ధనగ్నంగానే వున్నారు. సచినూ, చిరంజీవీ, వెంకటేషు, సిమ్రాను, సౌందర్యలు కూడా బట్టల్లేకుండా నా ఎదురుగా నిలబడి వున్నారు.

"సరే... మీ వూరికి మాష్టారు కాకుండా ఇంకెవరైనా ప్రభుత్వ ఉద్యోగి వచ్చేరా?"

"ఒక ఏయెన్నెమ్ వుందండీ. ప్రతీ రెండో శని వారం రావాలండీ. ఏదో ఒక నెలలో వస్తాది సార్." నేనేదడిగినా మాష్టారే సమాధానం చెప్తున్నారు.

"మీ ఊరికి ఏయెన్నెమ్ ఎన్ని సార్లు వొస్తుంది? మీకెవరికైనా జ్వరమో, జలుబో చేస్తే ఏం చేస్తారు?"

"ఆ యమ్మ వొస్తాది బాబు. ఒచ్చి అదిగాద ఆ 'తోయికి చిన్నడి'కి మాత్రలిచ్చేసి ఎల్లిపోతాది. కడుపుతోనున్నోల మాత్రలు మల్లా ఆడికే ఇచ్చేసి ఎల్తాది బాబు."

"మరి ఏదైనా అర్జెంటు కేసైతే ఏమి చేస్తారు?"

"డోలీ కట్టి దించుతాము మరేటి? అదా ఆ ముసిలోడికి రేపు కొండ దించాల" అని ఓ గడప వైపు చూపించేడు ఇండియా తాత. అటు చూసేను. చీకటి గడప లో కుక్కి మంచం మీద ఒక మానవ దేహం. చిరిగిన హాష్టల్ దుప్పటి కప్పుకొని. కింద కుంపటిలో నిప్పులు రాజుకుంటూ, కొన ఊపిరితో కొట్టిమిట్టాడుతున్నట్టు.

"ఏమైంది?" అడిగాను ఆతృతతో.

"మరేటౌతాది బావు... ఈ కొండల మీద ఏ మరిడో, దెయ్యమో పట్టి వుంటాది" అన్నాడు. దగ్గర కెల్లి చూసేను. జ్వరమే. కానీ ఎక్కువగా వున్నట్టుంది.

"మాత్రలేమైనా వేసారా?...ఎప్పటి నుండి?" అడిగాను ఇండియా తాతని.

"వారమైతుంది బాబు... కిందటి శని వోరం ఆ యమ్మొచ్చి సూది గుచ్చి, అదా ఆ పొట్లం నింద మాత్రలిచ్చి ఎల్లింది. తగ్గిపోతాదిలే అనన్నాది" అదేదో సర్వ సాధారణమైనట్టు చెప్పేడు

"మరి... ఈ లోగా ఏమైనా అయితే?"

"ఏటౌతాది? సస్తే.... సచ్చిపోతాడు. ఆడికీ భూమ్మీద నూకలింతే అని నిప్పెట్టెస్తామా మరేటి!!!" ఏమీ కానట్టు చెప్పేడు

మరణం ఇంత సహజమా? మరీ ఇంత దగ్గరగా వుంటుందా మరణం!!!

మంచంమీది ముసిలోడి మూలుగు వినపడింది మరొకసారి. ఎజ్జురాల్ని పిలిపించేరు. ఆమె మంచం కింది కుంపటిని బయటకి లాగి, నిప్పుల్ని చెయ్యితో రేపి గుగ్గిలం వేసింది. పొగ కమ్ముకుంది గడపనిండా. ఎజ్జురాలు ఏవో మంత్రాలు చదువుతూ ముసిలోడి నుదుటి మీద పసరు రాసింది. గడపలో కూర్చున్న వాళ్లకి ధైర్యం చెప్పి వెళ్లిపోయింది. చిన్న దోమకాటుతో ఒక నిండు ప్రాణం బలైపోవడం.... అదీ ఈ ఆధునిక యుగంలో!!? ఇన్నేళ్ల నడకా... ఇంతటి విజ్ఞా నమూ... ఏమి మాట్లాడాలో తోచలేదు నాకు. కాసేపు మౌనంగా వుండి పోయేను. నాతో బాటూ నా పరిసరాలూ నిశ్శబ్దాన్ని పాటించేయి.

"రేపెలాగైనా అతన్ని హాస్పిటల్ లో చేర్పించాలి" అని ముక్కు మూసుకున్నాను. అసంకల్పితంగానే నా చేతి రుమాలు నా ముఖం మీదికి తీసుకున్నాను. అంతదాకా నేను గమనించలేదు గానీ ఏదో దుర్వాసన వస్తోంది ఇంటి లోపలినుంచి.

"ఏమిటా దుర్వాసన?" అనడిగాను మాష్టారిని.

"మొన్ననే 'ఆగం' పండుగచేసేరు గదా!" అన్నారు.

"అంటే?" అన్నాను అర్థం కాక.

"మరేమీలేదు సార్! ఆ పండుగ రోజు ఏ ఆవునో, గేదెనో బలిచ్చివుంటారు. ఆ మాంసం చుట్టాలందరికీ వండిపెట్టగా మిగిలింది

ఎండబెట్టి వుంటారు, ఆ తర్వాతెప్పుడో ఉడకబెట్టి వండి తినడం కోసం ఇంటి పెణక్కి దోపి వుంటారు. అదిలా వాసనొస్తూ వుండి వుంటుంది.” అని వివరించేరు. ఇంటిలోపలికి అడుగు పెట్టేను ఇంటి గోడకానుకొని కర్రల పొయ్యి వెలుగుతోంది. దానికి పై భాగాన ఇంటి పెణక్కి రెండు కొసలు కట్టి వున్న ఒక కర్ర వేలాడుతోంది. దానికి మాంసం ముద్దలు వేలాడుతున్నాయి, నల్లగా భయం గొలుపుతూ, దుర్వాసన వెదజల్లుతూ.

ఒళ్లు జలదరించింది. రాతి యుగం నాటి చరిత్రపుటలు నా ముందు ఒక్కొక్కటి గా కళ్లముందు కదలాడినట్టైంది.

“ఇదే ఇంటిలో గత నెల నలుగురు చనిపోయారు ” అన్నారు మాష్టారు

“నిజానికి ‘డయేరియా’ సార్. కానీ వీళ్లంతా ‘సిల్లింగి’ అని అనుకుంటున్నారు” మాష్టారు ఏదో చెప్తూ వున్నారు.

నాలో నిశ్శబ్దం ఇంకా విస్తరిస్తోంది...ఎన్నో ప్రశ్నలు. ఆధునిక మానవుడు ఎంత దూరం ప్రయాణించేడు? ఇక్కడి ఈ ఆదివాసీ ఆధునికుడికి ఇంకా ఎంత దూరంలో వున్నాడు? ఆత్మశోధన చేసుకోవాల్సిన పాలకులు వేస్తున్న అడుగులు ఎటువైపు?

“రండి సార్!” అని మాష్టారు పిలవడంతో ఇంటి బయటకు అడుగులేసాను.

“మీరెప్పుడైనా ఓటు వేసారా?” అడిగాను ఊరి వాళ్లని చూస్తూ. ఈ దేశ ప్రజలకు ప్రజాస్వామ్యం ప్రసాదించిన తొలి వరం కదా ఓటు!!!

“ఏసినాము. దొంగోట్లు ఏసినామే మరి”

“అదేంటి?” అని అడిగితే పెద్ద కథే చెప్పేరు. ముందు గుర్తింపు కార్డుల్లేవన్నారట. ఆ తరువాత కార్డులొచ్చాక ఫోటోలు వాళ్లవి కావు అన్నారట. అవీ సరి చేసాక ఓటు వెయ్యడానికి వెళ్లే సరికి ఆ ఓట్లు అప్పటికే ఎవరో వేసేసారట.

ఇండియా తాత కళ్ల లోకి సూటిగా చూసేను. అతను నావైపూ చూసేడు, ‘ఇంతకీ ఈ దేశంలో మేమున్నట్టా లేనట్టా?’ అని ప్రశ్నిస్తున్నట్టున్నాయి అతని చూపులు.

"సారూ... వంట రెడీ. తినీసి మాట్లాడుకుందుముగని రండి" అని పిలిచేడు జీను ఫేంటు  హృతిక్ రోషన్.

లేచి భోజనాలకు తయారయ్యేము. వేడి వేడి అన్నం, వంకాయ జునుముల కూర, చింత పులుసు. వడ్డించడానికి ముందు హృతిక్ రోషన్ వచ్చి నాముందు ఒక రాయల్ స్టాగ్ సీసానీ రెండు ప్లాస్టిక్ గ్లాసుల్నీ వుంచేడు. నవ్వుతూ తిరస్కరించేను, బలవంత పెట్టేడు 'అలవాటు లేద'ని తిరస్కరించీ అడిగాను "ఇవి ఎక్కడినుంచీ వొస్తాయ'ని. "ఒకప్పుడు ఇలాంటివి అమ్మడానికి షావుకారొక్కడే వుండోడు బాబూ... ఇప్పుడలగ కాదు మాలోన మల్లా షావుకారులు కొత్తగా పుట్టుకొచ్చినారు బావూ" అని జవాబిచ్చేడు. ఆశ్చర్యపోవడం నావంతైంది.

"మీ ఎమ్మెల్యే ఎవరో తెలుసా మీకు?" అడిగాను.

"తెలుసు" అన్నాడు ఇండియా తాత. అతని గొంతులో ఏదో తేడా వుంది. అది గుర్తించేను.

"ఎవరూ?" అన్నాను

"పేరు తెలేదు.... గానీ ఒకటి ఎరుగుదును" అని ఆగేడు. అతని వైపు నిశ్చింతగా చూసేను. "ఆడు కొండోడు మాత్రము గాదు"

ఇది ఎస్టీ నియోజక వర్గం. దీనికి ఎన్నికైన నాయకులు ఎస్టీలు కాదనే అభియోగాలు ఎదుర్కొంటున్నారన్న సంగతి గుర్తొచ్చింది. కోర్టు తీర్పుల్ని సవాలు చేస్తూ వాయిదాలతోనూ స్టేలతోనూ కాలం గడుపుతూ ఎన్నికల్లో గడిపేయడం.. దానికి ఏ పార్టీ కూడా మినహాయింపు కాక పోవడం.. నిజమైన గిరిజన అభ్యర్థులు ఎన్నికల్లో గెలవలేకపోవడం అన్నీ ఒక్కొక్కటిగా గుర్తుకొచ్చేయి.

భోజనాలు పూర్తి చేసాక వీధిలో మంచాలు వేసేరు. పైన వెన్నెల. సముద్ర మట్టానికి వేల అడుగుల ఎత్తులో అడవి మధ్య.... ఆకాశానికి సగం దూరంలో. ఏదో జోల పాట పాడుతూ  ఊయలూపు తోంది గాలి. వీధిచివర హృతిక్ రోషన్ ఇంకా ఊపులోనే వున్నాడు.

మాష్టారు వీధిలోకి నడిచి వెళ్లేరు. రేపటి కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొంత మంది పిల్లల్ని పిలిచి ఏవో సూచనలు

ఇస్తున్నారు. మాష్టారి మాటల్లో నాకు తెలిసిందేమిటంటే ఈ వూర్లో జాతీయ జెండా తొలిసారిగా ఎగురుతోందని.

కళ్లు మూసుకున్నాను. ఆరు దశాబ్దాలు వయసు గల జెండా. ఈ కొండ మీద మొట్ట మొదటి సారిగా ఎగరబోతోంది. ఇన్నేళ్ల ఈ స్వతంత్ర్య భారతదేశంలో ఈ ఆదివాసుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందో!!! వీళ్ల సంస్కృతీ సంప్రదాయాలు మాత్రం ఇప్పటికే అంతరించే దశలో వున్నాయి కదా!! ఆదివాసుల్ని మనుషులుగా ఈ సభ్య సమాజం ఎప్పుడు గుర్తిస్తుందో...!!! దశాబ్దాల క్రితం ఈ నేల మీద జరిగిన పోరాటాలు వృధాయేనా? ఆ పోరాట ఫలితాలు ఎంతమంది అనుభవిస్తున్నారు?

నాకళ్ల ముందు బాన కడుపులతో ఒంటిమీద నూలు పోగైనా లేకుండా నిలబడి వున్న ఈ వూరి బడి పిల్లలూ, ఇండియా తాత, అతని లాగే వున్న వూరి ప్రజలు ఓ వైపు కనపడుతూ వుంటే, మరో వైపు రెపరెప లాడుతూ రేపు ఎగర బోయే మూడు రంగుల జెండా కనపడుతూ వున్నాయి. వీళ్లకి ఏమి ఇవ్వాలి? ఏమిస్తున్నాము? అసలు వీళ్లకి కావలసిందేమిటి???

ప్రశ్నలు గుచ్చుకున్నట్టు... నా ఒంటి పై గాయం చేస్తున్నట్టు.

కళ్లు తెరిచి చూసేను. నన్నెవరో తట్టి లేపుతున్నారు. కళ్లు నులుపు కుని చుసాను. ఎదురుగా మాష్టారు.

"ఏమైంద'ని అడిగాను.

"పిలుస్తున్నారు సార్" గుస గుసలాడుతున్నట్టు చెప్పేరు

"ఎవరు?" అన్నాను లేచి కూర్చుంటూ.

"వాళ్లు" అన్నారు ఇంకా దగ్గరికొచ్చి

"అంటే?"

"మీకేం బయం లేదు, నీనున్నాను గదా... రండి" అని నా చెయ్యి పట్టుకుని లాగినంత పని చేసేరు.

అంత దాకా లేని 'భయం' నన్ను నిలువెల్లా ఆక్రమించింది. ఏమి చెయ్యాలో తెలీలేదు. వాళ్ల గురించి ఎప్పుడూ వినడమే కానీ ఎప్పుడూ చూడలేదు. ఈ పరిస్థితి వొస్తుందని గతంలో ఎప్పుడూ

ఊహించలేదు. లుంగీ సర్దుకుని నా చెప్పుల్లో కాలు పెట్టేనో లేదో వాళ్లే ఎదురయ్యేరు. సుమారు ఇరవై మంది వుండొచ్చు. ఆలివ్ గ్రీన్ యూనిఫాం లో. ఒక్కొరి చేతిలో నల్లటి ఆయుధాలు. భుజాన బరువైన కిట్ బేగులు.

"నమస్కారండి" రెండు చేతులూ జోడించేను ఏమి చెయ్యాలో తోచక.

"లాల్ సలామ్... అన్నా!" అని బిగించిన పిడికిలిని గాల్లో లేపేడొకరు.

నేను కూడ అలానే అన్నాను. పైకి లేచిన నా కుడి చేయి సన్నగా వణకడం నాకు తెలుస్తూనే వుంది. తిరిగి నేను పడుకున్న మంచం వద్దకే నడిపించేరు మమ్మల్ని. నేను ఒక మంచం పైనా, కొంత మంది నా ఎదుట మంచం పైనా కూర్చున్నాం. నా ఎదుట ఇరికిరుకుగా కూర్చుని వున్నారు. నాకు తోడుగా మాష్టారుంటారని అనుకుంటే అతను వాళ్లతో నా ఎదురుగా వున్నారు. చాలా మంది మా చుట్టూ కాపలాగా....పొజిషన్‌లో.

"మీరు?" అని ప్రారంభించేడొకరు. బహుశ అతను నాయకుడై వుంటాడు.

చెప్పేను. ఒక్కొక్కరి  పరిచయం...కరచాలనాలు.. కుశల ప్రశ్నలూ...సరదానవ్వులూ. మా చుట్టూ మూగిన ఊరు.

"ఈ హడావిడేమిటీ" మంచం మీద వెనక్కి చేరబడుతూ అడిగాడు సడెన్‌గా.  మాష్టారు చెప్పారు నవ్వుతూనే.

"జెండా?... స్వాతంత్ర్యం!?" అతనదోలా నవ్వేడు. ఏమి చెయ్యాలో తెలీకా నేనూ నవ్వేను.

"ఈ దేశంలో ప్రజాస్వామ్యం అర్థం లేనిది. ఇన్నేళ్ల ఈ స్వతంత్ర దేశంలో పేదవాడు పేదవాడుగానే మిగిలాడు. ఇంకా చెప్పాలంటే దరిద్రుడై పోయాడు. కానీ ధనవంతుడు మాత్రం మరింత ధనవంతుడై ప్రజల సొమ్ము దోచుకోడానికి రాజకీయ నాయకుడిగా అవతారమెత్తి కార్పొరేట్ కనుసన్నల్లో ఈ దేశాన్ని పాలిస్తున్నాడు. ఇదేనా మీ ప్రజాస్వామ్యం?" అతని గొంతు గంభీరంగా వుంది. సూటిగా నావైపే

చూస్తున్నాడు. అతను నన్నే నిలదీస్తున్నాడా? నా ద్వారా రాజ్యాన్ని ప్రశ్నిస్తున్నాడా?

నాకేం చెప్పాలో అర్ధం కాలేదు. చుట్టూ చీకటి నిండిన నిశ్శబ్దం. మౌనంగా వుండిపోయేను.

"ఔనన్నా.. నిజమే" అన్నాను ఏమనాలో తోచక.

మాష్టారి వైపు చూసాను. అతనికి పరిస్థితి ముందే అర్ధమైనట్టుంది. మారుతున్న రంగుల్ని అతని ముఖంలో చూసేను.

"ఇలాంటి పరిస్థితిలో ఈ జెండాలకి ఎగిరే అర్హత వుందంటారా మిత్రమా?"అన్నాడు ఒక్కొక్క మాట నొక్కి పలుకుతూ.

" ..... " ఇంతకీ అతని ఉద్దేశ్యమేమిటో తెలీక మౌనాన్ని ఆశ్రయించేను.

చుట్టూ వున్న గ్రామస్తులు నావైపే చూస్తున్నారు. వాళ్లకి ఈ సంభాషణ ఏదీ అర్ధమవుతుందని నాకనిపించడం లేదు. నా మౌనాన్ని బట్టి నేనే దోషి నన్నట్టు అందరూ నావైపే చూస్తున్నారు.

"వీళ్లని చూడన్నా! వీళ్ల జీవితాల్లోకి ఒక్కసారి తొంగి చూడన్నా... వేల కోట్లు తినేసిన నేరస్తులు నాయకులై రాజ్యమేలుతున్న ఈ దేశంలో మనుషులు ఇలాగేనా వుండేది?" చుట్టూ వున్న వారిని చూపిస్తూ అన్నాడు.

నేనేం సమాధానం చెప్తానా అన్నట్టు నా వైపు అందరూ చూస్తున్నారు. కొంత మంది ముసి ముసి గా నవ్వుకుంటున్నారు. వాళ్ల అమాయకత్వానికి జాలేసింది. ఇతను నా నుండి ఏమి ఆశిస్తున్నాడో అర్ధంచేసుకోడానికి ప్రయత్నిస్తూ నేను నేల చూపులు చూసేను.

"అందుకే..." అని ఆగేడు. నేనతని వైపు చూసేను. "ఈ స్వాతంత్ర్య వేడుకల్ని బహిష్కరిస్తున్నాం. రేపు మీరు ఇక్కడ జెండా ఎగరేయడానికి వీల్లేదు." అని ముగించేడు. లేచి నిలబడ్డారు అంతా.

"అన్నా!" అని ముందుకొచ్చేరు మాష్టారు హఠాత్తుగా.

అందరు అతని వైపు చూసేరు... 'ఏమిట'న్నట్టు.

'జెండా ఎగరెయ్యక పోతే నా వుద్యోగం పోతుందన్నా...?" ఎందుకలా అడిగారో, లేదా ఏమి అడగాలో తెలీక అడిగారో గానీ మాష్టారు ధైర్యం చేసారు. దానికతను.... "జెండా ఎగరేస్తే... మీ ప్రాణం పోతుంది. ఉద్యోగమా? ప్రాణమా?? ఏది కావాలో మీరే తేల్చుకోండి" అని రెండడుగులు ముందుకేసి అగేడు.

నిశ్శబ్దం. ఆపై చీకటి. చుట్టూ అడవి.

"మీకంతగా ఎగరెయ్యాలని వుంటే ఇది ఎగరెయ్యండి" అంటూ మాష్టారి చేతిలో ఒక నల్ల గుడ్డని పెట్టి ముందుకు కదిలేడు. అతని వెంట అంతా నడిచి వెళ్లేరు. ఒక్కొక్కరూ ఒక్కొక్క నినాదమై.

మాష్టారూ, నేనూ ఎదురెదురుగా మిగిలిపోయాం. మా చుట్టూ ప్రశ్నల చీకటి. సందేహాల చలి. ఆ చీకటి రాతిరి మాష్టారి చేతిలో నల్ల జెండా లా ఎగురు తోంది.

"ఇంకా తొంగోలేదా గురువూ?" అని వినిపించింది. అటు చూసేం ఇద్దరం. చుట్ట ముట్టిస్తూ ఇంటి బయటకి వస్తున్నాడు... ఇండియా తాత. ఆ చీకటిలో అతన్ని చూసేను. అతని చేతిలో కర్ర వుంది. మొలకి గోచీ గుడ్డ వేలాడుతోంది. నోట్లో చుట్ట మాత్రం ఎర్ర గా మండుతోంది.

అర్ధరాత్రి దాటింది.

తెల్ల వారడానికి ఇంకా చాలా సమయం వుంది

తెల్లవారితే ఏ జెండా ఎగరాలో తెలీని సందిగ్ధంలో అడవి మీంచి చల్లని గాలి రివ్వున వీస్తోంది.

ఆ గాలికి ముసిలోడి మొల మీది మాసిన గోచి గుడ్డ మాత్రం రెప రెపలాడింది.

*(ఆదివారం, ఆంధ్రజ్యోతి-7,డిసెంబర్ 2014)*

# తార్రోడ్డు

**కొం**డ దిగి నాలుగడుగులు వేసేసరికి తార్రోడ్డు తగిలింది. కొత్తగా వేసింది. తారు వాసన ఇంకా గాల్లో తేలియాడుతోంది. తూరుపు దిక్కునుండి రాలుతున్న తొలికిరణాల్లో రోడ్డు నల్లగా నిగనిగా మెరుస్తోంది. రోడ్డు మీదికొచ్చి నిలబడ్డాను. ఇటూ అటూ చూసేను. ఎక్కడ మొదలయ్యిందో ఎక్కడ అంతమవుతోందో తెలుసుకోలేనంతగా నల్లగా, కొత్తగా వుంది రోడ్డు. కళ్లు చిట్లించి చూసేను. ఎందుకో ఆ రోడ్డు చీకటి వైపు అడుగులు వేస్తున్నట్టు కనిపించింది. మరో వైపు మనసు ఉత్సాహంగా గంతులేసినట్టైంది. ఎందుకంటే ఇక నుంచి ప్రయాణానికి ఇబ్బంది పడనక్కరలేదు. రోడ్డు బాగులేని కారణంగానే ఊరు ఈ ప్రపంచానికి కానిదైపోయిందిన్నాళ్లు. జ్వరమో, జబ్బో వస్తే డోలీలు కట్టి ఇద్దరు భుజాన మోసుకొస్తే గానీ రోగి హాస్పిటల్ కి చేరలేని పరిస్థితి ఇక వుండబోదు. రోడ్డు మా బతుకుల్లో ఒక వెలుగును నింపాలి ఇప్పటికైనా.

నిన్న నాన్న అన్న మాటలు నన్ను బాధిస్తున్నాయి. పదే పదే నన్ను నిలదీస్తున్నాయి. ఇన్ని రోజులుగా నాకు నేను వేసుకోలేని ప్రశ్నలు గుచ్చి గుచ్చి వేదిస్తున్నాయి.

తాగి తూలుతూ వచ్చేడు ఇంటికి. పొద్దుపోయి చాలా సేపయ్యింది. వీధిలోని కరెంటు స్థంబం జిగ్ మని వెలిగింది. గడపల్లో నిన్నాగిపోయిన సీరియళ్లు సాగడం మొదలయ్యాయి. రెండ్రోజుల కిందటే ఈనిన ఆవు మాత్రం ఇల్లు చేరలేదు. అప్పటికే నులక మంచాన్ని వీధిలో పరిచి చేరబడిపోయేడునాన్న. మంచమ్మీద నుంచి ఆకాశం వైపు చూస్తూ ఏదో బూతు పాట పాడుతూ దొర్లుతున్నాడు.

"బక్కేది నానా?" అడిగాను చిరాకుగా.

"నాకేటి తెలుసురా... నా కొడకా" అన్నాడు తల పక్కకి తిప్పి వుమ్మి వూస్తూ.

"బక్కనొగ్గేసి ఎక్కడ తిరుగుతున్నావైతే?"

"నీనొగ్గడం కాదురా అదే నాకొగ్గేసి ఎలిపోయింది. గెడ్డొడ్డున మేస్తుంది. గెడ్డత్తల కెల్లొచ్చేసరికి ఎటో ఎలిపోయింది" అన్నాడు ముద్ద ముద్దగా.నాకు అర్ధమైపోయింది. గెడ్డవతల సారా బట్టి వుంది. తాగడానికి వెళ్లినోడు ఆవు సంగతి మరిచి పోయి ఇల్లు చేరిపోయేడు. అదే మాట అనేసరికి నాన్న కి కోపమొచ్చింది.

"ఔన్రా... తాగేను. ఐతేటి?...తాగడం తప్పా? తాగకుండా నీనెన్నాలు బతికీయాల?"

"నోర్మూయ్యి నానా..." అన్నాను చికాగ్గా అడివిలో తప్పోయిన ఆవు దూడ గానీ ఏ జంతువుగ్గానీ దొరికిపోయిందేటోనని.

"నా కడుపున పుట్టి నాకే తిడతావురా.. నీ యమ్మ..." ఒక బూతు మాటతో మాటని పూర్తి చేసేడు.

నా కళ్లు చుట్టు ప్రక్కలా వెతుకుతున్నాయి. నాన్న మాత్రం ఏదో గొణుక్కుంటున్నట్టు... మత్తులో తనలో తాను మాట్లాడు కుంటున్నాడు.

"నీను బతికినన్నాలూ రాజు లాగ బతికినాన్రా! సెంటు బూవి

లేదు. సేతిల పైసా లేదు. నిర్భూసీగ బతికినాను. నీనే కాదురా కొడకా నిన్నూ ఇంతోడిని సేసినాను. నాకేటి కావాల్రా ఇప్పుడు? రేపోమాపో ఎలిపోయినోడిని. నువ్వు నాలాగ బతకగలవా? రేపు నీకొడుకుని నీకంట బాగా పెంచగలవా? ఆ నమ్మకం నీకీరోజున్నదా? సెప్పో"

ఆ మాటలు నేరుగా నా గుండెల్లోకి తాకేయి. ఆ ప్రశ్న మామూలుగానే కనపడుతున్నా కనుచూపుమేరా సమాధానం కనపడ్డం లేదు.నాన్న మాటల్లోని 'నిర్భూసీ తనం' తో నేడు బతకగలనా అనే సందేహం పదే పదే ఎదురౌతోంది.

వీపు వెనుక లెదర్ బేగ్ లోని సర్టిఫికేట్లు కళ్ల ముందు కదలాడేయి. నా గుండె బరువెక్కుతున్న కొద్దీ ఆ సర్టిఫికేట్లు ఎందుకో తేలికైపోతున్నట్టు అనిపించింది.

ఇన్నాళ్లూ నాన్నెలా బతికేడు? సెంటు భూమి లేక పోయినా కొండమీద పోడు చేసి బతుకు నెట్టుకొచ్చేసాడు. అదీ చాలక పోతే అడవి లోని చింతపండూ చీపుళ్లు, పనసపళ్లూ సీతాఫలాలో అమ్మి కుటుంబాన్ని లాక్కొచ్చేడు. నన్ను హాస్టల్లో పెట్టి ఇంతవాడిని చేసేడు. తీరా చదువుకుని నాలుగు సర్టిఫికేట్లు సంపాదించే సరికి భరోసా లేని బతుకైపోయింది. ఎందుకంటే నేనింతయ్యేసరికి లేని భూమి ఎలాగూ లేదు. అటవీ ఉత్పత్తులు అమ్మి బతుకుదామంటే అడవి తరిగిపోయి పూర్తిగా మైదానమైపోయింది. పల్లెటూర్లు టౌన్లుగా మారిపోయేయి. ఆ రోజు నాన్న రోజంతా కష్టపడి కుటుంబాన్ని ఎలాగైనా పెంచాలని రోజంతా శ్రమ పడే వాడు. ఈ రోజు నేను? చదువుకుని నాలుగు రాళ్లు సంపాదించాలని ఆఫీసుల చుట్టూ ఒక దరఖాస్తులా మారిపోయాను. దరఖాస్తు మీద సంతకం కోసం ఎదురుచూసే ఒకానొక బిచ్చగాణ్ణైపోయాను. ఏ పనీ చేయలేక శ్రమకు దూరమైపోయేను.

రోడ్డు మీద ఏదో వాహనం అలికిడైతే అటు చూసేను. మనుషులందరూ నాలుగు చక్రాల మీద మూటకట్టి దొర్లించు కొస్తున్నట్టు ఒక ట్రక్కరు వస్తోంది. అనడానికి అది వాహనం గానీ

దాన్ని మనుషుల మూట అంటే బాగుంటుందేమో! వాహనం కనబడడం లేదు. నిండా వేలాడుతూ జనం. అంతా గిరిజనం. పదిమందిని ఎక్కించే సామర్థ్యమున్న ట్రక్కు మీద యాభై మందిని వేలాడదీసుకొస్తోందా వాహనం.

ఈ కొత్త రోడ్లు ఇందుకు పనికొచ్చేయి. వాహనాలు పెరిగాయి. వాహనాల మీద ఇక్కడి గిరిజనులుని మోసుకు పోయి ఎక్కడికో తీసుకు పోవడానికి, దాని ద్వార గిరిజనేతరుడు రెండు చేతులా సంపాదించి మేడ మీద మేడలు కట్టు కోవడానికీ రోడ్లు పనికొస్తాయి.

చెయ్యెత్తకుండానే నాముందర ఆగింది. ఎక్కడ ఎక్కాలో తెలీక చూస్తూ నిలబడిపోయేను. చుట్టు పక్కలా అందరు వేలాడుతూ వున్నారు. కాళ్లు పెట్టడానికి కూడా స్థలం లేదు. అలాగని ఎక్కకుండా వదిలేస్తే మళ్లీ మధ్యాహ్నం దాకా మరే వాహనమూ రాదు. చుట్టూ తిరుగుతున్నాను. డ్రైవరు సైగ చేసేడు. బోనెట్ మీద ఎక్కమని. అప్పటికే అక్కడ నలుగురు కూర్చున్నారు. అక్కడ కూర్చుంటే పట్టుకోడానికి ఏ ఆధారమూ ఉండదు. డ్రైవరు కి దారి కనబడేట్టు బేలెన్స్ చేస్తూ ఎక్కాలి. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ముందుకు తూలి పోతాం. తప్పదు కాబట్టి ఎక్కాను. కాదు డ్రైవరు పైపునున్న ఇనప చువ్వకి వేలాడేను.

ఎటు వెళ్లాలో ఏమీ నిర్ణయించుకోలేదు. ఎక్కడికి చేరుకోవాలో తెలీడం లేదు. కోపం, బాధ. ఎవరి తోనైనా దెబ్బలాడితే బాగున్నట్టనిపిస్తోంది. వీపునున్న బేగులో వేలాడుతూన్న సర్టిఫికేట్లు ఎందుకూ పనికి రానివిగానూ, జీవితానికి సరిపడా భరోసా ఇవ్వలేనివిగానూ తోచేయి. జేబులో రెండొందలున్నాయి. అవి కూడ నిన్న సంతలో చింతపండు అమ్మి తెచ్చేడు నాన్న.

ఆగి ఆగి వెల్తోంది ట్రక్కు. ఎక్కేవాళ్లే గానీ దిగేవాళ్లు లేరు. అంతా మండల కేంద్రం లోనే దిగుతారు. మళ్లీ సాయంత్రమయితే గానీ ఈ ట్రక్కు రాదు. ఆకు పచ్చని కొండల మధ్యలోంచి మలుపులు తిరుగుతూ, ఎగుడు దిగుడు ల రోడ్డు... దానిమీద గుంపు గుంపులుగా

ప్రయాణం.నేను పుట్టినప్పటికి ఈ రోడ్డు కంకర రోడ్డు. దానికి ముందు బండి గోర్జి. అంతకు ముందు ఇది కాలిబాట. అంతకు ముందు అడివి. రోడ్డు వెడల్పు అవుతున్న కొద్దీ అడవి తరిగిపోతోంది. ప్రయాణం ముందుకు సాగుతోందా? వెనక్కా?

"కొత్తగూడ' దిగండి.."అన్న అరుపుతో పాటుగా ట్రక్కరు ఆగింది.

వేలాడిన వాళ్లందరు కిందికి దిగి చేతులకంటిన ఇనప తుప్పుని చూసుకుంటున్నారు . మరికొందరు సంచులు సర్దుకుంటూ వేలాడ్డానికి స్థలం పోకుండా ఇంకా అలాగే వుండిపోయేరు. రోడ్డుకి కుడి వైపున విశాలమైన ఆటస్థలం. ఆ తరువాత ఒక కూలిపోయిన భవనం. దానికవతల రెండంతస్థుల కొత్త భవనం. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల. నేను మూడో తరగతి నుండి పదోతరగతి దాకా చదువు నేర్పిన విద్యాలయం. పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు వచ్చి చేరుతున్నాయి కానీ ఒక్క ప్రహరీ గోడ లేక ఏ విద్యార్థి ఏ వైపునుండి ఎటు వెల్తున్నాడో మాష్టార్లకే కాదు ఆ దేవుడికి కూడా తెలీదు. ప్రతీ యేటా ఇలాంటి స్కూళ్ల నుంచి కొన్ని వందల మంది విద్యార్థులు విడుదలవుతూ వెళ్తుంటారు. ఐటీడీయేలో శత శాతం ఉత్తీర్ణత సాధించిన స్కూళ్లలో ఇదెప్పుడూ ముందుంటుంది. శత శాతం... శతశాతం... శతశాతం. అంకెలకే పరిమితమవడమే తప్ప పిల్లలకి స్వంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యాన్ని ఇవ్వగలుగుతున్నాయా అంటే అదీ లేదు.

పరీక్షలు ఎలా జరుగుతాయో గుర్తొచ్చాయి. పిల్లల్ని చూసి రాయించడానికి విద్యాసంవత్సరం మధ్యలోంచే ప్రయత్నాలు మొదలవుతాయి. దానికోసం వార్డెన్లు ఎక్కువ మొత్తంలో ఖర్చు చెయ్యాల్సి వస్తూంటుంది. దానికోసం పిల్లల మెనూలోంచి కత్తిరింపులూ, ఏమైనా అడిగే పిల్లలుంటే 'మీ రెలా పాసవుతార్రా?' అని బెదిరింపులు.... అన్నీ గుర్తొచ్చేయి. ఆ రోజుల నుండి ఈ రోజు వరకూ పిల్లలకు కావలసింది ఎలాగోలాగ పాస్ అవడం. మాష్టార్లకి కావలసింది ఎలాగో ఒకలాగ శత శాతం రిజల్ట్స్. ఎవరికి కావలసింది

వాళ్లు చూసుకుంటూ ప్రతి యేట నాలాంటి వందల మంది గిరిజన విద్యార్థుల్ని త..యా..రు..చే..స్తోం..ది. వీళ్ళంతా ఇంటర్మిడియట్‌లో చేరుతున్నారా? చేరిన వాళ్లు ఎలా పాస్ అవుతున్నారు అన్న ఆలోచన చేస్తే... అక్కడ కూడ శతశాతం కోసం ఇంకా ఎక్కువ ఒత్తిడి వుండడం వల్ల ఇంకా బాగా కాపీల్ని ప్రోత్సహిస్తూ కాలేజీలు స్కూళ్లకి మాంచి పోటీ ఇస్తున్నాయి. అలా అక్కడా పాస్ చేయించే బాధ్యత ను తీసుకుని రాబోయే తరాల్ని ఎంత నిర్వీర్యం చేస్తున్నాయో ఆలోచిస్తే భయమేస్తుంది.

నాకు తెలుసు... పదో తరగతి డిష్టింక్షన్లో పాసైన విద్యార్థి కి కార్పోరేట్ కాలేజీల్లో అధిక ఫీజులు చెల్లించి చేర్పిస్తే అక్కడ ఇంగ్లీషుని అర్థం చేసుకోలేక, అక్కడి వేగాన్నీ అందుకోలేక కాలేజీ మానేసి ఉపాధి హామీ పనులు చేసుకుంటూన్న నా తోటి వాళ్లు నాకు బాగ తెలుసు.

ట్రక్కరు వేగం పెరిగింది. ఎదురుగా ఒక బస్సు. వేగంగా దాటి పోయింది. ఒక్కసారిగ కుదుపు తో వంపు తిరిగింది ట్రక్కరు. డ్రైవరు ఒక్క బూతు తిట్టి రోడ్డు సైడుకు తీసి ఆపేడు. రోడ్డు సైడునుంచి తలమీద బరువులతోసంతకు నడిచి పోతున్న గిరిజనులు గతుక్కుమన్నారు. గేరు మార్చి మళ్లీ రోడ్డెక్కించేడు. కొందరు అతన్ని పొగుడుతున్నారు. మరికొందరు బస్సుడ్రైవరుని తిడుతు వేలాడుతున్నారు.

మండల కేంద్రాన్ని చేరుకోడానికి మరో పది నిముషాలు పడుతుంది. అక్కడి నుండి పార్వతీ పురం చేరుకోవడానికి బస్సులో వెళ్లాలంటే రెండు గంటల ప్రయాణం. ఐటీడీయే కి వెళ్లి అక్కడ పోష్టులేమైనా ఉన్నాయేమో అడగాలి. వీలైతే ఒక అప్లికేషను పెట్టి రావాలి. మరో వైపు ఆ ఆఫిసు అంటేనే భయం పుట్టుకొస్తుంది.

డిగ్రీ పూర్తయ్యాక ఎంప్లాయ్‌మెంట్ సెల్లో పేరు నమోదు చేసుకోవడానికి వెళ్లేను. నా సర్టిఫికేట్లు ఎంప్లాయిమెంట్ కోసం రిజిష్టరు చేయండని దరఖాస్తు రాసి ఇచ్చేను. అక్కడున్న అధికారి మొత్తం చదివి “నువేం చదివేవు?” అని అడిగారు. చెప్పాను సర్టిఫికేట్ల జెరాక్సులన్నీ చూపించేను. అన్నీ చూసి “మరి... ఇన్ని తప్పులేంటయ్యా

రాతలో ?" అన్నారు. "డిగ్రీలు చేసీడం కాదువోయ్... దరఖాస్తు రాయడం రావాలి. ఇదే అవకాశాలు ఇతరులకిస్తే వాళ్లెంత అభివృద్ధి చెందుతారో తెలుసా? ఉపయోగించుకోండి.." అని హితబోధ చేసేరు.

ఆ వెళ్లడం కొత్తకాదు. మొదటిసారీ కాదు. ఎన్నో సార్లు ఆ వరండాలో తిరిగాను. ఎన్నో సార్లు అక్కడి మెట్లెక్కి దిగేను. ఎన్నో దరఖాస్తుల్ని పట్టుకుని ఆ చెట్లకింద పడిగాపులు కాసేను. ఐనా ఏదో భయం. అక్కడున్నవాళ్లు ఎవరూ తెలిసిన వాళ్లు కాదు. ఒక గిరిజనుడిగా అక్కడ అడుగుపెడితే ఒక్క గిరిజనుడూ కనిపించడు. ఒకరిద్దరు ఉన్నా ఏ అటెండరు గానో, డ్రైవరు గానో ఉన్నోలే కానీ అధికారిగా ఎవ్వరూ అక్కడ లేరు. నేను తరగతి గదిలో ఉన్నపుడు మాత్రం ఉపాధ్యాయులు "రేపు మీరు పీవోగానో, డీడీ గానో రావాలి" అని చెప్పేవారు. ఇప్పుడనిపిస్తూంది. ఎలా వస్తారు? కాకి లెక్కల కాగితాల కోసం ఈ బడులు చూసిరాతల్తో పనికి మాలిన భవిష్యత్తునిస్తుంటే. చెప్పుకోడానికి డిగ్రీలు... చేతిలో రెండు కాగితమ్ముక్కలు. ఈ ఆఫీసు ఎదుట దరఖాస్తులు రాసుకోడానికే. అవెప్పుడూ నాకు రేపటి గురించి భరోసా ఇవ్వలేదు. బతకగలనన్న నమ్మకాన్నీ ఇవ్వలేదు. ఈ చదువులు ఏ కానిస్టేబుళ్లు గానో, జీసీసీ సేల్స్‌మేన్లు గానో, హాస్టల్లో వంటకుక్కులు గానో తయారు చెయ్యడానికే పనికొచ్చేవి నిన్న మొన్నటి వరకు. ఈ రోజు అదీ లేదు. ఎందుకంటే తగిన ఉద్యోగావకాశాల్ని కల్పించకుండా ప్రతి యేడూ కొన్ని వేల మంది గ్రాడ్యుయేట్లని ఉత్పత్తి చేస్తోందీ ప్రభుత్వం.

కిందటి నెల ఒక అటెండరు పోస్టు కోసం నోటిఫికేషను ఇచ్చేరు. నేనూ దరఖాస్తు చేసేను. డిగ్రీ చేసిన నాకే వస్తుందని ధీమాతో ఉండిపోయాను. తీరా అది నాకు రాక పోయేసరికి ఆశ్చర్య పోయి ఇందులో ఏదో కుట్ర వుందని అడిగాను. అప్పుడు చెప్పారు కదా! ఆ పోస్టుకి రెండు వేల అప్లికేషన్లు వొచ్చేయని. అందులో అందరు గ్రాడ్యుయేట్ల తో పాటు పోస్టుగ్రాడ్యుయేట్లు కూడ వున్నారని. వాళ్లలో మెరిట్ చూసి ఒకరికి అప్పాయింట్‌మెంట్ ఆర్డరు ఇచ్చేసారని.

అయితే... చదువుకున్నది ఉద్యోగానికేనా? ఉద్యోగమంటే జీతమొచ్చేదేనా?

ఊరికి కిలోమీటరు ముందు మామిడి చెట్టు కింద ఆపేసాడు ట్రక్కు. టిక్కెట్లు వసూలు చేస్తున్నాడు. వేలాడినా, కూర్చున్నా ఒకటే చార్జి. ఊర్లోకి వెళ్లాలంటే పోలీసు స్టేషను ముందునుంచే వెళ్లాల్సి ఉంటుందని, వెళ్తే ఫైను కింద నెల రోజుల రాబడి వసూలు చేస్తాడని ట్రక్కరు వాడికి తెలుసు. దిగిపోయిన వాళ్లు అడ్డగా సంత దరి నుంచి నడిచి వెళ్లి పోయేరు. మరికొందరు  బస్సు కెళ్లే వారు సీట్లు దొరుకు తాయని ఇక్కడే దిగి పోయారు. మొత్తంగా ట్రక్కరు వేలాడే వాళ్లు కాకుండా కూర్చునే వాళ్లతోనే కదిలింది. ఎంపీడీవో ఆఫీసు దాటుకుంటూ వెళ్తోంది. నాకు తెలీకుండానే నా గుండెల్లో వణుకు సన్నగా మొదలయ్యింది. ఏ ఆఫీసరు ఎదురై లోను బకాయి కట్టమంటాడోనని. ఇక్కడి పోష్టుమాను కనపడి నోటీసులెక్కడ అందిస్తాడోనని గుండెల్లో సన్నని భయం.

ఆ రోజు నిరుద్యోగ గిరిజన యువకులకు ట్రైకార్ ఋణాలు ఇస్తాం., అప్లికేషను పెట్టుకోండని ఊర్లోకి కబురొచ్చింది. ఆ పేరెప్పుడూ వినలేదు. అసలు ఋణమంటేనే తెలీని నాకు ఆ పదాన్ని నేర్పింది ఐటీడీయ్యేనే. అందరితో పాటూ నేనూ కాగితం రాసిచ్చేను. మరి కొద్ది రోజుల తర్వాత మళ్లీ కబురొచ్చింది. నాకు ట్రాక్టరు యూనిట్ మంజూరయ్యిందని. కానీ డౌన్ పేమెంట్ కొంత కట్టాలని.'చేతిలో సిల్లిగవ్వలేదని నీనేడుస్తుంటే  పేమెంటు చెయ్యమంటే ఎక్కడికెల్లి తేవాలి?' అప్పుడొచ్చేడు మా వూరి పాత షావుకారి. అతను మా చిన్నతనంలో వ్యాపారం చేస్తూ  మా ఊర్లోనే వుండేవాడు. హఠాత్తుగా ఓ రోజు అతను ఆస్తుల్నీ, ఇల్లునీ అమ్ముకుని విశాఖపట్నం వెళ్లిపోయేడు. ఎందుకెల్లి పోయేడో మా వయసులో ఉన్నోళకి అర్థం కాలేదు అప్పుడు. ఆ తర్వాత రోజుల్లో 'అతనికి అన్నలు బెదిరించేరని, అందుకే కొండదిగి, ఊరొదిలి పారిపోయేడని' పెద్దోళ్లు అనుకుంటుండగా విన్నాను. మళ్లీ ఇన్నాళకి కనిపించేడు. కాస్త సన్నబడ్డాడు. కానీ జీన్స్‌లో మోడరన్‌గా కనిపించేడు. చేతి వుంగరాలు

మరింత మెరుస్తున్నాయి. మెడలో గొలుసు మాత్రం అప్పటికంటే ఇంకా లావుపాటిదయ్యింది. పలకరింపులు తర్వాత "ఏటి సంగతని?' అడిగేడు. విషయం చెప్పాను. "ఓసింతేనా" అన్నాడు. అర్థం కాక అతని నవ్వువైపు చూస్తూ వుండిపోయేను. అప్పుడు తీరిగ్గా చెప్పాడు. "ఆ పేమెంట్ నేనిస్తా'నన్నాడు. ఎలా అని అడగలేదు. ఎందుకనీ అని అస్సలు అడగలేదు. అప్పటికప్పుడు డబ్బులిచ్చి ఆదుకున్నవాడిగానే కనిపించాడు తప్ప అతనిలో ఇంకే ఇతర భావలేమీ కనపడలేదు. ఇన్నాళ్లూ కనపడని వాడు ఇప్పుడెందుకొచ్చేడు? ఎక్కడో వైజాగులో స్థిరపడిన వాడు ఇక్కడికొచ్చి ఏమీ ఆశించకుండా ఉత్తినే అంత అప్పు ఎందుకు ఇస్తున్నట్టు? ఇవేవీ నాకు ఆలోచనలోకి రాలేదు. కనపడిందల్లా ట్రాక్టరు. దానిమీదొచ్చే రాబడి.

షావుకారి అప్పుతో ఐటీడీయే అప్పుని పొందేను. ఒక అప్పుకోసం మరో అప్పు వాడి ఋణగ్రస్తుడినయ్యేను. ట్రాక్టరు ఇంటికొచ్చింది. అందాక ఒక డ్రైవరుని మాట్లాడుకున్నాను. వోనర్ని గానీ డ్రైవింగు రాదుమరి నాకు. పసువూ కుంకుమ రాసి జాకరమ్మ దగ్గరి బొట్టు బెట్టింది అమ్మ. నాన్నకైతే ఏమీ తెలీక "ఇదేమిటి... ఎక్కడిది?" అన్నాడు. చెప్పేను. మరింత ఆశ్చర్యపోయేడు. "దుక్కి మల్లా దున్నేస్తాది తెలుసునా?" అన్నాడు పక్కనే వున్న డ్రైవరు. ఆ సంగతి నాక్కూడా తెలీదు. ఇద్దరం ఆశ్చర్యపోయేము. అప్పుడు చెప్పేడు దుక్కి సెట్టు కొనుక్కోవాలని. ఆ మాటకి నేను గతుక్కుమన్నాను. ఎందుకంటే దానికోసం మరింత డబ్బు కావల్సి వస్తుందని. కానీ నాన్న గొణుక్కుంటున్నట్టు అన్న మాటలు నా చెవిన పడకనే పడ్డాయి. " ఈ కొండమీద ఏమి దుక్కి పనుంతాది? తువ్వడం తప్ప." అని చుట్ట ముట్టించుకుంటూనే మరొక మాటన్నాడు. "ఇంతపిసర భూమున్నా బాగున్ను" అని. అప్పటికి నాకా మాటలు అర్థమవలేదు. అర్థమయేసరికి రావలసిన అనర్థం ముంచుకొచ్చేసింది.

బస్సు కోసం ఎదురు చూస్తున్నాను. పొద్దు రెండు బారలెక్కింది. అప్పుడే షాపులన్నీ ఒక్కొక్కటీ తెరుచుకుంటున్నాయి. ఇప్పుడు బస్సొస్తే సరిగ్గా ఐటీడీయే తెరుచుకునే సమయానికి చేరుకోవచ్చు.

బస్సొచ్చింది. కిటికీ పక్కసీటు. ఆకుపచ్చ కొండలు,ఎత్తైన చెట్లు, ఖానాలు, పొలాలూ, వాగులూ వంకలూ వెనక్కి వెళ్లిపోతున్నాయి. ట్రాక్టరు కి ఓనరు అయినా డ్రైవింగు రాక పోతే ఎంత నష్టమో కొన్ని రోజుల తర్వాత తెలిసొచ్చింది. చుట్టు పక్కల ఊళ్లు తిరిగి ఎక్కడ బేరాలున్నాయో తిరిగి తిరిగి రావడం ఒక ఎత్తైతే పనైన తర్వాత డబ్బులు రాబట్టడం మరొక ఎత్తు. అందరు తెలిసిన వాళ్లే. ఎవరికీ గట్టిగా అడగలేకపోవడం... కొన్ని చోట్ల మొహమాటానికి పోవడం. కొందరు తర్వాత ఇస్తామనడం, మరికొందరు డబ్బులు ఎగ్గొట్టడం. ఎలా అడగాలో తెలీక కొన్ని పద్దులు వొదులుకోవడం. ఇసుక లోడ్లు, రాయిలోడ్లు, ఇటికి లోడ్లు....ట్రాక్టరొచ్చిన కొత్తలో ప్రతి పనికీబండితో వెళ్లే వాడిని. కానీ కొన్ని లోడులకి స్వయంగా వెళ్లకపోతే డ్రైవరు ఎంత చెప్తే అంత. వాడు ఎన్ని లోడ్లు వేసేడో తెలిసేదికాదు. తొలిరోజుల్లో తెలిసిరాలేదుగానీ తర్వాత్తర్వాత వాడు అబద్దం చెప్తున్నాడని తెలిసిపోయింది. వాడు మానేస్తాడంటే మరొకడిని వెతక లేక అలా అలా గడిచి పోయేది.

నెల తిరిగేసరికి వాయిదా కట్టాల్సి రావడం... రోజులు గడుస్తున్న కొద్ది ఋణమెంత భారమో తెలిసొస్తూ వుండగా నాకు ఒక కొత్త సమస్య వొచ్చి పడింది. నాకు పోటీగా మరొక ట్రాక్టరు రావడం. అది ఒక విలేఖరిది. అతను కాంట్రాక్టు పనులు కూడా చేస్తూ వుంటాడు. దానికోసం పత్రిక ను ఎంతలా వాడుకోవాలో అతనికి బాగా తెలుసు. అతని పరిచయాలు... అతని పలుకుబడి ముందు నేను నిలబడి వర్కులు సంపాదించడం  సాద్యం కాని పనని కొద్దిరోజుల్లోనే తెలిసొచ్చింది.

ఒక పొద్దు పోతున్న సమయాన పోస్టురన్నరన్న ఒక కవరు అందించేడు. అది వాయిదా కట్టడం లేదని ట్రాక్టరుని జప్తు చేస్తున్నామని ఐటీడీయే వారు ఉత్తరం పంపేరు. దాన్ని మడతబెట్టి జేబులో పెట్టేనో లేదో పాతషావుకారి బండేసుకొని వొచ్చేడు ఊర్లోకి. దెబ్బమీద దెబ్బ. "మొదటోడు మొగుడు... రెండో వోడు రంకు మొగుడు" అన్నట్టుగుంది నా పరిస్థితి.  వాయిదాలు ఎగ్గొట్టి దాగి

దాగి తిరుగుతున్న నాకు అతన్ని తప్పించుకోవడం వీలు కాలేదు. ఏమి చెప్పాలో తెలీక నీళ్లు నమిలేను. ఇంట్లోకి తీసుకొచ్చి మంచమేసి కూర్చోబెట్టేను. తాగడానికి మంచి నీళ్లిచ్చేను. అతనికి ఏమి సమాధానం చెప్పాలో సిద్ధం చేసుకున్నాను.

"ట్రాక్టరు ఎలా నడుస్తుంది?" అడిగాడు. కష్టాలన్నీ చెప్పేను.... కరుణిస్తాడని. చిత్రంగా నవ్వేడు. ఆ నవ్వుకి అర్థం తెలుసుకోలేక పోయేను. 'ఇదీ నా పరిస్థితి' అన్నట్టు పోష్టరన్నరన్న అందిచించిన కవరు కూడా చూపించేను. అప్పుడతను మరింత ప్రశాంతంగా నవ్వి... ''నేనొకమాటంటాను వింటావా?'' అన్నాడు. అతని వైపు అనుమానంగా చూసేను. నా చూపుల్ని తప్పించుకుంటూ సూటిగా అన్నాడు... "నీ ట్రాక్టరు ముందు జప్తు జరక్కుండా చూద్దాం" అన్నాడు. "ఎలా?" అన్నట్టు అతని వైపు చూసేను. "డబ్బులు కట్టేద్దాం" అన్నాడు కొన్ని నిముషాల తర్వాత. ఆశ్చర్యపోయాను. ముందు అప్పే తీరలేదు. మళ్లీ ఇంకా నా మీద ఏ నమ్మకంతో ఇంత ప్రేమ కురిపిస్తున్నాడో నాకు ఒక పట్టాన అర్థం కాలేదు. మరికొంత నిశ్శబ్దం తర్వాత మళ్లీ అతనే అన్నాడు "మన పరువు పోకూడదు" అని. 'పోడానికి ఇంకెక్కడ మిగిలుంది గాకనా పరువు?' అని మనసు లో అనుకుంటుండగానే షావుకారి " అయితే ఒక షరతు..." అని కాసేపు ఆగేడు. " ట్రాక్టరు పనులు కలిసి చేద్దాం" అన్నాడు. 'అలాగే' అన్నట్టు తలవూపేను. నాకేమి చెయ్యాలో తోచలేదు. ఒప్పుకోవడం తప్ప వేరే దారిలేదు నాకు. ఆ వెంటనే లేచి నిలబడి బైకు ఎక్కేసాడు.

ఆ తెల్లారే వాయిదా కట్టేయడం, అటునుండటే ట్రాక్టరు రిపేర్లకని తీసుకెళ్లడం. కొత్త డ్రైవరుని పెట్టుకోవడం వెనువెంటనే జరిగిపోయాం అలా వెళ్లిన ట్రాక్టరు మళ్లీ తిరిగి రాలేదు. ఐటీడీయే వాళ్లు కూడా నాకు నోటీసులూ పంపలేదు. ఆ తరువాత సబ్సిడీ కింద ఋణం మాఫీ అయిపోయినట్టు తెలిసింది. చివరికి నేను పెట్టుకున్న డ్రైవరుకివ్వాల్సిన జీతం డబ్బులు, నేను రిపేర్లకని పెట్టిన డబ్బులూ అప్పుగా మిగిలిపోయేయి. ట్రాక్టరు మీద తిరిగి నందుకు నాకు ఒళ్లు నొప్పులూ మిగిలేయినాకు.

నాకు ఏ శబ్దాలూ వినపడ్డం లేదు. బస్సు టౌనుకి దగ్గరవుతోంది. తోటపల్లి బేరేజీ కొత్తరోడ్డు మీదుగా బస్సు వేగంగా కదులుతోంది. రోడ్డు విశాలంగా వుండడం వల్లేమో డ్రైవరు మరింత హుషారుగా పరిగెత్తిస్తున్నాడు. ప్రయాణీకులెవరూ ఊపిరితీయడం లేనట్టు... అందరూ మూగగా రోదిస్తున్నట్టు అంతా నిశ్శబ్దంగా... దృశ్యమొక్కటే కనిపిస్తోంది. నా ఊపిరి నాకే వినిపిస్తోంది. నా గుండె శబ్దం నాకు స్పష్టంగా చెవులకు సోకుతోంది. విశాలంగా తెరుకున్న తార్రోడ్డు నోటిలోకి బస్సుతో సహా నేనూ జారిపోతున్నట్టు. నగరభూతం నోరు తెరుచుకొని గాలితో సహా మింగడానికి సిద్ధపడుతున్నట్టు రోడ్డు మీద వాహనాలన్నీ కుప్పలు కుప్పలుగా అందులోకి కూలబడి పోతున్నట్టు....

తార్రోడ్డు మీద ప్రయాణిస్తున్నా...నాకు ఏదారీ కనిపించడం లేదు. ఏ ప్రయాణమూ గమ్యం చేరుతున్నట్టనిపించడం లేదు. ఉరుకుల పరుగుల వేగం తో ముందుకు వెళ్తున్నా ఒక్క అడుగూ కదిలినట్టనిపించడం లేదు.

సరిగ్గా ఇలాంటి సమయం లోనే అనుకుంటాను మా వూరి సోములు గాడు "నా మాటిను బావా.." అన్నాడు. 'ఏమిటన్నట్టు?' అతని వైపు చూసేను. అంతదాకా ఇంటరు పోయి ఉపాది హామీ పనులకెళ్లి బతుకుతున్నోడు ఒక్కసారిగా రాత్రికి రాత్రే మారిపోయిన వాడి రూపం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. వైట్ డ్రెస్ లో ఇన్ చేసుకుని... చేతిలో ఒక లెదర్ బేగుతో కనిపించేడు. దాంట్లో బైబిలూ మరికొన్ని సువార్త వచనాలూ. ఎప్పటినుండో మా ఊర్లో క్రైస్తవ సంఘం పెట్టి చర్చి నడుపుతున్నాడు. వాక్యం చదివి నలుగురిని సంఘం చేర్పించుకుంటే చాలు, కష్టాలన్నీ తీరిపోతాయని చెప్పేడు. దానికోసం కష్టపడక్కరలేదనీ చెప్పాడు. మత వ్యాప్తి చెయ్యడమెలాగో ట్రైనింగు కూడ ఇస్తారనీ, నెలకు జీతంతో పాటు మతస్తులనుంచి 'దశమ భాగం' కూడ వస్తుందనీ చెప్పాడు.

నాకెందుకో అది నచ్చలేదు. బతకడం కోసం జనాల నమ్మకాన్ని వాడుకోవడం....అస్థిత్వాన్ని వదులుకోవడం...నాకెందుకో

నచ్చలేదు. మతాన్ని ఉపాది మార్గంగా వాడుకోవడం... అందులోనూ స్వంత అలవాట్లనీ, సంస్కృతీసంప్రదాయాల్ని వదిలించుకోవడం అస్సలు నచ్చలేదు. ఐనప్పటికీ తోటి జనాలు గుడ్డిగా అటువైపే అడుగులు వేస్తున్నారు. తొలిరోజుల్లో నాకు అర్ధమవలేదు. ఇప్పుడిప్పుడే నాకూ అర్ధమవుతూ వస్తోంది ఏమిటంటే అభివృద్ధి చేస్తామని ఏర్పాటు చేసిన ఐటీడీయేలు ఎక్కడ ఫెయిల్ అయ్యాయో సరిగ్గా అక్కడే ఈ మతసంస్థలు అడవుల్లోకి దూరి అమాయక ఆదివాసుల్ని మెస్మరైజ్ చేస్తున్నాయన్న వాస్తవం. ఈ విషయం నా వాళ్లకి ఎప్పుడు తెలిసొస్తుందో!?

బస్సు పార్వతీపురం కాంప్లెక్స్ చేరింది. దిగి నడుస్తుంటే చాలా మంది స్నేహితులు కలిసారు. అందరూ ఒక్కొక్క గ్రీవెన్సు కోసం... ఒక్కొక్క దరఖాస్తు చేత బట్టుకొని. అందులో చాలా మంది గ్రాడ్యుయేట్లే. మరికొందరైతే బీఈడీ, పోష్టుగ్రాడ్యుయేషన్ చేసిన వాళ్లూ వున్నారు. ఆఫీసు వైపు నడుస్తుంటే ఔట్‌సోర్సింగు ఉద్యోగులు జీతాల కోసం ధర్నా చేస్తున్నారనీ తెలిసింది. ఆఫీసు దగ్గరవుతున్న కొద్దీ జనం చిక్కనవుతూవున్నారు. గేటు ముందర పోలీసు పహారా. లోపలికి వెళ్లే వీలు లేదు. వెనక్కి చూసేను తిరిగి వెళ్లే దారి కనిపించలేదు. జనం లో నినాదమైపోయేను.

జనం మా గోడు వినాలంటారు. ప్రోజెక్టు అధికారి మేడ మెట్లు దిగి రానంటాడు. పోలీసులు హద్దులు దాటొద్దంటారు.

పొద్దు నడి నెత్తి దాటి కిందకి జారుతూ ఒంటి మీద ఉప్పు పేలుస్తోంది. ఆకలి మంట... ఆపై కడుపు మంట. దేనర్ధం ఏదో తెలీని వెర్రి ఆవేశం. మా కోసమని ఏర్పడిన ఆఫీసులో నీడ లేకపోవడం... మా మాట వినే నాధుడు లేడని యువత బాధ. వెరసి తోపులాట. గేటు కవతల పోలీసులు...ఇవతల జనం. జనం అదుపు తప్పేరు. పోలీసులు సహనం కోల్పోయేరు. గుంపులోంచి ఒకడు తన నిరసన ని రాయి గా మార్చి బలంగా పీవో ఆఫీసు కేసి విసిరేడు. పీవో గారి చూపు లాఠీ అయ్యింది.

వెనుక నుంచి జనం ఒక్కసారిగా తోసుకోవడం... ఏమరు పాటుగా వున్న నేను కిందపడిపోవడం... నా మీద మరి కొందరు

పడిపోవడం... నా తల మీద ఒక లాఠీ తగలడం...స్పృహ కోల్పోవడం నిముషాల వ్యవధిలో జరిగిపోయాయి.

కళ్లు తెరిచేసరికి నేను హాస్పిటల్ బెడ్ మీద వున్నాను. చుట్టూ రోగులు. ప్రక్కనే మా వూరి తోయిక రాములు మామ... నేనెప్పుడు కళ్లు తెరుస్తానా అన్నట్టు. "నువ్వేటి మామా ఇక్కడ?" అన్నాను. అతని వెనుకే అత్త, ఇద్దరు పిల్లలు... వాళ్ల మూటలు. అప్పుడు మామ అంతా చెప్పుకొచ్చేడు. నిన్న సాయంత్రం కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్ వైపు నడిచొస్తుంటే పక్క వూరి వాళ్లెవరో ఎదురై చెప్పారట. లాఠీ దెబ్బలు తిని కింద పడిపోయిన నన్ను పోలీసులే హాస్పిటల్‌లో జాయిన్ చేసారని. నన్ను మామకి ఆప్పజెప్పేసి పోలీసులు వెళ్లి పోయేరని. "నిన్న చెన్నై మెయిల్ ఎక్కేసుంటే ఈ పాటికి దిగి పోయుందుము అల్లుడూ!" అన్నాడు. అప్పుడు గుర్తొచ్చింది ఆ కుటుంబం ఊరొదిలి కిందటి వేసవిలో పనుల కోసం చెన్నై వెళ్లి పోయేరని. రేషన్ కార్డులకి ఫొటోలు తీస్తున్నారంటే ఈ మద్యనే వొచ్చేరు.

నా సర్టిఫికేట్లు గుర్తొచ్చి.. "మామా! నా బేగో?" అడిగాను. తెలీదని అడ్డంగా తలూపేడు. నిన్న తొక్కిసలాటలో ఎక్కడో పోయుంటాయని గుర్తొచ్చింది. ఎందుకో వాటికోసం ప్రయత్నం చెయ్యాలనీ అనిపించలేదు. నాన్నడిగిన ప్రశ్నకి అవి జవాబు అవుతాయని నమ్మకం పోయింది నాకు.

నిన్నటి నుండి నేను చేసిన ప్రయాణం గుర్తొచ్చింది. తార్రోడ్డు మొదలు కొని హాస్పిటల్ బెడ్ దాకా. రోడ్డు మా వూరి వైపు...నేను వూరికి దూరంగా మరో వైపు... వ్యతిరేక దిశల్లో.

నొప్పి ఇంకా పచ్చిగానే వుంది. చుట్టూ చీకటిగా వుంది...నా భవిష్యత్తులా. మా ఊరొదిలి కూలి పనులకోసం వలసెళ్లి పోతున్న మామ కుటుంబం నా ప్రక్కనే వున్నారు... చిరు దీపం లా.

"మామా! ట్రైను ఎన్ని గంటలకి?" అని అడిగాను.

*(10వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక, ఏప్రిల్- మే 2015,చినుకు)*

# తాంద్రచుట్ట

**అ**వి...

నేను ఉపాధ్యాయుడుగా ఈ స్కూల్లో చేరిన తొలి రోజులు. ఇంకా చెప్పాలంటే ఈ పాఠశాలకి కూడా తొలి రోజులే. ఎందుకంటే నేను ఈ స్కూల్లో చేరే సమయానికి సొంత భవనం ఏమీ లేదు. ఇక్కడికి కిలోమీటరు దూరంలో వున్న పాడుబడిన సుగర్ ఫ్యాక్టరీ భవనాల్లో నడుస్తూ వుండేది. అంతకు ముందు ఇక్కడ ఒక పూరి పాక మాత్రమే వుండేది. అది ఓ రోజు గాలికి కొట్టుకుపోతే పిల్లలందరినీ ఎక్కడ వుంచాలో తెలీక సుగర్ ఫ్యాక్టరీ రేకు గదుల్లోకి ఉన్న పళంగా తరలించేరు. తరగతులన్నీ అక్కడే జరుగుతూ వుండేవి. సరిగ్గా అప్పుడే నేను విధుల్లోకి చేరేను.

ఆ పాడుబడిన రేకు షెడ్డుల్లోనే పిల్లల్ని కాపాడుకోవాల్సివచ్చేది.

తుప్పల డొంకల్లో నుంచి ఏ పాము ఎవరికి కాటేస్తుందో... ఏ పురుగు ఎవరి మీదికి ఎక్కి పాకుతుందో తెలీని పరిస్థితి.

అలాంటి రోజుల్లో ఐ.టీ.డీ.ఏ నుంచి జీపొచ్చి ఆగింది. గిరిజన సంక్షేమాధికారి దిగేరు. పిల్లల బాగోగులు గురించి అడిగేరు. అంతా వివరించి చెప్పాను. ఒక్క నిట్టూర్పు విడిచి..."స్కూలుకి బిల్డింగు సేంక్షనయ్యిందీ..కానీ ..." అని ఆగేరు. ఆ సాగదీత ఎందుకో అర్ధం కాక సార్ వైపు అనుమానంగా చూసేను. దానికి సమాధానం ఏమీ చెప్పకుండా "జీపెక్కండి" అని నన్నూ మరొక టీచర్‌నీ పాత పాకల పాఠశాల వైపు తీసుకు పోయారు. అప్పుడు చూసాను, పాత బడిని. కూలిపోయిన వెదురు గుడిసెని. గాలికెగిరిపోయిన గడ్డి పెణకల్ని.

జీపు దిగేసరికి... ఒరిగిపోయిన పాకలో గట్టిగా వున్న రాటలకి గేదెలు, పశువులు కట్టేసి వున్నాయి. చుట్టుప్రక్కల కంది చేను వేసి వుంది. మరో వైపు గొప్పు తవ్వుతూ కనిపించేడు బూగన్న. ఒంటిమీద గోచి గుడ్డ, చెవిలో చుట్ట ముక్కతో.

"ఏమోయ్! ఏం పేరు నీ పేరు?" అడిగాను.

"బూగన్న" అని చెప్తూ చేతికంటిన మట్టిని గోచి గుడ్డకు తుడుచు కుంటూ దగ్గరికొచ్చేడు...ఏమిటన్నట్టు.

"చూడు బూగన్నా! మీ వూరి బడి ఇలగ పాడుబడిపోయింది గదా నీకేమీ అనిపించడం లేదా?" అని చుట్టు ప్రక్కలా చూసేరు డీటీడబల్యూవో గారు.

"అది గాలికి పడిపోతే పడిపోతే నాది తప్పా?" అని చేతులు దులుపుకున్నాడు.

"నా వుద్దేశం అది కాదువోయ్...మీ వూర్లో బడి వుంటే మీకు మంచిది కదా?" అన్నాను

"ఐతే నీనేటిబడికి అడ్డేసినానా? బడుంతే నీను కాదంతానా?"

"నువ్వు కాదంటావని కాదువోయ్... బడి బిల్డింగుకి కొద్దిగా స్థలం చాలదు..." అని మెల్లగా అన్నారు. ఆ మాట నాకు అర్ధమయ్యీ అతని వైపు చూసాను. సార్ నన్ను గానీ, బూగన్నని గానీ ఏమీ

పట్టించుకొన్నట్టుగా కనపడలేదు. అతని చూపుల్ని బట్టి నేను గమనించిందేమంటే బూగన్న పొలం సరిహద్దుల్ని చూస్తున్నారని.

నేనూ అతని వైపు చూడ్డం మానేసి పొలాన్ని గమనించేను. ఏ నీటి ఆదరువూ లేని ఇసక భూమి. వర్షం పడితేనే తడిసే అవకాశం వుంది. లేదంటే అదీ లేదు. పొలం రోడ్డుకి ఊరుకి మధ్య వుంది. దానికానుకొని స్కూలు పాక వుంది. పొలంలో చోడి చల్లినట్టున్నాడు బూగన్న. చుట్టు ప్రక్కల పొలాలన్నీ అలాగే వున్నాయి.

"నీ పొలం ఎంతవరకూ వుందివోయ్ బూగన్నా?" అడిగారు సార్.

"ఇదంతా నా గుడ్డే. మీ బడికి మల్లా నీనిచ్చిన చోటే గదా?!"

"కదా... మరి నీ పేరు నిలిచి పోవాలంటే మరికొంచం భూమి ఇస్తే..." అని ఆపేరు సార్.

బూగన్న మౌనంగా వుండిపోయేడు. కొద్ది సేపు నిశ్శబ్దం తర్వాత..."నీ నేటి కాదన్నాను గాకనా?" అని ఒప్పుకున్నాడు. ఆశ్చర్యపోవడం నా వంతైంది. బహుశ సార్ కూడ ఊహించి ఉండరేమో... అతనంత తొందరగా ఒప్పుకుంటాడని.

"మరి మీమెలగ బతకాలైతే?" అని వినిపించింది.

వెనక్కి తిరిగి చూసేను. సన్నగా, పొడుగ్గా వున్న ఓ యువకుడు కనిపించేడు...జమ్మన్న, బూగన్న కొడుకు... షర్ట్, నిక్కరు వేసుకొని నిలబడి వున్నాడు.

నేను 'సార్' వైపు చూసేను. అతను నెమ్మదిగా మా వైపు రెండడుగులు వేసి "ఇక్కడేం పంటలు పండించేస్తున్నావోయ్?" అని నవ్వుతూ అడిగేరు.

"మరిదంతా పంట కాదేటండీ?" అని ఎండిపోయిన చోడి చేను వైపు చూపించేడు. అతని మాటలోని అసహనం నాకు వినిపించింది.

"ఏటి దీనితోటే బతుకంతా ఐపోతుందేటీ?" అని అన్నారు.

ఆ మాటలోని 'ధ్వని' నాకెందుకో నచ్చలేదు.  అదేమీ పట్టించుకోనట్టే ముందుకడుగేసారు  సారు.

"చూడవోయ్... భూమిస్తే మీ వూర్లో స్కూలవుతుంది... లేకపోతే లేదువోయ్. బడి కావాలంటే  భూమి ఉండాలోయ్." అని ముగించేరు... బయటకు నడుస్తూ.

''ఆడికేటీ తెలేదు బాబూ... నీను అంతున్నాను గదా...మాటంతే మాటే" అని బూగన్న ముందుకొచ్చేడు

"నీవలగే అంతావు. ఈపొద్దుంతావు. రేపు సత్తావు. నీనెలగ బతకాల?" అని జమ్మన్న వాదనకి దిగేడు. అదీ నిజమే కదా. బూగన్న ఒప్పుకున్న మాత్రాన సరిపోదుకదా! వారసుడిగా జమ్మన్న అంగీకారం కూడ అవసరం. రేప్పొద్దున ఏదైనా అభ్యంతరాలు వస్తే?

"సార్! ప్రభుత్వం తరపున మనమేమైనా వాళ్లకి ఇవ్వలేమా?" అన్నాను సార్ వెనకే నడుస్తూ.

"మాష్టారు! నాకు మాత్రం లేదా వాళ్లకి సాయం చేయాలని? కానీ మనకున్న అధికారాల ప్రకారం స్కూలు బిల్డింగు శాంక్షన్ వరకే" అందుకే మిమ్మల్ని పిలిపించానన్నట్టు చెప్పకనే చెప్పారు.

నన్ను స్కూల్లో దించి మిగతా స్టాఫ్ నీ పిలిపించి అన్నారు... "భూమి బాధ్యత మీదే, ఒప్పించండి. భూమి గ్రామస్తులే విరాళంగా ఇవ్వాల్సి వుంటుంది. దానికి ఒప్పించే బాధ్యత మీదే. స్కూల్ డెవలప్ అవ్వాలంటే ప్రజల సహకారం తో పాటు ఉద్యోగుల భాగస్వామ్యమూ వుండాలి,అక్కడ కాదంటే స్కూలు వేరే చోటికి తరలించాల్సి వుంటుంది." అని జీపెక్కేసారు.

నిజానికి వేరొక చోటుకు స్కూలుని తరలించినా  పోరాడే వాళ్లు గానీ అడిగే వాళ్లు గానీ ఆ ఊళ్లో లేరు.  ఉన్నది పదో పన్నెండో ఇళ్లు. అంతా గిరిజనులే. రోడ్డుపక్క ఊరని చెప్పుకోవడానికే గానీ చదువుకున్నవాళ్లెవరూ లేరు. తెల్లవారితే ఊర్లో ఒక్కరూ కనపడరు. పోడు చేసుకుంటూనో, పశువుల్ని మేపుకుని తిరగుతూనో, కొండమీది కట్టెల్ని అమ్ముకుంటూనో రోజుల్ని గడిపేసే  వాళ్లే గానీ బడికోసం ఆలోచించే వాళ్లెవరూ లేరక్కడ.

ఏది ఏమైనా బూగన్న ఒప్పుకున్నా అతని కొడుకు జమ్మన్నని కూడ ఎలాగోలా స్కూలు భవనానికి ఒప్పించాలని నిర్ణయించుకొని ఓ రోజు సాయంత్రం తోటి మాష్టారితో బయల్దేరాను.

వూరు సందడిగా వుంది. పశువులన్నీ ఇంటి దారి పడుతున్నాయి. వీధిలోని నులక మంచాలు నిలబడే వున్నాయి. ఇంటి కెదురుగా రాటలకి కట్టి వున్న మేకపిల్లలు గంతులేస్తున్నాయి. గడపల్లోని కుంపట్లలోని నిప్పులు రాజుకుంటున్నాయి. దిసమొలల్తో పసి పిల్లలు లేగదూడల్తో పోటీపడి పరిగెత్తుతుంటే ముసలోళ్లు ముచ్చటగా చూస్తున్నారు. బూగన్న ఇల్లేదని అడిగాం. ఇప్పసారా మత్తులో తూలుతూ చేయెత్తి చూపించేడు. వీధిలోనే నులక మంచం వేసుకొని కూర్చున్నాం. అతని ఇంట్లో దీపం వెలిగినట్టులేదు. గడప చీకటిగా వుంది. ఇరుగు పొరుగుల ఇళ్లలో సందడి వున్నా వెలగు లేదు. వీధిలోని అలికిడి పెరిగింది. బూగన్న రాక కోసం ఎదురుచూస్తున్న మాకు ఎవరూ పలకరించే వాళ్లే లేరు. మరికొద్ది సేపటి తర్వాత బూగన్న పశువులు తోలుకుంటూ వచ్చేడు. ముందు అనుమానంగా చూసి, ఆతర్వాత నన్ను పోల్చుకుని "బావున్నావు గురువూ?" అని పలకరించేడు. వీధిలో నిలబడి వున్న నులక మంచాన్ని తెచ్చి గడపలో వేసేడు. కూర్చున్నాం. వచ్చిన పని చెప్పాం. 'అలగేన్లే' అంటూ గడపలో కిరోసిన్ దీపాన్ని వెలిగించేడు.

"మరి మీ అబ్బాయి?" మా సందేహాన్ని వ్యక్త పరిచేం.

...కొంత నిశ్శబ్దం తర్వాత తనలో తాను మాట్లాడుతున్నట్టు అన్నాడు...." అది.. ఎంతో రత్తం కారించితే వొచ్చిన బూవి గురువూ!" అని మొదలుపెట్టేడు "అలపొంటి బూవి ఈపొద్దు సేయి జారిపోతున్నా దంతే బాదుండదు గురువూ?" అని ఆగేడు.

దీపం వెలుగు స్పష్టంగా కనపడుతోంది. చుట్టూ చీకటి మరింత ముదిరింది. ఎందుకో వీధి అంతా ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారిపోయింది. కాసేపటికి మళ్లీ ఏదో అలికిడితో యథాస్థితికి వొచ్చింది. బూగన్న గొంతు సవరించుకున్నాడు.

"అప్పుడు, భూములు కోసం సంగాలంట తిరిగి వుద్దాలు సేసేము. రత్తం పారింది, చట్టమొచ్చింది. బూములు మా సేతి కొచ్చినాయి, సంబరపడ్డాము. ఆ చట్టమే ఇప్పుడు పేరు మార్చి బూములు లాక్కుంతుంది. ఇప్పుడు వుద్దం సెయ్యగలమా? ఇవి సంగాలు పెట్టి వుద్దాలు సేసిన రోజులు కావు గురువూ... ఆ రోజు సావుకారి లాక్కున్నాడు ... ఈరోజు పెబుత్వం లాక్కుంతుంది తేడ నేదు బావ్.. ఉన్న తేడా అల్లా ఎక్కడంతే 'మాకు బూముంది' అనుకోడమే!" అన్నాడు.

పెణక్కి దోపిన చుట్టముక్కని దీపం వెలుగులో వెదికి తీసేడు. గోచీ గుడ్డలోని ఒక దారప్పోగుని లాగి పొగాకు కాడల్నిసరిచేసి చుట్టని ఇ(రించి కట్టి దీపం ముందు మూతి పెట్టి అంటించేడు. నాతో వొచ్చిన మాష్టారు విసుక్కుని బయటికి నడిచేరు. నాకెందుకో అతని మాటల కొనసాగింపుని వినాలనుంది.

"బూగన్నా! నావుద్దేశం నీనుంచి బూమి లాక్కోవడం కాదు. మీవూరికి బడి వస్తే ఎంతో మారుతుంది వూరు. మీ పిల్లలు చదువుకోవచ్చు, ఉద్యోగాలొచ్చి సుఖపడొచ్చు" అని వివరించబోయేను. ఆ మాట అన్నాక తెలిసింది ఉద్యమాల్లో తిరిగిన వ్యక్తికి నేనివన్నీ చెప్పాలా? సిగ్గేసింది.

"నేను అంతున్నది నీకు కాదు గురువూ.." అని మళ్లీ చెప్పడం ఆరంభించేడు.

అతను చెబుతున్న విషయాలు నాకు తెలియనివా?

ఇంకెవరికైనా తెలుసుకోమని చెబుతున్నాడా?

అతను నాతోనే మాట్లాడుతున్నాడా? నాద్వారా ఇంకెవరికైనా ప్రశ్నిస్తున్నాడా?

"కనపడినదల్లా సుకం కాదు గురూ... నాకు సుకమనుకున్నది నీకు కష్టమైతాది...నీకు సుకమనుకున్నది నాకు కష్టమైతాది... నాకు ఏది సుకమో నువ్వు సెప్పకూడదు... నీనే సెప్పాల. నా సుకం గురించి నీనే మాట్లాడాల" అని ఆగేడు మళ్లీ.

అతని స్వరంలోని భావ తీవ్రతకి భయమేసింది నాకు. నిజమే ఎవరి సుఖాన్ని వాళ్ళే నిర్వచించుకోవాలి. ఉద్ధరిస్తామూ, మీ బ్రతుకులు బాగుచేసేస్తామూ అని పథకాలు రచిస్తున్న ప్రభుత్వాలు ఈ విషయాన్ని గమనించుకోవాలి. డబ్బున్న బడాబాబుల ప్రయోజనాలకోసం ప్రజల మనోభావాలు తెలుసుకోకుండాక్రూరంగా భూముల్ని దోచుకుపోతున్న ప్రభుత్వాలు ఈ విషయాల్ని ఎప్పుడు పరిగణలోకి తీసుకుంటాయో?

ఎవరితను?

జీవితాన్ని వడబోసి ఏ సిద్ధాంతమో చెబుతోన్న తాత్వికుడా?

అడ్డపొగేసి లాగుతున్న చుట్టపొగ అతని ముక్కు రంధ్రాల్లోంచి మెల్లగా వొదులుతూ మళ్లీ మాట్లాడ్డం మొదలెట్టేడు.

"సూడు గురువూ... బూమి ఇప్పుడు నీనివ్వకపోయినా ఇంకేదో పేరు మీద లాక్కుంతాది."

అతను చెప్పింది వినడం తప్పా నేనేమీ అనలేని నిస్సహాయ స్థితిలో వుండిపోయాను.

ఊరు చీకటి వూయల్లో వూగుతోంది. వీధి చివర గడపలోంచి తుడుం మోగుతోంది. ఆ గడపలోంచే చలిమంట వెలుతురు స్పష్టంగా కనిపిస్తోంది. పిల్లల సందడి తగ్గిపోయింది.

"గురువూ! ఎప్పుడూ రానోడివి... నా ఇంటికొచ్చినావ్, నా గడపల కూకున్నావ్... నాకు సుట్టమైనావ్ ఇద" అని నా చేతిలో ఏదో పెట్టేడు. చీకట్లో అది ఏమిటో గుర్తించలేక పోయాను. పుల్లని వాసన మాత్రం వేస్తోంది. ఆకులో చుట్టి వుంది. చేతికి చిన్న తేమ తగిలింది.

"ఏమిటిది?" అని అడిగాను.

"తాండ్రసుట్ట... నాకాడ ఇంకేటున్నాది?" అని నాకు మరింత దగ్గరికొచ్చేడు. "నీవు నా నేస్తం. నా గడపకొచ్చినోడికి ఒట్టి సేతల పంపలేను" అని నా చేతిని పట్టి చిన్నగా నొక్కేడు.

నా కళ్లు చెమరించేయి. లాక్కోడానికి అతని దగ్గరికొస్తే నన్నే అతని సొంతం చేసుకున్నాడు.

ఆతరువాత కొన్ని రోజులకి వార్డెన్‌గారికి ఆఫీసు నుంచి కబురు. వెళ్లొచ్చిన రోజు సాయంత్రమే వార్డెన్ గారు రూములో పార్టీ ఏర్పాటు చేసేరు. చుట్టూ ఒకరిద్దరు మాష్టార్లు కూర్చుండగా మధ్యలో జమ్మన్న కూడా వున్నాడు. పార్టీ ముగిసే సరికి అతని జేబులో ఒకటి రెండు పచ్చనోట్లు చేరేయి. అతను ద్వారం దాటుతూ "నీకేలా? నీనొప్పు కుంతున్ను గదా..." అంటూ బయటికొచ్చేడు. ఆ మరుచటి రోజే ఇంజినీరు వొచ్చేరు. స్కూలు బిల్డింగుకి కావలసినంతమేరా మార్కింగ్ ఇచ్చి వెళ్లి పోయేడు. ఆ తరువాత రోజు పునాదులు తవ్వేరు. కొద్దిరోజుల్లోనే గోడలు, స్లాబు, ప్రహరీ... ఒకదాని తరువాత మరొకటి చూస్తుండగానే స్కూలు తయారైపోయింది. మరికొద్ది రోజులకే స్కూలు సుగరు ఫ్యాక్టరీ నుండి కొత్త భవనాలకు తరలింది.ఆ తరువాత కొద్దిరోజులకే నాకు వేరే స్కూలుకి బదిలీ అయిపోవడంతో ఆ రోజు నేనీవూరు ఒదిలివెళ్లాల్సివచ్చింది.

పదేళ్ల తర్వాత ప్రమోషన్‌మీద ఈరోజు మళ్లీ ఇక్కడికి రావడం. స్కూలు అప్పటిలా లేదు. ఆరోజు నూరు నూట యాభై మంది విద్యార్థులు మాత్రమే వుండే ప్రైమరీ స్కూలు. ఈ రోజు ఆరు వందల మందికి పైగా చదువుకుంటున్న ఏగ్రేడు హైస్కూలు. విశాలమైన తరగతి గదులుండే ఎత్తైన భవనాలు, హాస్టల్‌గదులూ, డైనింగు హాలూ, టాయిలెట్లూ బాత్‌ఘూట్లూ... దేనికదే వేరువేరుగా కనిపించే భవన సముదాయం. విశాలమైన ఆటస్థలం. రోడ్డుకానుకొని కొన్ని పూలమొక్కలు. విస్తరించిన పాఠశాల సరిహద్దులు. సరిగ్గా అప్పుడే బూగన్న గుర్తొచ్చేడు. సాయంత్రమెప్పుడో వీలుచూసుకొని ఊర్లోని బూగన్న ఇంటికి వెళ్లాలని అనుకున్నాను.

టైమ్ అయిందని క్లాసులోకి అడుగుపెట్టేను. పిల్లలెవరూ కనిపించలేదు. ఏమైందని అటుగా వచ్చిన కుర్రాడిని అడిగాను. "భోజనాలు లేటండీ" అన్నాడు. అటు వెళ్లేను. పిల్లలందరూ పళ్లేలు పట్టుకుని వరుసల్లో నిల్చొని వున్నారు ఎండలో. వంట పూర్తవలేదు. వార్డెన్ గారు దగ్గరుండి పొయ్యిలో కర్రలు పెడుతున్నారు. 'చూడండి

సార్! ఇంత పెద్ద బిల్డింగైతే ఇచ్చేరు గాని, ఇంతమంది పిల్లలకి వండి పెట్టడానికి కుక్కులు లేరు" అన్నారు. నాకు ఆ విషయం తెలుసు. కానీ ఇప్పుడు చూస్తున్నాను. మరి వంట ఎలా చేసి పెడుతున్నారు? అని అడిగాను. "ఇదిగోండి ఉన్న ఒక్క కుక్కూ ఒంట్లో బాగులేదని ఇంట్లో పడుకున్నాడు. వాడి బదులుగ ఒకడిని కూలికి పెట్టేడు మరొకడికి నేను కూలికి మాట్లాడి పెట్టేను." అని అంటుండగానే బూగన్న కొడుకు జమ్మన్న గుర్తొచ్చేడు. ఎందుకంటే ఆ రోజు కొత్తభవనాల పునాదులు తవ్వుతున్న రోజున "నా పరిస్థితేటి?" అని అడ్డంగా నిలబడిన జమ్మన్నకి ఆఫీసరు గారు "అందాక హాస్టల్ పిల్లలకి వండిపెట్టవోయ్" అని జీపెక్కేయడం నాకు బాగ గుర్తుంది. ఆ రోజు కూడా వార్డెన్‌కి వంటకోసం ఎలాగూ కూలి మనషులు కావాలి కాబట్టి అతన్ని కూలికే పెట్టుకున్నాడు. నెలవారి కూలిడబ్బులు ఇస్తుంటే అది జీతమని అనుకునే వాడు.

ఈ లోగా వంట పూర్తయినట్టుంది. పిల్లల్లో అలికిడి. కొంతమంది లైనులో వున్నారు. మరికొందరు గుమిగూడి వున్నారు. దగ్గర్లోవున్న పీటీ మాష్టారు విజిల్ వేస్తున్నారు. ఆరు బయట చెట్టుకింద ఆ దృశ్యం నన్నాకర్షించలేదు కానీ వంటగది గోడ నానుకొని వున్న దృశ్యం నా దృష్టినాకర్షించింది. అక్కడ కొంత మంది ఊర్లో వాళ్లు ఖాళీ పళ్లేలు పట్టుకొని వేచి వున్నారు. అలా పిల్లల భోజనాలు పూర్తయ్యేవరకు వాళ్లు ఎదురుచూడ్డం కూడా నాకు తెలుసు. ఎందుకంటే ఆ రోజు హాస్టల్లో కూలిపనిలాగానో, సాయం చేయడానికనో పనికి వచ్చిన వాళ్లు ఆ రోజు పిల్లలు తినగా మిగిలింది తీసుకు వెళ్లడం అక్కడ సాధారణం. కానీ వాళ్లలో ఒక ముసలివాడు నాకు ప్రత్యేకంగా కనిపించేడు. చేతిలో కర్ర. ఏమాత్రం మారని గోచి గుడ్డ. మరింత ఒడలిపోయిన శరీరం. బూగన్నే అయివుంటాడని అటు నడిచేను.

అతడే. దశాబ్దాలుగా ఏమార్పు లేని ఒకానొక ఆదివాసీ. "ఏం బూగన్నా! బాగున్నా?" పలకరించేను. అలా పలకరించడం నాకలవాటు. దానికతను "ఏం బాగు గురువూ? నీవు బాగుంతే నీను

బాగున్నట్టిగే" అని అనడం అతనకలావాటు. కానీ ఈ సారి నా పలకరింపుకి అతనలా స్పందించలేదు.

అప్పటికన్నా కొంచం వంగివున్నాడు. శరీరం తన ఆధీనంలో లేనట్టు అతని చేతిలోని కర్ర చెప్తోంది. నేనని గుర్తుపట్టినట్టు లేదు. ఐనా ఆశ్చర్యంగా నావైపు చూసేడు. ఒక్కసారిగా గుర్తుపట్టి నాదగ్గరకు రాబోయేడు. వారించి నేనే అతని వైపుకి నడిచి అన్నం వేయించి పంపేను. "బాగున్నావా గురువా?" అడిగాడు. చెప్పాను. అతనితోపాటే నడుస్తూ అతనింటి వైపు అడుగులు వేసేను. గడపలో నులకమంచం వేసేడు. లోపలికి అన్నం గిన్నెతో లోపలికి వెళ్లేడు. ఇల్లంతటినీ కలయ చూసేను. అప్పటిలాగే వుంది. అదే గడప. అదే పెణక. అప్పటిలాగే నులక మంచం.... ఏదీ మారలేదు. ఆ రోజు ఇదే నులక మంచమ్మీద నేను కూర్చున్న క్షణాలు గుర్తొచ్చాయి. మంచం మారలేదు. ఇల్లూ మారలేదు. ఆ రోజు నేనొచ్చింది దీపాల వేళ. ఆరోజు బూగన్న దీపం వెలిగించడం నాకింకా గుర్తుంది. ఈ రోజు మిట్టమధ్యాహ్నం వేళ. వెలుగులో తేడా. ఇంతలో బూగన్న ఇంటిలోపలి నుంచి బయటికొచ్చేడు.

"తిన్నావా?" అడిగాను.

"తింతాన్లే గురువూ!" అని నా కాళ్ల దగ్గర అరుగుమీద కూర్చున్నాడు. మంచంపైన కూర్చోమని ఎంత చెప్పినా వినలేదు. కుశలమడుగుతూ "మల్లా ఇక్కడికొచ్చినావా?" అన్నాడు. ఔనని తలవూపేను. దానికతడు సంతోషపడిపోతూ "పోన్లే... నువ్వొస్తే నాకింత తిండి దొరుకుతాదినే" అన్నాడు. ఆమాట నాకు ముఖమ్మీద ఫెడీల్మని కొట్టినట్టైంది. నేనేమీ మాట్లాడలేకపోయేను. కాసేపటికి ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గుర్తించేను. అదే అడిగాను. "ఎవలుంతారు ముసిలోడితోని?" అని చుట్టముట్టించేడు. అప్పుడు గుర్తొచ్చేడు... "జమ్మన్నో?" అని అడిగాను. ఆరిపోతున్న చుట్టని మండించడానికి నోట్లోని చుట్టని పెదాల మధ్యబిగించి గుప్పుగుప్పున పొగ లాగుతున్నాడు. అతని ముక్కులోంచి పొగ తెరలుతెరలుగా వస్తోంది.

నాలో ఆతృత పెరిగిపోతోంది. చుట్ట అంటుకుంది. పొగనొదుల్తూ చెప్పాడు మెల్లగా... "ఆడికి నామీద కోపం గురువా... సంపాదించిన బూమిని నిలబెట్టుకోలేకపోయినానని కోపం నామీద. ఈ ముసిలి పండుతనంలోన నీనేటి సెయ్యగల్ను సెప్మి?" అని ఆగేడు.

"ఏమైంది?... ఎక్కడికెల్లేడు??" అని అడిగాను.

"దేసిమెలిపోనాడు... ఇక్కడుండి మాత్రం ఆడు సేసిందేటి? మనుసులు కావాలనుకోని మేస్త్రీ వొచ్చినాడా టౌనుకాసి? ఆపొద్దే ఎలిపోనాడు. ముందు ఆడొక్కడూ ఎల్నాడు. మూడుమాసాలున్నాడు. ఆ తర్వాత పెల్లం పిల్లల్ని మల్లా పట్టికెలిపోనాడు." అని ఆగేడు. అతని కళ్లలో తిరుగుతున్న నీటిని చూడగలిగేను.

"ఎక్కడున్నాడు?" ఏదో అడగాలి కాబట్టి అడిగాను

"మద్రాసో అదేమిటోగాని నాకా పేరుమల్లా నోరుతిరగదు" అని దీనంగా చెప్పేడు. "ఉన్న బూమిలోన ఇంతరవ్వ ఇంతరవ్వని బడి బిల్డింగులు ఇన్ని కట్టీసినారు. నాకు పైసా ముట్టనేదు. గిరిజిని పిల్లల కోసం బడి అన్నారు. మరి నీను గిరిజినీ కాదేటి? నా తిండెలగ? ఆ రోజు నీనంతే బూమికోసం సంగాల్లంట తిరిగోడిని. ఈ వేల జమ్మన్న అలగ తిరగడానికి సంగాలున్నాయి గాకనా? ఉన్నే తిరిగ్గలిగిన ఓపికున్నాది గాకనా? అందకే ఆడిదారి ఆడు సూసుకున్నాడు." అని ముగించేడు. ఇంకేమీ మాట్లాడలేకపోయాను, వస్తానని చెప్తూ లేచేను. వీడ్కోలు చెప్తున్నట్టు నా చేతులు పట్టుకున్నాడు. అతని కళ్లలోకి చూసేను. ఆరోజు నేను ఇంటికొచ్చిన గుర్తుగా నా చేతిలో తాండ్రచుట్టని పెట్టేడు. ఈ రోజు మా నేస్తరికానికి గుర్తుగా ఏమైనా పెడతాడా? ఆసక్తిగా ఎదురు చూసేను. ఆధునికుణ్ని కదా! కానీ అతని కళ్లలో శూన్యాన్ని చూసేను.

"గురువూ ఒక్క సాయం సేస్తావా?" అని అర్థించేడు.

"చెప్పు" అన్నాను నేనతనికి చేయగలిగిందేమిటా అని.

"వార్డినుకు ఒక్క ముక్క సెప్పు గురువూ .... ఒక్క మద్దేనమే ఇన్నిగలు మెతుకులు సాలు. రేతరకైతే సుక్క సారా ఎలగైన

దొరికిపోద్ది. నీవు సెప్తే ఐపొద్ది. ముసిలోడ్నిగదా" అర్థిస్తున్నాడు. నాకు గుండెలు పిండేసినట్టై అతన్ని దాటి వచ్చేసాను. జీవితమంతా ధారపోసి పోరాటాలు చేసిన వాడికి ఈ రోజు పూట మెతుకులు కోసం ఒక్క మాట సాయం అర్థిస్తున్నాడు. అతని నేలమీద అతను అడుక్కుంటున్నాడు.

పొద్దు కొండచాటుకు చేరింది. తరగతిగదుల్లో మాష్టార్లు ఆరోజుకి చివరిపాఠాలు చెప్తున్నారు. ఉన్నట్టుండి సైన్సు మాష్టారు అరుచేరు... "పశువులు తోలండ్రా! మొక్కలు మేసేస్తున్నాయి" అని. పిల్లల్ని పంపించేరు పశువుల్ని అదిలించడానికి. "ఏమయ్యా! బుద్ధీ బుర్రాలేదా మీకు పశువుల్ని కట్టరా మీరు? మొక్కలెలా తినేస్తునాయో చూడండీ" అంటూ మాష్టారు కోపగించుకుంటున్నారు. ఆ మాష్టారిని చెప్పడానికి వరండ వైపు అడుగులేసేను. తిరిగొచ్చేసరికి ..ఎదురుగా పశువుల్ని తోలుకుంటూ నిశ్శబ్దంగా స్కూలు గేటు దాటి పోతున్న బూగన్న కనిపించేడు. నా గుండె కలుక్కుమంది. మాష్టారిని వారించేను. అతనికి బూగన్న గురించి చెప్పాలనిపించింది. ఎందుకో చివరి నిమిషంలో విరమించుకున్నాను. 'తన నేల మీద తాను పరాయిగా మారిపోవడం' నా కళ్ల ముందు కదలాడింది. అతను వెళ్లిపోయిన గేటు వైపు చూసేను. నిశ్శబ్దాన్ని గేటుకి తగిలించి, సమాధానం లేని ప్రశ్ననేదో నావైపుకి సంధించి వెళ్లిపోయినట్టు గేటు ఇటూ అటూ వూగుతోంది.

*(11వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక*
*చినుకు - మే, 2016)*

# బుగ్గి

**చీ**కటంతటినీ రెండు మూటలుగా కట్టి కావిడి చేసి భుజాని కెత్తుకున్నట్టు నడుస్తున్నాడు బూగన్న బొగ్గుల కావిడితో. ఆ బరువుతో అతనలా నడుస్తోంటే అతని భుజమ్మీది కావిడి బద్దా, మొల మీది గోచీ గుడ్డా లయబద్ధంగా వూగుతున్నాయి.

పొద్దెక్కడానికింకా సమయముందని తూరుపు కొండ మీది వెలుగు చెప్తోంది. నడవడానికింకా చాలా దూరముందని ఒంటి మీది చెమట చుక్కలు చెప్తున్నాయి. బూగన్న నడుస్తున్నాడన్న మాటే గానీ అతని దృష్టంతా తనను నడిపిస్తోన్న దారి మీదే వుంది. మరొండడుగులు వేస్తే చింత మాను కురికి దిగిపోతాడు. అక్కడికి రెండడుగులేస్తే గెడ్డ, గెడ్డ దాటితే పొలం గట్లు... అవీ దాటితే తార్రోడ్డు.

అక్కడి దాకా బెంగ లేదు. ఎప్పుడూ..? ఏ పారిస్టోడూ, ఏ పాపిస్టోడూ అడ్డగించకపోతే.

మరక్కడికి చేరాలంటే పొద్దు బారడెక్కినంత నడాల. ఎక్కడా అలుపుదీర్సడానికి కూడా ఆగకుండా.

ఆగితే? పొద్దు దాటిపోయి, పారిస్టోడి బండి ఎదురౌతాది. ఆడి బండి ఎదురయ్యిందంతే నాగ్రోజుల కష్టమంతా బుగ్గిపాలైనట్టిగే. రెండు రోజులుగా కాలుతున్న బొగ్గుల బట్టీ కళ్ల ముందు కనబడింది. పార పనీ, గొడ్డలి పనీ ఆపై రెండు మూడు రోజుల కాపలా. అన్నీ కళ్ల ముందు కదలాడేయి.

అడివిలోన ఎండిన కర్రల్నీ, మొజ్జుల్నీ మోసుకు రావాల. ఒక్కడూ ఐతే సాల్లేమని ఇద్దరిని తెచ్చేడు కూలికి మాట్లాడేడు. ఒక్కొక్కరికీ రోజుకి వందా, పూట భోజనం, సాయంత్రానికి సారా. ఒక రోజు ఒకడొస్తే మరొక రోజు మరొకడు రాడు. ఇద్దరొచ్చిన రోజు ముసిల్దాయి ముసుగేస్సింది. నానా బాదలూ పడి బట్టి తవ్వడం మొదలెట్టిన మూడు రోజులుకి పని పూర్తి చేసేడు.

ముసిలోడు అడివి దాటడానికింకా చాలా నడవాల్సి వుంది. అతడి దృష్టంతా దారి మీదే వుంది. నేలరాలుతున్న చెమట చుక్కలు గానీ, భుజాల మీద వూగుతున్న బొగ్గుల మూటలు గానీ అతని ఆలోచనల్లో లేవు. దారీ... దారి పొడుగునా తన దారికడ్డం రాబోయే వారి గురించే ఆలోచనలు...

కనబడిన వోలందరూ తన మీద పగబట్టినట్టే కనబడుతున్నారు. పారిష్టోడంటాడు.... బొగ్గులు కాలిస్తే అడివి తరిగి పోతుందని, సెట్లు నాశినమైపోతున్నాయని. "ఎన్ని సెట్లు నరికితే ఒక బస్తా బొగ్గులయ్యాయి వోయ్" అని ఊరు బడిలో సెపుతున్న మేష్టు అడుగుతాడు. 'అదేదో అడివంతా నీను బొగ్గులు కాలిస్తేనే నాశినమై పోతున్నట్టిగ మాట్లాడతారు' రోడ్డు మీద లారీల్లారీలు కలప పట్టికెలిపోతుంటే మాత్రం ఎవులూ ఉలకరూ పలకరూ... ఎవుడైనా అడిగితే దానికి పెర్మిసనుందివోయ్... అది మంత్రిగారిదని బుకాయించేస్తాడు. దోసికి దొబ్బీడానికి అనుమతులూ... బతకడానికి బొగ్గులు కాలిస్తే బొక్కల తోసీడాలా? ఇదేమి నాయిమో... లమ్డీకొడుకుల

నాయిము!! నా కడుపు మాడి రెండు మెతుకులు దొరుకుతాయని ఈ పనిసేస్తే అన్నేయంమూ... లారీల్లారీలు నరిక్కెలిపోతే నాయమైపోయిందా? నీను సేస్తే తప్పు... ఆడు సేస్తే ఒప్పా? అడివి మీదే అనీసి పట్టాలిచ్చి పొటొలు తీసినపుడు 'ఇక నుండి అడివి మీది బతకడం కోసం కట్టెలు కొట్టుకోవచ్చని' పోజులిచ్చేరు. గానీ పారిస్టోడికి ఎదురైనపుడు ఆమాటే సెప్తే "అటవీ హక్కులు" కాగితాలు సూబెట్టి అడివి నరికేస్తామంతే మీమొప్పుకుంతామేటని బొక్కల తోసెస్తాడు.... గవర్మెంటోడి దొంగ నీతి!

ముసిలోడి మొలమీద ఊగుతున్న గోచి గుడ్డ తడిసి పోయింది... చెమటతో. భుజమ్మీది కావిడిబద్ద బరువెక్కడం తెలుస్తోంది. గెంజితాగి బయలెల్లినా బాగున్ననుకున్నాడు...'గెంజితాగడానికి పొయ్యి ముట్టాల గదా' అని సమాధాన పరుచుకున్నాడు వెంటనే. చెట్ల సందుల్లోంచి పొద్దు బొల్లి మచ్చల్లా పడి దారి చూపెడుతోంది. దారంతా రాళ్ల మయం...గతుకులు గతుకులు, ఎగుడు దిగుడులు...

మండుతున్న బొగ్గుల బట్టి కనపడింది. ఓ సారి పారిస్టోడు తన బొగ్గుల్ని ఎలా ఎత్తుకు పోయాడో గుర్తొచ్చింది....

బట్టీ ఎర్రగా మండుతోంది. కన్నాల్లోంచి పొగ నెమ్మదిగా బయటకు వొస్తోంది. గాలి వేగం ఓ మాదిరిగా వుంది. అది ఏమాత్రం ఎక్కువ వీచినా కన్నాల్లోంచి గాలి దూరి లోపల బొగ్గులు మండి పోతాయి, అలా జరిగితే మిగిలేది బొగ్గులు కాదు బుగ్గే. అలా జరక్కుండా వుండాలంటే కుండతో నీలు పక్కనే వుండాలి. నీల కుండ పట్టుకొని హాష్టలు బోరింగు వైపు అడుగులేస్తుంటే మోటరు బైకు శబ్దం ఆలకించేడు. ఎప్పుడూ వొచ్చే షావుకారని అనుకుని ముందుకెలి పోతుండగా బట్టి పక్కనే బండి ఆగింది. బండి మీద నుండి పారెష్టు గార్డు దిగేడు. నీళ్లకని వెల్తుంటే పారిపోతున్నాడేమోనని పరిగెత్తి వొచ్చేడు. ఆ గాబరాకి రాయితగిలి ముందుకు తూలి పడిపోయేడు. ముఖం గట్టుకి గుద్దుకున్నాడు. ఆ శబ్దానికి బూగన్న వెనుతిరిగి చూసేడు. చేతినున్న కుండ వొదిలేసి గార్డుని పట్టుకుని మంచమ్మీద కుర్చోబెట్టి "సూసుకోవా బాబూ!" అని పలకరించేడు. "నన్ను సూసి

పారిపోతావురా లమ్డీకీ" అన్నాడు పలకరింపుకి ప్రతిగా. అతని ముఖం మట్టి కొట్టుకుపోయుంది. దానికి తోడు కోపంతోను, దెబ్బతిన్న అహం తోనూ మరింత ఎర్రబడి వుంది.

"పారిపోయినోడినైతే ఎదురెందుకొస్తాను బావు?" అని పక్కనే వున్న కంపురొడ్డ ఆకుల్ని తెంపు రెండు అర చేతుల్లో నలిపి రసం కారేలా పిండుతున్నాడు.

"ఏట్రా ఎదురు మాట్లాడుతున్నావు?" అని పేంటు పైకెత్తి ముడుకు చూసుకుంటున్నాడు.

రగిడిన చోట రసం పిండుతూ... అన్నాడు బూగన్న " సిన్న మంటవుద్ది బావూ వోర్సుకో... బేగి మానుతాది పుండు నీరు పట్టదు"

"ఒరే సంపెస్తావేట్రా!" అని అరిచేడు గార్డు గాయం మంటకి. కంపు రొడ్డ పిప్పిని గాయానికి ఒత్తుతూ అన్నాడు బూగన్న మళ్లీ "నీకు పున్నిముంతాది బొగ్గులొాదిలీ బావు" అని. ఆ మాట గార్డు మరోలా అర్ధంచేసుకొని ''ఇంత సేవ సేసింది ఒగ్గేమని సెప్పడానికిరా?" అన్నాడు. కాదని ఎంత చెప్పినా గార్డు మనసు కరగలేదు. ఒదల్నన్నాడు. కాదంటే కేసు కట్టేస్తాననీ అన్నాడు. ఎక్కువ మాట్లాడితే బొక్కలో తోయించేస్తానని బెదిరించేడు. బూగన్న కాళ్లు పట్టుకొని బ్రతిమాలేడు. కష్టాలన్నీ ఒక్కొక్కటీ వివరించి చెప్పేడు. చివరికి ఒక ఒప్పందాని కొచ్చేడు. బట్టి ఆర్పిన తరువాత సగం మూటలు గార్డుకిచ్చియాలని. ఒప్పుకొని తీరాల్సిన ఒప్పందం. తల వూపేడు బూగన్న. అప్పటికే బొగ్గులు బొక్కల్లోంచి మంట ఎత్తిరింది.

కొండ దారి పొలం దిగింది. గట్టుమీద కావిడి నడక. పొద్దు మరింత పైకెక్కింది. మరింత జాగ్రత్తగా నడవాలిప్పుడే. ఊరు దగ్గరవుతున్నపుడే దొరికిపోయే ప్రమాదాలు ఎక్కువ. ఎవరి కంటా పడకూడదూ... వీధులంట తిరిగి అమ్మకం జరిగిపోవాలి. గేసు పొయ్యి రాడంతో బొగ్గులు బేరం పోయింది. ఎక్కడ బొగ్గులు కొంతారో ఆ ఈదిలంటే అమ్మాల...అమ్మకంలో నష్టం రాకూడదు. నష్టం సంగతి దేవుడెరుగు...కేసు కాకుండగుంతే సాల్ను.

ఆ రోజూ బొగ్గుల బట్టీ కాలుతోంది నిశ్శబ్దంగా. గాలి రివ్వున వీయడం మొదలు పెట్టింది. నిలబడి గాలిని గమనించేడు. ఇది ఒదిలే గాలి కాదని గబగబా అడుగులు వేయడం మొదలెట్టేడు. బోరింగు నుండి నీళ్లు తేవడానికి. దూరంగా హాస్టల్ గోడ దాటి బోరింగు చేరుకున్నాడు. అప్పటికే కొందరు హాస్టల్ పిల్లలు భోజనాలు చేసి ప్లేట్లు కడుక్కుంటున్నారు. వాళ్లు ఖాళీ చేసే దాకా ఆగితే బొగ్గులు మండి పోవచ్చని గాబరా పడి పిల్లల్ని బతిమాలి నీళ్లు పట్టుకున్నాడు. గబగబా బొగ్గుల బట్టిని చేరుకొని తడిపేడు. మరో రెండు కుండల నీళ్ల పోసి మరో కుండనీళ్లు ప్రక్కనే పెట్టుకున్నాడు. రాత్రంతా నీళ్ల కుండల్తో కాపలా కాసేడు. నాలుగు కొయ్యిలు పాతి రెండు ఎండు కొమ్మల్తో వేసిన పందిరి కింద నులక మంచం మీద చేర బడ్డాడు. పైన చుక్కలాకాశం. చుట్టూ చలి నిండిన ఆకాశం. దూరంగా ఊరిలోంచి కరెంటు స్తంబాల వెలుగు ... మరో వైపు అడవి లోంచి ఏదో జంతు సవ్వడి. మరో వైపు ఊరు మీది నుంచి వీస్తోన్న సన్నటి గాలి. ముసిలోడి చుట్టూ ముసురుకున్న ఆలోచనలూ. దేశమెలిపోయిన పెద్దకొడుకు... ఎలా వున్నాడో... ఏమి పని చేస్తున్నాడో... ఎప్పుడొస్తాడో!!! చెవిలో దోపిన చుట్టని తీసి ముట్టించేడు.

పొగ వదుల్తూనే ఆలోచించ సాగేడు. ముసిల్దాయి పక్కనే మంచం కి అవతల అంచుకి అటు వైపు తిరిగి పడుకుని వుంది. తెల్లారీ తెల్లారగానే బొగ్గులు ఎత్తీయాల. గోని సంచీల్లో కుట్టీసి తుప్పల్లో దాసీయాల. లేక పోతే ఏ పారిస్టోడో, పాపిస్టోడో పారొస్తే మల్లా మొదులుకెల్తాది బేరం. తెల్లారి గట్ట బండేసుకొని ఎలిపొస్తానన్నాడు మేరంగి షావుకారి. నాలుగు బస్తాలుంచ మని వందరూపాయలు బయాన ఇచ్చేడు మొన్న సంతల కనపడి. ఆడిగ్గాని అనుకున్న బొగ్గులు ఇయ్యకపోతే ఊరిల మరుంచడు. ఈది మద్దిన 'బూంగ్ బాంగ్'సేసెత్తాడు...అని చుట్ట ఆర్పేడు.

ముసిలిదాయి ఇటు కదిలింది. "తిన్నాదో లేదో" అని పందిరి రాటకి వేలాడుతున్న ఉట్టిలోని దాకని వంచి చూసేడు. తిన్నట్టే వుంది.

'ఐనా తినడానికి ఇదేటైనా మెతుకు బువ్వలా?' వుట్టి కిందికి దించేడు. చెయ్యి దులుపుకుని దాకలో ముంచేడు. గెంజితో పాటు నూక బువ్వ చేతికి నిండా తగిలింది. ముసిలిదాయి తిన లేదని గ్రహించి లేపబోయేడు. చేయిముందుకు చాచి ఆగిపోయేడు. ముసిలిదాయి గురక పెడుతుంది. లేపినా తిడతాది గానీ తినదు. అదెప్పుడూ అంతే తిన్నానని ఇంత గెంజి తాగేసి మెతుకులన్నీ తన కోసమే వొదిలెస్తాది. "ఏమే?" అనడిగితే "నా తిండేమి తిండీ.. 'అపర...సపరే' అని ముసుగు తన్నేస్తాది లేక పోతే పనిలోకి ఎలిపోద్ది. 'ఈ బొగ్గుల డబ్బులొస్తే మిల్లు కెల్లి నూక బియ్యం కొనాల... ముసిలిదానికి కడుపు నిండా తినిపించాల' అనుకున్నాడు. గబ గబా తిండి ముగించి కుండలోని నీళ్లతో కడిగి బొగ్గుల బట్టీ మీద జల్లేడు. బట్టి చుట్టూ మరొక్క సారి తిరిగి కన్నాలన్నిటినీ ఒక్కొక్క దాన్నీ జాగ్రత్తగా పరిశీలించి మంచమ్మీద చేరబడ్డాడు.

తెల్లవారేసరికి మోటర్ సైకిల్ శబ్దం వినపడింది.అటువైపు చూసేడు, మేరంగి షావుకారి. బండి ఆపి, గోని బస్తాలు మడతలు విప్పుతూ బట్టీ కేసి నడిచి వొస్తూ కనిపించేడు. అప్పటికే ఐదు బస్తాల బొగ్గులు ఎత్తేసేడు. అవి షావుకారికిచ్చీయొచ్చని అనుకున్నాడు. కానీ షావుకారి ఒప్పుకోలేదు. ఎందుకంటే అతని చేతిలో వున్నవి పెద్ద బస్తాలు. తాను ఎత్తినవి చిన్నవని తగువు తీసేడు. ఎదురుచెప్పలేక ఒప్పుకున్నాడు. ఎందుకంటే వంద 'బయాన' ఇచ్చేడు. దానికి తోడు అతని తో తగువు పడితే తిరిగి పారిస్టోడికి అప్పజెప్పేస్తానని బెదిరించేడు కూడ ఒకసారి.

పారెస్టోడితో ఒక భయం.

షావుకారితో మరో రకం భయం.

భయమెంతున్నా బతకడం తప్పదు.

బతకాలంటే భయం వొదలదు. బతుకే భయం.

షావుకారి తన బస్తాలన్నీ నింపుకున్న తర్వాత బండి లోంచి రెండు సీసాలు తీసేడు. ముసిలోడి చేతిలో పెట్టేడు.

“తెల్లారి తెల్లారి ఒద్దు షాకారీ!” అని మొగమాట పడ్డాడు బూగన్న.

“అదేట్రా, నాకాడ సిగ్గెందుకురా!” అని బలవంత పెట్టేడు. సీసా చూసి ఆశ పడ్డాడు. బూగన్న పెదాలు తడుపుకున్నాడు. పని కాసేపు ఆపి పందిరికింద మంచమ్మీద కూర్చున్నాడు. సీసా మూత తీసి గటగటా రెండు గుక్కలు తాగేడు. సీసా రంగుదైనా సారామాత్రం తనకు తెలిసిందే. వంటదే. షావుకారి కేసి చూసేడు. షావుకారి నవ్వేడు. “దార్లోన నీకోసమని పట్టి తెచ్చేన్రా!” అని నవ్వేడు.

షావుకారి నవ్వు పూర్తయ్యేసరికి బూగన్న రెండు సీసాల్నీ ఖాళీ చేసీసేడు. అప్పుడు షావుకారి లెక్క చెప్పేడు. గతంలో ఇచ్చిన బయాన తో మొదలెట్టి, అప్పుడప్పుడూ సంత కొచ్చినపుడల్లా షాపులో తీసుకున్న పొగాకు కట్టలకీ,ఉప్పూ మిరపకాయలకీ ఎంతిచ్చేడో అన్నీ కలిపి లెక్క కట్టి “ఇదిగోరా బూగన్నా! నీకే....” అని జేబులో చెయ్యి పెట్టేడు షావుకారి.

షావుకారి మంచమ్మీద కూర్చొనీ, బూగన్న అతని కాళ్ల దగ్గర మట్టిలో బొంతుకాలేసుకొనీ తలెత్తి రెండు కళ్లనీ దోసిళ్లు చేసి షావుకారి జేబువైపు చూస్తూ....

సూర్యోదయమయ్యేసరికి కొండకింద ఎప్పటికీ మారని ఆ దృశ్యం యధాతదంగా అక్కడ ఆవిష్కృతమైంది ఎప్పటిలాగానే.

బూగన్న మత్తు వదిలేసరికి అతని చేతిలో ఇరవై రూపాయల నోటు మిగిలింది. దూరంగా... దుమ్ము రేపుకుంటూ దూరమైపోతూన్న షావుకారి మోపెడ్ శబ్దం వినపడింది.

పొలం దారి దాటి.. రోడ్డు ... రోడ్డు దాటి ఊరు.. ఊరిలోని వీధులు... సందు గొందుల్లోంచి... బొగ్గుల బరువుతో బూగన్న. నడుస్తున్నాడే గానీ అతని నడక లోంచి సన్నగా వణుకు పుడుతోంది. అది భయం వల్ల వొచ్చింది కాదు. అంతదూరం నడిచి మోసుకొచ్చిన కావిడి బరువు వల్ల... వయసు భారం వల్ల. అతని వొళ్లు చెమట చెట్టింది. ఒక్కొక్క చెమట చుక్కా నేల రాలి మొలకెత్తడానికి పదును పెట్టుకుంటున్నట్టు చల్లబడుతోంది నేల.

సూర్యుడు నడి నెత్తిన నిలబడి చూస్తున్నాడు. ఎర్రగా. ఎంత తిరిగినా తాననుకున్న రేటు రాకపోవడం. ఒంట్లోని రక్తం అంతా చెమట చుక్కలయి నేల రాలుతున్నట్టు ... నిస్సత్తువగా, నిర్జీవంగా. ఎంతో కొంతకి ఇచ్చేసాడు. కళ్లు బైర్లు కమ్ముతున్నట్టు... మసక మసకగా. చేతిలోని నోట్లు ఎంతో కూడా లెక్కబెట్టలేనంత బలహీనంగా.... అడుగులేస్తున్నాడు. వీధుల్లోంచి బస్టాండు దాటి ఇంటి దారి పట్టబోతుండగా ఎవరో కుర్రాడు తన చేతిని నోట్లను లాక్కున్నాడు. తుళ్లిపడ్డాడు. ఎక్కడిలేనికోపంతో కళ్లెర్రగించి వాడి కాలర్ పట్టుకున్నాడు.

వాడు....

తాగి వున్నాడు.

జీను ఫేంటు తో జారిపోయిన ఇన్ షర్టు చేసుకొని వున్నాడు.

చేతిలో మాసిపోయిన గుడ్డ సంచీ వుంది.

పిడికిలి మరింత బిగించి కళ్లు చిట్లించి చూసేడు బూగన్న.

వాడు.... ఇల్లొదిలి పనుల కోసం వలసెల్లిపోయిన కన్న కొడుకు నాగన్న. కూలి పనులకెల్లి రెండు డబ్బులు సంపాదించి ఇంటికొస్తాడని ఆశపడిన కొడుకు ఇలా ఎదురయ్యేడు. బూగన్నకి ఏమి చెయ్యాలో తెలీలేదు.

“సరిపోతాయో లేదో ఇంకా... సెల్లు లేక టౌనులోన తిరగనేక పోతున్నాము. తలెత్త లేకుంటున్నాము” అని తూలుతూ తండ్రి చేతిని విసురుగా విడిపించుకొని ఏదో గొణుక్కుంటూ ఇంటి వైపు వేగంగా అడుగులేస్తూన్న కొడుకు లీలగా అస్పష్టంగా అలికినట్టు కనిపించేడు బూగన్న కంటికి. వాడిని అంకదుకొని వాదనకు దిగే శక్తి, ఓపికా బూగన్నకి లేవు. నిశ్శత్తువగా కూలబడిపోయేడు.

బూగన్న కి ఆ మాటలూ వినపడలేదు. విన్నా అర్థం చేసుకోలేదు.

అర్థమయ్యింది ఒక్కటే... తానెంత కష్టపడుతున్నా ఫలితాన్నెవరో ఒకరు లాక్కుపోతున్నారని. తనకు మాత్రం మిగిలేది బుగ్గేనని.

*(సాహితీ ప్రస్థానం --)*

# నిత్య నిర్వాసితులు

**అ**డవి దారి దాటి రోడ్డెక్కాడు గుంపయ్య. భుజాన వెదురు బొద్దు బరువు అతన్ని పదపదమని ముందుకుతోస్తోంది. టౌను చేరేసరికి ఒళ్ళంతా తడిసి ముద్దయిపోయింది. బస్టాండ్ రద్దీగా వుంది. అప్పటికే తన వూరి వాళ్లు వెదురు బొద్దుల్ని నిలబెట్టి ఎండలో నిలబడి వున్నారు వరుసగా...మంచి రేటుకోసం ఎదురుచూస్తూ. ఎండ చుర్రు మంటుంది. వెదురు బొద్దు చెల్లడానికి ఇంకా టైము పట్టినట్టిగే వుందని పక్కకి చూసేడు గుంపయ్య. ఒక్కొక్కరివీ రేటు అటూ ఇటులోన చెల్లిపోతున్నాయి. తన వెదుళ్లూ చెల్లిపోతే టౌనులో సామాన్లు కొనుక్కొని ఇంటికెల్లిపోవచ్చు అనుకున్నాడు.

ఇల్లంటే వూరు గుర్తొచ్చింది. వూరంటే కాలిపోయిన గోడలు... చింత చెట్టునీడ. ఆ నీడ కూడా ఊరికి దూరంగా వుంది గాబట్టి ఆ చింత చెట్టు కాలలేదు. లేకపోతే ఆ నీడకూడ దొరక్క పోను. అలాగే

జరిగివుంటే వూరొదిలి... అంటే కాలిన గోడల్ని వొదిలి దూరంగా వెళ్లాల్సి వుండేది.

ఆ రోజు గుర్తొచ్చింది. అది ఊరు కాలిపోయిన రోజు మాత్రమే కాదు. వూరి కలలు కాలిపోయిన రోజు కూడ. సల్లందులేలకి ఇంకా గంటో గడియో వుంది. ఊరు సిమోరుగుంది.ఆ రోజు పక్క వూరిలో సంత. వూరు వూరంతా సంత సందడిలో పడిపోయింది. మిగిలిన పిల్లలు బిడ్డికోల గడపలోన ఆట సందడిలోన పడిపోయున్నారు. గుంటలు ఎంత సందడిలోనున్నారంతే బయట గాలి జా( కొడుతున్నా... కానుకోలేకపోయినారు. ఎండ నిప్పులు రాలుస్తుంది....గాలి జోరు మీదుంది. ఆటలో ములిగిపోయిన గుంటలకి ఆ యింటి ముంజూరు అంటుకుంతే గానీ తెలివిరాలేదు. తెలివొచ్చేసరికి వూరు మంటల్లోన మసైపోయింది.

గడపలోనున్నోలందరూ బయటికి పారిపోయి నారు గానీ లేకపోతే పిల్లలెంతమంది మంటల్లో కాలిపోయున్నో! గోల గోల. దేవుడా కాపాడూ అని అరడమే గానీ బిందిడు నీలుపోసి ఆర్పడానికి మల్లా లేకుండాపోయింది. గుంటలందరూ ఊరు అత్తల చింతమాను కిందకి చేరి బిక్కుబిక్కుమంటూ చూస్తూ వుండిపోయేరు. పెద్దలందరూ సంత నుండి ఊరు చేరేసరికి ఇల్లు మాడి మసైపోయి మొండిగోడలు మిగిలినాయి. ఏ ఇంటి నుండీ ఒక్క ముంతగానీ, తపేలగానీ తియ్యలేక సూస్తున్నోలు సూస్తున్నట్టిగే నిలబడిపోయినారు. కట్టుబట్టలు తప్పా ఏదీ మిగల్లేదు. మొత్తం బూడిదయిపోయింది.

"ఎంతవోయి?" అని వినపడేసరికి కాలిన వూరు నుంచి టౌనులో నిల్చున్నచోటుకొచ్చేడు గుంపయ్య.

"ఐదొందలు"

"ఐదొందలా?...ఇచ్చీ రేటు సెప్పవోయ్" అన్నాడు. అతని వైపు చూసేడు గుంపయ్య. రైతు. తనలాగే వున్నాడు.

"ఎంతిస్తావు?"

"రెండొందలు"

"నాకు గిట్టదు"

ముందుకు వెళ్లిపోయేడు. ఇంతలో పక్కనున్న సోమయ్య చెప్పేడు "మనూరికి ఎమ్మార్వో వొచ్చినాడట గురూ!" అని.

"ఏమిదనికి?"

"కాలిపోయిన వూరు సూడ్డానికొచ్చినాడట"

వెదుళ్లు బేరమాడి వెళ్లిపోయిన రైతు వైపు చూసేడు గుంపయ్య. పక్కనే బేరమాడుతున్నాడు. అతన్ని పిలిచి రెండొందలకే ఇచ్చేసాడు.

"ఏమిరా తొందరా?" అడిగాడు ఇటు వైపున్న మండింగోడు.

"ఇక్కడ మూడొందలుకి ఆశపడితే ఊర్లోన కాలిపోయిన ఇల్లు మల్లా తగలబడిపోతాదివోయ్!" అని ఊరు వైపు నడిచేడు. కాలిపోయిన వారంరోజులకి ఆ రెవెన్యూ అధికారి వొచ్చేడు. ఇల్లు సేంక్షను చేస్తాడని ఆశ. ప్రభుత్వం నుండి సాయమందుతుందని ఎదురుచూపులు.

అతనిలాగే అక్కడ నిలబడిన వాళ్లందరూ ఏదో ఒక రేటుకి ఇచ్చేసి వూరి వైపు పరుగులు తీసారు.

* * *

ఊరి చివర చింత చెట్టుకింద నులక మంచాలేసి వున్నాయి. మంచాల మీద అధికారులు కూర్చొని వున్నారు. చుట్టూ ఊరోల్లు మూగి వున్నారు. ఆడ, మగా, పిల్లలూ అందరి కళ్లలో ఏదో నిర్లిప్తత. ఊరు కాలిపోయిన తర్వాత కొత్తవాళ్లు రావడం, సానుభూతి ప్రకటించడం సాధారణంగా మారిపోయింది. అధికారులు వచ్చి చాలసేపయ్యిందేమో ముఖాల్లో అసహనం కనపడుతోంది. ఊరు కాలిపోవడానికి కారణాలు అప్పటికే అడిగేసినట్టున్నారు. సానుభూతి ప్రకటనలూ పూర్తయిపోయినట్టున్నాయి.

ఎండ చెట్టు సందుల్లోంచి అధికారుల ముఖంమీద పడుతోంది. మంచం జరపడానికి లేచి నిలబడ్డారు. అంతదాక పడమటి వైపున్న నీడ తూర్పు వైపు కదిలింది. ఆ లేవడమే లేచి ఎమ్మార్వో గారు గొంతు సవరించుకున్నారు. అందరూ అతని వైపు చూసేరు.

"మీ వూరు కాలిపోవడం చాలా విచారకరం. దానికి నా సానుభూతి ప్రకటిస్తున్నాను. ప్రభుత్వం తరపునుంచి ప్రతి కుటుంబానికి పాతిక కేజీల బియ్యం, రెండువేల రుపాయల నగదు అందిస్తున్నాను." అని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గారి వైపు చూసి "ఏర్పాట్లు చెయ్యండి" అంటూ ముగించారు.

అప్పటికి చేరుకున్న గుంపయ్య "అదికాదండి ఎమ్మార్వోగారూ!" అని ముందుకొచ్చేడు. అందరూ అతని వైపు చూసేరు. "మీరిస్తున్న బియ్యమూ, డబ్బులు మాకేమాత్రము సరిపోతాయో మీకూ తెలుసును, మాకూ తెలుసును. కాలిపోయిన వూరెలాగ కాలిపోయింది. అది మా కరమ్మ. ఇప్పుడు మాకు కావలసింది బియ్యమూ, రెండువేలూ కాదుగదండీ." అని ఆగేడు.

మరింకేమిటన్నట్టు చూసేరు గానీ అతనేమడగబోతున్నాడో ఎమ్మార్వోగారికి తెలుసు.

అదే అడిగాడు గుంపయ్య...."ఇల్లు ఇస్తే మాకు బాగుంతాది సార్!" అని.

ఆమాటతో వూరివాళ్ల కళ్లల్లో వెలుగు కనపడింది. అందరూ ఎమ్మార్వోగారి వైపు చూపుల్ని తిప్పేరు. నిలుచున్న చోట నుంచి రెండడుగులు ముందుకేసి, రెండు చేతుల్నీ ఫేంటు జేబుల్లోకి దూర్చి నిలబడి వూపిరి బిగపట్టి బలంగా విడిచిపెట్టేరు.

"మీ వూరికి ఆ పని చెయ్యడానికి అది నా పరిధిలో లేదు." చేతులెత్తేసారు... ఆ ఒక్కటీ అడక్కండి అన్నట్టు.'ఎందుకు?' అన్నట్టు చూసేడు గుంపయ్య.

దానికతను చిరునవ్వుని దాచుకుని ముఖంలో గంభీరతను తెచ్చిపెట్టుకొని అన్నారు..."ఇది నిర్వాసిత గ్రామం"

ఆమాట కుర్రాళ్లకు సగం అర్ధమయింది... ముసలి వాళ్లకి మాత్రం పూర్తిగా అర్ధమయ్యింది.

ఇప్పటి ముసలివాళ్లు యుక్త వయసులో ఉన్నప్పటి మాట. గుంపయ్య నెలల బాలుడైవుంటాడు. ఒకరోజు మిట్ట మద్యాహ్నం

వేళ వూరవతల కొండమలుపులో జీపుఆగింది. అధికారులు వూర్లోకి కిలోమీటర్లు దూరాన వున్న వూరుని కాలినడకన చేరుకున్నారు. మర్యాదలన్నీ అయ్యింతరువాత ఉన్నట్టుండి అన్నారు... “మీరు ఊరు ఖాళీ చెయ్యాలనీ’ అన్నారు. వూరు బిక్క చచ్చిపోయింది. తెల్లమొఖా లేసుకుని అధికారులు కూర్చున్న మంచానికి మరింత దగ్గరిగా వచ్చి కూర్చున్నారు ‘ఎందుకు?’ అన్నట్టు.

ఊరు దిగువుకి జంఝావతి డామ్ కట్టబోతున్నామనీ అది కడితే మీ వూరు మునిగిపోతుందీ, ఖాళీ చెయ్యాలని ఆ రోజు చావుకబురు చల్లగా చెప్పేరు. గట్టు అవతల ఉన్న వూరుకి నాలుగు మైళ్ల దూరాన జాగా చూపించి ఒక్కొక్క కుటమానికి రెండువేలు రుపాయలు, కట్టుకోడానికి జాగా చూపెట్టి ఇకనుండి ఇదీ మీ వూరు ‘పెల్లి వలస’ కాదు, ‘కంచాలపాడు’ అని ఒక బోర్డు పాతేసి రికార్డుల్లో రాసుకొని వెళ్లిపోయారు అధికారులు. ఊరు ఇక్కడైతే అడివికి దూరమై పోతుంది, ఇంకొక దగ్గర అడివికి దగ్గర జాగా చూపెట్టమన్నారు. అధికారులు వినలేదు. జీపు దుమ్ము రేపుకుంటూ వెళ్లిపోయింది. అదిగో అక్కడినుండి వూరి కళ్లలో, బతుకుల్లో దుమ్ము కొడుతూ మట్టి కొట్టుకుపోతుందే తప్ప ఏ ఒక్కరూ ఏమైందని ఏనాడూ రాలేదు అధికారిక వాహనం. ఏదిజరిగితే అది జరగనని ఎవ్వరూ కదల్లేదు. ఏమి అక్కడికి వెళ్లలేదని ఏ అధికారీ అడగలేదు.

చూస్తుండగానే కొత్తవూరికని కట్టిన బోర్డు విరిగి పింపురు పట్టి నేల రాలిపోయింది. జంఝావతి యేరు మీద ఉన్నట్టుండి గోడల్లాంటి సిమెంట్ కట్టడాలు లేచినిలబడ్డాయి. ఏరు మధ్యలో డామ్ నిర్మాణం జరిగిపోయింది. అది ఆసియా ఖండంలోనే ఏకైక రబ్బర్ డామ్ గా పేరు గాంచింది. పేపర్ల నిండా ఆ ఫోటోలతో నిండిపోయి యేరు పేరు మారు మోగిపోయింది. వరదలొస్తే వూరు మునిగి పోతుంది. కానీ ఎప్పుడూ ఆ పరిస్థితి రాలేదు. ఎందుకంటే ఎగువునున్న ఒరిస్సా రాష్ట్రం ప్రోజెక్టుకి అడ్డుపుల్లేసింది. ప్రోజెక్టు పూర్తవ్వాలని రైతులూ, ఒరిస్సా అనుమతి లేనిదే ముందుకెళ్లలేమని ప్రభుత్వమూ

అంటూ వస్తుండడంతో వూరికే హానీ జరగలేదు. అలాగే... ఆక్కడే వుండిపోయింది. ఇన్నాళ్లూ గడిచిపోయింది.

ఇలాంటి పరిస్థితిలో వూరు కాలిపోయింది.

"మొత్తానికి మావూరుకి ఇల్లివ్వలేమంతారు ... అంతేనా?" ఎవరో తనలోని అసహనాన్ని ప్రదర్శించేరు.

"మా రికార్డుల ప్రకారం ఇక్కడ పెల్లి వలస అనే పేరుతో వూరే లేదు. ఉన్నదల్లా కంచాలపాడు, అదీ గట్టుకి అవతల." అని ఎమ్మార్వోగారు నిట్టూర్చారు.

"మరి మీమక్కడ లేముగదా?" అన్నారెవరో.

"మీరు లేమంటే కుదరదు. మా లెక్కల ప్రకారం మీరక్కడే వున్నారు. ఆ లెక్కలెలా వున్నా ముందు మీరీ బియ్యమూ కిరసనాయిలూ తీసుకొండి" విసుగును అణుచుకున్న గొంతుతో అన్నారు.

"తీసుకుంతాము గానీ మాకు ఇల్లు ఒచ్చినట్టిగ సూడండి సార్" గొంతులో ఆశను నింపుకుని అడిగారింకొకరు. "మీకు అర్థం గావడం లేదు. ఇల్లు కోసం నలభై సంవత్సరాల క్రితం ఆల్‌రెడీ మీరు డబ్బులు తీసుకున్నారు. ఒక్కసారి డబ్బులు తీసుకున్న తర్వాత మళ్లీ ఇల్లు శాంక్షన్ చెయ్యడం కుదరదు." తెగేసి చెప్పేసారు ఎమ్మార్వో గారు మరింత అసహనాన్ని గొంతులో నింపుకుని.

ఇంతలో రామ్మూర్తి గారు అక్కడికి చేరుకున్నారు. అతని వెనుక పార్టీ కార్యకర్తలున్నారు. తోటపల్లి నిర్వాసిత గ్రామల కోసం చేసిన పోరాటం అతనికి కొత్త ఉత్తేజాన్నిచ్చింది. గతంలో ఈ వూరి రేషన్ కార్డుల గురించీ, పించను సౌకర్యం గురించీ పోరాడింది అతనే.

ఇప్పుడు కడుతున్న తోటపల్లి ప్రోజెక్టు నిర్వాసితులకి ఇల్లు కోసం లక్షాయాభైవేలూ... యెకరాకి మరొక లక్షా గుర్తొచ్చి "ఈ రోజు జంఝావతికి కూడా అలాగె ఇవ్వండి" అని రామ్మూర్తి గారు అడిగారు. దానికి ఎమ్మార్వో గారు చిరునవ్వు మళ్లీ ముఖమ్మీద పులుముకుని... "నేను చెప్పింది మీకింకా అర్థం కావడంలేదు" అని "రామ్మూర్తి గారూ మీకు తెలియందేముంది? ఏ ప్రోజెక్టుదా ప్రోజెక్టే...

దేని పరిహారం దానిదే. ఆ లెక్కన మీకివ్వడానికి ఈ వూరు తోటపల్లి నిర్వాసిత గ్రామం కాదు. ఆ పేరుతో ఇవ్వడం కుదరదు" తెగేసి చెప్పేసారు.

అందరికీ విషయమేమిటో అర్థమైపోయింది, రేపేం చెయ్యాలో.

* * *

ఐ.టీ.డీ.ఎ. కార్యాలయం. ఇంకా కళ్లు తెరుచుకోలేదు. గేటు బయటి టీ కొట్టు మాత్రం అదే పనిగా తన బాధ్యతని నిర్వర్తిస్తోంది. ముందొచ్చిన స్వీపర్లూ, అటెండర్లూ నెమ్మదిగా తమ పనిని మొదలుపెట్టేరు.

'ఇప్పుడేటి సేస్తాం వోయ్?' అని అందరూ గుంపయ్య వైపు చూసారు.

'ముందు పీవో గారిని కలుద్దుమా' అన్నాడు సాలోచనగా.

ఆఫీసులు ఎంత బద్ధకంగా నిద్రలేస్తాయో కళ్లారా చూసేరు. అధికారులు ఎంత దర్జాగా వుంటారో గమనించేరు. ఎండ వేడెక్కిన టైమ్ కి ఒక్కొక్క తెల్లకారూ రావడం మొదలైంది. చల్లటి కారుల్లోంచి దిగడం మొదలెట్టేరు అధికారులు.

ఆఫీసు ఎదర చెట్ల కింద కూర్చున్నారు. ఎండముదిరి రోజు వేడెక్కింది కానీ ఎందుకొచ్చారనీ, మీ సమస్య ఏమిటనీ ఎవ్వరూ అడగలేదు. పీవో గారిని ఎలా కలవాలో కూడ తెలీలేదు వీళ్లకి. ఊరెళ్లినా చెట్టుకింద కూర్చోడమే కదా, ఆ కూర్చోడమేదో ఇక్కడే కూర్చుందామన్నట్టు కూర్చున్నారు ఆఫీసు చెట్టుకింద.

రామ్మూర్తి గారు అక్కడికి చేరుకోవడంతో అందరిలో కదలిక మొదలయ్యింది. వీళ్లందరితో పీవో గారి ఆఫీసు లోపలికి అడుగుపెట్టారు మూర్తిగారు."నమస్కారమండీ! వీళ్లు పెల్లొలసోలు సార్!" అని మొదలెట్టబోయేరు.

"ఎక్కడుందావూరు?" అడిగారు. చెప్పారు

"నేనెప్పుడూ వినలేదే?"

"కంచాలపాడంతారండి" అందరు చెప్పారు

"ఓ... అదా! చెప్పండి..." అన్నారు పీవో గారు

గుంపయ్య అంతా వివరించి చెప్పాడు. "మీరే మాకిల్లిచ్చి ఆదుకోవాలయ్యా" అని ముగించాడు.

కాసేపు నిశ్శబ్దం తరువాత, పెదవుల్ని మునిపంట కొరుక్కొన్న తర్వాత ఎమ్మార్వో గారు చెప్పిన చెప్పిన మాటనే పీవో గారు మరోలా చెప్పారు " ప్రభుత్వం తో మాట్లాడి మీ సమస్యని పరిష్కరిస్తాను సరేనా?" అని

"అలాగంతే కుదరదండి. ఈ రోజు మీరేదో ఒక మాట సెప్పకపోతే మీము కదలమండీ" అన్నాడు గుంపయ్య... జీవితకాలపు అసహనాన్ని గొంతులో నింపుకొని.

పరిస్థితిని గమనించి ఓ పోలీసు అధికారి లోపలికి వొచ్చేడు. అతడు ఈమధ్యనే సీఐగా వచ్చిన చంద్రశేఖర్. అతనికి పెళ్లి వలస గ్రామస్తుల్ని పేరుపెట్టి పిలిచేంత చనువుంది. ఎస్సైగా వున్నపుడు తాగుడు, కొట్టుకోడాల కేసులు ఈ వూరి నుండే వుండేవి. 'ఎందుకురా ఈ సారా వంటకం... చెక్కగా పని చేసుకొని బతకండ్రా' అని అతనంటే 'మాకు పనిప్పించండి చేస్తాం' అని అనడం అతనికి గుర్తొచ్చింది. 'మా వూరోలకి ఒక రేషను కార్డులేదు, ఆధారు కార్డులేదు, ఇక్కడ మీమున్నామని గవర్మెంటుకి లెక్కేలేదు' అని అనేవాళ్లు. అప్పటికే ఆ వూరు ఇంటలిజెన్స్ వారి నిఘాలో వుంది. ఉపాదిలేక వలసెల్లి పోయాడనుకున్న ఆ వూరి వ్యక్తి ఒక ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం. వాడు చనిపోవడానికి ముందు ఆవూరికి వచ్చివెళ్తూ వుండేవాడని అనుమానం.

పీవో గారి ముఖంలో అసహనం స్పష్టంగా కనపడుతోంది. గుంపయ్య మాట్లాడుతున్నాడు..."నిజమేనండి ! ఆ రోజు మీరు చెప్పేరు ఖాళీ చెయ్యమని. వేరే జాగా మల్లా చూపెట్టేరు. అడివికి దగ్గర జాగా ఇవ్వండని మీమడిగేము. మీరివ్వలేదు. తెలిసో తెలీకో మీము కదల్లేదు. ఇన్ని సమచ్చరాలూ మీరేటీ అనలేదు, మీరేటీ అనలేదుగదా అని

మీమూ కదల్లేదు. అలగని మీము మనుసులం కాకపోతామా? మీము బతకడం లేదా? మాకూ ఒక దారి సూపెట్టండి" అతని గొంతులో అభ్యర్ధన వుంది.

"ఈ రోజు వూరి కాలిపోయి రోడ్డున పడ్డారు సార్! నలభై సంవత్సరాల క్రితం పరిహారం తీసుకొని ఊరు ఖాళీ చెయ్యలేదన్న ఒక్క కారణంతో ఇల్లివ్వకపోవడం అన్యాయం సార్. మీ లెక్కల ప్రకారమే ఏదైనా వూరు కాలిపోతే ఇల్లు శాంక్షన్ చెయ్యరా? ఇప్పుడూ అలాగే ఇల్లివ్వండి. రికార్డుల్లో వూరుపేరు లేదని, మీరిచ్చే కాగితమ్ముక్క లేదని వీళ్లు మనుషులు కాకుండాపోతారా?..'' అని మాట్లాడుతుండగానే గుంపులో ఎవరో అరి చారు "ఇల్లివ్వాల్సిందే లేకపోతే..." అప్పటికే కార్యకర్తలు చేరుకున్నారు. తొక్కిసలాట మొదలయ్యింది.

''పెల్లి వలసనీ నిర్వాసిత గ్రామంగా ప్రకటించాలి... ప్రకటించాలి..."

"కొత్త పేకేజీ అమలు చేసి అడవికి దగ్గరలోని స్థలాలివ్వాలీ.... స్థలాలివ్వాలీ...."

"కాలిపోయిన ఇళ్ల స్థానంలో కొత్త ఇళ్లూ కట్టించాలీ... కట్టించాలీ..." అని నినాదాలందుకున్నారు. పరిస్థితి అదుపు తప్పింది. పోలీసుల చేయిదాటిపోయింది. లాఠీలకు పనిచెప్పారు.

* * *

తెల్లవారే సరికి దినపత్రికల్లో పెల్లివలస నెత్తురోడింది. ఆ పక్కనే "ఝంజావతికి నిధుల వరద" అని కలెక్టరు గారి ప్రకటనా వెలువడింది. తొంభై శాతం పనులు పూర్తైన ఝంజావతి డామ్ ఈ నిధులతో మిగులు పనులు పూర్తయితే మరో పాతిక వేల ఎకరాలకు నీరందించ వచ్చని కలెక్టరు గారు స్పష్టం చేసారు.

"అదే జరిగితే ఆ వూరు మునిగిపోవడం ఖాయం" పేపరు చూస్తూ అన్నారు రామ్మూర్తి గారు నిన్న తగిలిన లాఠీ దెబ్బల్ని చూసుకుంటూ.

"ఏ వూరండీ అది?" గాయానికి లేపనం రాస్తూ అడిగింది అతని భార్య

"పెల్లివలస అనీ.." ముందురోజు జరిగినదంతా చెప్పారు.

"మరి ఇప్పుడు వాళ్లెక్కడికి వెల్తారు?" ఆడిగింది ప్రక్కనే కూర్చుంటూ.

"ఏమో..!" అని అన్నారు నిన్న జరిగిన తోపులాటను తలచుకుంటూ.

అతని కళ్లలో భవిష్యత్తు కదలాడింది.

డామ్ గేట్లు ఎత్తుతున్నట్టు...

ఆవూరి నిండా నీరు కమ్ముకుని క్రమక్రమంగా మునిగిపోతున్నట్టు...

వూరి జనం హాహా కారాలతో... తలో దిక్కూ చెదిరిపోతున్నట్టు.

వారిలో కొంతమంది అడవుల వైపు అడుగులు వేస్తున్నట్టు.

*(పొద్దు మునిగిపోయింది, ముంపు కతలు మార్చి-2017 స్నేహకళాసాహితి కథల సంపుటి)*

# అడవితనం

**దిగ్గు**న లేచేను ఎవరో తట్టి లేపినట్టు. అర్ధరాత్రి దాటి రెండు గంటలయ్యిందని స్మార్ట్‌ఫోన్ చెప్తోంది. గదిలో బెడ్‌లైట్ కాంతి మత్తుగా పరుచుకుని వుంది. ఫ్రిజ్‌లోంచి బాటిల్ తీసి నీళ్లు తాగినా దాహం తీరలేదు.

బాత్రూమ్‌కెళ్ళొచ్చి కళ్ళు మూసుకున్నా కనుల కొమ్మల మీద కునుకుపిట్ట వాలడం లేదు. పక్కనే అతను. హాయిగా ప్రశాంతంగా నిద్రపోతూ. అదృష్టవంతుడు... సెక్యూర్డ్ స్లీప్. మధ్యలో బాబు అమాయకంగా... కలలో నవ్వుకుంటూ.

ఈ మధ్యంతా ఇలాగే జరుగుతోంది. సరిగ్గా ఇదే సమయాల్లోనే మెలకువొచ్చి ఆ తర్వాత నిద్ర పట్టడం లేదు. నా నిద్రని నా నుండి దూరం చేసిందేమిటి? కలా? ఇంకేమైనానా? ఏదో భరించలేనిది. గుర్తుకుతెచ్చుకోవడానికి ప్రయత్నించేను. సాధ్యం కాలేదు.

కానీ...

అతనన్న మాట గుర్తుకొచ్చి మనసు చివుక్కుమంది. కొన్ని రోజుల క్రితం...టౌన్‌లో గిరిజన ఉద్యోగులందరూ ఒక సంఘంగా ఏర్పడి వనభోజనాలు ఏర్పాటు చేసుకున్న .. పిక్నిక్ రోజు. పిల్లలూ యువకులంతా స్టేజి మీద డాన్స్ చేస్తుంటే ఉత్సాహం ఆపుకోలేక నేనూ రెండు స్టెప్పులేసాను. అది కోపం తెప్పించింది అతనికి. పెళ్ళైన వాళ్ళెవరూ ఆ పని చెయ్యలేదనీ, నీవెందుకలా చేసావనీ... దెప్పి పొడుస్తూ... ఆ మాటనేసాడు నవ్వుతూనే.

పెళ్ళైతే? ఆడ్డం మానేయాలా? ఆపుకోలేని ఆనందమొస్తే అణుచుకునే వుండాలా? ఎంతకి టౌనైతే మాత్రం? అదే మా వూరైతే?

ఒకదాని మీద మరొకటి ప్రశ్నలన్నీ నన్నుక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నన్ను నిద్రనుండి మరింత దూరం చేస్తున్నాయి.

టౌను.

పెళ్ళై ఎనిమిదేళ్ళు. ఆరేళ్ల బాబు. వాడు బుడి బుడి అడుగులేస్తున్నపుడనుకుంటా ఉద్యోగం వున్న చోటే వుండాలంటే ఇక్కడికొచ్చేసాం. బాబు ముద్దు ముద్దు మాటలాడుతున్నంత వరకూ వూరెళ్ళి వస్తూ వుండే వాళ్లం. హటాత్తుగా వూరెళ్ళడం తగ్గించేసాం. ఎందుకో ఎప్పటి నుండో గుర్తుకు రావడం లేదు.

కానీ ఓ రోజు వూర్లో పిల్లల్తో బాబు ఆడుకుంటుంటే వీధిలో అందరూ ముద్దు ముద్దుగా చూస్తున్నారు అరుగుల్లోంచి.

“నీ ముక్కేదీ?” పిల్లలడుగుతున్నారు.

బాబు చూపిస్తున్నాడు

“నీ కళ్ళేవీ?”

“నీ నోరేదీ?”

“నీ తుంబేదీ?”

వాడు పొట్ట చూపించేడు.

అప్పుడే వచ్చిన కృష్ణ చప్పున బాబుని ఎత్తుకుని అక్కడి నుండి లాక్కెళ్ళిపోయేడు.

ఆ తెల్లవారే ఇక్కడికొచ్చేసాం.

'ఇంతర్జెంటేటీ?' అని అడిగాను కూడా.

'అర్జెంటూ లేదూ గిర్జెంటూ లేదు. ఇక్కడుంటే ఇలాంటి మాటలే నేరుస్తాడు' అని గొణుక్కోవడం గుర్తొచ్చింది.

ఆ రోజు అర్థం కానిది ఈ రోజు నాకు అర్థమౌతూ వస్తోంది. అక్కడి 'మాట' అతని కొడుకు నోట రావడం అతనికిష్టం లేదు.

అత్త మామల్ని కూడ అవసరమైతే ఇక్కడికే రప్పిస్తాడు. కానీ ఏ రోజూ ఆ వూరు నన్ను తీసుకెళ్లలేదు. ఒక వేళ తాను వెళ్ళినా సాయంత్రానికి ఇక్కడికొచ్చేసే వాడు. అలాగని ఆ వూరంటే కోపంగానీ, ద్వేషంగానీ లేదు. వూరంటే కొండల్లో వుంటుంది, అది రోడ్డుకి ఆమడ దూరంలో వుంటుంది, ఏదైనా అవసరమొస్తే అక్కడేవీ దొరకవూ, ఏ రోగమొచ్చినా అందుబాటులో ఏ మందులుగానీ దొరకవనీ మాత్రమే నిర్వచిస్తాడు.

కానీ నాకో?

వూరంటే సంబరం, నలుగురు కలిసే ఉత్సవం.

ఊరంటే గుగ్గిలం పొగ.

ఊరంటే ఎజ్జోడి మంత్రం.

ఊరంటే కొత్తల సంబరం.

ఊరంటే సన్నాయి, పిల్ల కర్రల గానం.

ఊరంటే తుడుం డప్పుల హోరు.

టౌనొచ్చి ఈ నా నిర్వచనాలన్నీ కలలు గానే వుండిపోయేయి. కలత నిద్దర్లు గానే ఇక్కడి రాత్రిళ్ళు గడుస్తున్నాయి. చుట్టూ చూసేను. కిటికీ అవతల చీకటి తెరలు తెరలుగా వేచి చూస్తోంది. సిమెంటు కట్టడాల కీకారణ్యం. ఏది కావాలన్నా దొరుకుతుంది డిపార్ట్‌మెంట్ స్టోర్లలో. డబ్బే వుండక్కరలేదు. కార్డుంటే చాలు. గీకే అవకాశం ఎక్కడైనా... ఎప్పుడైనా.

ఇంట్లో అన్ని వస్తువులూ అమరి వుంటాయి. బతకడానికే డోకా లేదు. చేతిలో కార్డు పెట్టి 'నీకేం కావాలన్నా కొనుక్కో నాక్కూడా

చెప్పక్కర్లేదు' అని అన్నాడు. 'ఇదంతా జీతమేనా?' అని అడిగితే మాత్రం 'అది నీ కనవసరం' అని కళ్ళెర్రజేస్తాడు. నగరంలో సొంత ఇల్లు, ఖరీదైన జీవితం. కానీ మాట్లాడడానికి మనిషుండడు.

అతన్ని చూసేను. ఈ రోజు ఇంటికొచ్చేడంటే మరో నాలుగు రోజులు కనిపించడని అర్థం. వచ్చిన రోజు గురక పెట్టీ మరీ నిదురపోతాడు. ఎప్పుడైనా నిద్ర పట్టకపోతే రెండు పెగ్గులు వేసుకుని నిద్రలోకి జారిపోతాడు. వూర్లో వున్నపుడు జీలుగు కల్లు కూడా తగని వాడు ఇక్కడికొచ్చి ఇది నేర్చుకున్నాడు. మత్తు మాత్రం కావాలి. అది వూరిదైతే అక్కర్లేదు.

ఏ బాదరాబందీ లేదు..!? చింతా చీకూ లేని జీవితం..!? సెక్యూర్డ్ లైఫ్!!!

ఎంత అదృష్టవంతుడు!

హాయిగా నిదుర పోగలగడం ఎంత అదృష్టమో!!

మరి నాకెందుకు నిద్ర పట్టడం లేదు!?

* * *

గదిలో ఎయిర్ కండిషన్ శబ్దం చికాకు పెడుతోంది.

చలి., దుప్పటి కప్పక తప్పని చలి. కొనుక్కున్న చలి. డబ్బులు చెల్లిస్తే గానీ రాని చలి.

అదే వూరిలో చలైతే...? పండుగే. చలేసిందంటే కందులు గింజ కట్టేయన్నమాటే. కాయ తెంపాలంటే కొత్తల పండుగ చెయ్యాల్సిందే.

చలిలో కొత్తల పండుగ!!

పండుగలో తుడుం డప్పుల హెూరు...

థింసా అడుగుల తోరణం...

వూరంతా కొండ పూల పరిమళం. పోడు కాల్చిన వాసనతో కొండమీది అడవి కొత్త పంటని కలగంటూ వుంటుంది.

ఇప్పుడెలా వుందో వూరు?

కొత్తల రోజు దుర్ల కి బయల్దేరుతున్నారో లేదో! ఎలాగైనా ఈ సారి కొత్తలకి వూరెళ్ళాలి. గొడ్డలమ్మకి చీర చూపించి మొక్కు తీర్చుకోవాలి. పశుపు నీళ్ళు పోసి బొట్టు పెట్టుకోవాలి. ఆ తల్లిని చల్లగా చూడమని కోరుకోవాలి.

వెళ్ళాలి. ఎలాగైనా వూరెల్లాలి. డప్పుదరువుల హోరులో నడుముల మీంచి చేతులు కలిపి థింసా అడుగులెయ్యాలి. సమూహంలో కలిసిపోవాలి. గోల చెయ్యాలి. లయబద్ధంగా అడుగు లేస్తుంటే కొంటె గుంటలు ఒళ్ళు ఒళ్ళూ తగులుకునేట్టు... చెమటతో చలి పారిపోయేట్టు... ఒళ్ళంతా పండుగ రగులుకునేట్టు ఆడాలి. ఎలాగైనా వెళ్ళాలి. వూరెళ్ళాలి.

పండుగంటే నాగడు గుర్తొస్తాడు. వాడు లేకపోతే వూరు కదిలిరాదు. వాడు లేకపోతే సందడుండదు. వాడు లేకపోతే గొడ్డలమ్మ జాకరి దాటి రాదు. ఆ గొడ్డలమ్మ తల్లి బయటకు రాకపోతే "దుర్ల" సాధ్యంకాదు.

వాడు...

డప్పుకొడతాడు.

వాడు...

ఒక సమూహమౌతాడు.

వాడు...

ఆపదొస్తే సాయమౌతాడు.

నడవలేని రోగులని కొండ దించడానికి నలుగురిని కూడేసి ఒక డోలీ అవుతాడు.

వూరిలో ఒకరికి 'అవసరం' అనుకుంటే నేనున్నానని నిలబడతాడు. మేము వూరొదిలి ఇక్కడికి చేరాక వూర్లో యువతకి నాయకత్వం వహించి ఇతని స్థానాన్ని భర్తీ చేసిన వాడు.

ఇప్పుడేం చేస్తున్నాడో!?

పక్కనే వున్న ఇతన్ని చూసేను. నిదురపోతున్నాడు. ఒకప్పుడు వూర్లో సందడైన వాడు. పెళ్ళికి ముందు డప్పుదరువుల సమూహానికి

నాయకత్వం వహించి, ఉద్యోగంలో చేరినాక అన్నీ వదులుకున్నాడు. అసలు డప్పుకొట్టడాన్నే నామోషీగా చిన్నతనంగా భావిస్తున్నవాడు. ఇప్పుడు నిదురపోతున్నాడు.

ఇప్పుడు వూరెలా వుందో? వెళ్ళాలి ఎలాగైనా వూరెళ్లి రావాలి.

వూరు....

కొత్త రకం అలికిడితో వీధి దీపాల్లో మెరుస్తున్న సిమెంటు రోడ్లు... డిష్ యాంటెన్నాలను నెత్తిన మోస్తూ వూరిళ్ళ స్థానంలో స్లాబిళ్ళు... ఇళ్ళకి గజాల దొడ్లూ... వాకిళ్ళలో టూవీలర్ బళ్ళూ... యువకుల చేతుల్లో సెల్‌ఫోన్లూ... వూరి చుట్టూ అడవులు స్థానే జీడి మొక్కలూ. వూరెళ్లాలి. ఎలాగైనా వీలుచూసుకుని వూరెళ్ళాలి.

* * *

ఫోన్ రింగవుతోంది. గతుక్కుమన్నాను. ఏదో అన్నోన్ నంబర్. టైమ్ చూసేను. తెల్లవారడానికింకా చాలా సమయముంది. భయం భయంగానే "హలో?" అన్నాను.

"అక్కా! నేనూ... తారని" అటునుండి వినిపించింది.

"ఎవరూ?" అన్నాను.

"నేనక్కా తారని, నాగడి పెళ్ళాన్ని" ఆమె గొంతులో ఆతృత కనిపిస్తోంది. కీడేదో వినిపిస్తోంది. ఆ తరువాత కాసేపటికి గుర్తొచ్చింది. ఆమె... నాగడు భార్య తార. నా నేస్తురాలు. పక్కవూరిలో వుంటుంది. కలిసి హాస్టల్లో చదువుకున్నాం. నేను పది పూర్తిచేసి హాస్టల్ దాటేను గానీ ఆమె దాటలేకపోయింది. ఇంటిలో కొండకెళ్ళకపోతే కుండ నిండని పరిస్థితి. వూర్లో థింసా బృందానికి నాయకత్వం వహించేది. జట్టులో చిట్ట చివర వుండేది. డప్పుదరువులకు అనుగుణంగా అడుగులేసి వూరు ఆడవాళ్ళని ఒకచోట ముడేసేది. ఏ సాయంత్రపు సమయాల్లోనో ...ఏ ఉత్సవ సందర్భాల్లోనో... నాగడి మీద మనసుపారేసుకుంది. డప్పుదరువులకి థింసా అడుగుల ముడి పడింది.

"ఆఁ..ఆఁ... తారా! చెప్పు. ఏమైందీ? ఎక్కడి నుండి మాట్లాడుతున్నావు?" అని అడిగేను.

"ఇదేవూరో తెలీడం లేదక్కా!" అని గద్గద స్వరంతో చెప్పింది.

"అదేంటే? ఏమయ్యింది?"

"పనులకనీ వొచ్చేమక్కా" అంది ఆమె గొంతులో ఇంకా దుఃఖం చల్లార లేదు.

అప్పుడు గుర్తుకొచ్చింది. వూర్లో చాల మందిలాగే నాగడు కూడ మూటా ముల్లె సర్దుకుని పొట్టకూటి కోసం భార్యతో ట్రైనెక్కేసాడని వూరికి ఫోను చేసినప్పుడు తెలిసింది.

ఆరోజూ ఇలాగే నిద్రపట్టలేదు.

డప్పు దరువుల్లేని సాయంత్రాలు. పురాతన సాంప్రదాయమైన "కందికొత్త" పండుగల్లేని వూరు. థింసా అడుగుల్లేని కొత్త వీధులు... సీరియళ్ల ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఆదివాసీ గ్రామాలు. కొత్త సారా మత్తులో తూలుతున్న యువకులు...అరచేత బూతు చిత్రాల భూతాలతో.

"చెప్పు తారా! ఏమైందీ?" అంత రాత్రిలో ఆ ఓదార్పు సరిపోదని తెలిసీ అడిగాను... నా గుండెలదురుతుండగా.

ఆమె ఏడుస్తోంది. వెక్కి వెక్కి ఏడుస్తోంది. దుఃఖాన్ని దిగమింగుకుని చెప్తోంది..."మా ఆయన సావుబతుకుల్లోనున్నాడక్కా"

'ఏమయ్యిందీ?' అని నేనడిగేలోగానే రాగమందుకుంది. నాకు ఏమి చెయ్యాలో తోచలేదు. ముందామెను ఏడ్వనివ్వాలని కాసేపు మౌనంగా వున్నాను.

"హలో... అక్కా!... ఆలకిస్తున్నావా?" అంది

"ఇప్పుడు చెప్పు ఏమయ్యింది?" ఓదార్పుగా అడిగాను.

చెప్పింది. అంతా చెప్పింది. తాము వూరొదిలి వెళ్లిన నుండి ఈ రోజు దాక చెప్పింది. పనులకోసమని నెల్లూరు వెళ్ళారట. అక్కడ చేపల చెరువుల్లో పని చేసి మరికొన్నాళ్ళకి చెన్నై చేరుకున్నారట. అక్కడ తాపీ పని, భవన నిర్మాణ పనట. వెళ్ళిన ప్రతిచోట మేస్త్రీలు, మేనేజర్లు తో ఏదో ఒక తగువే. పనులు ఎక్కువ రోజులు చేయించుకోవడం డబ్బులు ఇచ్చినప్పుడు మాత్రం లెక్కలు తప్పు చెప్పడం. ఏదో ఒక

తగువేనట. ప్రశ్నించడం వాడి సహజ లక్షణం. బహుశా అందుకేనేమో ఎక్కడా కుదురుగా వుండలేకపోయేడు. కొన్నాళ్ళకి జబ్బు పడ్డాడు. మందుల కోసం డబ్బులు తిరిగి అప్పు చేయాల్సి వచ్చిందట. నిజానికి ఒప్పందం ప్రకారం మేనేజరే హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళాల్సి వుండగా తిరిగి అప్పు చేయాల్సి రావడం నాగడికి కోపమొచ్చిందట. అదే చివరి తగువు. వూరు కాని వూరు. భాష తెలియని మనుషులు... తెలిసిన వారున్నా అందరూ అక్కడి కూలీలే గానీ ఎవరూ కలిసిరాక ఒంటరివాడై పోయేడు. చివరికి వీడెప్పటికైనా ప్రమాదమని గ్రహించి పని లోంచి తీస్సేరట. జ్వరంతోనే తిరుగు ప్రయాణమయ్యేరు. ట్రైన్‌లో టిక్కెట్టు తీయలేదని అతన్ని పోలీసులు తీసుకెళ్తుండగా కదులుతున్న ట్రైన్నుంచి గెంతీసాడట. రైల్వే హాస్పిటల్లో వున్నాడట. తెల్లారితే గాని ఏవూరో తెలీదట.

"ప్రమాదమేమీ లేదుకదా?" అడిగాను.

"ఆడికి కుడి చెయ్యి తెగిపోయిందక్కా!" బోరున ఏడుస్తోంది.

నా చెయ్యి తెగిపడినంత బాధ గుండెల్లో. వాడి చేతి వేళ్ళు కనిపించేయి. కొండల్ని తన దరువులతో ప్రతిధ్వనింపజేసిన వేళ్ళు... గుండెవైపు డప్పుని ఆనించుకుని కుడిచేత్తో సిరతలతో దరువులు మారుస్తుంటే వూరు వూరంతా వూగిపోయేది. అడివితల్లి ఆకుపచ్చగా నవ్వాలంటే వీడు తుడుం కుండ పట్టాల్సిందే. అలాంటి నాగడు ఇప్పుడు బతుకు పోరాటంలొ ... ఓడిపోయి... ఒక వికలాంగుడుగా...

గాయపడింది వాడా? నేనా? వూరా?

"ఏటే ఈ గోల? ప్రశాంతంగా పడుకోనివ్వా?" నిద్రాభంగాన్ని తట్టుకోలేక అడుగుతున్నాడితడు.

విషయమంతా చెప్తే అన్నాడు దుప్పట్లోకి దూరిపోతూ..."ఐతే నన్నేం చెయ్యమంటావ్?" చిరాకు, నిర్లక్ష్యం కూడిన స్వరం.

"అదేటీ అలాగంటారు..? అవతల మన వూరు వాళ్ళండీ"

"ఐతే?" దుప్పటి బయటకు రాకుండానే ముద్ద ముద్దగా అన్నాడు.

ఛీ! ఏమిటీ మనిషి? ఎందుకిలా మారిపోయేడు? ఇతన్నిలా మార్చిందెవరు?

నాకు కన్నీళ్ళాగలేదు. చీకటి, దుఃఖం కలిసి నా కంట్లోంచి దారగా...

ఉన్నట్టుండి దిగ్గున లేచేడు. దుప్పటి తీసి నేలకేసి కొట్టేడు. అతనికి నిద్రా భంగమయ్యిందని తెలుస్తూనే వుంది. "ఎందు కేడుస్తున్నావ్?" అర్థం లేని ప్రశ్నొకటి అడిగేడు.

"నాకోసం ఎప్పుడైనా ఏడ్చావా? నీకూ... వాడంటే..." అనేసాడు... ఎప్పుడో అనాల్సిన మాటేమో... ఇన్నాళ్ళూ దాచుకునీ అన్నాడు బలంగా నొక్కి నా గుండెల్లోకి గుచ్చినట్టు అనేసాడు.

మౌనంగా వుండిపోయేను. వాదనకు దిగకపోవడం అతన్ని మరింత రెచ్చిపోయేలా చేసింది.

నన్ను నేను ప్రశ్నించుకున్నాను. అతనన్నది నిజమా? నేను ఇష్టపడింది వాడినా? వాడిలోని కళనా? లేదా వాడిలో వున్న వూరునా? వూరు వాడినెందుకు దూరం చేసుకుంది? వాడు వూరొదిలి ఎందుకు వెళ్ళాల్సి వచ్చింది?

అసలు వాడిలో నిలిచివున్నదేమిటీ? ఇతనిలో కనుమరుగై పోయిందేమిటీ? వూరు నుంచి ఇక్కడికొచ్చాక ఇతనిలో వచ్చిన మార్పులేమిటి? వచ్చిన కొత్తలో ఇక్కడ ఏర్పడిన గిరిజన సంఘం మీటింగులకి తరచూ వెళ్తూ వుండేవాడు. ఇల్లు కట్టినపుడు స్థలం విషయంలో ఏదో సమస్య వచ్చినపుడు సంఘం ద్వారానే పరిష్కరించు కున్నాడు కూడా. ఆ తరువాత మీటింగులంటే దూరంగా వుంటున్నాడు. కొత్త స్నేహితులు.., సాయంత్రాన పార్టీలు.., కొత్త అలవాట్లతో క్రమ క్రమంగా నగర జీవిగా రూపాంతరం చెందాడు. సంపాదనా యంత్రంగా మారిపోయాడు. వూరుకీ వూరి లక్షణాలకీ దూరమై పోయాడు. అడవికి దూరమైనవాడు అడవితనాన్ని కూడా కోల్పోయాడు.

అడవి నడిబొడ్డులో వున్న వూరితో సంబంధాలు కలిగివుండి వుంటే... అతనిలో కాస్తైనా అడవితనం మిగిలి వుండేది. అదే జరిగి వుంటే ఇవ్వడం... నేస్తరికం చెయ్యడం... ఆశ్రయమివ్వడం... ఓదార్పునివ్వడం లాంటి లక్షణాల్ని కలగివుండేవాడు.

పూర్తి నగరజీవిగా మారి మనిషితనాన్ని కోల్పోయిన వాడు.

మరి నాగడు?

కళతో ఒక సమూహాన్ని నిర్మించిన వాడు. అడవితనాన్ని ఆవహించుకుని బతుకు వెతుకులాటలో నెత్తురోడుతున్నవాడు.

నా దృష్టిలో నగరం దెబ్బకి ఇద్దరూ గాయపడ్డవారే. ఒకడు కోరి గాయపడితే ... మరొకడు తనకు తెలీకుండా కోరల్లో చిక్కుకున్న వాడు.

నేను నేనుగా మిగలాలంటే ఏదో ఒకటి చెయ్యాలి. నాలో అడవి బతికుండాలంటే ఒక లేపనమవ్వాలి.

రిసీవ్డ్ కాల్‌ని డయల్ చేసాను. "తారా! నువ్వేమీ గాబరా పడకు వస్తున్నా" అని లేచి బయటకు నడిచాను.

అప్పుడే తెల్లవారుతోంది.

*(13.09.2017, నవ్య - తురగా జానకీరాణి కథల పోటీలో విశేష బహుమతి)*

# శిథిల సమూహం

"నింజాబల యఇ్‌ఁజీ ! (రండీ అమ్మలార!)

నింజాబల వాఇ్‌ఁజీ ! (రండీ తండ్రులార!)

సీరీవుర్ జన్నీలేన్ గువ్వాయ్‌బల యఇ్‌ఁజీ! (సీరీవూర్ తో జన్నోడిని పిలవండి)

పాపూవూర్ జన్నీలేన్ గువ్వాయ్‌బల వాఇ్‌ఁజీ!" (జన్నోడు వెదురు చీలుస్తున్నాడు రండి)

అది నాన్న పాడిన చివరి పాట. నేను అతని భుజాల మీద కూర్చుని విన్న తొలిపాట, నన్నూ నాన్ననూ ఇంతదాకా నడిపించిన పాట. ఆ మాటకొస్తే వూరు వూరునీ నడిపించి దారి చూపిన పాట. ఆ పాట పాడుతుంటే నాన్న కళ్లెదుట నిలబడ్డాడు. అతడు రంగులద్దిన సాయంత్రాలు కళ్ల నిండా అలముకుంటాయి.

కానీ...

ఇప్పుడు ఆ పాట జ్ఞాపకం మాత్రమే.

ఆ పాట గుర్తొస్తే నాన్న గుర్తొస్తాడు. నాన్న గుర్తొస్తే వూరు గుర్తొస్తుంది. వూరంటే అక్కడ జరిగిన మార్పులు గుర్తొస్తాయి. వాటి మూలంగా నాన్న మీద జరిగిన దాడి గుర్తొస్తుంది. నానుంచి నేను దూరమైపోవడం గుర్తొస్తుంది.

ఆ జ్ఞాపకాలు నన్నల్లుకున్నాయి.

ఆ పాట వినపడిందంటే పొద్దు కొండమీద అలుపు తీర్చుకుంటోందన్నమాట. 'రేపు మరి రావేటి.. ఈ పొద్దుకి సాల్లే ఎల్లెల్లు' అని ఆ రోజుకి వీడ్కోలు పలికి ఇల్లు చేరుతుంటాయి పశు వులు. వాటి వెనుక తూలుతూ ఏదో పాట పాడుకుంటూ చేతిలో తేగల కట్టపట్టుకుని నడుస్తుంటారు వూరి మగాళ్లు. వాళ్లు చేరిన మరి కొంత సేపటికి ఆడవాళ్లు ఇల్లు చేరతారు. మగవాళ్ల తో సమానంగా తూలుతున్నారు. ఎందుకంటే మగవాళ్లు కన్నా ఆడవాళ్లే ఎక్కువ కష్టపడతారు. ఆడవాళ్లు వూరు చేరడంతోనే ఇంటి గడపల దీపాలు వెలుగుతాయి. అక్కడికి మరికొంత సేపటికి పొయ్యి ఎత్తురుతుంది. వీధిలో మంచం కోలు నేల నిలబడతాయి. వూరి మధ్యలో నెగడు. అప్పటికి గానీ తెలిసి రాలేదు చీకటెంత చిక్కబడిందో. ఒక్కొక్కరూ వచ్చి చలిని మంటల్లో పడేసి మత్తుగా మంట చుట్టూ చేరారు.

గడపలోంచి గొగోయ్ తీసి మంట ముందుకొచ్చేడు నాన్న. అతని రాకతో మత్తులో వున్న మంట ఎత్తిరింది. అతడు గొంతు విప్పాడు. గొగోయ్ శృతి కలిసింది. మంట మరింత ఎత్తిరింది.

"నింజాబల యఇఀజీ!

నింజాబల వాఇఀజీ!

సీరీవుర్ జన్నీలేన్ గువ్వాయ్‌బల యఇఀజీ!

పాపూవూర్ జన్నీలేన్ గువ్వాయ్‌బల వాఇఀజీ!"

"డాడీ" సురేష్ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చి పడ్డాను "ఎందుకు నాన్నా, ఒకే పాటని పదే పదే పాడుకుంటావు?" సురేష్ గొంతులో అసహనం.

ఆ పాట నాకు నాన్న జ్ఞాపకం. ఆ పాట నాకు ఒక సమూహం. ఆ పాట నాకు ఒక ప్రవాహం.

ఆ పదాల రాగాన్ని పెదాల మీద పలికితే నాన్నని ముద్దాడినట్టే అనిపిస్తుంది నాకు. నాకూ నాన్నకూ వారధి అయిన ఆ గానం రేపు నాకూ వీడికీ మధ్య వుంటుందా అన్న సందేహం నాలో మొదలయ్యింది.

మళ్లీ నాన్న నన్నల్లుకున్నాడు.

చలి వేస్తే ఊరి మధ్యలో మంట ఎత్తిరినట్టు నాన్న పాటందుకుంటాడు.

"పుర్ పుర్‌లేన్ కానిల్లేన్ ఆండజ్‌బల యఇ్‌జీ! (పూజల్లోని పాటల్ని విందాం రండి!)

డెబ్‌డిజ్ లేన్ తొజ్‌సిజ్‌లేన్ నీయాయ్‌బల వాఇ్‌జీ!" (వాద్యాల వరసల్లో ఆడుతూ పాడుతూ రండి)

అతని వెనక 'గొగోయ్' తనని తాను శృతి చేసుకుంటూ. 'డుండుజ్ సిరాయ్' గొంతు కలుపుతో. మింజూరు కింది నుంచి దీపాలు తొంగి చూస్తాయతనివైపు వీధిలో అన్నీ సిద్ధం చేసాడా లేదా అని. కొండ వెన్నెలని పులుముకుంటూ వుండేది. అడవి ఆనంద గీతమై తలలూపుతూ నిదురబోయేది. ఆ పాటకు మంచి చేసే దేవతలు మేల్కొంటారు. పీడ తెచ్చే మరిడమ్మలు పారిపోతారు. అతని గొంతులో ఆ పాట మొదలయ్యిందంటే ఏదో ముహూర్తం ముందుందని అర్థం. ఏ పండుగ చెయ్యాలో ఏ కార్యం కట్టాలో నాన్న నిర్ణయించేవాడు.

నాన్న వూరికి దీసరి. దేవతలతో నేరుగా మాట్లాడతాడు. పట్టపగలే... మిట్టమధ్యాహ్నమే రెల్లి పొదల నీడలోంచి ఆకాశం లో చుక్కల్ని లెక్కెట్టగలడు. ఆ చుక్కల గమనాన్ని బట్టి చెట్టు ముహూర్తం కడతాడు. దీసరి ముహూర్తం నిర్ణయించేడంటే వూరిలో ప్రతి ఇంటా గుగ్గిలం నిప్పుల్లో దూకి ధూపమై పరిసరాల్ని పరిమళభరితం చేసేస్తుంది. వూరు తనంతట తానే ముస్తాబైపోతుంది ఏదో ఒక పండుగ చేసుకోవడానికి.

జన్నోడు వడివడిగా అడుగులేసుకుంటూ వీధి మధ్యలోనున్న జాకరమ్మ వద్దకు చేరుకునే వాడు. అతని చేతిలో చేట, చేటలో బియ్యం

గింజలు. బియ్యం గింజల మీద వెలుగుతున్న మట్టి దీపం. గాలికి ఆరకుండా చేతులడ్డం పెట్టి బొంతుకాలి మీద కూర్చుని... జన్నోడు. దీసరి పాడిన పదాలకు వంత పాడుతూ. ఇద్దరూ బృందగానమై...

“గొర్జాజ్‌లిన్... సొండాజ్‌మర్ (వూరి పెద్ద మనిషిని )

గువ్వాయ్‌బల యఞ్‌జీ! (పిలుచుకు రండి అమ్మలారా!)

బారామర్ చెర్నామర్ (మాట్టాడే పెద్దమనిషినీ, పనిచేసే పెద్దమనిషినీ)

గువ్వాయ్‌బల యఞ్‌జీ! (పిలుచుకు రండి అమ్మలారా!)

బజ్‌సాబెర్ బెర్నాజీ! (ఒక మంచిమాట,ఒక మంచి మనిషి)

బెర్నానీదేతి (మాట్లాడ్డమవుతుంది)

ఎర్‌బజ్‌సాన్ బజ్‌సాన్‌జీ (మంచి చెడులు / తప్పొప్పులు)

గాలమ్ నాదేతి” (తెలుసుకోవచ్చు) //ఇంజాబల యఞ్‌జీ!//

పాట ఆగే సరికి వూరు వూరంతా అక్కడికి చేరిపోయేరు. అందరి చేతిలో తమ కష్టంతో పండిన గింజలు అడ్డిదేసి వున్నాయి. కొందరి చేతిలో చిన్న కోడి పిల్లలు అదనంగా వున్నాయి. పాట ఆపిన నాన్న వూరందరి వైపూ నిశితంగా చూసేడు ఇంకెవరైనా రావాల్సి వుందా అని. వీధి చివరి గడపలోంచి డప్పు మోగడంతో కొందరి దృష్టి అటు మళ్లింది. డప్పు వెనక తుడుం జతకలవడంతో వూరు నిద్దుర మత్తు వదిలింది. వీధిలోకి పిన్న కర్ర నడిచొచ్చింది. ఆడ మగా తేడా లేకుండా అప్రయత్నంగానే ఒకరి నడుమ్మీది నుంచి మరొకరి చేయినందుకొని థింసా బృందమైపోయేరు. తుడుం డప్పుల హోరు కొండల్లో ప్రతిధ్వనించింది. థింసా అడుగుల చప్పుడులో వూరు తడిసి ముద్దైపోయేది. వూరు కొండమీద పోడు మంటై మెరిసేది.

కొండ...

దానికానుకొని మరొక కొండ.

వాటినానుకొని మరిన్ని కొండలు.

ఏ శిఖరాల్లో మొదలయ్యిందో నిత్య పురాతన గీతంలా గెడ్డ. దానికి దిగువున పొలాలు. పొలాల మధ్య ఓ కొండవాలులో చిన్న గూడ. గూడంటే ఇరవయ్యిళ్ల సమూహం మాత్రమే కాదు. కొన్ని జీవాల

సముదాయం మాత్రమే కాదు. ఒక పురాతన వ్యవసాయ క్షేత్రం. అడవిని చేదించే ఒక అంతు చిక్కని రహస్యం.

అందరూ సవరలే. మాట్లాడేది సవర భాష. జీవించేది సవర జీవనం. జంతువులే కాదు అడవి కూడా సవర భాషని అర్ధం చేసుకోగలదు. వూరు నిర్మాణం ఎప్పుడు జరిగిందో తెలీదు గానీ అది ఒక పురాతన ఆదిమానవ సమూహం. ఎందుకంటే ఊర్లోని మానవులు ఇప్పటికీ ఆదిమానవుల్లా కనిపించడమే. మెడలో మెరిసే పూసల దండలు, ముక్కున బేసర్లతో ఆడాళ్లు. ముడేసిన జుట్టు మొలతాడుకి నామమాత్రపు గోసి గుడ్డతో మగవాళ్లు. దర్భ గడ్డితో నేసిన ఇళ్లు, ఇళ్లకెదురుగా పశువుల శాలలు. శాలల్లో మనుషులకి రెట్టింపు సంఖ్యలో పశువు ఆలమందలు. పొద్దు పొడిస్తే కొండకి తెల్లవారుతుంది. వూరుకి మాత్రం సాయంత్రమే తెల్లవారుతుంది. అంతదాకా నిశ్శబ్దానికి చిరునామా అయిన వూరు పొద్దుములగడంతో అలికిడి మొదలయ్యింది.

వీధి మధ్యలో చలి మంట. చుట్టూ పరుచుకున్న మంచాలు. ఊరోళ్ళు ఒక్కొక్కరూ వచ్చి సమావేశమయ్యేరు. మంటలోంచి నిప్పుతీసి చుట్ట తీసి వెలిగించేరొకరు. ఆ చుట్టకి చిట్టంటించి మరొక నిప్పు రాజుకుంది మరొకరి పెదాల మీద. గొగోయ్ పట్టుకుని చేరేడు సింగన్న. ఆనప తుంబకి వెదురు బద్దలు నేర్పుగా మైనంతో అంటించి దాని మీంచి సన్నని తీగలు సాగిన అతి పురాతన సంగీత వాద్యం గొగోయ్. దాని రాకతో మంట మరింత ఎత్తిరింది. మంగన్న శృతి చేసేడు గొగోయ్ని....

గొర్జాజ౯లిన్ సన్రూక్కున్ బెర్నానీదేతి (మన వూరి కష్టాలు మాట్లాడుకోవచ్చు)

ఎర్బజ౯సాన్ మన్రెజ౯నాన్ బజ౯సానీదేతి (మంచి బతుకు మంచి మార్పు)

రూక్కూలిన్ మూండాలిన్ నీయహాయ్ుబల యఃజ౯జీ (మూకుమ్మడిగా, కలిసికట్టుగా రారండి)

కష్టంలేన్ దుఃఖంలేన్ ఆండాజ౯బల వాజ౯జీ (కష్టాలు దుఃఖాల్లాగా రండి)

"నింజాబల యఇూజీ!
నింజాబల వాఇూజీ!
సీరీవుర్ జన్నీలేన్ గువ్వాయ్‌బల యఇూజీ!
పాపూవూర్ జన్నీలేన్ గువ్వాయ్‌బల వాఇూజీ!"

పలుకున్నది మాములు గీతం మాత్రమే కాదు ఒక పిలుపు కూడా. పాట పూర్తయ్యే సరికి వూరు వూరంతా మంట చుట్టూ చేరింది. అప్పుడు చెప్పాడు మంగడు"చలి మొదలయ్యింది... కందులు గొడ్డలమ్మని కలవరిస్తున్నాయ'ని. అతడు చెప్పింది పండుగ గురించి మాత్రమే కాదు. అది జరిపాల్సిన ముహూర్తం గురించి కూడా. ఎందుకంటే అతడు వూరి "దీసరి". ముహూర్తం చూసి పండుగ నిర్వహణ చూడాల్సిన బాధ్యత అతని మీద వుంది. అతడు వూరి పెద్ద. పెద్దంటే మోతుబరి కాదు. నాయకుడు కాదు. అతడు వూరి తరపున కొండ దేవతలతో మాట్లాడతాడు. ఎజ్జోడు ముందుకొచ్చి "ఎప్పుడు పడుతుందో నీవే సూడైతే.." అని. ఆకాశం కేసి చూస్తూ చుక్కల్ని లెక్క కట్టేడు.

"ఒస్తున్న సుక్రోరం..." అని ప్రకటించేడు. అప్పటికే మంట పక్కనున్న జీలుగుతుంబ చేతుల్లోకి తీసుకుని గొంతు నిండా సారా పోసుకుని చప్పరించేడు.

తుడుం మోగింది. డప్పు జత కలిసింది. గొగోయ్ పాటందు కుంది. పిల్లకర్ర వూపిరి తీసుకుంది. ఆకాశం తొంగి చూసింది మబ్బుతెరలు తప్పించుకుని. గ్రామస్తులు గుండెల్లో దరువుల మంట నింపుకుని ఒకరి నడుమ్మీద మరొకరు చేతులు పోనిచ్చి థింసా ఆడేరు... లయబద్ధంగా. రాత్రి రంగులద్దుకుని ముస్తాబయ్యింది. ..రానున్న పండుగని కలగంటూ.

అప్పటికది వాస్తవం. వూరు ఒకటై వుండేది. వూరు అంటే జన్నోడు, దీసరి, ఎజ్జోడు, కార్జి ల సమన్వయంతో ముందుకెళ్లేది. అది వూరును నడిపే ఒక పురాతన వ్యవస్థ. తరతరాలుగా సాగుతూ వస్తున్న సంప్రదాయం.

కానీ...

ఆ రోజు వీధిలో మోగుతున్న వాద్యాల ధ్వనిలో ఏదో తేడాని గమనించేడు నాన్న. సమూహం వైపు చూసేడు. ఏదోలోపిస్తోంది. తుడుం వుంది. సన్నాయి వుంది.'గొగోయ్' వుంది. 'దుండుఞ సిరాయ్' వుంది. టిల్లకాయ వుంది. అయినా ఏదో లోపం... ఇంకా పరిశీలించి చూస్తే... నాలుగు డప్పులుండాల్సింది.... మూడే వున్నాయి. మంగన్న లేడు.

మంగన్న ఈ మధ్య సమూహంలోంచి తప్పుకుంటున్నాడు.

వూరోలందరూ సారా మానిపించాలని గెడ్డలంబడి తిరిగి తిరిగి మహిళా మండళ్ళతో వంట సారాని ద్వంసం చేస్తే బడ్డీ షావుకారి మండల కేంద్రంలోని వైన్ షాపులకి బెల్ట్ నడుపుతూ బీర్లు, నిబ్బులు అమ్మడం మొదలు పెట్టేడు. ఆడోళ్ళందరు అడిగితే... 'మరి పెట్టనెండీ ఈ సారికొగ్గియండి' అని బతిమాలిన బడ్డీ షావుకారి మళ్ళీ మళ్ళీ అమ్మడం మొదలెట్టేడు. బడ్డీ సామాన్లు లాగీడం నుంచి పోలీసు రిపోర్టిస్తాం అనడం వరకూ వచ్చినా ఎప్పటికప్పుడు మొదటి కొస్తూండడంతో వూరి జాకరి తల్లిమీద ఒట్టేయమన్నారు.

అప్పుడు మంగన్న ముందుకొచ్చేడు 'ఆ ఒట్టేయడమేదో అక్కడ కాదు ఇక్కడ వెయ్యమనండి' అని ఆ పుస్తకాన్ని చూపించేడు. అది పవిత్ర గ్రంథం. దళసరి అట్ట పైన బంగారు రంగు అక్షరాలతో ముద్రించబడి వుంది. షావుకారి మాత్రం అక్కడా కాదు ఇక్కడా కాదు ఇదిగో 'మా దేవుడిమీదొట్టు' అని తిరపతి వెంకన్న బొమ్మ మీద చెయ్యాన్నబోయేడు.

అది మీమొప్పము అని అటు మంగన్న చేతిలోని పుస్తకం చూపిస్తే, వూరంతా మీమొప్పుతామేటి అని జాకరమ్మని చూపించేరు. ఈ మధ్యన షావుకారి ఏ ఒట్టూ వెయ్యకుండా యధా ప్రకారం కొన్ని రోజులు పోయాక తన పనేదో తాను చేసుకుపోతూ వచ్చేడు.

"వూరు దీసరిని సెప్తున్నాను. నీ పెబువూ లేదు, నీ ఎంకన్నా లేదు. తరతరాల కాసి మొక్కుతున్నము, వూరి జాకరమ్మ మీద ఒట్టేయాల్సిందే' నని శాసించే స్వరంతో చెప్పాడు... ఎప్పటిలాగానే.

'ఆ రోజులెప్పుడో పోయినాయి నాయినా!" అనుకుంటూ వెనుతిరిగి వెళ్ళిపోయేడు మంగన్న. 'నీను కాదనలేదుగదా?' అన్నట్టు తాను కూడా వెళ్ళిపోయేడు షావుకారి.

అప్పటికి తన వయస్సు ఇరవై. ఇంటర్ తప్పి వూర్లో తిరుగుతున్న రోజులు. వూర్లోకి కొత్త కొత్త మార్పులొస్తున్న రోజులు. ఎవరికెవరూ కాకుండా పోవడం మొదలవుతున్న రోజులు. ఆ సంఘటన వూర్లో వాళ్లు క్రమక్రమంగా మర్చిపోయారు గానీ నాన్న మర్చిపోలేకపోయేడు. తర తరాలుగా సాగుతున్న ఒకానొక పురాతన సంప్రదాయం. వూరు కట్టుబాటు. దీసరి, జన్నోడు, ఎజ్జోడు, కార్జి. ఎవరి పని వాళ్లు నిబద్ధతతో నిర్వహిస్తూ వూరుని నడిపిస్తూ వస్తున్న ఒక ఆచారం. కొత్త తరానికి జీర్ణమౌతుందేమో గానీ, అ వ్యవస్థలో భాగమైన నాన్నకి కష్టమైపోయింది.

ఒంటరిగా ఏ పిస్లకర్రో, గొగోయో చేతపట్టుకుని కొండలమీద గడపడం మొదలు పెట్టేడు. ఇంటికి రావడం కూడ తగ్గించుకుంటే భోజనానికి పిలవడానికి వెళ్తే తనలో తాను మాట్లాడుకుంటూ ఏమని చెప్పేడు?

''వూరు మారిపోయిందిరా! మారిపోయింది. మన తాతతండ్రుల కాసి వొస్తున్న మన వూరు జాకరమ్మ సచ్చిపోయిందిరా! మనకెవులు దిక్కు ...సెప్మి? సెట్టుకి మొక్కేము. పుట్టకి మొక్కేము. అడివి తల్లికి మొక్కేము. ఇన్నాళు అవే మనకి తిండి పెట్టి బతికించినాయి. అందకే మన తాతలు అడివికే దేవతని సేసి మొక్కేరు. ఇన్నాళూ మనమూ మొక్కుతూ వొచ్చినామా? ఇప్పుడా సెట్టు లేదు. పుట్ట లేదు. అడివి లేదూ అడివి తల్లీ లేదు. ఆ రోజు అడివిని, అడివిలున్న మనల్ని దోసెస్తున్నారని సొండీల్నీ, సావకారుల్నీ, కాంట్రాతీల్ని వుద్దము సేసి బూములు తిరిగి లాక్కున్నామని సర్దాపడితున్నామా? గానీ అడివి తల్లి పీకనొక్కీసి, ఇనాయకుడిని వూర్లొదిలినారు. వుద్దంతర్వాత వూర్లు మారడం మొదలైనట్టిగే, వూర్లోన మనుసులూ మారడం మొదలైంది. అదెక్కడి నుండంతే వూరుల్లోన

ఇనాయక సవితిలు సెయ్యడం మొదలయినప్పటి కాసి. ఆ తర్వాత ఇదిగో వూర్లోకి కొత్త శిలువొచ్చిన తర్వాత వూరు జాకరమ్మ మరీ వూపిరిలేనిదైపోయింది…" తనలో తాను కాకుండా నేను వింటున్నానా లేదా అనే స్పృహ లేకుండా చెప్పుకు పోతున్నాడు.

"ఇదంతా కుట్ర లాగ నేదా?" గాల్లోకి చూస్తూ ఎవరినో ప్రశ్నిస్తున్నట్టు అంటున్నా ఆ మాట నాకు వినపడింది.

నిజం. వూరిప్పుడు ఒక్కటిగా లేదు… దేవుళ్ళుగా విడిపోయింది. అడవిప్పుడు మతమార్పిడి స్థావరంగా మారిపోయింది. వూరినిప్పుడు ఏ శక్తులు నడిపిస్తున్నాయి?

కొన్నాళ్ళ క్రితం దాకా వూర్లో ఎవరి మాట చెల్లీది? వినాయక చవితి చందాలు ఎత్తడం లోన, సంక్రాంతికి బోగి మంటల కర్రలు కాల్చడం లోన వూర్లో తీర్మానాలు జరిగీవి. అవి ఎవులుసేసీవోలూ? మేష్టర్లు, కొత్త వుజ్జోగస్తులు. ఆలెక్కడి నుండి వొచ్చేరు?

ఇప్పుడు?

వూర్లోకి కొత్త మనుషులొచ్చేరు. వూర్లోని చదువుకుని ఉద్యోగం చేస్తున్న ఆడపిల్లల్ని పెళ్లిల్లు చేసుకుని వూర్లోనే కాపరం పెట్టిన కొత్త గిరిజనులు వచ్చేరు. వాళ్ళ మాట చెల్లుతుంది.

అలాంటి వాళ్ళలో ముఖ్యుడు చౌదరిగారు.

మొన్నటికి మొన్న వూర్లోని పంచాయితీ ఎన్నికల్లో…? చౌదరి గారు నిలబెట్టిన అభ్యర్థి గెలిచాడు. అతని మాట విన్న వాడే ఇప్పుడు వూరి సర్పంచ్. ఈ రోజు అతను ఏమి చెబితే అది జరుగుతుంది వూర్లో. ఈ చౌదరి గారు ఎక్కడినుండొచ్చారు? ఏదో ట్రైనుంగులో వూరి అమ్మాయిని చూసేరు. ఆమెకి ఐ.టీ.డీ.యే.లో ఏదో పనిచేసి పెట్టేరు. పరిచయం పెంచుకున్నారు. ముందు స్నేహమన్నారు. తరువాత ప్రేమ అన్నారు. ఇప్పుడు వూర్లో అందరూ దండం పెట్టాల్సిన వాడయ్యేడు. అతనికి మండల కేంద్రంలోని వైన్ షాపులు, షాపింగ్ కాంప్లెక్సులూ వున్నాయి. వున్నవన్నీ భార్యపేరుమీదే వున్నాయి. నడిపేది, నడిపించేదీ అతడే.

అంతదాకా బాగానే వుంది కానీ...

ఓ రోజు నాన్న తో మాట్లాడాలని ఇంటికొచ్చేడు. అప్పుడికి నాన్న గడపలో నులక తాడు పేముతున్నాడు. అతని రాక చూసి నోట్లోని చుట్టతీసి నేలకి రాసి పక్కన బెట్టి ఆహ్వానించేడు నాన్న.

"బాగున్నావా?" పలకరించేడు ప్రేమగా. ఆప్రేమ వెనుక ఏదో వుందని ముందే గ్రహించేడు నాన్న.

"బాగున్నాను గానీ ఏటిలగొచ్చినావూ?" అడిగాడు సూటిగా.

అప్పుడు చెప్పేడు దోనిపాక గెడ్డ దిగువునున్న రెండెకరాల పొలం గురించి. ఆ ప్రక్కనే వున్న పదిహేను ఎకరాల భూమి కొనుక్కోగా చిన్న మెరక లాంటి ఆ భూమిని కూడా కలుపుకోవాలని ఎప్పటినుండో అనుకుంటున్న పథకాన్ని ఆ రోజు అమలు పరిచాడు.

"అది మా తాతలు చేసిన బూమి బావూ! జాకరమ్మ కురిక్కి పక్కనున్నదని మా తాత ఆ భూమి సేసుకున్నాడు బావూ!" కుదరదన్న మాటని అలా చెప్పేడు.

చౌదరి గారికి కోపమొచ్చింది. నాగుపాములాగా నడిచెల్లి పోయేరు.

ఆ కొన్నాళకి....

ఒక సాయంత్రం...

కొండ మీద నేదొండ పాదులుకి గొప్పు తవ్వుతున్న నాకు నాన్న గొంతు వినిపించింది."బాబూ! రా రా!!" అంటూ నాన్న నా వైపు పరెగెత్తుకుంటూ రావడం కనిపించింది.

అప్పటికే అతని పరిస్థితి నాకే కాదు వూరందరికీ అర్థమవుతూ వచ్చింది... మతిని కోల్పోతున్నాడని.

"ఏ వాఇ్!" అంటూ ఎదురెళ్ళేను కొండ రాళ్ళమీద ఎక్కడ పట్టు తప్పి అడుగేడి పడిపోతాడోనని. అతని ముఖంలో ఆందోళన. కళ్ళలో భయం. "ఏటయ్యింది వాఇ్?" అడిగేను. నా చేయి తన చేతుల్లోకి తీసుకుని వూరి వైపు లాగుతూ నన్ను నడిపించేడు. అతని చెయ్యి వణకడం నాకు తెలుస్తుంది.

వూరి చివర 'జాకరమ్మ సంది' దగ్గర జనం గుమి గూడి వున్నారు. ముందుకెళ్ళి చూస్తే... కొంత మంది గునపాలు పారలు పట్టుకుని సంధి బుట్టల్నీ, గంపల్నీ చిందర వందర చేసేసి అక్కడ తవ్వడం కనిపించింది. ఏమి జరిగిందని అడిగితే.... "ఇక్కడ చర్చి కడుతున్నాం" అన్నారు. ఆ సమూహానికి మంగన్న నాయకత్వం వహిస్తున్నాడని అర్థమవుతూనే వుంది.

అప్పుడే చౌదరి గారు అక్కడ ప్రత్యక్షమయ్యేరు. ఆ సమూహం లోంచి ఏదో మాట్లాడుతున్నాడు. మొదట్లో ఎవరికీ అర్థం కాలేదు. కొంత సేపటికి నాన్నకి అర్థమైపోయింది. ఆ రోజు చౌదరికి గారికి ఆ భూమి ఇవ్వనందుకు ఫలితంగా మంగన్నని ఈ మధ్యనే ఎమ్మార్లో ఆఫీసుకు తీసుకుపోయి, ఆ భూమిని  అటవీ హక్కుల చట్టం కింద 'వూరుమ్మడి' స్థలంగా రాయించి తీసుకొచ్చేడు.

నిజమే అది 'వూరుమ్మడి జాగా'యే. అందుకే దేవుని స్థావరమైన జాకరమ్మకని నిర్ణయించి దీసరికప్పజెప్పేరు. కానీ ఈ రోజు? వూరుమ్మడి జాగాలో జాకరమ్మ బదులుగా కొత్త శిలువొచ్చి నిల్చుంది.

"ఇది 'జాకరమ్మ సంది'రా! వూరుని దయ్యాల నుండి మరిడమ్మల నుండీ కాపాడే సందిరా! ఇది మన తాత తండ్రుల నుండి వస్తున్న మంత్రించిన వూరు కట్టు స్థలంరా!" చెప్పేను. ఎవరూ వినలేదు. చిన్న తోపులాట. నన్ను వెనక్కి నెట్టేరు.  నాన్న మాత్రం అచేతనంగా మాటలేవీ పలక కుండా ముందుకెళ్ళి గునపాల్నీ పారల్నీ లాక్కుని సంది బుట్టల్ని యదా స్థానంలో పెట్టే ప్రయత్నం చేసేడు. అంతే. అందరూ కలిపి అతన్ని నన్నూ వెనక్కి నెట్టేరు. నేను తమాయించుకో గలిగేను. కానీ నాన్న నిలబడలేకపోయేడు. పెనుగులాటలో ఎవరో అతన్ని బలంగా తోసేరు "పిచ్చోడ్రా.." అని. నేల పడి నుదురు రాయికి గుద్దుకున్నా పట్టించుకోకుండా ఆ మాటన్న వాడి వైపు చూసేడు. తమ్ముడి కొడుకు కొడుకు. మనవడి వరస. ఆ మాటకొస్తే అక్కడ నిలబడిన వారందరూ బంధువులే. ఒకరికొకరు చుట్టాలే. ఎందుకిలా అయిపోయారు? దీనికి కారణమెవరు?

ఆ పడిపోవడం.... నాన్న మాత్రమే పడిపోయేడనుకున్నాం. కానీ నాన్న నోరు కూడా పడిపోయింది. ఆ నోట పాట పడిపోయింది. తరతరాలుగా సంప్రదాయం పేరుతో వూరుని నడుపుతున్న ఒక వ్యవస్థ కూలిపోయింది. దీసరి ముహూర్తం చూసే అవసరం పోయింది. జన్నోడు పూజలు చేసే సందర్భం క్రమంగా కనుమరుగైపోయింది. ఎజ్జోడు దీర్ఘాలు తీస్తూ కానికులు చదవడం ఆగిపోయింది. కార్జి పండుగ సందర్భాన్ని చాటింపు వేసే దృశ్యం కలగా మిగిలిపోయింది. జనం డప్పు దరువుల్ని మర్చిపోయేరు. వూరంతా ఒక్కటి. తమ కుటుంబం మాత్రమే ఒక్కటి. ఈ బాధలేవీ నా కొడుక్కి తగలకూడదనీ వూరుకి దూరంగా.. కొండకనపడని నగరంలోకి పారిపోయొచ్చేసాం.

అక్కడితో నాన్నా లేవలేదు. నాన్న గొంతూ లేవలేదు. కానీ వూర్లో చర్చ్ మాత్రం నిటారుగా రంగురంగుల గోడల్తో నిలబడింది. ఆ కొన్నాళ్ళకి చౌదరిగారు ఆ రెండెకరాల తో పాడు మొత్తం పాతికెకరాల భూమినీ తొంభైతొమ్మిది సంవత్సరాలకి లీజుకి రాసుకుని వ్యవసాయం చేస్తున్నారు.

"అయితే డాడీ! ఇప్పుడు మనూరు జన్నోడు, దీసరి, ఎజ్జోడు, కార్జిలు ఎలావున్నారో? ఎక్కడున్నారోకదా?" అడిగేడు సురేష్.

"ఎలా వుంటారు? వాళ్ళందరూ చెన్నయి, బెంగుళూరు లాంటి మహా నగరాల్లో రోజు కూలీలుగా వున్నారు." అని జవాబిస్తుండగానే.. చెన్నైలో నిర్మాణంలో వున్న భవనం కూలిపోయిందని, శిధిలాల కింద ఉత్తరాంధ్రకు చెందిన కూలీలు సమాధైపోయేరని టీవీలో బ్రేకింగ్ న్యూస్ మళ్ళీ మళ్ళీ వినిపిస్తూ....

*('కొండ శిలువ' పేరున స్వల్ప మార్పులతో ఉత్తరాంధ్ర, డిసెంబరు 2017)*

*(మిత్రుడు నిమ్మల నాగయ్యకు ప్రేమతో)*

# డోలి

**సా**యంత్రం...చిన్నారి పెళ్ళి కూతురు కన్నీరు పెడుతున్న వేళ. సన్నగా చినుకులు మొదలయ్యేయి. కొండమీద నుంచి పశువులు తో పాటు మనుషులు కూడా వూరు చేరడంతో అలికిడి అప్పుడే మొదలయ్యింది. నులక మంచాలకింద కుంపట్లు ఒళ్ళు విరుచుకుంటున్నాయి. ముసిలోల నోట అడ్డపొగ అంటుకుని గుప్పు గుప్పున పొగలొదులుతున్నాయి చుట్టలు. గడపల్లో మనుషులమీద విషం చిమ్ముతోంది రంగుల వెలుతురు.

అప్పుడే... అంతదాకా కుక్కిమంచమ్మీద ముతక దుప్పటిలో మూలుగుతున్న సింగన్న పడాల్ భళ్ళున వాంతి చేసుకున్నాడు. అతడి వయసు పద్నాలుగేళ్ళు. చినుకులు వానగా మారాయి. ఈదురు గాలి తోడై రొజ్జకొట్టింది. బ్రేక్ రావడంతో కొందరు పడాల్ వైపు చూసేరు. మరికొందరు ఇది మామూలే అన్నట్టు ముందుకే చూస్తూ వుండి

పోయేరు. మొగలిరేకులు మొదలయ్యింది. వార్తల్లో కొత్త రాజధాని మెరిసి మాయమయ్యింది. జోడీ కట్టిన జంటలు ఢీ కొట్టేయి. జబర్దస్త్‌లో వోలకాలూ పూర్తయ్యేయి. పడాల్ కి వాంతులు ఎక్కువయ్యేయి. పిల్లలు ఎక్కడివాళ్లు అక్కడే నిదరపోయేరు.

"ఎప్పుడు కాసి అవుతున్నాయి.?" పడాల్ పక్కకి చేరి అడిగేడు రామన్నదొర. అడగేడు కానీ అతనికీ తెలుసు పడాల్ మంచమెక్కి మూడు రోజులయ్యిందని.

"నిన్నటి కాసే..." మంచం కింద వాంతిని నీళ్ళతో కడిగి కింద కుంపటి సరి చేస్తూ చెప్పింది తల్లి.

"ఏటేనే తిన్నాడా?"

లేదన్నట్టు తలవూపింది. కానీ అతనికి తెలుసు మొన్న అతనేమి తిన్నాడో. మూడురోజుల క్రితం పందిముక్కు దుంపలు తవ్వి తెచ్చేడు అడవిలోంచి. అవి ఉడకబెట్టి తిన్నాడు. అంతవరకూ బాగుంది కానీ అవి సరిగ్గా ఉడక్కపోవడమే వచ్చింది సమస్య. ఆ రోజు రాత్రే మేక మాంసం కూడ తినేయడంతో...

మళ్ళీ వాంతి చేసుకున్నాడు పడాల్ . గడపలో నీచు కంపు మరింత ముదిరింది. పడాల్ ఆపసోపాలు పడిపోతున్నాడు. కుంపట్లో గుగ్గిలం గుండ వేయడంతో గడప వాసన మారింది.

''నాగరాజు దగ్గిరకెల్లి మాత్రలున్నాయేటో సూడుమీ'' పంపించేడు రామన్నదొర పక్కింటి యువకుడ్ని. వాడు వెళ్ళొచ్చేడు. "లేవట మామా! కిందిటి నెల యేయెన్నెమ్ ఇచ్చిన మాత్రలు అయిపోయినాయట" అని తూలుతూ రాటకి చేరబడ్డాడు. ఆమాటతో వెంటనే సెల్ తీసి ఏదో నంబర్ డయల్ చేసేడు. ఫోన్‌లో రింగ్‌ని వింటూనే రాటవైపుకి చూసేడు. వాడు తాగి వున్నాడని తెలిసిపోతూనే వుంది. చదువుకున్నవాడే కానీ తాగుడుకి బానిసైపోయేడు. 'వూర్లో మాత్ర కంటే మందే సులభంగా దొరకడం! ...ప్చ్!'

"హలో?"

"చెప్పు దొరన్నా!" అటునుంచి ఏయెన్నెం గొంతు వినపడింది.

"పడాల్ కి వాంతులవుతున్నాయి"

"నేనిచ్చిన మాత్రల్లో డొమెస్టాల్ అని చిన్న మాత్ర వుంటాది తీసి వెయ్యించండి"

"ఏ మాత్రలూ లేవట"

"అదేటీ అన్నీ అయిపోయ్యా?"

"అయిపోనాయీ... లేకపోతే మాకేటి సరదాయేటి...?"

"హలో?"

"హలో??"

"హలో!"

"...??!!"

"ఈ రోజు ఐటీ అనగానే ఆంధ్రప్రదేశ్ గుర్తుకు రావాలి. ప్రపంచంలో ఏ మూల నుంచైనా తెలుగువాడు గర్వపడేలా రాజధాని నిర్మాణం చేస్తున్నాం. అందుకు మీరందరూ సహకరించాలి' టీవీ ముందు ఎవ్వరూ లేకపోయినా దానంతటదే వాగుతోంది. ఇంట్లో ఉన్న వాళ్ళందరూ పడాల్ మంచం చుట్టూ వున్నారు.

''ఇప్పుడేటి సేస్తామైతే?'' సందేహం వెలిచ్చాడు నడి వయసులోవున్న వ్యక్తి.

వాన పెరిగింది. పడాల్ వాంతుల్లాగే.

"ఎజ్జోడికి పిలండి" వెనక నుంచి ఎవరో అన్నారు.

"కాదు. ఆస్పిటల్‌కి తీసికెల్దుమ" చదువుకున్న రామన్న దొర అన్నాడు. అతని వైపు అందరూ ఆశ్చర్యంగా చూసేరంతా.

ఎందుకంటే...

వాన. ఆపై రాత్రి. వూరు దాటాలంటే బురద దారిలో కొండ దిగాలి. మధ్యలో గెడ్డ దాటాలి. ఒకవేళ తీసుకు వెళ్ళాలన్నా తెల్లవారే సాధ్యంగానీ ఇప్పుడు సాధ్యం కాదని అందరికీ తెలుసు.

'కిందకి దించకపోతే లాభం లేదు' తనలో తాను అనుకున్నా అది బయటికి వినపడింది. అతను హాస్పిటల్‌కి చేరకపోతే మొన్న జరిగిన చావులాగే ఇదీ జరగొచ్చు.

అంతదాకా దుఃఖాన్ని గొంతులో నొక్కిపెట్టి ఆపుకున్న తల్లి ఆ మాటతో ఒక్కసారి ఏడుపందుకుంది. అందరూ బిక్కచచ్చిపోయేరు. వూర్లో వున్న మిగతా గడపలు ఉలిక్కిపడ్డాయి. ఏదో కీడు శంకించేరు. ఒక్కొక్కరుగా అక్కడికి చేరుతున్నారు. వాన మరింత ముదిరింది. గాలి విసిరికొడుతోంది. కొడుకు పక్కనే చుట్ట కాలుస్తూ నేల చూపులు చూస్తూ వుండిపోయేడు పడాల్ తండ్రి సోమన్నపడాల్. అతడి ముఖంలో ఏ భావమూ కనిపించడం లేదు. ఏమి చెయ్యాలో తోచక ఎజ్జోడి రాక కోసం ఎదురు చూస్తూ వుండిపోయేడు.

రామన్న దొర నలుగురు కుర్రాళ్ళని కూడదీసేడు. రెండు కర్రల్ని తెప్పించేడు. గట్టి దుప్పటి నాలుగు చివర్లనీ రెండు కర్రలకి ముడి వేసేడు. డోలీ కట్టిస్తున్నాడని అందరూ అక్కడి ఏర్పాట్లని చూస్తూ వుండిపోయేరు. ఇది సాధ్యమా కాదా అని అందరిలోనూ ప్రశ్న. రామన్న దొర తన పని తాను చేసుకుపోతున్నాడు. దొర వూరిలో డిగ్రీ చదివిన మొదటి కుర్రాడు. అతని తర్వాత డిగ్రీ చేస్తున్న వాళ్ళున్నా కొందరు వూర్లో వున్నారు. మరికొందరు హాస్టళ్ళలో వుంటున్నారు. సెలవులకే వూరు చేరుతారు.

"ఏటిప్పుడు డోలీ మీద దించీగలమనే ఇదంతా సేస్తున్నావేటి?" అడిగేడు ఒక నడివయసాయన.

"లేకపోతే ఈడినిలాగే ఒదిలేస్తమా?" డోలీ కడుతూనే సమాధానమిచ్చేడు రామన్నదొర.

"వాన సూస్తే ఇలగుంది. డోలీ అని తయారైపోతున్నారు. ఎలాగవుద్దివోయ్?" మరోసారి అనుమానం వ్యక్తం చేసేడు.

"గొడుగులున్నాయిగదా? తియ్యండి" ఎలాగైనా పడాల్‌ని కొండదించడానికే నిర్ణయించుకున్నట్టు అన్నాడు.

"గొడుగులుంతే? దారి కనపడొద్దేటి?" మరొక అనుమానం తెరలేపేడు.

"టార్చిలైటుంది గదా అడగండి కొసాయింటి మంగన్న దగ్గర?"

"ఉంది. గానీ బేటరీల్లేవు"

"సెల్‌ఫోన్లు పట్టండి... ఏది ఏటైనా ఈడినీ రాత్రి కొండ దించాల" అని నిలబడ్డాడు.

"ఒద్దు బాబు...!" అని నిలబడింది పడాల్ తల్లి ఉన్నట్టుండి.

అందరూ ఆమె వైపు చూసేరు. "పోతే ఇక్కడే నా ఇంటి కాడే పోనీ గానీ....." అని గుక్కపెట్టి ఏడుస్తోంది. ఆమె వయసు నలభై దాటి వుంటుంది. డెబ్భైయ్యేళ్ళ స్వతంత్ర భారతదేశంలో ఎదిగిన ఏ నగరాన్నీ చూసి వుండదు...దగ్గర్లోని సంత ని తప్ప. మొదటిసారి నగరానికి తన కొడుకుని ఈ స్థితిలో తీసుకు వెళ్ళడం ఆమెకు నమ్మకం కలగడం లేదు. బోరున ఏడుస్తోంది వర్షంలా.

"నువ్వొల్లకోయే ఏటైపోయిందని ఏడిసెత్తున్నావు" అని కసురుకున్నారు. రామన్నదొర ఇవేవీ పట్టించుకునేలా లేదు. తన పనేదో తాను చేసుకుపోతున్నాడు. మరికొందరు సెల్‌ఫోన్‌లో సిగ్నల్స్ కోసం ప్రయత్నిస్తున్నారు. గడపలో టీవీ మాత్రం అదే పనిగా వాగుతోంది. ఇంకా పడుకోని పిల్లలు రిమోట్ కంట్రోల్‌తో చానెల్స్ మారడాన్ని బాగా ఎంజాయ్ చేస్తున్నట్టు ఒకదాని తర్వాత మరొకటి మారుస్తూనే వున్నారు.

డోలి సిద్ధమైంది. చినుకుల ఉధృతి కాస్త తగ్గినట్టైంది. పడాల్‌ని మంచం మీది నుంచి డోలీకి మార్చేరు. పడాల్ తల్లి శవాన్ని ఎత్తినట్టు భావించిందేమో గొల్లున మరొక్కసారి ఏడుపందుకుంది. అందరూ ఆమెను ఓదార్చి ఇంట్లోకి తీసుకుపోయేరు.

గొడుగూ, గిడుగులతో...

రెండు కర్రలకూ నాలుగు వైపులా నలుగురు మోస్తూ...

సెల్‌ఫోన్ వెలుతురులో...ఆకాశం ఉరుముతుండగా...

డోలీ కొండ దిగుతోంది.

ముందు నడుస్తున్న వాళ్ళ చేతుల్లో కర్రలున్నాయి ఆపదొస్తే ఆయుధాల్లా ఉపయోగించడానికి.

డోలీ ఊరు దాటిందో లేదో కళ్ళు జిగేల్మనేలా మెరుపు

మెరిసింది. అందరి కళ్ళూ బైర్లు కమ్మినట్టైంది. ఒక్కసారి ఆగి మళ్లీ కదిలింది డోలి.

❊ ❊ ❊

అలవాటైన దారే. కానీ ఆకాశం ఇలాగున్నపుడు దారి ఎలా మారిపోతుందో ఎవ్వరికీ అంతు చిక్కదు. వానలో కొండదారి ఉనికిని మార్చుకుంటూ వుంటుంది. అక్కడక్కడా రాళ్లు జారిపోతుంటాయి. మట్టి కరిగి కొండనీటికి కొత్త దారినిస్తుంటాయి. దారి కాలువై పోతుంటుంది. పట్టు తప్పితే ప్రమాదం పొంచి వుంటుంది. అందరూ గుడ్డిగా నడుస్తున్నారు. నడుస్తున్న దారి ఇప్పటిది కాదు. తాము పుట్టి బుద్దెరిగిన నుంచీ నడుస్తున్న దారి. తామే కాదు తాతలు నడిచిన దారి కుడా. ఈ దారి మీద ఎన్ని తరాలు నడిచేయో! ఇంకెన్ని తరాలు నడవాల్సి వుంటుందో?!

సెల్‌ఫోను లైటు కన్నా వెయ్యకుండా వుంటేనే కాస్త వెలుతురు వున్నట్టు గమనించేరు, ముందున్నవాడి చేతిలో తప్ప అందరూ చీకట్లో తప్ప అందరూ నిశ్శబ్దంగా నడుస్తున్నారు. కొందరు సిగ్నల్ తగులుతుందేమోనని అక్కడక్కడా ఆగి సెల్‌ఫోన్ ని ఆన్ చేసి చూస్తున్నారు. డోలీ లో పడాల్ ఊపిరి మాత్రమే తీస్తున్నాడు.

చినుకులు ఆగేయి. మబ్బులు పల్చబడ్డాయి. దారి ముందుకన్నా స్పష్టంగా కన్పిస్తోంది. రాళ్ళున్న చోట జాగ్రత్తగా దిగుతూ, నీరు పారుతున్నచోట డోలీని ఎత్తి నడుస్తూ ముందుకు సాగుతున్నారు. కొండ దిగిపోయింది డోలి. ఇప్ప చెట్ల కింద నుంచి మామిడి మాను తోటలోకి దారి దూరింది. ఎవరిదో సెల్‌పోన్ బ్లింక్ అయింది. సిగ్నల్ అందిందన్న ఆనందంతో అందరి ఫోన్లూ చెక్ చెసుకుంటున్నారు.

కానీ....

ఎదురుగా వాగు. గర్జిసోంది. రెండు కొండల నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దాటడం కష్టం. “నీను సెప్పినానా లేదా?” అంటూ ముందుకొచ్చేడు మండింగి సిమ్మడు. దాటలేమురా అంతే ఇన్నారా?..

ఇప్పుడు పడండి. ఇంటికాడుండుంతే వానకైనా తడకుండుందుము” అన్నాడు. డోలీ భుజాలు మారింది. మోసినోళ్ళ కాళ్ళు వణుకు తున్నాయి. ఎక్కడా దించకుండా నడవడం వల్లేమో అందరూ గట్టిగా వూపిరి తీస్తున్నారు. చినుకుల్లో చెమట. డోలీలో పడాల్ వాంతితో దుప్పటి మరింత కంపు కొడుతోంది.

“ఏటి సేద్దుమంతే ఏటిసేద్దుమని వల్లకుండా ఏదో ఒకటి సెయ్యండ్రా!... ఇలాంటివి మనకేటి కొత్తా యేటి?” అసహనాన్ని ప్రదర్శించేడొకరు.

“గొల్లు సెయ్యకండ్రా! ఏయేనమ్మకి ఫోను రింగవుతుంది... హలో?”

“హలో?”

“మీమిప్పుడు పడాల్ని డోలీ యేసి పట్టుకొచ్చేసినాము హాస్పిటల్కని... గానీ ఇక్కడ వాగు బాగా పారుతుంది. ఏటి సెయ్యడము?”

“నీనేటి సెయ్యగలను?హాస్పిటల్కి తెచ్చేస్తే ఎదో ఒకటి చేద్దాం.. ఈ లోగా నీను నూటెనిమిదికి ఫోను చేస్తాను”అంటు పెట్టేసింది.

వాగు...

ఇక్కడ ఒక కాజ్వే కట్టండని ఎన్నిసార్లు కాగితాలు పెట్టేమో గుర్తొచ్చింది రామన్న దొరకి. ఈ దారి గుండా నాలుగూర్లు నడకదారి సాగుతుంటుంది. ఎన్నిసార్లు దీని పేరు పెట్టుకుని....ఇక్కడ ఇది కట్టిస్తానని ప్రెసిడెంట్లు ఎంతమంది మారేరో గుర్తుకొచ్చింది. ఎంతమందికి అధికారులకీ, ఎమ్మెల్యేలకి దండాలు పెట్టేమో గుర్తొచ్చింది. వాన పడితే వాగు పొంగుతుంది. వాగు పొంగితే దారి ఆగిపోతుంది. ఈ దారి దాటుతూ ఎంతమంది ప్రాణాలొదిరేరో!? ఎన్ని పశువులు ఇక్కడ జారిపడి కొట్టుకుపోయాయో?!

ఈ రాత్రివేళ డోలీ దాటించడమెలాగో ఆలోచిస్తున్నాడు రామన్న దొర. అదే సమయంలో అతన్ని ఆడిపోసుకుంటున్నారు ఈ వానకి గెడ్డ పొంగుతాదని తెలీదా అని. అందరికీ ఒక్క గసురు గసిరి తిరిగి

తిట్టేడు. దారి ఎలాగైనా దాటించి వీడిని డాక్టరు దగ్గరకి చేర్చకపోతే వీడు చచ్చిపోతాడని మందలించేడు. ఊర్లో జరిగిన చావుల్ని గుర్తు చేసేడు. వాటికి కారణాల్ని విశ్లేషించేడు. కారణం ఆలస్యమని చెప్పేడు.

"బాగుందిరా దొర! అయితే ఈ గెడ్డెలగ దాటిస్తావో అది ముందు సెప్పు" అంటూ అందరూ ప్రశ్నించేరు.

"ఒరే నాగన్నా! గొడ్డలి తెచ్చేవుగలా?" అంటూ నాగడి వైపు చూసేడు.

"అర్ధమైందిలే... గానీ ఈ యేలప్పుడు ఏ సెట్టు కొట్టెస్తావూ? ఎలగ కొట్టెస్తావు?" అతని వ్యూహం అర్ధమైనా సాధ్యాసాధ్యాల గురించి అడిగేడు భుజమ్మీది గొడ్డలి చేతిలోకి తీసుకుంటూ నాగడు.

వాగు దూరం ఇరవై నుంచి ముప్పై అడుగుల పొడవుంటుంది. నీటి ప్రవాహం ఉధృతంగా వున్నా మధ్యలో నాలుగడుగుల వెడల్పున్న రాయి కనిపిస్తోంది. అక్కడికి ఒక చెట్టు నరికి అడ్డంగా వేస్తే అక్కడి నుండి అదే చెట్టు అవతలకి వేసి దాన్ని పట్టుకుని దాటొచ్చనేది దొర వ్యూహం. చాలా సార్లు అలాగే గెడ్డ దాటింది వూరు.కానీ అంత పొడవున్న చెట్టు నరికాలంటే ఎంత సమయం పడుతుంది? ఈ చీకటి వేళ అది సాధ్యపడుతుందా?

నాగడు అప్పటికే ఒడ్డుకి పదడుగుల దూరంలోనున్న గుగ్గిలం మాను కొట్టడం మొదలెట్టేడు. ఆ గొడ్డలి అలికిడికి దగ్గర్లోని పక్షులు, జంతువులు అలికిడి చేస్తూ పరిపోయేయి. కొంతమంది అటు వైపు నడిచేరు సాయంగా. మరికొందరు సెల్‌ఫోన్ తో తెలిసిన వాళ్ళకి మాట్లాడ్డానికి ప్రయత్నిస్తున్నారు. డోలీ కిందికి దించేరు. పడాల్ మరోసారి విరేచనం చేసుకున్నట్టున్నాడు... ఇందాకటి కంటే ఘాటైన కంపు కొడుతోంది. పారుతున్న నీటితో అతన్ని శుభ్రం చేసేరు. మరికొందరు పారుతున్న వాగు వంక పరిశీలనగా చూస్తున్నారు.... వేగం తగ్గితే దాటడానికి వీలు పడుతుందేమోనని. మరికొంతమంది దొరని తిట్టుకుంటున్నారు... చెప్తే విన్నాడు కాదని. అందరికీ తెలుసు, ఆ గెడ్డ ఎంతో సేపు అలా పారదని. ఒక గంటో గంటన్నరలోపే తగ్గిపోతుంది. కానీ వాన తగ్గాల.

చీకట్లో ...

అంతా ఎవరికి అనువైన ప్రదేశాల్లో వాళ్ళు ...

కూర్చుని ఎదురు చూస్తున్నారు.

చెట్టు కూలిన శబ్దం. కొండ ప్రతిధ్వనించింది. చెట్టు మీద నిద్రిస్తున్న పక్షుల గుంపులు గోల చేసుకుంటూ ఎగిరిపోయేయి. చుట్టు ప్రక్కల జంతువులేవో అక్కడి నుండి పారిపోయిన అలికిడి.... మొత్తంగా అక్కడ ఒక చెట్టు కూలిన సవ్వడి కొండకి దడ పుట్టించింది. ఇంత చేసినా ఆ చీకట్లో చెట్టు ఇక్కడికి మొయ్యగలమా లేదా ?మోసినా అది సరిగ్గా గెడ్డ మధ్య రాయి మీదకి సరిగా వేయగలమో లేదో నని సందేహాల మీద సందేహాలతో తర్జన భర్జన పడుతుంటే పడాల్ మరో సారి వాంతి చేసుకున్నాడు.

ఆకాశం మరొక్క సారి ఉరిమింది. ఆ వెలుగులో గెడ్డ మధ్య రాయి ముందుకంటే స్పష్టంగా కనపడింది. అంటే వరద తగ్గినట్టే. కొట్టిన చెట్టునలాగే ఒదిలేసి వాగు దాటింది డోలి. రోడ్డుకి నాలుగు కిలోమీటర్ల నడక దారి. నూటెనిమిది ఇంత లోపలికి రాదు. రోడ్డు మీదికొచ్చేయండి మీ ప్రాణాలకి మేము అడ్డుంటామని అంటారు. గానీ రోడ్డుకి రావడమంత తేలిక కాదన్న సంగతి నూటెనిమిదోలకి తెలీనిదా?

డోలీ దుప్పటిని మరోసారి కర్రలకి బిగించి కట్టి పడాల్‌ని మోసుకుపోతున్నారు. చీకటి... ఆపై బురద. దారి స్పష్టమవదు. నడక తరిగిపోదు. ఈ నడక ఎన్నాళ్ళు నడిచేరో ఆ వూరి వాళ్ళు! ఈ దారి ఎన్నేళ్ళుగా ఆ వూరి దరఖాస్తులమీద నడిచెళ్ళిందో! ఎంత మంది నాయకులకు ఓట్ల కోసం ఉపయోగపడిందో!

రోడ్డు చేరేసరికి నూటెనిమిది వాహనం ఎదురు చూస్తోంది. ఏయెన్నెం ఫోన్ చేసిందన్నమాట. మండల కేంద్రం లోని ఆసుపత్రికి చేరేసరికి రాత్రి అర్ధరాత్రిగా మారింది. బద్ధకంగా లేచిన డాక్టరు ఎగాదిగా వూరి వాళ్ళందరి వైపూ చూసాక పేషెంట్ నాడి పట్టుకోకుండానే 'ఏమైందని' అడిగేడు. చెప్పేరు. 'ఏమి తిన్నాడు'

అడిగాడు. చెప్పలేదు. ఎందుకంటే తిడతారని. అయినా రామన్నదొర ముందుకొచ్చి నిజం చెప్పేడు. డాక్టరు కష్టమని అన్నాడు. గతుక్కుమన్నారు అంతా. ఏమని అడిగితే ఇప్పటికే చాలా ఆలస్యమయ్యిందని అన్నాడు. గంట ముందు తీసుకొస్తే బాగుణ్ణని అన్నాడు. బతిమాలితే ఇక్కడ లాభం లేదు, జిల్లా హాస్పిటల్‌కి తీసికెళ్ళండని సలహా ఇచ్చేడు. ఇక్కడికి రావడమే గగనం. అంతకు మించి ఏమీ ఆలోచించలేక పోతున్నారు. 'ఇప్పటికే బాడీలో నీటి శాయం బాగా తగ్గిపోయింది... సెలైన్ ఎక్కడం కూడా కష్టమవుతోంది... మీరు లేట్ చేస్తే మీకే ఇబ్బంద'ని అన్నాడు.

'ఎలా?'అని ఆలోచించేలోగానే మరో డాక్టరు గారొచ్చేరు.

'ఏమైంద?'ని మళ్ళీ అడిగేరు.

అందరూ మౌనం వహించేరు. డాక్టర్లిద్దరూ పక్కకెళ్ళి మాట్లాడుకున్నారు. ఏమి చెయ్యాలో తెలీక ఏయెన్నెమ్ వైపు చూసేరు జనం. ఆమె తిరిగి డాక్టరు గారి వైపు చూసింది... ఏదో ఒక దారి మీరే చూపించండని అన్నట్టు. మళ్ళీ నూట ఎనిమిది ని పిలిచేరు. ప్రయాణం మళ్ళీ మొదలయ్యింది. నగరం వైపు పరుగులు తీస్తూ...పడాల్ అపస్మారక స్థితిలో.

చేరేసరికి వాన నెమ్మదించింది. హాస్పిటల్‌కి చేర్చి నూటెనిమిది వాహనం వచ్చిన దారినే వెళ్ళిపోయింది. డ్యూటీ డాక్టరు పేషెంటుని చూడడం కంటే అక్కడున్న మిగతా వారినే గమనించడం తెలుస్తూనే వుంది వాళ్ళకి. గదిలోకి స్ట్రెచర్‌మీద తీసుకెళ్ళేరు. పడాల్‌ని పరీక్షించేడు. ఆశ్చర్యంగా చేతులు దులుపుకుంటూ బయటికొచ్చేడు.

"ఇతను ఎప్పుడో చనిపోయాడు" అన్నాడు.

గతుక్కుమన్నారు అంతా. అందరి గుండెల్లో రాయి పడింది. ఆడోళ్ళు ఏడుపు అందుకున్నారు. పడాల్ తల్లినయితే ఎవరూ ఆపలేకపోతున్నారు. 'నీనప్పుడే సెప్పినానా? నా కొడుకు ఇంటి కాడైనా...' అని రాగమందుకుంది. మగాళ్ళు మాత్రం మౌనంగా గుండెల్లో బాధని దాచుకుని అనుకున్నారు... "వూరి చావు మరొకటి,

అయితే అది వూరి బయట" అని. రామన్నదొరకి ఏమీ పాలు పోలేదు. ఇప్పుడేమి చెయ్యాలో అర్ధంకాలేదతనికి. వెంటనే డాక్టరు గదిలోకి వెళ్లాడు.

"సార్! ఇప్పుడెలా తీసుకెల్లాలి?" ఆడిగాడు.

"నేనెలాగా చెప్తానయ్యా?'' అతని ముఖంలో విసుగు కనిపిస్తోంది. అతని డ్యూటీ దిగిపోయే సమయమని చూసేవాళ్ళకి తెలిసిపోతుంది.

"అంబులెన్సుంటాది గలా చూడండి సార్!" బతిమాలేడు.

"హాస్పిటల్‌లో ఏంబులెన్సులుంటే ఎప్పుడో బాగుపడిపోను వోయ్... అదిగో అటు చూసేవా? అదే మా అంబులెన్సు. దాన్ని పట్టికెల్తావా?" అంటూ బయట చుట్టూ గడ్డిమొలిచి తుప్పు పట్టిన వాహనాన్ని చూపించేరు. సరిగ్గా అప్పుడే తుప్పు పట్టిన వాహనం పక్కకొచ్చి నిలబడింది ఒక కొత్త వాహనం. అది చూసిన దొర "సార్...!" అంటూ డాక్టరు దగ్గరికి పరిగెత్తాడు. "ఆ బండేదో ఒచ్చినట్టుంది సార్!" అని అడిగాడు. దానివైపు డాక్టరు గారు చూస్తూ "అదా! అందులో పేషెంటున్నారయ్యా!" అని డాక్టరు చిరాగ్గా లోపలికి వెళ్ళిపోబోయేరు. అందరూ అటువేపు చూసేరు. నిజమే ఆ ఏంబులెన్స్‌లో పేషెంటున్నాడు. అతడు ఖరీదైన మనిషని తెలిసిపోతూనే వుంది. ఎవరికీ నోట మాట రాలేదు. ఏమి చెయ్యాలో తోచలేదు. డాక్టరు కాళ్ళమీద పడిపోయేడు రామన్నదొర. హటాత్పరిణామానికి డాక్టరుకి కోపమొచ్చింది. అతను కాళ్లు విదిలించేడు. దొర కింద పడిపోయేడు. అప్పుడే ఎవరో కొత్త వ్యక్తి లోపలికొచ్చేరు. అతని కాళ్ళకడ్డం పడ్డాడు దొర.

"అరరె...!" అంటూ దొరని పైకి లేపేడు. 'ఏమైంద'ని అడిగాడు. దొర ఒంటికంటిన దుమ్ముని దులుపుకుంటూ జరిగింది చెప్పాడు. అతను డాక్టరు వైపు అడుగులేసేడు.

"డాక్టరు గారూ! చూస్తేనే తెలిసిపోతుంది వీళ్ళంతా

అమాయకులని. పైగా చావు. మీరే ఎలాగో ఒకలాగ వెహికిల్ అరేంజ్ చెయ్యొచ్చు కదండీ" బతిమాలేడు.

దానికి అతనికి కోపమొచ్చింది. "వీళ్ళు అమాయకులా? నా డ్యూటీ నన్ను చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారు. వీళ్ళు అమాయకులా?" అంటూ స్వరం హెచ్చించి మాట్లాడేరు.

"నో సార్! వాళ్ళ ఉద్దేశం అది కాకపోవచ్చు... అర్థం చేసుకోండి సార్" ముందుకు నడిచిపోతున్న డాక్టరు వెనక పడ్డాడతను. ఆ మాటకీ ఆగలేదు డాక్టరుగారు.

"గిరిజనులంటే అంత చులకనా మీకు డాక్టరు గారూ!" స్వరం పెంచి గట్టిగా అరిచాడు. అంతా అతని వైపు చూసేరు."అతనేమీ ప్రాణాపాయ స్థితిలో లేడు. వీళ్ళా శవంతో వున్నారు. చేతిలో డబ్బులూ లేవు. ఏంబులెన్సు ఏర్పాటు చెయ్యలేరా?" అని డాక్టరు గారిమీదికి ఉరికేడు. అతనెవరో వీళ్ళకి తెలీదు.

"పోనీ... ఇందాక నూటెనిమికి పిలిపించండి సార్!" దొర బతిమాలేడు.

"అది పేషెంట్లకే గానీ శవాలకి కాదయ్యా" అని డాక్టరు గారు స్టెత్ వూపుకుంటూ ముందుకు కదిలిపోయారు.

వెళ్తూ వెళ్తూ 'మీరు త్వరగా శవాన్ని ఖాళీ చెయ్యాలయ్యా'లని చెప్పి వెళ్లిపోయేడు.

ఆ ప్రక్కనే వున్న నర్సులు దగ్గరికొచ్చేరు. "మీరు ఇక్కడ ఎంత బతిమాలినా ఏమీ ఫలితముండదువోయ్. బయటకెల్లి ప్రైవేటు అంబులెన్సులుంటాయి తీసికెల్లండ'ని ఉచిత సలహా ఇచ్చేరు. అక్కడ అడిగి చూసేరు. ఆ డబ్బు చెల్లించాలంటే వూరోలందరి చింత చెట్లు సంవత్సరం పాటు షావుకారికిచ్చేయాలి.

వచ్చిన కొత్త మనిషి "డాక్టర్ల నిర్లక్ష్యం... నశించాలి... నశించాలి" అని నినాదాలు చేస్తున్నాడు. అతని వెనక్కి మరికొంత మంది వచ్చి చేరేరు. దొర కూడ అక్కడే వుండి నినాదమై అరుస్తున్నాడు.

పరిస్థితి అర్థమైపోయింది... వూరి జనానికి. శవాన్ని చాపలో చుట్టి కట్లు ఇర్రించి కట్టేరు. ఎప్పటిలాగే రెండు కర్రలకి డోలీని సరిచేసేరు. శవాన్ని డోలీలోకెక్కించి హాస్పిటల్ దాటి రోడ్డుమీదికొచ్చేరు. ఎవరో మీడియాకు కూడ సమాచారమిచ్చినట్టుంది. సెల్‌ఫోనుల్తో కొంతమంది వెనకా ముందు నుంచి బంధిస్తున్నారు. వెనుక నుంచి అరుపులు నినాదాలూ వినపడుతున్నాయి.

మలుపు తిరిగింది డోలీ.

నాలుగు రోడ్ల కూడలి... ట్రాఫిక్ స్థంబించి పోయుంది.

అన్ని వాహనాలతోపాటూ నడుస్తున్న డోలీ కూడా ఆగిపోయింది. కారణాలు వాళ్ళకి తెలీలేదు. ముందుకు తలెత్తి చూసేరు. రోడ్డు మధ్యలో టెంట్లు వేసి వున్నాయి.

చాలామంది...

టెంటు నీడలో కుర్చీల ముందు నిలబడి....

కుడి చెయ్యిని ముందుకు చాపి నవనిర్మాణ దీక్ష చేపడుతున్నారు.

ప్రతిజ్ఞ మైకుల్లో ప్రతిధ్వనిస్తూండగా....

డోలీ దారి చేసుకుంటూ ముందుకు కదిలిపోయింది.

*(సాక్షి ఫన్‌డే, 8.01.2018)*

# గత వర్తమానం

“**అ**న్నా! కరపత్రం రెడీ అయిందా?” అడుగుతున్నాడు మిత్రుడు ఫోన్లో.

“సాయంత్రానికిచ్చేస్తా”నన్నాను.

ఆకు పచ్చని కొండలు. దొంతరల దొంతరలుగా. కొండలకానుకొని పంట పొలాలు. కొండల మీంచి జారుతున్న జలపాతంలా ఆకుపచ్చదనం. కోతిపిల్లకర్రాట, బొండాట, సిర్తా బిల్లాట... సింతపిక్కలాట... ఒకటేమిటి నా బాల్యమంతా ఆటలు దిద్దుకున్న ఆకుపచ్చదనం. నన్నెత్తుకున్న ప్రతి చెట్టూ ... నను హత్తుకున్న ప్రతి పుట్టా ఈ రోజు కనిపిస్తూ వుండొచ్చు కానీ రేపు? కన్నెదార కొండా... బోడికొండా... ఎర్రమంటి కొండా... ఒక్కొక్కటీ మాయమై పోతూ. సాలూరు కొండలూ, బాక్సైటు గనులూ... అన్నీ ఆదివాసీ నివాసాలే. తవ్వకాలూ, సంపదా, అభివృద్ధి పేరుతో ఆదివాసీల్ని తరిమేయడం...

దీన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ఐ.టీ.డీ.యే ని ముట్టడించే కార్యక్రమం చేపట్టింది. దాని గురించే రాయాల్సివుంది కరపత్రంలో.

టైమ్ చూసేను. స్కూలుకి వెళ్ళాల్సివుంది.

తరగతి గదిలో చెప్పాల్సిన పాఠం... రాయాల్సిన కరపత్రం మదిలో మెదులుతున్నాయి.

చుట్టూ చేసేను. బస్ ఇంకా రాలేదాని నిర్ధారించుకున్నాను. నాతో పాటు బస్సు ఎక్కాల్సిన వాళ్ళు అక్కడే వున్నారు. ఆ సెంటర్ ఒకప్పుడు నిర్మానుష్యంగా వుండేది. ఇప్పుడది మండల ముఖ్య వ్యాపార కేంద్రం. రోడ్డు ప్రక్కనే ఎత్తైన భవనాలు. వ్యాపార సముదాయాలు. జీడి పిక్కల వ్యాపారులు, కిరాణా, బట్టలు, డిపార్ట్‌మెంటల్ స్టోర్లూ, బజాజ్ బైక్ షోరూములు, మారుతీ కారు షోరూములూ... అన్నీ ఒకటేమిటి అన్నీ వ్యాపారంగా మార్చే అత్యాధునిక స్థలాలు. అన్నీ గిరిజనేతరులవే. ఈ భూములన్నీ స్థానిక గిరిజనులకే దక్కాల్సి వుండగా ఇవన్నీ ఎలా సాధ్యం? ఇక్కడ ఒన్నాఫ్ సెవెంటీ చట్టం వుందా? ఈ భూముల్ని కాపాడడానికి ఒక స్పెషల్‌డెప్యుటీ కలెక్టరు కార్యాలయం కూడా వుంది. కానీ అది కూలడానికి సిద్ధంగా. యేళ్ళ తరబడి ఆ పోష్టు ఖాళీగా. ఆ రోజు ఒకటి రెండు కుటుంబాలు మాత్రమే ఇక్కడ వుండి గిరిజన సంపదపై కన్నేసేవి. మరిప్పుడు? ఇవన్నీ ఎలా వచ్చాయి..? ఈ భవంతులన్నీ ఎలా లేచేయి? ఈ కార్లన్నీ ఎక్కడినుండొచ్చాయి?

బస్ రావడంతో బడిగుర్తొచ్చింది. నేనటు నడిచాను.

గదిలోకి అడుగుపెట్టగానే పిల్లలు ముఖాల్లో వెలుగు. అందరూ గిరిజన పిల్లలే. అసలు పాఠశాలే గిరిజన సంక్షేమానికి చెందినది. నాతో సహా అందరూ కొండా కోనల్లోంచి వచ్చిన వారే.

ఎన్వైర్న్‌మెంట్ లో "వాటీజ్ మేన్ విదవుట్ బీస్ట్"పాఠం. రెడ్ఇండియన్ల చీఫ్ సీటెల్ అమెరికా వాసులనుద్దేశించి చేసిన ప్రసంగం అది. వాషింగ్టన్ నిర్మించడానికి ఆ భూముల్ని తమ నుండి బలవంతంగా

లాక్కున్నపుడు అయిష్టంగానే అంగీకరిస్తూ చేసిన ప్రసంగమది. మూవింగ్ స్పీచ్...! అందరి గుండెల్లో ఎప్పటికీ మారుమ్రోగుతున్న ఆకుపచ్చ సందేశం.

అసలు సీటెల్ అయిష్టంగానైనా తమభూముల్ని ఇవ్వడానికి ఎలా అంగీకరించివుంటాడు?ఐరోపానుండి వలస వచ్చిన అమెరికన్లు స్థానిక నివాసులైన రెడ్ఇండియన్ల భూములు లాక్కోవడానికి ఏ ప్రలోభాలు చూపించి వుంటారు? లేదా ఏమని బెదిరించివుంటారు? అసలు అమెరికన్ల రాజధాని నిర్మాణం కోసం తన భూముల్ని ఎందుకు ఇవ్వాల్సివచ్చింది?

“రెడ్ఇండియన్లు ఎవరు సార్?” అడిగాడొక కుర్రాడు.

ఔను... ఎవరు? భూములు కోల్పోయిన వాళ్ళు. ఎవరు రెడ్ఇండియన్లు? రాజధాని రైతులని చెప్పాలా?పోలవరం గిరిజనులని చెప్పాలా? ఎలా చెబితే పిల్లలకు అర్థమవుతుంది?

చెప్పాను... వాళ్ళూ మనలాగ గిరిజనులు. అతి పురాతన ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్. ప్రకృతిని దేవతలా కొలిచే అత్యంత సహజమైన మానవులు. ఈ భూమి పైన అణువణువూ పవిత్రమైనదేనని భావించే సమూహం. తన పూర్వీకుల జ్ఞాపకాలు చెట్లలో ప్రవహించే జీవరసమనీ... పరిమళించే ప్రతి పువ్వూ అక్కచెల్లెలేనని... పలకరించే ప్రతిజీవీ తమ అన్నదమ్ముడే అని భావించే అతి పురాతన మానవ సమాజం అని చెప్పాను.

"can you buy or sell the sky? or warmth of the land?" అని అడుగుతున్నాడు సీటెల్ తరగతి గదిలో.

తరగతి గది సడెన్‌గా అడవిలా మారిపోయింది. సీటెల్ ఓ రాయి మీద కూర్చొని అక్కడి కొచ్చిన అమెరికన్లనుద్దేసించి మాట్లాడుతున్నాడు. చుట్టూ రెడ్ ఇండియన్లు తమ తమ పెంపుడు జంతువులైన గుర్రాల మీద బర్రెల మీద కూర్చొని ఆసక్తిగా వింటున్నారు. వాళ్ళలో కొంతమంది డెస్క్ బెంచీల మీద కూడా కూర్చొని వున్నారు. జాగ్రత్తగా చూస్తే వాళ్ళు మా పిల్లలు.

రాయి మీద నుండి మాట్లాడుతున్నది నేనా? చీఫ్ సీటెలా?

అది రెడ్ ఇండియన్ల నేలా? తరగతి గదా?

"ఈ రోజు తెల్లవాడి నుండి ఒక వర్తమానం అందింది." నా గొంతు నాకే గంభీరంగా వినిపిస్తోంది. దాదాపు మూడు చదరపు కిలోమీటర్ల మేర నిలబడివున్న ప్రజలు సులభంగా వినపడగల ధ్వని ప్రసరిస్తోంది నా గొంతులోంచి. "ఈ నేలను కొనాలనుకుంటున్నాను... దేశ రాజధాని నిర్మించుకుంటానని...ఈ నేల నుండి మనల్ని ఖాళీచేయమని అంటున్నాడు.... ఇచ్చేద్దామా మన భూములూ?"ఇంకా బిగ్గరగా అడిగాను.

'నీనెందుకిస్తానూ బూమీ?' తిరిగి ప్రశ్నించిందొక గొంతు. అటు చూస్తే అది నాన్న. అతడికెదురుగా మా ఎమ్మార్వో చేతిలో ఏవో కాగితాలు పట్టుకుని. "ఇక్కడ నర్సరీ ఎక్స్టెన్షన్ చేస్తున్నాం ఈ పాక వున్న భూమి ని ఇవ్వాల్సి వుంటుంది" అంటున్నారు. "ఇవ్వనంతే ఇవ్వను" అంటున్నాడు నాన్న.

"సార్! ఏమ్మాట్లాడుతున్నారు?" పిల్లలెవరో అరిస్తే ఈ లోకానికొచ్చేను.

దేశమేదైనా...

కాలమేదైనా... భూములు లాక్కోవడం. ఆదివాసీల్ని నిర్వాసితులుగా మార్చేయడం. ఇదే కదా చరిత్ర? ! కాదు కాదు ఇదే కదా వర్తమానం?!

నేనున్నది గతంలోనా? వర్తమానంలోనా??

"మన కోసం పునరావాసం కొత్తగా నిర్మిస్తున్నారని, మనల్నందరినీ అక్కడికి వెళ్ళమని కోరుతున్నాడు. ఆ స్వరంలో అభ్యర్థన కంటే ఆదేశమే వినపడుతోంది. వెళ్దామా?" సీటెల్ అడుతున్నాడు మరోవైపు తరగతి గదిలో రాయి మీద కూర్చొని.

"వద్దు సార్! ఈ భూముల్ని రాజధానికోసం ఇవ్వొద్దు సార్! ఇది మన నేల. మనకు బతుకు లేకుండా ఆర్భాటం, హంగుల రాజధానికోసం మనల్ని మనం కోల్పోవద్దు సార్!" పిల్లలు అరుస్తున్నారు.

అరుస్తున్నది పిల్లలా? భూములు కోల్పోతున్న రైతులా?

హటాత్తుగా తరగతి గదిలో అలజడి.

"మీకోసం అత్యంత ఆకర్షణీయమైన పేకేజీ ఇస్తున్నాం. మీ భూముల్ని ప్రపంచ పెట్టుబడుల్తో అందంగా తయారు చేస్తాం. అభివృద్ధి చేసి మీకో ప్లాటిస్తాం. అక్కడ మీరు వ్యాపారం చేసుకోవచ్చు....." తాయిలాలు మండమీద బెల్లం రాసినట్టు.

"వ్యవసాయం ఎలాగూ లాభసాటిగా లేదు... వ్యాపారమే మేలు... ఒప్పుకుంటున్నాం ఒప్పుకొంటున్నాం. మీ పేకేజీ బహు బాగున్నది'' గుంపులోంచి ఒకరు లేచి తన భూముల్ని అప్పగించేస్తున్నట్టు ప్రకటించేడు. అతని వెంట మరి కొందరు. వాళ్ళకి శాలువా కప్పేరు ప్రతినిధులు. కడుపు నిండా భోజనం పెట్టి పంపించేరు. అక్కడి నుండి వెళ్ళిపోతున్న వాళ్ళు అస్థిపంజరాల్లా మారిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది.

"ఆగండి! అందరూ అలాగే అనుకుంటే... ఇక్కడ వ్యవసాయం ఎవరు చేస్తారు? రాబోయే తరాలు ఏమి తింటాయి? ప్లాస్టిక్కుతో నిండి పోతున్న భూమి మీద మనిషి తినాల్సింది అన్నమే కదా? ఒకటి కాదు రెండు కాదు. యాభై వేల ఎకారాలు. అది మామూలు సంఖ్య కాదు. ఒక తరానికి తరం కోల్పోతున్న అన్నం ముద్ద. వేలకు వేల కుటుంబాలు నిర్వాసితులుగా మారిపోతున్న సంధర్భం... ఆలోచించండి ...ఆలోచించండి...ఆగండి!" మరికొందరు అరుస్తున్నారు.

వారి వెనక మరికొందరు.

ఆ సంఖ్య పెరిగిపోకుండా ఆనేల మీద రెండు అస్త్రాలు ప్రయోగించారు.

ఒకటి భూసేకరణ. రెండు భూఆక్రమణ. రెంటి అర్ధమూ ఒక్కటే. ప్రజల భూముల్ని ప్రభుత్వం లాక్కోవడం.

ఆ రెండూ కాఖీ రంగులో అక్కడి గాల్లో వ్యాపించాయి. ప్రజలు ఒక్కసారిగా అరిచారు. ప్రాణ భయంతో చెల్లా చెదురైపోయారు.

సీటెల్ కళ్ళు మూసుకున్నాడు. ఈ దృశ్యం ముందే

ఊహించగలిగాడతడు. అందుకే భూముల్ని తెల్లవాడికి అప్పగించడానికి అంగీకరించాడు...మౌనంగా.

"నాయకా! ఏమిటీ మౌనం?" ఎవరో ప్రశ్నిస్తున్నారు.

ప్రశ్న ఒకటే.

గొంతులే వందలు...

కాదు వేలు...

కాదు కాదు...లక్షలు.

కాదు కానేకాదు... అనంతం...బృందగానంలా.

కళ్ళు తెరిచాను. ఎదురుగా అడవుల్ని మోస్తోన్న అడవి బిడ్డలు. యూనిఫామ్ తొడుక్కుని అమాయకంగా డెస్క్ బెంచీల పై కూర్చొని... ఒక్కొక్కరూ ఒక్కొక్క ప్రశ్నలాగా.

నిజం కదూ! వీళ్ళంతా ఇళ్ళూ,భూములు కోల్పోయిన నిర్వాసితులు.

ఔను... నిర్వాసితులు.

హక్కుల్ని కోల్పోతున్న నిత్య నిర్వాసిత ఆదివాసీలు.

సీటెల్ చుట్టూ... మోకరిల్లి నేల మీద తలలు వాల్చి కూర్చున్న ప్రిమిటివ్ ట్రైబల్ పిల్లలు.

సీటెల్ మళ్ళీ గొంతు విప్పాడు.."తప్పదు. మనం ఈ నేలను విడిచి వెళ్ళక తప్పదు. లేదంటే మన జాతే అంతరించిపోతుంది. ఆధునిక కుట్రపూరిత శక్తుల ముందు ఆదివాసులమైన మనం ఎదురు నిలబడి పోరాడలేం. ఇది చీకటి కాలం. ఇప్పటికిప్పుడు యుద్ధానికి దిగితే మరణం తథ్యం. అది నాకిష్టం లేదు. ప్రవాసం అనివార్యం. ఎవరో కవి అన్నట్టు 'ప్రవాసమూ ఒక యుద్ధ రహస్యమే'. తప్పదు... ఈ నేలని ఖాళీ చేసి ఆ నిర్వాసిత కట్టడాల్లోకి వెళ్దాం పదండి" సీటెల్ నన్నావహించాడు. నా గొంతు నాలోనే ధ్వనిసోంది రహస్యంగా... స్పష్టంగా.

స్వరంలో కన్నీళ్ళు...! లక్ష గొంతుల నిర్వాసిత హోరు...!!

"నిర్మాణాలు...!

ఆధునిక నిర్మాణాలు...!!

ప్రజని నిర్వాసితులుగా మార్చే దు:ఖ నిర్మాణాలు...!!!

ఓట్ల కోసం...

పడగలెత్తే కోట్ల కోసం...

అందలమెక్కించే అసెంబ్లీ సీట్ల కోసం...

నిర్మాణాలు... ఆధునిక నిర్మాణాలు..." నా గొంతు తరగతి గోడలమీద రాసిన అక్షరాల్లా ధ్వనిస్తోంది.

"సార్! కవిత్వమా?" ఎవరో అడుగుతున్నారు. తరగతి గదిలోపలి నుంచా? గుండెగది లోపలినుంచా?

''కాదు కాదు. ప్రజల గొంతు. వారి కన్నీళ్ళను అనువదిస్తున్నాను" నేనే చెప్పానా మాట.

"అర్థం కాలేదు. మరోలా చెప్పండి. ఒక ఉదాహరణమివ్వండి" నా ఒడిలోకొచ్చి నా చెక్కిలి మీద చేయాన్చి అడుగుతున్నాడు మరొకరు.

గొంతు సవరించుకున్నాను. నా ఎదురుగా కుతూహలం కుప్పల్లా కూర్చొని వుంది... బెంచీల మీద... పుస్తకాలు ముందేసుకొని.

"ఇది నిర్వాసిత కాలం. ప్రజలంతా నిర్వాసితులుగా మారే కాలం. నేలను మాత్రమే కాదు, తమ బతుకుల్ని తాము కోల్పోతున్న కాలం. తమకు తెలీకుండానే నిర్వాసితులుగా మారిపోతున్న కాలం. మనిషి మనిషన్న సంగతి మర్చిపోతున్న కాలం. ఒక జాతి అంతరిస్తున్న కాలం. ఔను ! ఒక తరం తరవాతి తరంతో బంధనాల్ని తెంపుకుంటోన్న కాలం."

"కాలం సరే! కారణాలు చెప్పండి" కాలాన్నీ కవిత్వాన్నీ అర్థం చేసుకోలేకపోతున్న మరో విద్యార్థి అడిగాడు

వాడిని దగ్గరగా చేర్చుకున్నాను. అవే మాటల్ని మరోలా చూపించాను.

"ఇక్కడ చూడండి! మరొక నిర్మాణం." అని కొన్ని పాత దిన పత్రికల్ని చూపించాను.

"సార్! ఇది పోలవరం! నవ్యాంధ్ర మెడలో పూలహారం" అరిచాడో కుర్రాడు.

నవ్వొచ్చింది. బిగ్గరగా నవ్వేను.

"ఎందుకు నవ్వుతున్నారు సార్!" అయోమయంగా అడిగాడు అదే కుర్రాడు.

వాడి భుజమ్మీద చెయ్యేసి నడిపించాను. మా వెనుక తరగతి నడుస్తోంది. "కవిత్వమంటే కళాత్మకంగా చెప్పడమొక్కటే కాదు. నిజాన్ని నిర్భయంగా చెప్పడం కూడా" అన్నాను.

"అంటే? నేను చెప్పింది అబద్ధమా సార్?"

"ఔనన్నాను. నీ కవిత్వానికి దినపత్రికల సమాచారం మాత్రమే ఆధారం కాకూడదు."

"ఎందుకని సార్?"

"పత్రికలు చెప్పినవన్నీ నిజాలు అవ్వాలని రూల్ లేదు"

"మరి?"

"కవిత్వం నిజాన్ని ప్రతిబింబించాలి. పత్రికల్లో వచ్చిందీ, ప్రభుత్వాలు చెప్పింది మాత్రమే నిజం కాదు.అందుకే పోలవరం పూలహారం అంటే నవ్వాను"

"మరి నిజమేంటో ఎలా తెలుస్తుంది సార్?"

"పోలవరం అంటే ప్రోజెక్టు మాత్రమే కాదు. పోలవరం అంటే ఆదివాసీ నిర్వాసితుల శాపం కూడ. వాళ్ళతో మాట్లాడితే తప్ప నిజాలు తెలీవు."

"నిజం. అక్కడికి వెళ్ళకుండా, ఆ నిర్వాసితులతో మాట్లాడకుండా పోలవరం గురించి మాట్లాడే హక్కు మనకెవ్వరికీ లేదు." చివరి బెంచీ విద్యార్థి అన్నాడు.

"అందుకే ఇక్కడికొచ్చాం" అని ఆగాను. నా వెనుక వాళ్ళు...

తరగతి గది ఇప్పుడు...

రేకుల షెడ్డులతో...

వున్న వూరికి దూరంగా సిమెంటు గోడలతో...

మనుషుల నిండా కన్నీళ్ళతో...

భూములు కోల్పోయి పనుల్లేక దిక్కుతోచని మనుషులతో...

ఒక నిర్వాసిత గ్రామంగా మారిపోయింది.

విద్యార్థులు ఇంటర్వ్యూ చేస్తున్నారు.

వారితో మాట్లాడుతున్నది నేనో! పోలవరం నిర్వాసితుడినో!? రెడ్ఇండియన్ల చీఫ్ సీటెల్నో..! మాట్లాడుతున్నాం అంతే....

"నేనూ...నిర్వాసితుడిని! ఈ నేలమీద నన్ను నేను కోల్పోయిన ఒక నిర్వాసితుడిని...ఒక ఆదివాసీని. నా నేలను కోరుకున్నావంటే నా హక్కుల్నీ కోరుతున్నట్టే...

పిల్లలు శ్రద్ధగా వింటున్నారు.

"నీ పిల్లలకు చెప్పాలి...వాళ్ళ పాదాల కింద వున్న నేల మా పూర్వీకుల అస్థికలతో నిండి వున్నదని. ఈ మాటనే ఆధునిక కవి మరోలా అన్నాడు 'నేలంటే తాత ముత్తాల మాంసాస్థికలలోంచి పుట్టుకొచ్చిన బతుకు పువ్వు' అని. ఆమాటకు అర్థం తెలుసా? ఈ సందేశం పంపించి నా నేలను సొంతం చేసుకోవాలనుకున్నావు... అలా అనుకోవడంలో ఈ నేలను జయించానని విర్రవీగుతున్నావు. కానీ ఈ నేల అలా అనుకోదు. నీ వెర్రితనానికి నవ్వుకుంటుంది. ఎందుకంటే నేలను ఎవ్వరూ జయించలేదు. నేలే మనల్ని జయిస్తూ వస్తోంది. మనిషి నేలకు చెందినవాడు కానీ నేల మనిషికి చెందింది కాదు. ఈ సత్యాన్ని ఎప్పుడు నువ్వు గ్రహిస్తావో నాకర్థం కావడం లేదు. ఎందుకంటే నీ దృష్టిలో నేనొక ఆదివాసీని... అడవిమనిషిని... అజ్ఞానిని"

"మా హక్కులు మాక్కావాలి"

"మునిగిపోయింది భూమి కాదు... మా బతుకు...మా ఉనికి... మా చిరునామా"

"మాకు మా షెడ్యూల్డ్ ఏరియా హక్కులు కావాలి" నినాదాలు... జెండాలు...మనుషులై ఎగురుతున్న నిరసనలు... సీటెల్ మాటలకు కొనసాగింపులా. అధికారం ఆలకించని ఆర్తనాదాల్లా.

"మిష్టర్ సీటెల్! ఎక్కడున్నామో తెలుస్తోందా మీకు?" ఏ ప్రదేశం గురించి మాట్లాడుతున్నామో తెలుసా అని అర్థంలో అడుగుతున్నాడు మూడో బెంచీమీదున్న గ్రామస్తుడు.

"తెలుసు! దేశమేదైనా భూమొక్కటే. మనిషెక్కడివాడైనా జీవమొక్కటే. బాధ ఎక్కడిదైనా ఆక్రందన ఒక్కటే! నా మాట నమ్మక పోతే అటు వినండి!" అని నా చూపుడు వేలుని అటుగా చూపించాను.

పిల్లలందరూ ఒకే సారి అటువేపు తలలు తిప్పి చూసేరు.

భారీ తవ్వకాలతో పోలవరం! ఎత్తైన ఇనప గోడల నిర్మాణం!!

అవతల గోదావరి...!

నిండా నీళ్ళతో...!

కాదు కాదు మునిగిపోతున్న ఆదివాసిల కన్నీళ్ళతో...!

మాయమైపోతున్న అడవి నేల మూగ రోదనతో...!

ఇవతల..

నిర్వాసిత కట్టడాలుగా వూళ్ళు...!

దళారి చేతుల్లో దగాపడుతూ...ఆదివాసీ!

ఎంగిలి మెతుకుల్ని పేకేజీల్లో విసురుతూ... చిద్విలాసంగా నాయకులు!

"సార్! బెల్ అయి చాలసేపయింది" గది బయట తర్వాతి పిరియడ్ చెప్పాల్సిన మాష్టారు దీనంగా వున్నారు.

ఔను! ఒక పిరియడ్ పూర్తయింది.

బయటికొస్తుండగా స్టాఫ్ రూమ్‌లో నా మొబైల్ మోగింది. మిత్రుడు గుర్తు చేస్తున్నాడు "మిత్రమా! కరపత్రం తయారయ్యిందా? మనకంతగా సమయం లేదు ప్రింటింగ్‌కిచ్చేయాలి" అని.

ఔను...

సమయం లేదు.

*(వైజాగ్ ఫెస్ట్ 2018 కథల పోటీలో ప్రథమ బహుమతి,*
*సాహిత్య ప్రస్థానం, జనవరి 2018)*

# మా మాట

ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని కళా సాహిత్య సాంస్కృతిక రంగాల ఔన్నత్యాన్ని ఇక్కడి కవులు, కథకులు, కళాకారులు వివిధ కోణాలలో ఆవిష్కరిస్తున్నారు. అణగారిన జనాల ఆర్తిని అక్షరబద్ధం చేస్తున్నారు.

ఆ ప్రయత్నాలకు కొనసాగింపుగా స్నేహకళాసాహితి వేదికగా మా వంతు కృషి చేస్తున్నాము. గతయేడాదే మా రజతోత్సవ వేడుకల సందర్భంగా "పొద్దు ములిగిపోయింది" కథా సంకలనాన్ని ప్రచురించి మీ ఆదరణను పొందాము. స్నేహకళా సాహితి ప్రచురణ రంగంలో అడుగిడి రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న తరుణమిది.

1998లో "పాడుదమా స్వేచ్ఛాగీతం"తో ప్రారంభించి... గతయేడాది ప్రచురించిన "మనసు పలికే..." వరకూ కథలూ, కవిత్వమూ, గేయాలు, పాటలు, నఖచిత్రాలూ, వ్యాస సంపుటులూ

మొదలైన పద్ధెనిమిది పుస్తకాలను ప్రచురించాము. ప్రచురణ రంగం లో ఇరవయ్యో యేట అడుగిడుతున్న ప్రత్యేక సందర్భంలో...మా పందొమ్మిదో ప్రయత్నంగా స్నేహకళా సాహితి మిత్రుడు మల్లిపురం జగదీశ్ తన రెండో కథల సంపుటి "గురి" ని సాహిత్య లోకానికి అందిస్తున్నందుకు గర్వంగా వుంది. ఎప్పటిలాగానే మా ఈ పుస్తకాన్నీ సమాదరిస్తారని ఆశిస్తున్నాము.

<u>మా ప్రచురణలు</u>

| | |
|---|---|
| పాడుదమా స్వేచ్ఛాగీతం (పాటలు) | 1998 |
| కళింగోర (ఆంధ్రప్రభ కాలమ్, యాసపీఠం) | 2001 |
| రెక్కతలుపుల గోస (కవిత్వం) | 2003 |
| గీతాంజలి (పాటలు, ఠాగోర్‌కి స్వేచ్ఛానుసరణ) | 2004 |
| బడికథలు (కథలు) | 2004 |
| ప్రియభారత జనని (దేశభక్తి గీతాలు) | 2005 |
| నదిని దానం చేసాక (కవిత్వం) | 2006 |
| గాయం (కథలు) | 2008 |
| దుక్కి (కవిత్వం) | 2008 |
| నఖచిత్ర రేఖ (నఖ చిత్రాలు) | 2009 |
| నకజనకరి నాం..నాం... (కథలు) | 2011 |
| మంటిదివ్వ (కవిత్వం) | 2011 |
| ఇది నా వూరేనా(పాటలు సీడీ) | 2011 |
| కథా పార్వతీపురం (కథలు) | 2012 |
| ఎగిరిపోతున్న పిట్టల కోసం (కవిత్వం) | 2014 |
| పొద్దు ములిగిపోయింది (కథలు) | 2017 |
| మనసు పలికే...(గజల్ గీతాలు) | 2017 |
| గురి (కథలు) | 2018 |

స్నేహకళాసాహితి — **జి. రామకృష్ణ (శాంతి)**
20.04.2018. — కార్యదర్శి, స్నేహకళా సాహితి